
## సాంఘిక శాస్త్రం

### బోధనాభ్యసన ప్రక్రియలు - ప్రణాళికలు
### మూల్యాంకన విధానాలు




**EDUCATION**

KNOWLEDGE TRAINING TEACHER THEORY TEST INFORMATION

తెలంగాణ ప్రభుత్వ ప్రచురణ,
హైదరాబాదు


## సాంఘిక శాస్త్రం



**బి.ఎడ్.**





# బోధనాభ్యసన ప్రక్రియలు - ప్రణాళికలు
# మూల్యాంకన విధానాలు


## ఛాత్రోపాధ్యాయుల కరదీపిక





రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు

# సాంఘికశాస్త్ర బోధనాభ్యసన ప్రక్రియలు, ప్రణాళికలు & మూల్యాంకన విధానాలు

## (A Source book on pre-service Teacher Education) - B.Ed/D.Ed

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
తెలంగాణ, హైదరాబాదు.

## రచయితలు

1. డా॥ కె. బాలరాజు, లెక్చరర్, ఐ.ఎ.ఎస్.ఇ., మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్.
2. శ్రీమతి షహనాజ్ బేగం, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐ.ఎ.ఎస్.ఇ., ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్.
3. డా॥ బి. భాగ్యమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ (సి), ఐ.ఎ.ఎస్.ఇ., ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్.
4. డా॥ యం. రవీంద్రనాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (సి), ఐ.ఎ.ఎస్.ఇ., ఎస్.వి. యూనివర్శిటీ, హైదరాబాద్.
5. శ్రీ యం. పాపయ్య, లెక్చరర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైద్రాబాద్.
6. శ్రీమతి డి. విజయలక్ష్మి, లెక్చరర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైద్రాబాద్.
7. శ్రీ కె. సుబ్రమణ్యం, లెక్చరర్, డైట్, కర్నూలు
8. శ్రీ ఎ. లక్ష్మణ్‌రావు, ఎస్.ఎ., జి.హెచ్.ఎస్. దన్‌గర్‌వాడి, కరీంనగర్.
9. శ్రీ పి. రథంగపాణి రెడ్డి, ఎస్.ఎ. జి.ప. ఉ.పా. పోల్కంపల్లి, అడ్డాకల్ (మం), మహబూబ్‌నగర్.
10. శ్రీ యు. అనంద్ కుమార్, ఎస్.ఎ. జి.ప. ఉ.పా. సుజాత నగర్, ఖమ్మం.
11. శ్రీ యన్.సి.జగన్నాథ్, ప్ర.పా., కుల్సుంపుర, హైదరాబాద్.
12. శ్రీ ఎస్. వినాయక్, సి అండ్ టి విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి, హైదరాబాద్.

## సమన్వయం

శ్రీ మల్యాల పాపయ్య, లెక్చరర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైద్రాబాద్.

శ్రీమతి దుగ్గిరెడ్డి విజయలక్ష్మి, లెక్చరర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైద్రాబాద్.

## ఎడిటింగ్

**డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,**

ప్రొఫెసర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం,

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

## సలహాదారులు

**ప్రొఫెసర్ ఎస్. మహేందర్ రెడ్డి**

ఛైర్మెన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్, కాకతీయ యూనివర్శిటీ, వరంగల్.

**మరియు**

డీన్, ఫాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్, శాతవాహన యూనివర్శిటీ, కరీంనగర్.

**ప్రొఫెసర్ సుధీర్‌రెడ్డి,**

డీన్, ఐ.ఎ.ఎస్.ఇ, ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్

**ప్రొఫెసర్ ఎమ్. శివరత్నం రెడ్డి**

ప్రిన్సిపాల్, ఐ.ఎ.ఎస్.ఇ. వెంకటేశ్వర యూనివర్శిటీ, తిరుపతి.

**ప్రొఫెసర్ ఎ. రామక్రిష్ణ**

ఐ.ఎ.ఎస్.ఇ., ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాదు.

## ముఖ్య సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,** సంచాలకులు,

రాష్ట్ర విద్య, పరిశోధన శిక్షణా సంస్థ,

హైదరాబాదు

# ముందుమాట

జాతి భవిష్యత్తు తరగతి గదిలో నిర్మాణమౌతుందని కొఠారి కమిషన్ పేర్కొన్నది. అంటే పాఠశాలలు పిల్లల్ని జాతికి ఉపయోగపడే హేతుబద్ధమైన పౌరులుగా తయారుచేసే గురుతరమైన బాధ్యతను పోషించాల్సి ఉంటుంది. పిల్లలందరూ నాణ్యమైన విద్యను పొందడం నిర్బంధ ఉచిత విద్యాహక్కుచట్టం 2009 ప్రకారం పిల్లల హక్కుగా మారింది. పిల్లలు ఆలోచించగలగడం, వ్యక్తీకరించడగలగడం, విచక్షణతో వ్యవహరించగలగడం, సబ్జక్టువారీగా, తరగతివారీగా నిర్ధారించిన సామర్థ్యాలను సాధించగలగడం వంటివి నాణ్యమైన విద్యలో ముఖ్యమైన అంశాలు. వీటిని పొందేలా చేయడం పాఠశాలల బాధ్యత. వీటిని సాధించేలా చేయాల్సింది ఉపాధ్యాయులు.

విద్య వ్యాపారాత్మకమైన నేటి పరిస్థితుల్లో పాఠశాలలు తమ బాధ్యతను నిర్వర్తించడం, ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు తమ విధులను నెరవేర్చడంలో అనేక సవాళ్ళను ఎదుర్కొనేలా ఉపాధ్యాయులు మారాల్సి ఉంటుంది. సమాచారాన్నే జ్ఞానంగా భావించడం, ఈ సమాచారాన్నే పిల్లలకు అందించడం లేదా అర్థం చేయించడమే బోధనకు పరమావధిగా భావించడం, వీటిని జ్ఞాపకం పెట్టుకోవడాన్ని పరీక్షించడమే పరీక్షల ముఖ్య ఉద్దేశంగా మారడం వంటి పరిస్థితుల నుండి నూతన దృక్పథంతో ఆలోచించి ఉపాధ్యాయులు తమనుతాము మార్చుకోవాలి. పాఠశాల వ్యవస్థను మార్చగలగాలి. వీటిని సాకారంచేసే దిశగా ఉపాధ్యాయ విద్య ఎప్పటికప్పుడు ఆధునీకరించబడాలి.

ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలో జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2005, RTE-2009 ఆధారంగా రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధిపత్రం 2011ను రూపొందించారు. పిల్లలు అర్థవంతమంగా నేర్చుకోవాలని, పిల్లలు జ్ఞాననిర్మాతలని, తాము పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించగలగాలి. నేర్చుకోవడం అనేది పాఠ్యపుస్తకాలకూ తరగతిగదికే పరిమితం కారాదు. అన్వేషణలు, ప్రయోగాలు, ప్రాజెక్టుపనులు, ప్రతిచర్యలతో కూడి బోధనాభ్యసన ప్రక్రియలుండాలని, ఇందుకనుగుణంగా విమర్శనాత్మక బోధనా పద్ధతులు, సామాజిక నిర్మాణాత్మక వాదానికి చెందిన బోధనా పద్ధతులు వినియోగించాలని, పిల్లల సామర్థ్యాలను ఆలోచన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అంచనావేసేలా నిరంతర సమగ్ర మూల్యాంకన విధానాలు అమలు జరగాలని SCF-2011 లోని కీలక సూత్రాలు తెలుపుతున్నాయి. వీటి ఆధారంగా మన రాష్ట్రంలో ఒకటి నుండి 10వ తరగతి వరకు పాఠ్యప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు, మూల్యాంకన విధానాలను ఆధునీకరించారు. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ వీటిని రూపొందించింది.

ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించే వృత్తిపూర్వక ఉపాధ్యాయ శిక్షణను నిర్వహించే ఉపాధ్యాయ విద్యా సంస్థలు, శిక్షణా సంస్థలు వీటిని ఆకళింపు చేసుకొని ఛాత్రోపాధ్యాయులను తయారుచేయాలి. నూతన పాఠ్యపుస్తకాలపైన, ఆధునిక బోధనా విధానాలపైన, మూల్యాంకన విధానాలపైన, తమ శిక్షణార్థులకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది. ప్రధానంగా నూతన పాఠ్యపుస్తకాలకు అనుగుణంగా జ్ఞాన నిర్మాణం జరగడానికి వీలుగా ఆధునిక బోధనాపద్ధతులతో కూడిన ప్రణాళికలను రూపొందించుకునేలా శిక్షణ ఇవ్వాలి. ఇందుకోసం విశ్వవిద్యాలయాల్లోని విద్యావిభాగాల వారు రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (SCERT) లోని విద్యావిభాగంతో కలిసి పనిచేయడానికి ముందుకు రావడం, ఈ మార్పులను స్వాగతించడం శుభపరిణామం. విశ్వవిద్యాలయాల్లోని ఆచార్య బృందం, SCERT విద్యా ప్రణాళిక విభాగంలోని సభ్యులు కలిసి ఛాత్రోపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా బోధనాభ్యసన ప్రక్రియలు, ప్రణాళికలు, మూల్యాంకన విధానాలు అనే కరదీపికను ఛాత్రోపాధ్యాయుల కోసం రూపొందించారు. ఈ కరదీపికలో SCF పరిధిపత్రం సంక్షిప్తసారాంశం, RTE-2009 చట్టం, జ్ఞానం-జ్ఞాననిర్మాణం-తరగతి గది అన్వయం, నూతన సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాల ప్రత్యేకతలు, కీలకసూత్రాలు, సాంఘికశాస్త్ర బోధనా వ్యూహాలు-బోధనాసోపానాలు, వార్షిక పాఠ్యప్రణాళిక, పీరియడ్ ప్రణాళికలు, నిరంతర సమగ్రమూల్యాంకనం, బోధనాభ్యాసం మార్గదర్శకాలు మొదలగు అధ్యాయాలు చేర్చారు. కరదీపికలో చివర సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు ఉపయోగపడే రెఫరెన్స్ పుస్తకాల వివరాలు, వెబ్‌సైట్ల వివరాలను కూడా పొందుపరిచారు.

ఛాత్రోపాధ్యాయుడు ఈ కరదీపికలోని అంశాల ఆధారంగా బోధనాభ్యసనంలో భాగంగా రాసే వార్షిక, పాఠ్య, పీరియడ్ ప్రణాళికలను ఆధునిక విధానాలకు అనుగుణంగా, రాయగల్గుతారు. అట్లే SAT రికార్డును నిరంతర సమగ్ర మూల్యాంకనానికి అనుగుణంగా మార్చి రాయగల్గుతారు.

అధ్యాపకులు నిరంతర అభ్యాసకులుగా, పరిశోధనా దృక్పథంతో పనిచేయాల్సి ఉంటుంది. అవసరాలకనుగుణంగా తమనుతాము మార్చుకొని ఫలితాలను సాధించే వ్యక్తులుగా నూతన పాత్రలు పోషించాల్సి ఉంటుంది. ఈ వాస్తవాలను అర్థంచేసుకొని భవిష్యత్ తరాలకు ఉత్తమ ఉపాధ్యాయులను అందించడానికి కృషిచేస్తారని ఆశిస్తున్నాం.

దీని రూపకల్పనలో పాల్గొన్న SCERT లోని విద్యాప్రణాళికా విభాగ సభ్యులకు, పాఠ్యపుస్తక రచయితలకు స్టేట్ రిసోర్సు గ్రూప్ సభ్యులకు, ఉస్మానియా, కాకతీయ, వెంకటేశ్వర, ఆంధ్ర విశ్వవిద్యాలయాల ఆచార్య బృందానికి అభినందనలు. భవిష్యత్తులో ఇదే విధంగా విశ్వవిద్యాలయాలు, SCERT తో కలిసి విద్యాభివృద్ధికోసం కృషిచేస్తాయని ఆశిస్తున్నాం.

సంచాలకులు
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
హైదరాబాదు.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రణాళిక పరిధిపత్రం - 2011 - కీలక సూత్రాలు | 1-7 |
| 2. | నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం - 2009 - గుణాత్మక అంశాలు | 8-29 |
| 3. | జ్ఞానం - జ్ఞాననిర్మాణం - తరగతిగది అన్వయం | 30-45 |
| 4. | సాంఘికశాస్త్ర విద్యాప్రమాణాలు - అవగాహన | 46-52 |
| 5. | సాంఘికశాస్త్ర స్వభావం - నూతన పాఠ్యపుస్తకాల ప్రత్యేకతలు | 53-70 |
| 6. | సాంఘికశాస్త్ర బోధనా లక్ష్యాలు - విధానాలు | 71-74 |
| 7. | ఉపాధ్యాయుని సంసిద్ధత - ప్రణాళిక | 75-117 |
| | అ) వార్షిక ప్రణాళిక (Year Plan) | 76-85 |
| | ఆ) పాఠ్యప్రణాళిక (Lesson Plan) | 86-88 |
| | ఇ) బోధనా సోపానాలు (Teaching Steps) | 89-90 |
| | ఈ) పీరియడ్ ప్రణాళిక (Period Plan) | 91-117 |
| 8. | బోధనా వ్యూహాలు, వనరులు | 118-132 |
| 9. | నిరంతర సమగ్ర మూల్యాంకనం (CCE) | 133-142 |
| 10. | నిర్మాణాత్మక మూల్యాంకనం - అమలు | 144-153 |
| 11. | సంగ్రహణాత్మక మూల్యాంకనం - అమలు | 154-167 |
| 12. | బోధనాభ్యసనం - మార్గదర్శకాలు (Teaching Practice - Guidlines) | 168-173 |
| | అనుబంధం: క్యుములేటివ్ రికార్డు | 174-192 |

# 1 రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం-2011 (SCF - 2011) - కీలక సూత్రాలు

**నేపథ్యం:**

చదువుకోవడం అనేది ఒకప్పుడు గౌరవప్రదమైన కార్యక్రమం మాత్రమే. కానీ ప్రస్తుతం అది ఒక ప్రాథమిక హక్కు కూడా. ఎలిమెంటరీ స్థాయివరకు బడిఈడు పిల్లలందరు నాణ్యమైన విద్యను పొందడం **"ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 (RTE-2009)"** ప్రకారం ప్రాథమిక హక్కుగా మారింది. విభిన్న సంస్కృతులు, భాషావైవిధ్యత కల్గిన మనదేశంలో **అందరికీ విద్య**ను అందించడం గురించి భారతరాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. గత ఆరు దశాబ్దాలుగా అందరికీ విద్యను అందించడానికి మనదేశంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమలుజరిగాయి, జరుగుతున్నాయి కూడా! అయినప్పటికీ ఇంకను సవాళ్ళు తెరముందుకు వస్తూనే ఉన్నాయి. బాలకార్మికత, బడిబయట పిల్లలుండడం; నాణ్యతాలోపం; జవాబుదారీతనం లోపించడం; యాంత్రికమైన బోధనాభ్యసన ప్రక్రియలు, ప్రమాణాల పేరుతో అధిక సమాచార భారంతో బరువెక్కిన పాఠ్యపుస్తకాలు; ఒత్తిడి, ఆందోళన, మార్కులు, ర్యాంకులకు పరిమితమైతున్న మూల్యాంకన విధానాలు; అడుగంటుతున్న విలువలు, రోజురోజుకు వ్యాపార ధోరణి పెరుగుతూ క్రమేణా ఉన్నవారు ఒకరకమైన చదువులు, లేనివారు ఇంకోరకమైన చదువులు పొందుతున్న విద్యావాతావరణం, మౌలిక వసతుల కొరత మొదలగు సవాళ్ళను మనం గమనించవచ్చు. ***మన రాష్ట్రంలోని పరిస్థితి కూడా ఇందుకు విభిన్నంగా ఏమీ లేదు. వీటికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుముఖం పట్టడం, సమాచారాన్ని జ్ఞాపకముంచుకోవడాన్నే జ్ఞానంగా భావించడం, గిరిజనులు, అల్పసంఖ్యాకవర్గాలు, బాలికలు మొదలగు వర్గాలు ఇతర వర్గాలతో సమానంగా విద్య పొందలేక పోవడమనే అదనపుసమస్యలు కూడా ఉన్నాయి.***

ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో జాతీయ విద్యాప్రణాళిక చట్రం -2005 (NCF - 2005) ను **"భారరహిత అభ్యసనం"** (Learning without burden) అనే నివేదిక ఆధారంగా రూపొందించింది. పిల్లల చదువులు బట్టీ విధానాలకు పరిమితం కాకుండా, అర్థవంతంగా మారాలని, నేర్చుకొన్న జ్ఞానాన్ని నిత్యజీవితంలో వినియోగించాలని, నేర్చుకోవడమనేది పాఠ్యపుస్తకాలకే పరిమితం కారాదని, ఆందోళన, పోటీతత్వం అధిగమించేలా పరీక్షల విధానాలను సంస్కరించాలని **జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2005** సూచించింది.

ఈ అంశాలతోపాటు పిల్లలందరు నాణ్యమైన విద్యను పొందడాన్ని చట్టబద్ధం చేస్తూ ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 (Right to Free and Compulsory Education Act - 2009) అమలులోకి వచ్చింది. **పాఠశాల విద్యలో కీలకమైన వ్యక్తులు ఉపాధ్యాయులు**. ఉపాధ్యాయ నిర్మాణం పైననే నాణ్యమైన విద్య ఆధారపడి ఉంటుందని **ఉపాధ్యాయ విద్య జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2010** ని (NCFTE - 2010) జాతీయ ఉపాధ్యాయ విద్యా సంస్థ (NCTE) రూపొందించింది.

భారంలేని విద్య నివేదిక, జాతీయ విద్యాప్రణాళిక చట్రం (NCF - 2005), విద్యాహక్కు చట్టం (RTE - 2009), జాతీయ ఉపాధ్యాయ విద్యా ప్రణాళిక చట్రం (NCFTE) - 2010 ప్రతిపాదనలు, మార్గదర్శకాలను పరిశీలించినపుడు మన రాష్ట్రంలోని పాఠశాల విద్యలో సంస్కరణలు చేపట్టడం అత్యవసరమని భావించారు. ఇందుకోసం మనరాష్ట్రంలోకూడా **రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం - 2011** (State Curriculum Frame Work - 2011) ను రూపొందించడానికి జాతీయస్థాయి విషయనిపుణులు ఉపన్యాసకులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు, విశ్వవిద్యాలయ ఆచార్యులు మొదలగు

వారితో సలహా సంఘాన్ని, స్టీరింగ్ కమిటీని రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసింది. అట్లే వివిధ సబ్జక్టులు, సహపాఠ్యఅంశాలకు చెందిన 18 అంశాలలో ప్రస్తుత పరిస్థితిని విశ్లేషించి ప్రతిపాదనలతో **ఆధారపత్రాలను రూపొందించడానికి ఒక్కొక్క అంశానికి ఒక ఫోకస్‌గ్రూపును** కూడా నియమించింది.

**వాటి వివరాలు:**

**1. విద్యా విషయక ఆధారపత్రాలు** (Position Papers on Subject Areas) :

1.1 భాష – భాషాబోధన – ఆధారపత్రం (Position Paper on Language and Language Teaching)

1.2 ఆంగ్లబోధన – ఆధారపత్రం (Position Paper on English Teaching)

1.3 విజ్ఞానశాస్త్ర విద్య – ఆధారపత్రం (Position Paper on Science Education)

1.4 గణిత విద్య – ఆధారపత్రం (Position Paper on Mathematics Education)

1.5 సాంఘికశాస్త్ర విద్య – ఆధారపత్రం (Position Paper on Social Science Education)

1.6 పరిసరాలు – అభ్యసనం – ఆధారపత్రం (Position Paper on Habitat and Learning)

1.7 కళావిద్య – ఆధారపత్రం (Position Paper on Art Education)

**2. వ్యవస్థాపక సంస్కరణలు** (Position Papers on Systemic Reforms) :

2.1 విద్యా లక్ష్యాలు – ఆధారపత్రం (Position Paper on Aims of Education)

2.2 వ్యవస్థాపర సంస్కరణలు – ఆధారపత్రం (Position Paper on Systemic Reforms)

2.3 ఉపాధ్యాయ విద్య – ఉపాధ్యాయ వృత్తిపర అభివృద్ధి – ఆధారపత్రం
(Position Paper on Teacher Education and Teacher Professional Development)

2.4 అభ్యసనం కొరకు మూల్యాంకనం – ఆధారపత్రం (Position Paper on Assessment of Learning)

2.5 విద్యా సాంకేతికత – ఆధారపత్రం (Position Paper on Education Technology)

2.6 విద్యాప్రణాళిక – పాఠ్యపుస్తకాలు – ఆధారపత్రం (Position Paper on Curriculum and Textbooks)

**3. రాష్ట్ర సంబంధిత ముఖ్యమైన అంశాలు** (Position Papers on State concerns) :

3.1 విభిన్న వర్గాల విద్య (ఎస్.సి., ఎస్.టి., మైనార్టీ – బాలికలు – సమ్మిళిత విద్య) – ఆధారపత్రం
(Position Paper on Education for Diversities - S.C, S.T, Minority, Girls, Inclusive)

3.2 ఆరోగ్య – వ్యాయామ విద్య – ఆధారపత్రం (Position Paper on Health and Physical Education)

3.3 బాల్యారంభ విద్య – ఆధారపత్రం (Position Paper on Early Childhood Education)

3.4 పని మరియు విద్య – ఆధారపత్రం (Position Paper on Work and Education)

3.5 నైతికత – విలువలు – మానవ హక్కులు – ఆధారపత్రం
(Position Paper on Ethics, Values and Human Rights)

రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం – 2011ని మరియు 18 ఆధారపత్రాలను రూపొందించడానికి ఈ కింది నివేదికలను పరిగణనలోకి తీసుకున్నారు. అవి.

- **రాజ్యాంగ నిబంధనలు భారత రాజ్యాంగ ప్రవేశిక మరియు 73, 74 వ రాజ్యాంగ సవరణలు (Constitutronal Amendment).**
- **జాతీయ విద్యా ప్రణాళిక చట్టం 2005 (NCF - 2005)**
- **'భారరహిత అభ్యసనం' నివేదికలు (GOI - Report on Learning without burden)**
- **ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్రం 2009 (RTE-2009)**
- **ఉపాధ్యాయవిద్య - జాతీయ విద్యా ప్రణాళిక పరిధి పత్రం 2010 (NCFTE-2010).**
- **జాతీయ విజ్ఞాన కమీషన్ ప్రతిపాదనలు (National Knowledge Commission Recomendations)**

పై నివేదికలకు చెందిన, ప్రతిపాదనల ఆధారంగా రాష్ట్ర విద్యాప్రణాళిక చట్రం 2011 (APSCF 2011) కింది సూత్రాలను ప్రతిపాదించింది. వీటి ఆధారంగానే వివిధ సబ్జక్టులు, సహపాఠ్య అంశాలకు చెందిన ఆధారపత్రాలను, సిలబస్‌ను, విద్యాప్రమాణాలను రూపొందించారు. అట్లే పాఠ్యపుస్తకాలను ఆధునీకరించి, మూల్యాంకనం మరియు పరీక్షల్లో సంస్కరణలు చేపడతారు. ఈ క్రమంలో APSCF-2011 ప్రతిపాదించిన రాష్ట్ర దృక్పథాన్ని (Perspectives of the State) మరియు APSCF-2011 కీలక సూత్రాలను (Key Principles) ను పరిశీలిద్దాం.

## మనరాష్ట్ర దృక్పథం (perspective of the State):

- విద్యయొక్క ప్రాథమిక ఉద్దేశ్యం పిల్లలందరినీ బాధ్యతాయుతమైన, హేతుబద్ధమైన, పౌరులుగా (Responsible and Rational Citizens) తయారుచేయడం. విద్యాలక్ష్యాలు దీనిపై ప్రధానంగా దృష్టిసారించడం. అట్లే పిల్లలు తమ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రశంసిస్తూ, సామాజిక మార్పుకు దోహదపడే వ్యక్తులుగా పిల్లలను తీర్చిదిద్దడం.
- విద్యాప్రణాళిక రూపకల్పనలో పిల్లలయొక్క అవసరాలు, కోరికలు కేంద్రబిందువులుగా ఉండడం.
- పిల్లలు నేర్చుకోవడంలో ఒక జ్ఞానాత్మక క్రమం (Cognitive sequence in learning) ఉంటుంది. విద్యాప్రణాళికను ఈ క్రమం మరియు పిల్లల మానసికస్థాయిల ఆధారంగా రూపొందించడం. ఫలితాలకంటే కూడా వాటిని పొందే ప్రక్రియలను పరిపుష్టి చేయడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం. దీనివల్ల పిల్లలు కేవలం సమాచారాన్ని జ్ఞాపకముంచుకోవడంకంటే వాటిని అర్థవంతంగా పొందడం, విశ్లేషించడం వంటి నైపుణ్యాలను పొందుతారు.
- జ్ఞానమనేది (knowledge) సమగ్రమైంది. దీన్ని వివిధ సబ్జక్టుల పేరుతో విడదీసి ముక్కలు ముక్కలుగా అందించడమనేది కృత్రిమమైనది. జ్ఞానమనేది జ్ఞానాత్మక సామర్థ్యాలతో (Cognitive abilities) కూడినదనేది నిర్వివాదాంశం. ఒకే అంశాన్ని వివిధ లక్ష్యాల సాధనకోసం అనగా భాషా సామర్థ్యాల సాధనలో, గణిత సామర్థ్యాల సాధనలో, సామాజిక స్పృహను పెంపొందించడానికి, తార్కిక ఆలోచనలను వృద్ధిపరచడానికి, విశ్లేషణలు మరియు నిర్ధారణలు చేయడానికి వినియోగించవచ్చు.
- విద్యాప్రణాళిక అనేది గతిశీలమైనది (Dynamic). ఇది పాఠ్యపుస్తకాలకే పరిమితం కారాదు. ఇది పరిసరాలు, బాహ్యప్రపంచంతో అనుసంధానమై పిల్లలు, ఉపాధ్యాయుల సృజనాత్మకతను పెంచడానికి దోహదపడాలి.
- విద్యా ప్రణాళికతోపాటు, విద్యాపరిపాలన, పాఠశాలకు చెందిన అన్ని కార్యకలాపాలలో వికేంద్రీకరణను (Decentralisation) అమలుచేయడం.

## SCF-2011 మౌలిక సూత్రాలు (Key principles)

- పిల్లలు తమకున్న సహజమైన శక్తిసామర్థ్యాల ఆధారంగా నేర్చుకునేలా ప్రధానంగా దృష్టిపెట్టడం.
- పిల్లలభాష మరియు సమాజంలోని వివిధ రకాలైన జ్ఞాన వ్యవస్థలను గౌరవించడం, వాటిని అభ్యసనంలో వినియోగించడం.
- జ్ఞానాన్ని బడిబయటి జీవితంతో అనుసంధానం చేయడం.
- బట్టీ విధానాలకు స్వస్తిపలకడం. వాటికి బదులుగా పరస్పర ప్రతిచర్యలు (Interactions) , ప్రాజెక్టుపనులు, అన్వేషణలు (Explorations), ప్రయోగాలు, విశ్లేషణలు వంటి పద్ధతులద్వారా పిల్లలు అర్థవంతంగా నేర్చుకోవడం.
- నేర్చుకోవడాన్ని పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా, పిల్లల సమగ్ర అభివృద్ధికోసం విద్యాప్రణాళిక తగిన అవకాశాలు కల్పించడం. ఇందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలలో మార్పులు చేర్పులు చేపట్టడం.
- నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని (Continuous Comprehensive Evaluation) అమలు చేయడం ద్వారా పరీక్షలను సరళీకరించి, బోధనాభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం చేయడం. పిల్లలు ఎంత నేర్చుకున్నారని తెలుసుకోడానికి మూల్యాంకనం చేయడానికి బదులు పిల్లలు నేర్చుకోడానికి దోహదపడేలా మూల్యాంకన విధానాలను సంస్కరించడం (Assessment for Learning).
- పాఠ్యప్రణాళికలోని విభిన్న అంశాలను సమ్మిళితంచేస్తూ, అర్థవంతంగా నేర్చుకోడానికి వీలుగా సామాజిక నిర్మాణాత్మక (Social constructivism), విధానాలను తులనాత్మక / విమర్శనాత్మక (Critical pedagogy) బోధనా విధానాల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించడం.
- పిల్లల సంస్కృతి, అనుభవాలు, స్థానిక అంశాలకు తరగతి గదిలో ప్రాధాన్యత కల్పించడం.

రాష్ట్ర దృక్పథం మరియు కీలక సూత్రాల ఆధారంగా రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం 2011 ను రూపొందించారు. ఇది కింది అంశాలలో మార్పులను చేర్పులను ప్రతిపాదించింది.

### పాఠ్యపుస్తకాలు:–

ఇప్పటి వరకు రూపొందిన పాఠ్యపుస్తకాలు సుమారు 10 సంవత్సరాలకొకసారి మార్పులు చేర్పులకులోనైనవి. ఐతే మౌలికమైన మార్పులు నామమాత్రంగానే చోటుచేసుకున్నాయని చెప్పవచ్చు. అట్లే పాఠ్యపుస్తకాల రూపకల్పనకు ఆధారమైన విద్యాప్రణాళిక చట్రం లేదా సబ్జక్టుల వారీగా ఆధారపత్రాలుగానీ గతంలో రూపొందించలేదు. దీని వల్ల పాఠ్యపుస్తకాలలో పాఠ్యాంశాలు మారినవేగాని, విషయఅమరికలో, అభ్యాసాలలో వైవిధ్యత చోటుచేసుకోలేదు. అట్లే పాఠశాల విద్యకు చెందిన సబ్జక్టుల ద్వారా ఆశించే లక్ష్యాలు లేదా సబ్జక్టుల స్వభావం, పిల్లల స్వభావం వంటివి పాఠ్యపుస్తకాల రూపకల్పనలో పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదు. అట్లే పాఠ్యపుస్తకాలు ప్రమాణాల పేరుతో అధిక సమాచారంతో నిండి బరువెక్కాయి. గణితం, విజ్ఞానశాస్త్రం వంటి సబ్జక్టులలో పై తరగతులలోని అంశాలు కింది తరగతులలో చేరాయి. ఇది మానసికంగా కూడా పిల్లలకు భారమైంది. ఐతే రాష్ట్రంలో అమలుజరిగిన APPEP, DPEP వంటి కార్యక్రమాలవల్ల ప్రాథమిక తరగతుల పాఠ్యపుస్తకాలలో కొంతవరకు మార్పులు చోటుచేసుకున్నా, ఇది NCF-2005, RTE-2009, APSCF-2011 ప్రకారం మరింత సమగ్రంగా మారాల్సిన అవసరం ఉంది.

**రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం –2011 వీటిని అధిగమించి అర్థవంతమైన పాఠ్యపుస్తకాలను రూపొందించడానికి కింది ప్రతిపాదనలు చేసింది.**

- భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం వంటి సబ్జక్టులలో పాఠ్యపుస్తకాలు రూపొందించడానికి సబ్జక్టువారీగా ఆధారపత్రాలు ఉండాలి.
- పాఠ్యపుస్తకాలు పిల్లల్ని ఆలోచింపచేసేలా, పిల్లలు తమకున్న సహజమైన శక్తి సామర్థ్యాలు వినియోగించి నేర్చుకోడానికి దోహదపడాలి.
- పాఠ్యపుస్తకాలు సమాచారంతో బరువెక్కకుండా, పిల్లలే సమాచారాన్ని సేకరించేలా, ఆ సమాచారాన్ని విశ్లేషించేలా, నిర్ధారణలుచేసేలా అవకాశం ఉండాలి.
- పిల్లలు జ్ఞానాన్ని నిర్మించుకోడానికి పాఠ్యపుస్తకాలు తోడ్పడాలి. ఆ జ్ఞానాన్ని నిత్యజీవితంలో వినియోగించడానికి అవకాశం ఉండాలి.
- పిల్లలు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, అదనపు అభ్యసనం కోసం సంప్రదింపు గ్రంథాలు, మ్యాగజైన్లు, పత్రికలు, సామగ్రి, సమాజ సభ్యులతో పరస్పర ప్రతిచర్యలు జరిగేలా పాఠ్యపుస్తకాలు అవకాశం కల్పించాలి.
- పాఠ్యపుస్తకాలలోని భాష సరళంగా మారాలి. నేర్చుకోడానికి భాష ఒక అవరోధంగా ఉండరాదు. బహుభాషత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలి (Multilinguality).
- పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలు లింగ వివక్షకు తావివ్వరాదు. పిల్లల ఆత్మవిశ్వాసం పెంచేలా, ఆలోచింపజేసేలా, మానవ హక్కుల పట్ల స్పృహ పెంచేవిగా ఉండాలి. ఇందుకోసం ఆలోచనానైపుణ్యాలు అనగా ప్రతిస్పందించడం (Reflection), విమర్శనాత్మకంగా ఆలోచించడం (Critical thinking), బహుకోణాల్లో ఆలోచించడం (Dialectical thinking), సృజనాత్మకంగా ఆలోచించడం (Creative thinking), భావప్రసారనైపుణ్యాలు (Communication Skills) వంటివి పెంపొందించాలి.
- స్థానిక కళలు, సంస్కృతి, ఉత్పాదక కార్యకలాపాలు, స్థానిక అంశాలు మొదలగునవి పాఠ్యాంశాలుగా ఉండాలి.
- ఆయా సబ్జక్టులకు నిర్ధారించిన విద్యాప్రమాణాలు (Academic Standards), ఆశించిన అభ్యసన ఫలితాలు (Expected learning outcomes) సాధించడానికి వీలుగా అభ్యాసాలు ఉండాలి.
- కృత్యాలు, ప్రాజెక్టు పనులు, అన్వేషణలు, ప్రయోగాలు, బహువిధాలైన సమాధానాలు వచ్చే ప్రశ్నలు (Open ended questions), క్రీడలు, ఫజిల్స్ మొదలగు వాటి రూపంలో ఆలోచింపజేసే అభ్యాసాలు ఉండాలి.
- పిల్లలు వ్యక్తిగతంగా నేర్చుకునేలా, జట్టుపనుల్లో పాల్గొనేలా, పూర్తితరగతి ద్వారా నేర్చుకునేలా అభ్యాసాలు ఉండాలి (Individual, group, whole class activities).
- పిల్లలు సహపాఠ్యాంశాలైన మానవతావిలువలు, నైతికత, కళలు, ఆరోగ్యం, పని మొదలగు అంశాలను కూడా గ్రహించడానికి వీలుగా పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలు మరియు అభ్యాసాలు ఉండాలి.
- పాఠ్యపుస్తకాలు కింది తరగతులకు చెందిన కనీస సామర్థ్యాల పునశ్చరణకు అవకాశం కల్పిస్తూనే, తరగతి సామర్థ్యాలు సాధించడానికి మరియు పై తరగతులకు చెందిన అంశాలకు అనుసంధానించేలా ఉండాలి.
- పాఠ్యపుస్తకాలు ఆకర్షణీయంగా, అందంగా ఉండాలి. నాణ్యమైన పేపరు, ముద్రణ, చిత్రాలతో కూడి ఉండాలి.

**బోధనాభ్యసన ప్రక్రియలు (Teaching Learning Processes) :**

బట్టీపట్టడం, వల్లెవేయడం, పుస్తకాలలోని, గైడ్లు, ప్రశ్నల బ్యాంకులలోని అంశాలను ఎత్తిరాయడం, లేదా యాంత్రికంగా చదవడం వంటి యాంత్రికమైన విధానాలకు బదులు బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లలు అర్థవంతంగా నేర్చుకోడానికి దోహదపడాలి. ఇందుకోసం APSCF 2011 కింది ప్రతిపాదనలు చేసింది.

- పరస్పర ప్రతిచర్యలు (Interactions), స్వీయవ్యక్తీకరణ (Self Expression), ప్రశ్నించడం (Questioning) వంటివి బోధనాభ్యసన ప్రక్రియలలో కీలకం కావాలి.
- ప్రయోగాలు, అన్వేషణలు, కృత్యాలు, ప్రాజెక్టు పనులు, క్రీడలు మొదలగునవి బోధనాభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం కావాలి.
- బోధనాభ్యసన ప్రక్రియలంటే ఉపాధ్యాయులు వివరించడం లేదా చదివి విన్పించడం కాదు. ఉపాధ్యాయులు పిల్లలు నేర్చుకోడాన్ని ప్రేరేపించేలా, పాల్గోనేలా చేయాలి. అవసరమగు సామాగ్రిని ఉపయోగించాలి. అందుబాటులో ఉంచాలి. అభ్యసన వాతావరణాన్ని కల్పించాలి.
- పిల్లలు వ్యక్తిగతంగా, తోటివారితో, ఉపాధ్యాయుల ద్వారా, సామాగ్రి ద్వారా అభ్యసించేలా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ ఉండాలి. పిల్లల అభ్యసన సమయం పూర్తిగా సద్వినియోగం కావాలి.
- పిల్లలందరు తమ ఇంటి భాషలో నేర్చుకోడానికి అనువైన ఏర్పాట్లు / వాతావరణం ఉండాలి. ఉపాధ్యాయులు పిల్లల భాషను వినియోగించాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ పిల్లల అనుభవాలు, పూర్వజ్ఞానం ఆధారంగా ప్రారంభంకావాలి.
- స్థానిక కళలు, ఉత్పాదక అంశాలు, శ్రమజీవుల అనుభవాలను బోధనాభ్యసన ప్రక్రియల్లో వనరులుగా ఉపయోగించాలి.

**మూల్యాంకనం - పరీక్షలు:-**

పిల్లల్ని అంచనా వేయడానికి ఇప్పటి వరకు కేవలం పరీక్షల పైనే ఆధారపడుతున్నాం. పరీక్షలు కూడా పిల్లల్ని అంచనావేయడానికి బదులుగా పిల్లల్ని దోషులుగా చూపడానికి, న్యూనతకు గురయ్యేలా చేయడానికి, ఒత్తిడి, ఆందోళనను పెంచడానికి తోడ్పడుతున్నాయి. ఒకరకంగా పరీక్షలే విద్యా వ్యవస్థను శాసిస్తున్నాయని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం-2011 కింది ప్రతిపాదనలను చేసింది.

- మూల్యాంకనం మరియు పరీక్షలు పిల్లల్ని కేవలం అంచనావేయడానికి పరిమితం కాకుండా, పిల్లలు నేర్చుకోడానికి దోహదపడాలి. (Assessment for Learning)
- RTE-2009 సూచించిన విధంగా మూల్యాంకనాన్ని నిరంతరం సమగ్రంగా నిర్వహించడం. (Continuous and Comprehensive Evaluation - CCE)
- పిల్లలను అంచనావేయడానికి కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా ప్రాజెక్టు పనులు, అసైన్‌మెంట్లు, ఫోర్టుపోలియోలు, సెమినార్లు, ప్రదర్శనలు, అనెక్‌డొట్స్, పరిశీలనలు వంటివాటిని కూడా వినియోగించడం. ఈ అంశాలకు సంవత్సరాంత పరీక్షలలో తగు భారత్వాన్ని కేటాయించడం.
- ఇందుకోసం మూల్యాంకనాన్ని బోధనభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం చేయడం.
- పరీక్షలలోని ప్రశ్నల స్వభావాన్ని మార్చడం. బట్టీని ప్రేరేపించే ప్రశ్నలు, పాఠ్యపుస్తక సమాచారానికే పరిమితమయ్యే ప్రశ్నల స్థానంలో పిల్లలు సొంతంగా ఆలోచించి రాయడానికి, తమ అనుభవాలను వ్యక్తపరచడానికి, బహు విధాలైన సమాధానాలు రావడానికి (Open Ended Questions), నిత్యజీవితంతో అన్వయించడానికి (Application Oriented) వీలుగా ఆలోచింపచేసే ప్రశ్నలు ఉండడం.
- పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని ఏమేరకు వినియోగించగలరో అంచనావేయడానికి మూల్యాంకనం తోడ్పడడం.
- పిల్లలు తమను తాము స్వీయ మూల్యాంకనం చేసుకోవడం, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రగతిని స్వయంగా పరీక్షించుకోడానికి వీలుగా పారదర్శక, బహిరంగ మూల్యాంకన విధానాలను అమలు పర్చడం.

- బోర్డు పరీక్షల్లో కూడా పాఠశాలలో నిర్వహించిన నిరంతర, సమగ్ర మూల్యాంకన అంశాలకు తగిన భారత్వాన్ని కేటాయించడం.
- బోర్డు పరీక్షల జవాబుపత్రాలను కోరినప్పుడు తల్లిదండ్రులకు అందచేయడం. పునర్ మూల్యాంకనం చేయడం.
- సహపాఠ్య అంశాలైన వైఖరులు, విలువలు, పని, ఆరోగ్యం, ఆటలు మొదలగువాటిని కూడా మూల్యాంకనం చేయడం.

**వ్యవస్థాపరమైన సంస్కరణలు (Systemic Reforms):**

రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం 2011 ను అమలుపరచడానికి పైన తెల్పిన అంశాలలోని మార్పు చేర్పులతోపాటు కింద తెల్పిన వ్యవస్థాపరమైన సంస్కరణలను కూడా ప్రతిపాదించింది.

- పరిపాలన మరియు పాఠశాల నిర్వహణలో వికేంద్రీకరణ కోసం పంచాయితీ రాజ్ సంస్థలను భాగస్వాములను చేయడం.
- పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడి అధీనంలో పనిచేసేలా ECE కేంద్రాలను ఏర్పాటుచేయడం. పిల్లల సంరక్షణ, ఆరోగ్య బాధ్యతలను ICDS శాఖ, విద్యాబాధ్యతలు విద్యాశాఖవారు స్వీకరించడం.
- RTE 2009 సూచించిన విధంగా అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడం.
- అట్లే పిల్లల తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పరచి, పాఠశాల నిర్వహణలో వారిని భాగస్వాములను చేయడం.
- ప్రణాళిక, నిర్వహణ, మానిటరింగ్, నిధుల వినియోగం మొదలగు అన్ని అంశాలలో వికేంద్రీకరణ విధానాలను అమలుపర్చడం.
- ఉపాధ్యాయ విద్యతోపాటు, ఉపాధ్యాయ సహాయ, సహకార వ్యవస్థలను బలోపేతం చేయడం.
- పాఠశాల విద్యకు చెందిన వివిధ సంస్థలు (School, School Complex, Mandal Resource Centre, DIET, SCERT) మరియు వ్యక్తులకు పనితీరు సూచికలు (Performance Indicators) రూపొందించి అమలుజరపడం ద్వారా జవాబుదారీతనం పెంచడం.
- ఉపాధ్యాయ విద్యా ప్రణాళిక చట్రాన్ని రూపొందించి అమలుపర్చడం, ఉపాధ్యాయ విద్యలో సంస్కరణలు చేపట్టడం.
- పిల్లల్లో మానవత విలువలు, ఉన్నత వైఖరులను పెంపొందించడానికి తరగతివారీగా పిల్లలకోసం ప్రత్యేక వాచకాలను రూపొందించడం.
- పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవడం.

సమాజం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే ఆ సమాజం విద్యారంగంలో సంపూర్ణ అభివృద్ధిని సాధించాలి. ఇందుకు పునాది పాఠశాలవిద్య. పాఠశాల విద్యను సంస్కరించి, పిల్లలను సమాజాభివృద్ధికి తోడ్పడే వ్యక్తులుగా, హేతుబద్ధమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అవసరమైన నైపుణ్యాలు, విలువలు, వైఖరులు పెంపొందించడానికి రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం 2011 దిశానిర్దేశం చేస్తుంది. ఇందుకోసం రూపొందించిన ఆధారపత్రాలద్వారా ఆయా సబ్జెక్టులు మరియు అంశాలలో ప్రతిపాదనలు చేశారు. వీటిని అమలుపరచడానికి వ్యవస్థాపర సంస్కరణలను చేపడతారు. ఇందుకోసం అన్నివర్గాల ప్రజలు, విద్యావేత్తలు, ఉపాధ్యాయసంఘాలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంఘాలు మొదలగు వారి నుండి సలహాలు సూచనలు స్వీకరించి అవసరమైన మార్పులు చేర్పులు చేపడతారు. తద్వారా రాష్ట్రం విద్యారంగంలో అభివృద్ధిని సాధించి, అగ్రగామిగా నిలపడానికి ప్రయత్నం చేద్దాం.

# 2

# నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం - 2009 గుణాత్మక అంశాలు

## నేపథ్యం (Context)

భారతదేశం సువిశాలమైన దేశం. కోట్లాది మంది ప్రజలున్న దేశం. విభిన్న మతాలు, కులాలు, వర్గాలతో భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన దేశం. ఉత్కృష్టమైన సంస్కృతి, సంప్రదాయాలతో విరాజిల్లుతోన్న దేశం. ఒకప్పుడు అనగా అతి ప్రాచీనకాలంలోనే నలంద, తక్షశిల వంటి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన విశ్వ విద్యాలయాలతో ప్రపంచానికి జ్ఞాన భిక్షను పెట్టిన దేశం మనది. అయితే ఆ తదనంతర కాలంలో మన దేశంలోని విద్యా పరిస్థితిని, ప్రజల అభివృద్ధిని విశ్లేషిస్తే గత వైభవాన్ని కోల్పోయినట్లుగా గుర్తించవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాల కాలం దాటినా ఇప్పటికీ 100% అక్షరాస్యత అందని ద్రాక్షగానే ఉంది. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో దేశ భవిష్యత్తు విద్యారంగంపైననే ఆధారపడి ఉంటుందని విశ్వసించి పిల్లలందరు విద్యను పొందాలని, ఆదేశిక సూత్రాలలో పొందుపర్చారు. ఆ తరవాత మన దేశంలో అక్షరాస్యత కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం వల్ల అక్షరాస్యతలో అభివృద్ధిని గమనించవచ్చు. అయినప్పటికీ కూడా పాఠశాలకు వెళ్ళాల్సిన బడి ఈడు పిల్లలు బళ్ళలో చేరడం, చేరిన వారు కొనసాగడం, వారందరూ అర్థవంతంగా నేర్చుకోవడం, నేర్చుకున్నదాన్ని వినియోగించగల్గడం, ఆనందంగా, అర్థవంతంగా నేర్చుకోవడానికి అనువైన ప్రోత్సాహకరమైన, స్వేచ్ఛాపూరిత వాతావరణం పాఠశాలల్లో కొరవడింది. ఒక దశలో విద్యను పూర్తి చేసిన పిల్లలు ఏమి సాధించాలి? అనే అంశం పట్ల స్పష్టత కొరవడింది. విద్య వ్యాపారాత్మకమై ఉన్న వారికి ఒక రకంగా, లేని వారికి మరో రకంగా విద్య లభిస్తుండడం ఆందోళనకు గురిచేస్తున్నది. అధిక సమాచారంతో బరువెక్కిన పాఠ్య పుస్తకాలు, ఒత్తిడి, ఆందోళనలకు గురిచేసే పరీక్ష విధానాలు, పాఠశాలను సమాజం నుండి వేరు చేసే వైఖరులు/ పనితీరు, పిల్లలకు లేదా సమాజానికి జవాబుదారీతనం వహించే లక్షణం కొరవడడం వంటి అంశాలు విద్యా వ్యవస్థను అపహాస్యం పాల్జేస్తున్నది.

ఈ నేపథ్యంలో విద్యా వ్యవస్థలోని అపసవ్య, అశాస్త్రీయ విధానాలను చాలా సునిశితంగా విమర్శిస్తూ రావలసిన మార్పుచేర్పుల గురించి ప్రొఫెసర్ యశ్‌పాల్ గారు 2003 సంవత్సరంలో 'భారంలేని విద్య' అనే నివేదికను భారత ప్రభుత్వానికి సమర్పించారు. వీటి ఆధారంగా ఎన్.సి.ఇ.ఆర్.టి. జాతీయ విద్యా ప్రణాళిక చట్రం-2005ను రూపొందించింది. 1986 సంవత్సరం తరవాత మన దేశంలో చోటుచేసుకున్న మంచి కార్యక్రమాలు, వాటి ఫలితాలు (OBB, APPEP, DPEP, SSA మొదలగు కార్యక్రమాలు) అధికారపూర్వకంగా ఒక నివేదిక రూపంలో జాతీయ విద్యా ప్రణాళిక చట్రం-2005 ద్వారా వ్యక్తమైనవి. అర్థరహితమైన బట్టీ విధానాలకు స్వస్తిపలికి అర్థవంతంగా నేర్చుకోవాలని, నేర్చుకోవడం పాఠ్యపుస్తకాలకే పరిమితం కారాదని, పిల్లలు తాము నేర్చుక్ను అంశాలు/ జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించాలని, సమాచారం, జ్ఞానం ఒక్కటి కావని, జ్ఞానమనేది పిల్లల అనుభవాల ఆధారంగా ఆలోచన, విశ్లేషణల ద్వారా ఉత్పన్నమవుతుందని, ఒత్తిడికి గురిచేసే పరీక్షల విధానాలు సంస్కరించబడాలని ఎన్.సి.ఎఫ్-2005 పేర్కొన్నది. వీటిని సాకారం చేయడానికి విద్యావ్యవస్థలో మౌలికమైన మార్పులు చేర్పులు చోటుచేసుకోవాలని, సమాజ భాగస్వామ్యంతో పాఠశాల విద్య అభివృద్ధిని సాధించాలని తెలిపింది.

పాఠ్యపుస్తకాలు ఆలోచనాత్మకంగా, పిల్లల అనుభవాల ఆధారంగా అర్థవంతంగా నేర్చుకోవడానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించింది. బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లల భాగస్వామ్యాన్ని పెంచేలా జ్ఞాన నిర్మాణానికి తోడ్పడేలా ఉండాలని తెలిపింది. ఎన్.సి.ఎఫ్-2005 సూచించిన పలు అంశాలతోపాటు సమాజంలో కొంతమంది పిల్లలు బాల కార్మికులుగా ఉండడం, వారి ప్రవేశానికి పాఠశాలల నియమ నిబంధనలు అడ్డంకిగా నిలవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రాథమిక హక్కుగా మారిన 'విద్య'ను పిల్లలందరూ పొందడానికి ఉద్దేశించి మన దేశంలో 2009 ఆగస్టు మాసంలో భారత పార్లమెంట్‌లో చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం 26 ఆగస్టు, 2009 భారత రాష్ట్రపతిచే ఆమోదం పొందింది. భారత ప్రభుత్వం ఈ చట్టాన్ని **'ఉచిత, నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం-2009 Right To Education Act-2009'** అని పేర్కొని 27 ఆగస్టు, 2009 రోజున గెజిట్ ద్వారా విడుదల చేసింది.

ఆర్.టి.ఇ-2009 చట్టం ఏప్రిల్ 1, 2010 నాటితో అమలులోకి వచ్చింది. భారతదేశ చరిత్రలో ఒక చట్టం ఆ దేశ ప్రధానమంత్రి జాతినుద్దేశించి ఇచ్చిన ఉపన్యాసం ద్వారా అమలులోకి వచ్చింది. ప్రధానమంత్రి తన సందేశం ఇస్తూ ఈ దేశపు బాలలందరూ అంటే జాతి, మత, కులాలకు అతీతంగా బడిలో చేరి నాణ్యమైన విద్యను పొందడానికి ఈ చట్టం ద్వారా ప్రాథమిక హక్కు కల్పించబడింది. నాణ్యమైన విద్య ద్వారా ఒక బాధ్యతాయుతమైన మంచి పౌరులుగా ఎదగడానికి కావల్సిన జ్ఞానం, నైపుణ్యాలు, వైఖరులు, విలువలు నాణ్యమైన విద్య ద్వారా వారికి అందించబడతాయి.

ఈ చట్టం చారిత్రాత్మకమైనది. 'విద్య'ను ప్రాథమిక హక్కుగా పరిగణించి చట్టాలు చేసిన దేశాల జాబితాలో మన దేశం కూడా చేరింది. ప్రధానంగా ఈ చట్టం వల్ల బడిఈడు కలిగిన పిల్లలు (9-14 సం॥ల వయసు) నాణ్యమైన విద్యను పొందే హక్కును సంపాదించుకున్నారు. నాణ్యమైన విద్యను పిల్లలందరూ పొందడానికి అవసరమైన పాఠశాలల ఏర్పాటు, ప్రభుత్వాల బాధ్యతలు, బడి బాధ్యతలు, ఉపాధ్యాయుల బాధ్యతలు, బడికి ఉండాల్సిన నియమాలు, ప్రామాణికాల గురించి ఈ చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. దీంట్లో ప్రధానంగా రెండు రకాలైన అంశాలు గమనించవచ్చు. మొదటిది పరిమాణాత్మకమైన, పరిపాలనాపరమైన, అమలుకు చెందిన అంశాలు. రెండవది నాణ్యమైన విద్యకు సంబంధించిన అవగాహన, విద్యా ప్రణాళికలకు సంబంధించిన అంశాలు. చట్టం అమలు జరగడం అంటే ఇందుకు అవసరమైన అన్ని అంశాలు ఆచరణలోకి రావడం అని అర్థం. అనగా పిల్లలందరూ బడిలో చేరడం, వారందరూ కొనసాగి నాణ్యమైన విద్యను పొందడానికి అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టడం ద్వారా ఫలితాలు సాధించాల్సి ఉంటుంది.

## చట్టంలోని అధ్యాయాలు, వాటి వివరాలు (Section in the Act and its details)

ఆర్.టి.ఇ.-2009 చట్టంలోని అధ్యాయాలు, సెక్షన్లు గురించి తెలుసుకుందాం.

- ఈ చట్టంలో 7 అధ్యాయాలు, 38 సెక్షన్లు, ఒక షెడ్యూల్ ఉంది.
- ప్రారంభంలో ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో ఎప్పుడు ప్రవేశపెట్టారు, రాష్ట్రపతిచే ఆమోదం పొందిన తేది, అమలు పరిధి వివరాలు ఉన్నాయి.
- **అధ్యాయం1** లో చట్టం పేరు, పరిధి, అమలు, వివిధ పదాలకు సంబంధించిన అర్థాలు, నిర్వచనాలు ఉన్నాయి. ఉదాహరణకు బడి, పిల్లలు, ప్రాథమిక విద్య, ఎంపిక విధానం వంటి పదజాలాలకు వివరణలు ఉన్నాయి. ఈ వివరాలను 1 నుండి 3 సెక్షన్ల ద్వారా తెలిపారు.
- **అధ్యాయం2** లో ఉచిత విద్యకు బాలల హక్కు, బడిలో ప్రవేశం, బదిలీ ధ్రువీకరణ పత్రం మొదలగు అంశాల గురించి 4, 5 సెక్షన్ల ద్వారా తెలిపారు.

- **అధ్యాయం3** లో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వం, తల్లిదండ్రుల బాధ్యతల గురించి, పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాల ఏర్పాటు గురించిన వివరాలు 6 నుండి 11 సెక్షన్ల ద్వారా తెలిపారు.

- **అధ్యాయం4** లో బడులు, ఉపాధ్యాయుల బాధ్యతలకు సంబంధించిన వివరాలను సెక్షన్ 12 నుండి 28 వరకు పొందుపర్చారు. ప్రధానంగా పిల్లలను బడిలో చేర్చినపుడు ఎంపిక విధానానికి గురిచేయరాదని, ఎలాంటి క్యాపిటేషన్ రుసుము వసూలు చేయరాదని తెలిపారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకున్నా పిల్లలను బడిలో చేర్చుకోవాలని, ఒకే తరగతిలో పిల్లలను మళ్ళీ కొనసాగించడం లేదా పాఠశాల నుండి తొలగించడం చేయరాదని, పిల్లలను శారీరకంగా గాని, మానసికంగా గాని వేధించడం, శిక్షించడం చేయరాదని వంటి అంశాల గురించి స్పష్టంగా పేర్కొన్నారు. బళ్ళను ఏర్పాటు చేయడం, అవి పాటించాల్సిన ప్రామాణికాలు, నియమాల గురించి, ఉపాధ్యాయుల నియామకం, వారి విధులు, బాధ్యతలు మొదలగు అంశాల గురించి కూడా వివరించారు.

- **అధ్యాయం5** లో నాణ్యమైన విద్యకు సంబంధించిన విద్యా ప్రణాళికలు, పాఠ్య ప్రణాళికలు, మూల్యాంకన విధానాలు మొదలగు వాటి గురించి సవివరంగా సెక్షన్ 29, 30ల ద్వారా తెలిపారు. వీటిలో ప్రధానంగా విద్యా ప్రణాళికలను రూపొందించేటపుడు, మూల్యాంకన విధానాలను నిర్ధారించేటపుడు పిల్లల సమగ్ర అభివృద్ధిని, రాజ్యాంగ విలువలను తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకోవాలని చట్టంలో పేర్కొన్నారు. వీటితోపాటు బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన విధానాలు, బోధన మాధ్యమం, అభ్యసన వాతావరణం వంటి అంశాల గురించి కూడా తెలిపారు.

- **అధ్యాయం6**లో బాలల హక్కుల సంరక్షణ, పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయిలో సలహా సంఘాల ఏర్పాటు గురించి సెక్షన్ 31 నుండి 34ల ద్వారా వివరించారు.

- **అధ్యాయం7**లో చట్టం అమలు గురించి ఆదేశాలు జారీచేసే అధికారాలు, ప్రాసిక్యూషన్, చేపట్టాల్సిన చర్యలు, నియమ నిబంధనలు రూపొందించడం గురించిన వివరాలను సెక్షన్ 35 నుండి 38ల ద్వారా వివరించారు.

- చట్టం చివర అనుబంధంలో పేర్కొన్న **షెడ్యూల్**లో బడికి సంబంధించిన ప్రామాణికాలు, నియమాల గురించి సెక్షన్ 19, 25లను దృష్టిలో పెట్టుకొని వివరాలను పొందుపర్చారు. వీటిలో పిల్లల సంఖ్యను బట్టి ఉండాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాల భవనం, గదులు, వసతి సౌకర్యాలు, సామగ్రి, విద్యా సంవత్సరంలో పాఠశాల పనిదినాలు, బోధనాగంటల సంఖ్య, ఉపాధ్యాయులు వారానికి పనిచేయాల్సిన పనిగంటల సంఖ్య మొదలగు వాటి వివరాలను చేర్చారు.

## RTE-2009 – గుణాత్మక అంశాలు – చేపట్టిన చర్యలు

RTE-2009 చట్టం పిల్లలందరూ నాణ్యమైన విద్యను పొందడానికి ఉద్దేశించినది. బడిఈడు పిల్లలందరూ బళ్ళలోచేరి పాఠశాలవిద్యను ఎలాంటి అంతరం ఏర్పడకుండా పూర్తిచేయాలి. ఈ క్రమంలో వాళ్ళు ప్రతి తరగతికి సంబంధించిన ఆయా సబ్జెక్టుల్లోని విద్యాప్రమాణాలను సాధించాలి. అనగా సబ్జెక్టులు నిర్ధారించిన సామర్థ్యాలను సాధించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన చట్టంలోని కొన్ని ప్రత్యేకమైన సెక్షన్లను, వాటి గురించి చేపట్టిన చర్యలను తెలుసుకుందాం.

**సెక్షన్ (4) :** RTE-200 చట్టంలోని ఈ సెక్షన్ ప్రకారం బడిఈడు పిల్లలు వారి వయసుకు తగ్గ తరగతిలో చేరి నాణ్యమైన విద్య పొందే హక్కు కలిగి ఉన్నారు.

బడిఈడు పిల్లలు వారి వయసుకుతగ్గ తరగతిలో చేరే క్రమంలో కొన్ని సందర్భాలలో ఆ తరగతిలో కొనసాగడానికి అవసరమైన కనీస సామర్థ్యాలను కలిగి ఉండకపోవచ్చు. అయినప్పటికీ వాళ్ళు మిగతా పిల్లలతోబాటు ఆ తరగతిలో కొనసాగి నాణ్యమైన విద్యను పొందే హక్కు చట్టం ద్వారా పొంది ఉన్నారు. దీనివల్ల కనీస సామర్థ్యాలను పిల్లలందరూ కల్గి ఉన్నారని నిర్ధారించుకోవడం ఉపాధ్యాయుల బాధ్యతగా మారింది ఉపాధ్యాయులు తప్పనిసరిగా పిల్లలందరినీ ఆయా తరగతులకు సంబంధించిన కనీస సామర్థ్యాలు సాధించేలా శిక్షణ ఇచ్చి తర్వాతనే ఆ తరగతికి చెందిన పాఠ్యాంశాల ద్వారా నిర్ధారించిన సామర్థ్యాలను సాధించేలా చూడాలి.

ఇందుకోసం మన రాష్ట్రంలో పిల్లలందరిచే ప్రత్యేక శిక్షణ ఇవ్వడం కోసం రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ సబ్జెక్టుల వారీగా అభ్యాస పుస్తకాలను రూపొందించింది. అట్లే నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించేటప్పుడు ఆయా తరగతులకు అవసరమైన కనీస సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని అభ్యాసాలను చేర్చారు.

అధ్యాయం-5లోని సెక్షన్ 29 (1), (2)లోని అధ్యాయాలు, పాఠ్యప్రణాళిక, మూల్యాంకన విధానాలకు ఉద్దేశించినవి. వీటిలోని అంశాలను పరిశీలిద్దాం.

a) రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా ఉండాలి.

b) బాలల సర్వతో ముఖాభివృద్ధి జరగాలి.

c) బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించాలి.

d) బాలల పూర్తి సామర్థ్యంమేరకు శారీరక, మానసిక శక్తుల అభివృద్ధి చెందాలి.

e) పిల్లలను కేంద్రంగా చేసుకొని వారికి అనువైన విధానాల్లో కార్యక్రమాలు, పరిశోధన, కనుగొనుట మొదలగు శిశు కేంద్రీకృత విధానాలు, కృత్యాధార పద్ధతుల్లో నేర్చుకోవాలి.

f) ఆచరణలు సాధ్యమైనంత వరకు బోధనా మాధ్యమం బాలల మాతృభాషగా ఉంటుంది.

g) భయం, ఆందోళన వంటి వాటి నుంచి బాలలను విముక్తంచేసి వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడంలో సహాయపడాలి.

h) జ్ఞానాన్ని బాలలు అర్థం చేసుకున్న విధానం, దాన్ని అన్వయించే సామర్థ్యాలపై నిరంతర సమగ్ర మూల్యాంకనం జరగాలి.

30 (1) ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు బాలలు ఎటువంటి బోర్డు పరీక్షకు హాజరుకారాదు. 30(2) ఎలిమెంటరీ విద్య పూర్తిచేసినవారికి ధృవీకరణ పత్రం జారీచేయాలి.

పైన తెల్పిన అంశాలలోని వివిధ విషయాల గురించి చర్చిద్దాం.

### ఆర్.టి.ఇ-2009 - బాలల అభివృద్ధి (RTE-2009 - Child Development)

**'అభివృద్ధి చెందడం'** అనేది పిల్లల హక్కు. బాలల హక్కుల్లో జీవించే హక్కు, సంరక్షించబడే హక్కు, భాగస్వామ్యపు హక్కు, అభివృద్ధి చెందే హక్కు అనే ప్రధానమైన హక్కులు ఉన్నాయి. ప్రపంచంలోని బాలలందరికీ ఇవి వర్తిసాయి. బాలలందరూ అభివృద్ధి చెందడానికి ఆయా దేశాలు అంతర్జాతీయ వేదికలపై తగిన చర్యలు చేపడతామని కూడా చెప్పాయి.

పిల్లలందరూ జీవించడానికి అవసరమైన పోషకాహారం, తాగునీరు, ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన పరిసరాలు/ వాతావరణం కలిగి ఉండడం. భద్రత, ప్రేమపూర్వకమైన స్వేచ్ఛా వాతావరణం కలిగి ఉండడం, పిల్లల అభివృద్ధికి తోడ్పడే పాఠ్య, సహపాఠ్య

కార్యక్రమాలన్నింటిలో పాల్గొనడం వంటివి పిల్లల హక్కులు. ఇవన్నీ సక్రమంగా జరిగినప్పుడే పిల్లలందరూ అభివృద్ధిని సాధించగల్గుతారు. బాలల హక్కుల్లో నాలుగు కూడా ఒకదాన్ని ఇంకొకటి ప్రభావితం చేస్తుంది. అందుకే బాలల సర్వతోముఖాభివృద్ధిని బాలల హక్కుల కోణంలో అర్థం చేసుకోవాల్సిన అవసరముంది.

బాలలందరూ సర్వతోముఖాభివృద్ధి సాధించడం అనేది మన దేశంలో నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం–2009 ద్వారా చట్టబద్ధమైంది. ఈ ఆర్.టి.ఇ.–2009 సెక్షన్ (29) సబ్ సెక్షన్ (2)లో బాలలందరూ విద్య ద్వారా సర్వతోముఖాభివృద్ధి సాధించేలా విద్యా ప్రణాళికలు, పాఠ్య ప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు, మూల్యాంకన విధానాలు ఉండాలని పేర్కొన్నది.

బాలల సర్వతోముఖాభివృద్ధి కోసం విద్యా విషయక అధీకృత సంస్థ (Academic Authority) కింది అంశాలపై దృష్టిపెట్టి విద్యా ప్రణాళికలు, పాఠ్య ప్రణాళికలు, మూల్యాంకన విధానాలు ఉండాలని RTE-2009 సూచించింది. అవి:

- రాజ్యాంగంలో పొందుపర్చిన విలువలు
  ఉదా: సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామ్యవాదం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం మొ॥వి.
- బాలల సర్వతోముఖాభివృద్ధి
- బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలు, వైఖరులు.
- బాలల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక, మానసిక శక్తుల అభివృద్ధి.

పాఠశాల అనేది బాలల సమగ్ర ఎదుగుదలకు ఏర్పాటు చేసిన కేంద్రం. పిల్లల్లో ఏదో ఒక సామర్థ్యాన్ని అభివృద్ధిపర్చడం ద్వారా గాని లేదా కొన్ని విషయాలకే పరిమితమై వాటిని సాధించడం వల్ల గాని విద్య యొక్క లక్ష్యం నెరవేరదు. బాలల ఇష్టాలు, ఆసక్తులు వారిని అభివృద్ధిపరిచే రంగాలను గుర్తించి, వాటిలో పాల్గొనేలా చేయడం, అందుకు అవసరమైన కార్యకలాపాలను పాఠశాలల్లో నిర్వహించినపుడే బాలల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది.

'బాల్యం' పిల్లల ఎదుగుదలకు తోడ్పడే దశ. ఈ సమయంలో పిల్లల బాల్యాన్ని హరించేవిధంగా పాఠశాల వాతావరణం, పనితీరు ఉంటే, ఇది పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపి బాలల అభివృద్ధిని నిరోధిస్తుంది. అందుకే బాలల సర్వతోముఖాభివృద్ధి జరగడానికి అవసరమైన అన్ని రంగాల్లో కార్యక్రమాలు నిర్వహించబడాలి. ఇందుకోసం కింది రంగాలపై దృష్టి పెట్టాలి.

బాలల సర్వతోముఖాభివృద్ధి రంగాలు

- శారీరక అభివృద్ధి, మేథోపరమైన అభివృద్ధి
- సాంఘిక అభివృద్ధి
- ఉద్వేగ అభివృద్ధి
- నైతిక విలువల అభివృద్ధి
- సౌందర్యాత్మక స్పృహ

**బాలల సర్వతోముఖాభివృద్ధి – ప్రస్తుత పరిస్థితి (All Round Development of Children - Existing Situtation)**

- విద్య యొక్క పరమార్థం పరీక్షలు, మార్కులు, ర్యాంకులుగా మారింది.
- జ్ఞాపక శక్తిని పరీక్షించడానికి పరిమితమైన పరీక్షల విధానాలు.

- కేవలం పాఠ్యవిషయాలు అంటే భాషలు, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలకే ప్రాధాన్యత.
- పిల్లల అభివృద్ధికి తోడ్పడే విలువలు, అభిరుచులు, ఆటలు, పని వంటి అంశాలు పాఠశాలలో కనుమరుగైనవి.
- తల్లిదండ్రుల దృష్టిలో కూడా ఆటలు, పాటలు, కథలు, వ్యాయామం, పనిచేయడం వంటివి చదువులో భాగం కాదని, వీటి వల్ల తమ పిల్లల చదువులు దెబ్బతింటాయని భావించడం.
- ఆనందంగా ఆడుకునే సాయంకాలం (పిల్లల సమయం), ఇంటిపని (home work)తోనో, పరీక్షల కోసం చదవడానికో, ట్యూషన్లకో, స్టడీసెంటర్లకో వెళ్లడానికే పరిమితమైంది.
- పిల్లలు తల్లిదండ్రుల కోరిక మేరకే చదవడం.
- ఇటు ఉపాధ్యాయులు, అటు తల్లిదండ్రులు.... ఇలా అందరూ కూడా పిల్లలకు ఒక మనసుంటుందని, వారికి ఆలోచనలు, ఆసక్తులు ఉంటాయని మరిచి, తమకిష్టమైన/ తోచిన అంశాలను బలవంతాన రుద్దుతున్నారు. పిల్లలను యంత్రాలుగా మారుస్తున్నారు.
- వీటికితోడు ప్రమాణాల పేరుతో బరువెక్కిన చదువులు అంటే (IIT) కోచింగ్‌ల పేరుతో పై తరగతుల్లో చదవాల్సిన వాటిని అర్థమైనా, కాకున్నా బలవంతాన కింది తరగతుల్లోనే చదవడం.
- ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు పుస్తకాల చుట్టూ, వాటిలోని అంశాలను మెదళ్ళలో కుక్కుకోవడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు.
- వీటి ప్రభావం వల్ల పిల్లల్లో ఆరోగ్య సమస్యలు, ప్రవర్తనా సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఒత్తిడి, ఆందోళనకు గురై ఆత్మన్యూనతలో మునిగిపోవడం, స్తబ్ధంగా, నిస్తేజంగా ఉండడం. స్పందించే గుణం కోల్పోవడం జరుగుతున్నది.
- వీటిని దృష్టిలో పెట్టుకొని మన రాష్ట్రంలో APSCF-2011ను రూపొందించి మన రాష్ట్ర దృక్పథాన్ని రాసుకున్నాం.

## బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలు, విలువలు, వైఖరులు, సంపూర్తిగా పెంపొందించడం (Development of children knowledge, abilities, skills, values and attitudes to the fullest extent)

బాలల శారీరక, మానసిక, సాంఘిక, నైతిక, మేధోపర, భావోద్వేగ, సౌందర్యాత్మక స్పృహ వంటి అంశాలలో అభివృద్ధిని బాలల సర్వతోముఖాభివృద్ధి అనవచ్చును. బాలలు ఆసక్తిగా అభ్యసించడం, భయరహిత వాతావరణంలో భాగస్వాములవడం ద్వారా బాలల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. బాలలను భావి ఉత్తమ పౌరులుగా రూపొందించి ఉత్తమ జీవన విధానానికి తోడ్పడేదే విద్య. బాలల శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడునట్లుగా పాఠశాల కార్యక్రమాలు ఉండాలి. బాలల అంతర్గత శక్తులను, సామర్థ్యాలను వెలికితీసే విధంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి.

### 1. బాలల సర్వతోముఖాభివృద్ధి :

పిల్లలందరూ శారీరక, మానసిక, సాంఘిక, నైతిక, ఉద్వేగ రంగాలలో అభివృద్ధిచెందినప్పుడే సర్వతోముఖాభివృద్ధిని సాధించినట్లు. ఇందుకోసం పిల్లలు పాఠ్య విషయాలతోపాటు సహపాఠ్య విషయాలను కూడా అభ్యసించాల్సి ఉంటుంది. మన రాష్ట్రంలో RTE-2009 చట్టం అమలులో వచ్చినందున సహపాఠ్య విషయాలను కూడా పాఠ్యవిషయాలతో సమానంగా అభ్యసించేలా చేయడానికి చర్యలు చేపట్టారు. ఇందుకోసం కింది విషయాలను పిల్లలు అభ్యసించాల్సి ఉంటుంది. అవి :

| ప్రాథమిక స్థాయి | ఉన్నత స్థాయి |
|---|---|
| ♦ ప్రథమ భాష (మాతృ భాష)<br>♦ ద్వితీయ భాష (ఆంగ్లం)<br>♦ గణితం<br>♦ పరిసరాల విజ్ఞానం<br>♦ వ్యాయామ, ఆరోగ్యవిద్య<br>♦ విలువలు, జీవన నైపుణ్యాలు<br>♦ పని, కంప్యూటర్ విద్య<br>♦ కళలు, సాంస్కృతిక విద్య | ♦ ప్రథమ భాష (మాతృ భాష)<br>♦ ద్వితీయ భాష (హిందీ / తెలుగు / ఉర్దూ)<br>♦ తృతీయ భాష (ఆంగ్లం)<br>♦ గణితం<br>♦ విజ్ఞాన శాస్త్రం<br>♦ సాంఘిక శాస్త్రం<br>♦ వ్యాయామ, ఆరోగ్యవిద్య<br>♦ విలువలు – జీవననైపుణ్యాలు<br>♦ పని, కంప్యూటర్ విద్య<br>♦ కళలు, సాంస్కృతిక విద్య |

పాఠశాల అనేది బాలల సమగ్ర ఎదుగుదలకు ఏర్పాటు చేసిన కేంద్రం. పిల్లల్లో ఏదో ఒక సామర్థ్యాన్ని అభివృద్ధిపరచడం ద్వారాగాని లేదా కొన్ని విషయాలకే పరిమితమై వాటిని సాధించడంవల్లగాని విద్య యొక్క లక్ష్యం నెరవేరదు. బాలల ఇష్టాలు, ఆసక్తులు వారిని అభివృద్ధిపరిచే రంగాలను గుర్తించి, వాటిలో పాల్గొనేలా చేయడం, అందుకు అవసరమైన కార్యకలాపాలను పాఠశాలల్లో నిర్వహించినప్పుడే బాలల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది. ఇందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలు, పాఠ్యప్రణాళికలు రూపొందించారు.

**బాలల జ్ఞానం (Knowledge):**

ఇది సమాచారం కాదు. పుస్తకాలలోని లేదా గైడులలోనిది జ్ఞాపకం ఉంచుకొని తిరిగి అప్పజెప్పడం కాదు. పుస్తకాలలోని ప్రశ్నలను, జవాబులను గైడ్లు/ స్టడీమెటీరియల్ వంటివి చూసి రాయడం కాదు. జ్ఞానమంటే గతానుభవాల ఆధారంగా తమ ఆలోచనల నుండి ఉద్భవించేది. ఇది ఒక అవగాహన కావచ్చు. ఒక కవిత కావచ్చు; కథ కావచ్చు, సూత్రీకరణ కావచ్చు. జ్ఞానం అనేది అన్ని సబ్జెక్టులలో ఒకే రీతిలో ఉండదు. ఆయా సబ్జెక్టు స్వభావాన్ని బట్టి ఉంటుంది. కాబట్టి భాషలో కథలు రాయడం, అనుభవాలు రాయడం, నినాదాలు రాయడం, కవితలు, గేయాలు వంటి వ్యవహార రూపాల్లో ఉంటే గణితంలో సూత్రాలు, సంబంధాలు నిరూపణలు వంటి రూపంలో ఉంటుంది. సైన్సులో భావనలు, అవగాహన, సిద్ధాంతాలు, సాధారీకరణాల వంటి రూపాల్లో ఉంటుంది. సాంఘికంలో మానవతా మధ్య సంబంధాలు, మానవ జీవనాన్ని ప్రభావితం చేసే అంశాలను గుర్తించడం, విలువల ఆవిర్భావం, చట్టాలు, సామాజిక కట్టుబాట్లు, వంటి రూపాల్లో ఉంటుంది. కాబట్టి జ్ఞాన నిర్మాణం జరిగితేనే నేర్చుకోవడం జరిగిందని భావించాలి. వివరించడం, చదివించడం, చూసి రాయమనడం వల్లే వేయడం వంటి అర్థరహిత విధానాల ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగదు. ఇందుకోసం కృత్యాలు, ప్రాజెక్టులు, అన్వేషణలు, కనుగొనడం వంటి శిశుకేంద్రీకృత విధానాల ద్వారా బోధనాభ్యసన ప్రక్రియను అర్థవంతంగా నిర్వహించాలి.

జ్ఞానమనేది సమాచారం పొందడం కాదు. జ్ఞానం ఆలోచనల, అనుభూతుల సంగమం, బట్టిపట్టడం, పునశ్చరణ చేసుకోవడం ద్వారా పిల్లవాడు పొందే సమాచారాన్ని మనం జ్ఞానం అని తరుచూ భావిస్తారు. కాని జ్ఞానమంటే ఇది కాదు. జ్ఞానమనేది విద్యార్థికి ఇవ్వబడేది కాదు. ఇది అనుభవం ద్వారా స్వయంగా నిర్మించుకునేది. పిల్లలు స్వయంగా ఈ ప్రకృతిలో చురుకైన పాత్ర పోషించి తమంతట తాము చేసి, చూసి జ్ఞానాన్ని పొందాలి. బాలలకు విషయాన్ని బదలాయింపు చేసి జ్ఞాపకం

చేసిన విషయాలను ప్రశ్నల ద్వారా ఉన్నదున్నట్లుగా తిగిరి చెప్పించడం జ్ఞానం కాదు. దీని ద్వారా పిల్లవాన్ని విద్యావంతుని చేయడంగా భావించలేము. నేర్చుకునే విధానం, పద్ధతులు భావనలపై సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి, సాధారణీకరించేలా ఉండాలి. పాఠశాల ఈ విధంగా ప్రేరేపించాలి, ప్రోత్సాహించాలి. జ్ఞానమనేది నియమిత కాలంలో పూర్తిగా ఇవ్వగలిగేది కాదు. మానవమేథో భాండాగారాన్ని బదలాయింపు చేసేది మాత్రమే విద్య కాదు. విద్యార్థి పరిశీలన, అనుభూతుల, ఆలోచనల ద్వారా జ్ఞాన నిర్మాణం చేసుకుంటాడు.

**జ్ఞానం వివిధ రీతులలో ఉంటుంది:**

1. విషయ సంబంధ పరిజ్ఞానం (factural knowledge) నిజాలు, నిర్వచనాలు, సమాచారం, పదజాలం.
2. భావనలపరమైన జ్ఞానం (conceptural knowledge)  వివిధ భావనలు, భావనల సమాచారం
3. పద్ధతి సంబంధిత జ్ఞానం (procedural knowledge) – రూల్స్, పద్ధతులు, వివిధ పద్ధతులు, జ్ఞాన నిర్మాణం చేసుకోవడం.
4. Meta cognition – స్వీయ అవగాహన, మనం ఏమిటి ఎలా నేర్చుకుంటున్నాము అనే దానిపై అవగాహన.

బెంజమిన్ బ్లూమ్ మహాశయుని ప్రకారం ఏదైనా ఒక భావనపై జ్ఞానం ఉందంటే దానిని పోల్చడం, తిరిగి తన దైనందిన భాషలో ఉదా॥ చెప్పగల్గడం, బొమ్మ గీయడం, భాగాలు గుర్తించడం, దానిపై ఒక అవగాహనకువచ్చి రాయడం, పరిశీలించి నమోదు చేయడం, వివరణ ఇవ్వడం, తిరిగి చెప్పడం మొదలైనవి చేయగలగాలి. నేర్చుకొనే దానిని ఉపయోగించగలగాలి.

జ్ఞానం ఉన్నదంటే ఇవి చెయ్యగలగాలి.

- అవగాహన (understanding)
- వినియోగం (application)
- విశ్లేషణ (analyses)
- సంశ్లేషణ (synthesis)
- మూల్యాంకనం (evaluvation)
- సృజించడం (creation)

**బాలల సామర్థ్యాలు (Competencies/ abilities):**

సామర్థ్య అంటే చేయగలగడం అని అర్థం. సమర్థత కలిగివుండడం అని అర్థం. 'మాట్లాడడం' అందరికీ వస్తుంది. ఐతే ఒక సమాచారాన్ని ఇతరులను అడిగి తెలుసుకోవడం సమర్థత. అట్లే రాయడం అందరికీ వస్తుందా. ఐతే తన అవసరం కోసం ఒక దరఖాస్తు రాయగలగడం సమర్థత. ఈ కోణంలో మనం సామర్థ్యాలను అర్థం చేసుకోవాలి. అంటే నైపుణ్యం చెందిన జ్ఞానాన్ని సామర్థ్యంగా భావించాలి.సామర్థ్యాలు సాధారణంగా సబ్జెక్టు స్వభావాన్ని బట్టి ఉంటాయి. ఇవి మానసికమైనవి. ఆలోచనలు కూడా ఉంటాయి. పాఠశాల విద్య ద్వారా పిల్లలు వివిధ సబ్జెక్టులను నేర్చుకుంటారు. ఐతే వీటి ద్వారా ఆయా సబ్జెక్టులలో పిల్లలు ఏమి సాధించాలి? ఏమేం చేయగలగాలి? అనేది ముఖ్యం. అందుకే ప్రతి సబ్జెక్టులో తరగతి వారీగా ఆయా సబ్జెక్టుల స్వభావాన్ని బట్టి సాధించాల్సిన సామర్థ్యాలను నిర్ధారించారు.

సాంఘికశాస్త్రంలో పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలను అన్ని పాఠ్యపుస్తకాలలో విద్యాప్రమాణాలుగా పొందుపరచారు.

## విద్యా ప్రమాణాలు

**పాఠంలోని అంశాలు విద్యార్థులకు అర్థమయ్యేందుకు తగినంత సమయం వెచ్చించాలి. మధ్యమధ్యలో ఉన్న ప్రశ్నలు ఇందుకు ఉపయోగపడతాయి. ఇవి భిన్నమైన ప్రశ్నలు: హేతువు, కారణ-కార్యం, సమర్థన, మేథోపటం/భావనల పటం, పరిశీలన, విశ్లేషణ, ఆలోచన, ఊహ, సమాలోచన, వ్యాఖ్యానం వంటి వాటికి సంబంధించినవి. ముఖ్యమైన భావనలను ప్రతి అధ్యాయంలోనూ ఉదాహరణలతో చర్చించారు, కీలక పదాలుగా కూడా ఇచ్చారు.**

**1) విషయావగాహన:** విచారణ, చర్చ, సమాలోచనలు, కేస్ స్టడీల ద్వారా ఉదాహరణలు, వ్యాఖ్యానం, పరిశీలనవంటి వాటి ద్వారా మౌలిక భావనల అధ్యయనాన్ని ప్రోత్సహించటం.

**2) పాఠ్యాంశాన్ని (ఇచ్చిన) చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం:** అప్పుడప్పుడూ నేరుగా భావనలను తెలియచేయని రైతుల, కార్మికుల కేస్ స్టడీలు, కొన్ని చిత్రాలు ఉంటాయి. వీటిని అర్థం చేసుకోవటానికి, చిత్రాలను వ్యాఖ్యానించటానికి విద్యార్థులకు తగినంత సమయం ఇవ్వాలి.

**3) సమాచార నైపుణ్యాలు:** సామాజిక శాస్త్రాల విధానాలన్నింటినీ కేవలం పాఠ్యపుస్తకాలు చర్చించలేవు. ఉదాహరణకు పట్టణ ప్రాంతంలో ఉన్న పిల్లలు తమ ఎన్నికైన ప్రజా ప్రతినిధుల గురించి, పల్లెప్రాంతాలలో ఉండే పిల్లలు తమ ప్రాంతంలోని చెరువు/ సాగునీటి సౌకర్యాల గురించి సమాచారం సేకరించవచ్చు. ఈ సమాచారమూ, పాఠ్యపుస్తకాలలో ఇచ్చినదీ ఒకటిగా ఉండక పోవచ్చు. దీనిని వివరించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు సేకరించిన సమాచారాన్ని తెలియ చెప్పటం కూడా ముఖ్యమైన సామర్థ్యం అవుతుంది. ఉదాహరణకు చెరువుకు సంబంధించి సమాచారం సేకరిస్తే లిఖిత నివేదికతోపాటు చిత్రం లేదా పటం జోడించవచ్చు. సేకరించిన సమాచారాన్నే చిత్రాలు, గోడ పత్రికల రూపంలో ప్రదర్శించవచ్చు. సమాచార సేకరణ, క్రోడీకరణ, విశ్లేషణ వంటివి కూడా సమాచార నైపుణ్యాలు అవుతాయి.

**4) సమకాలీన (సామాజిక / సాంఘిక) అంశాలపై ప్రతిస్పందన - ప్రశ్నించటం:** తమ జీవన ప్రమాణాలను వివిధ ప్రాంతాల, వివిధ కాలాల ప్రజల జీవన ప్రమాణాలతో పోల్చేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. ఈ పోలికల సందర్భంలో తలెత్తే ప్రశ్నలకు ఒకే సమాధానం ఉండకపోవచ్చు.

**5) పటనైపుణ్యాలు:** ఈ పాఠ్యపుస్తకంలో వివిధ రకాల పటాలు, చిత్రాలు ఉన్నాయి. ప్రదేశాలకు సంబంధించి పటాలు నైరూప్య చిత్రణలు అని అర్థం చేసుకుని దానికి సంబంధించి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి. దీంట్లో వివిధ దశలు ఉన్నాయి. గత తరగతుల్లో ఎత్తు, దూరాలను పటంలో ఎలా చూపించాలో తెలుసుకున్నాం. సమతల ఎత్తుల గురించి ఈ తరగతిలో తెలుసుకుంటాం. పాఠ్యపుస్తకంలో వివిధ చిత్రాలు, ఫోటోలు, గోడ పత్రికలు ఉన్నాయి. ఇవి కేవలం అందం కోసం పొందుపరచినవి కావు, పాఠానికి సంబంధించినవి. చిత్రాలకు సంబంధించి కూడా కొన్ని కృత్యాలు ఉన్నాయి.

**6) ప్రశంస / అభినందన - సున్నితత్వం:** భాష, సంస్కృతి, కులం, మతం, స్త్రీ-పురుషుల విషయాలలో మన దేశంలో ఎంతో వైవిధ్యత ఉంది. సామాజిక శాస్త్రం ఈ వైవిధ్యతలను పరిగణనలోకి తీసుకుంటుంది, వీటి పట్ల సున్నితత్వం ప్రదర్శించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తుంది.

కాబట్టి వీటిని పిల్లలందరూ సాధించేలా చూడడం మన బాధ్యత. ఇందుకనుగుణంగానే నూతన పాఠ్యపుస్తకాలు నెలకొనాలి. వీటిని సరైన రీతిలో వినియోగించాలి. అనగా పాఠాల మధ్యలోని, పాఠాల కింద ఉన్న సామర్థ్యాధారిత అభ్యాసాలను పిల్లలు

సొంతంగా రాసేలా చూడాలి. గైడ్లు వంటి వాటిని చూసి రాయడాన్ని నిషేదించాలి. ఇలా చేస్తే వారిలో సామర్థ్యాభివృద్ధి జరుగదు. ఆలోచించడం, చేసి చూడడం, అధ్యయనం చేయడం, పాల్గొనడం, సొంతంగా రాయడం ద్వారా సామర్థ్యాలను పిల్లలు పొందుతారు. ఇందుకోసం ఉపాధ్యాయులు వార్షిక ప్రణాళికను, పాఠ్య ప్రణాళికను రూపొందించుకొని తగిన సంసిద్ధతతో బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి.

పిల్లలు ఎన్నో అంతర్గత శక్తులు, సామర్థ్యాలు కలిగి ఉంటారు. విద్య యొక్క ముఖ్య ఆశయం బాలల్లో ఉండే సహజమైన ఈ శక్తులను అభివృద్ధి పరచడమే (capabilities or innate abilities)

**బాలల అంతర్గత శక్తులు, సామర్థ్యాలు:**

ఈ అంతర్గత శక్తులు ప్రతి బాలుని/ బాలికలో ఉంటాయి. ఇవి ఒక్కొక్కరిలో ఒక్కోవిధంగా అభివృద్ధి చెందివుండాలి. వీటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మంచి శక్తులు, నైపుణ్యాలు గల వ్యక్తులను తయారు చేయడమే పాఠశాల ప్రముఖ కర్తవ్యం.

- ఆలోచించడం
- పరిశీలించడం, పోల్చడం, సేకరించడం
- ఊహించడం
- భేదాలు, పోలికలు గుర్తించడం, చెప్పడం
- వర్గీకరించడం, లెక్కించడం
- అంచనా వేయడం
- కారణ కారకాలు, సూత్రీకరించడం
- ప్రశ్నించడం, పరికల్పనలు చేయడం
- కారణాలు చెప్పడం
- నియమాలు ఏర్పరచడం, సాధారణీకరించడం
- విశ్లేషించడం
- సంశ్లేషించడం
- ఉత్పత్తి చేయడం/సృజించడం
- ఆడడం, పాడటం, అభినయనం
- సృజనాత్మకంగా వ్యక్తీకరించడం
- సమస్యా పరిష్కారాలు సూచించడం
- నిర్ధారణకు రావడం
- పరికరాలను ఉపయోగించడం
- మానసిక చిత్రాలు ఏర్పరచుకోవడం
- బొమ్మలు, పటాలు గీయడం

పై శక్తులు ఎంతో కొంత అభివృద్ధి చెంది పిల్లలందరిలో ఉంటాయి. వాటిని పూర్తిగా వృద్ధిపరచడం, పిల్లల పూర్తి సామర్థ్యం మేరకు పై శక్తులను (capabilities) ను వృద్ధి పరచడం పాఠశాలలు, ఉపాధ్యాయులు చేయాల్సింది. ఉపాధ్యాయులు తమ సబ్జెక్టులో భాగంగానే వీటి పెంపుదల, అభివృద్ధికి తగిన కార్యక్రమాలు ప్రణాళికచే సాధించాలి.

**నైపుణ్యాలు (Skills):**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో నూతన సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొనుటకు పిల్లలు ప్రదర్శించాల్సిన సామర్థ్యాలే నైపుణ్యాలు. ఈ నైపుణ్యాలు సబ్జెక్టు ఆధారంగా కావచ్చు లేక అన్ని సబ్జెక్టులో అంతర్గతంగా ఉండేవి కావచ్చు.

నైపుణ్యాలు ముఖ్యంగా ఈ రకాలుగా ఉంటాయి.

1. ఆలోచనా నైపుణ్యాలు (Thinking skills)
2. సామాజిక నైపుణ్యాలు (Social skills)
3. భావప్రసార నైపుణ్యాలు (Communicative skills)
4. స్వయం నిర్వహణ నైపుణ్యాలు (Self management skills)
5. పరిశోధన నైపుణ్యాలు (Reserch skills)

**ఆలోచనా నైపుణ్యాలు:**

సాధారణంగా మనకు భాషల్లో భాషానైపుణ్యాలు, విజ్ఞానశాస్త్రంలో ప్రక్రియా నైపుణ్యాలు వర్గీకరణ, పోల్చడం, ప్రయోగాలు, భావ ప్రసార నైపుణ్యాలు, పరికల్పనలు, అన్వేషణలు నిర్ధారణ మొదలగువాటి గురించి కొంత అవగాహన ఉంది. నైపుణ్యాలు అనేవి మానసికపరమైనవి. అనగా ఆలోచణాత్మకమైనవి. ఆలోచించే విధంలో వైవిధ్యతను ప్రదర్శించే నైపుణ్యం కల్గి ఉండడం. వీటినే ఆలోచన నైపుణ్యాలు (thinking skills) అంటారు. ఇవి ప్రధానంగా నాలుగు రకాలు.

1. ప్రతిస్పందించడం (Reflection)
2. హేతుబద్ధంగా ఆలోచించడం (Rational thinking) అంటే వాస్తవాలు గుర్తించి కారణాలు చెప్పగలగడం.
3. బహుకోణాల్లో ఆలోచించి విశ్లేషించడం అంటే ఏ విషయం గురించైనా విభిన్న కోణాల్లో చెప్పగలగడం, సమర్థిస్తూ మాట్లాడడం, దాన్నే విభేదిస్తూ మాట్లాడడం; ఏదైనా పని – అంటే ప్రజాస్వామ్యంలో ఎన్నికల గురించి ప్రయోజనాలను చెప్పగలగడం అట్లే పరిమితులను కూడా చెప్పగలగడం.
4. **సృజనాత్మక ఆలోచనలు (Creative Thinking)**: అంటే నూతన ప్రతిపాదన చేయగల్గడం ,కొత్తవి సృష్టించడం, తన నిర్ణయాన్ని ప్రకటించడం అంటే తానే ఆస్థానంలో ఉంటే ఏం చేస్తాడు? అని స్థిరంగా/ ఆత్మ విశ్వాసంతో చెప్పగలగడం.
5. విమర్శనాత్మక ఆలోచనలు **(Critical Thinking)**: ఎందుకు? ఏమిటి? ప్రశ్నించడం ద్వారా ఆలోచింపజేయడం.

నేర్చుకోవడం అనేది ఆలోచించడం ద్వారానే జరుగుతుంది. అభ్యసనం జరగాలంటే విద్యార్థులను భావనలపై, సమస్యలపై ఆలోచింప చేయాలి. ఆలోచించడం, చేయడం, అనుభవాల ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.

జ్ఞానాన్ని పొందడానికి ఆలోచించాలి. ఆలోచిచండం ద్వారానే అవగాహన, వినియోగం, విశ్లేషణ, సంశ్లేషణ, మూల్యాంకనం అనే అత్యున్నత నైపుణ్యాల సాధన జరుగుతుంది.

**సామాజిక నైపుణ్యాలు (Social Skills):**

- ఇతరులను గౌరవించడం
- బాధ్యతలు స్వీకరించడం
- ఇతరులతో కలిసి పని చేయడం, పంచుకోవడం
- సమాజంలో సమూహంలో తన బాధ్యతను నిర్వర్తించడం
- స్వీయ విశ్వాసం, నమ్మకం ఉండటం
- కుటుంబ జీవనం, కుటుంబ సంబంధాలపై ఆకాంక్ష

**భావ ప్రసరణ నైపుణ్యాలు (Communicative Skills):**

- బాగా వినటం
- ఆలోచించి మాట్లాడటం
- చదవటం
- చదివింది అవగాహన చేసుకొని ప్రతిస్పందించడం
- స్వీయ రచన : చదివింది, విన్నదానిపై అవగాహనతో వ్యాఖ్యానించడం
- హావ భావాల ద్వారా భావనా ప్రసరణ నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ

**స్వీయ నిర్వహణ నైపుణ్యాలు (Self management Skills):**

- మానసిక చలనాత్మక నైపుణ్యాలు (కాళ్ళు, చేతులు, వేళ్ళతో వివిధ పనులు చేయటం)
- సమయ పాలన నిర్వహణ (Time management)
- ఆరోగ్యమైన జీవన విధానాలు (Healthy life style)
- ఆశించిన రీతిలో పిల్లల ప్రవర్తన

**పరిశోధనా నైపుణ్యాలు/సమాచార నైపుణ్యాలు:**

పరిశోధించడం ద్వారా తెలుసుకోవటం, వివిధ నైపుణ్యాలు సాధించడం అవి

- ప్రశ్నించడం
- ప్రశ్నల ఆధారంగా పరిశీలనలు చేయడం
- ప్రణాళిక మరియు సమాచార సేకరణ
- సేకరించిన సమాచార నమోదు, విశ్లేషణ
- కనుగొన్న విషయాలు రిపోర్టు రూపంలో రాయటం, ప్రదర్శించడం

ప్రతి పాఠశాల తన సిలబస్ మరియు వివిధ అంతర కరికులం కార్యక్రమాల ద్వారా పై నైపుణ్యాలను పిల్లలందరిలో అభివృద్ధి పరచాలి.

**4. వైఖరులు (Attitudes/ dispositions):**

వ్యక్తులు తమ ప్రకృతి మరియు సమాజంపై ప్రదర్శించే, బహిర్గత పరిచే అతి ముఖ్యమైన మానవ విలువలు, నమ్మకాలు, అనుభూతులను వైఖరులు అంటాం.

**వ్యక్తులు ప్రదర్శించే ముఖ్యమైన వైఖరులు:**

- బాధ్యత తీసుకోవడం
- కలిసి పనిచేయడం (Cooperation)
- సృజనాత్మకత (Creativity)
- ఉత్సాహం, ఉత్సుకత (Curiosity)
- తదానుభూతి (Empathy)
- సహనం, ఓర్పు
- గౌరవం చూపడం
- స్వతంత్రత

- క్షమ, ప్రేమతత్వం
- ప్రోత్సహించడం, ప్రశంసించడం
- నిజాయితి, శ్రమకు విలువనివ్వటం

విద్య అనేది జాతీయ అభివృద్ధిని, సాంఘిక అభివృద్ధిని సాధించేది. బాలల అంతర్గత శక్తులను గుర్తించి శారీరక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక, విలువలు, నీతినియమాలను అభివృద్ధి చేయునట్లుగా పాఠశాల పని చేయడం ద్వారా బాలల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది.

**బాలల సర్వతోముఖాభివృద్ధి - అభివృద్ధి రంగాలు**

**(All round development of children - Developmental areas)**

బాలల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక, మానసిక శక్తులను అభివృద్ధి చేయడం.

బాలలు సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే పాఠశాల స్థాయిలో కింది రంగాలపై దృష్టిపెట్టాలి.

1. శారీరక అభివృద్ధి
2. మానసికాభివృద్ధి/ మేధోపరమైన అభివృద్ధి
3. సాంఘికాభివృద్ధి
4. ఉద్వేగాభివృద్ధి
5. నైతికత, విలువలు శీలనిర్మాణం
6. సౌందర్యాత్మక స్పృహ, ప్రశంస

బాలల సర్వతోముఖాభివృద్ధిలో శారీరక, సామాజిక, మానసిక, మేధోపర, నైతిక, విలువలు, సౌందర్యాత్మక స్పృహ వివిధ రంగాలు ఇమిడి ఉన్నాయి. వీటి వికాసానికి పాఠశాలలు కేంద్రబిందువులు కావాలి. వీటన్నిటితో కూడిన పాఠ్యప్రణాళిక పాఠశాలల్లో అమలుకావాలి.

**అభ్యసనం అంటే? (What is Learning?)**

చాలామంది 'అభ్యసనం' అంటే పుస్తకంలోని సమాచారాన్ని ఉపన్యాసపద్ధతి ద్వారా పిల్లలకు అందించడం, ప్రశ్నల ద్వారా అందించిన సమాచారాన్ని రాబట్టడంగానే భావిస్తారు. దీనివల్ల చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుడు కేవలం చెప్పడం, విద్యార్థి విని అర్థంచేసుకొని గుర్తు పెట్టుకోవడం జరుగుతున్నది. వాస్తవంగా అభ్యసనమంటే సమాచారం అవగాహన చేసుకొని అనుభవం ద్వారా జ్ఞానంగా మార్చుకోవడం. అవసరమైనప్పుడు, సందర్భోచితంగా ఈ జ్ఞానాన్ని వినియోగించగలగాలి. ఈ మేరకు సరైన అభ్యసనా అనుభవాలు పొందకపోవడం వలన పిల్లలకు బట్టీ విధానం తప్ప మరో మార్గం లేని పరిస్థితి నెలకొన్నది.

ఆధునిక విద్యావేత్తలు పరిశోధనలు చేసి పిల్లలందరిలోనూ అభ్యసించే శక్తి ఉందని నిరూపించారు. దీని ప్రకారం పిల్లలు స్వంతంగా జ్ఞానాన్ని నిర్మించుకోగలరు. పిల్లలకు సమాచారాన్ని అందుబాటులో ఉంచి వారి పూర్వజ్ఞానం, పూర్వానుభవాలతో జ్ఞానాన్ని నిర్మించుకోనేందుకు ఉపాధ్యాయులు సంధానకర్తలుగా, సౌలభ్యకర్తలుగా (ఫెసిలిటేటర్) ఉండాలి.

సాంప్రదాయంగా భావిస్తున్నట్లు ఉపాధ్యాయులు జ్ఞానదాతలు కారు, పిల్లలు జ్ఞానగ్రహీతలు కారు. జ్ఞాన నిర్మాతలు. అంతేకాని ఉపాధ్యాయుని సూచన ప్రకారం నడుచుకొనే 'మరమనషులు' కారు.

పై అంశాలను పరిశీలిస్తే సమాచారాన్ని పూర్వానుభవాలతో సంధానం చేసుకొని సామర్థ్యాలకు పదును పెట్టుకొని సందర్భానుసారం వినియోగించే శక్తిని పెంపొందించుకోవడమే అభ్యసనం అని చెప్పవచ్చు.

**అభ్యసన స్వభావం, పిల్లలు ఎలా నేర్చుకుంటారు?**

**(Nature of learning - How children learn)**

- పిల్లలు కేవలం వినడం లేక చదవడం ద్వారానే కాకుండా అనేక ఇతర పద్ధతుల ద్వారా కూడా నేర్చుకొంటారు. అనగా అనుభవాలు (Experience), పనులు, కృత్యాలు చేయడం ద్వారా (learning by doing), ప్రయోగాలు చేయడం (experimentation), చర్చలు (discussion), అడగడం/ ప్రశ్నించడం, ఆలోచించడం, ప్రతిస్పందించడం, ఆలోచించి స్వంతంగా రాయడం, (asking / questioning, listening,thinking, reflecting and expressing, one self) మొదలగు వాటి ద్వారా నేర్చుకొంటారు.
- ఉత్సాహంగా నేర్చుకోవడం అనేది పిల్లలందరికి స్వాభావికంగానే ఉంటుంది. అందరు పిల్లలు నేర్చుకోగలరు. నేర్చుకొనే స్వామర్థ్యం పిల్లలందరికీ ఉన్నది. నేర్చుకోవడం అనేది పాఠశాలలోనే గాకుండా బయట వాతావరణంలో కూడా జరుగుతుంది. అభ్యసనాన్ని మెరుగుపరచాలంటే తప్పనిసరిగా తరగతి గది అభ్యసనాన్ని బడి బయట కృత్యాలతో, అనుభవాలతో అనుసంధానం చేయాలి. చేయడం ద్వారా పరిశీలన ద్వారా, ఆలోచించడం ద్వారా బాగుగా నేర్చుకుంటారు.
- అర్థాన్ని గ్రహించడం, అవగాహన చేసుకోవడం, తార్కికంగా ఆలోచించడం, సమస్యల సాధన, అన్వేషించడం, కనుగొనడం, చర్చలు మొదలగు వాటి ద్వారా అభ్యసనం బాగా జరుగుతుంది.
- పిల్లలు మానసికంగా, శారీరకంగా, మేథోపరంగా సంసిద్ధులు కాకముందే బడికి పంపితే అభ్యసనం జరుగదు. ఇటువంటి పరిస్థితుల్లో పిల్లలు పాఠాలను బట్టీ పట్టి అప్ప చెబుతారే, కాని ఆ సమాచారాన్ని అవగాహన చేసుకోరు, నిత్య జీవితానికి అన్వయించుకోలేరు. బళ్లో కూడా నేర్పే అంశం పట్ల పిల్లలకు ప్రాథమిక అవగాహన లేదా తగిన సామర్థ్యాలు లేకున్నా కూడా పిల్లలకు నేర్చుకొనే విషయం పట్ల అయిష్టత ఏర్పడుతుంది. ఆ సబ్జెక్టును కష్టమైనదిగా భావిస్తారు. కాబట్టి తప్పనిసరిగా మేథోపరంగా సంసిద్ధులను చేయడం మన బాధ్యత.
- అభ్యసనం బాగా జరగాలంటే తగిన ప్రశ్నల ద్వారా పిల్లలను ఆలోచింప చేయాలి. కృత్యాలు, సమస్యలు, ప్రాజెక్టులు ఇచ్చి దానిపై పిల్లలను మాట్లాడించాలి. చేసింది, నేర్చుకొన్నది రిపోర్టుల రూపంలో రాయమనాలి. తరగతి గదిలో ప్రదర్శించి చర్చకు పెట్టమనాలి. ఇలా చేస్తే పిల్లలు సంతోషంగా, బాగుగా నేర్చుకొంటారు. ఇటువంటి పనులలో వైవిధ్యం, సవాలు (challenge) ఉంటుంది. విసుగుదల ఉండదు. పనులు చేయడం ద్వారా నేర్చుకుంటున్నారు. కావున ఏకాగ్రత ఉంటుంది. పిల్లలు ఇష్టంగా చేయడం వల్ల వాటిలో, ఉత్సాహంగా పాల్గొంటారు. నేర్చుకోవడం సులభంగా తెలియకుండానే జరుగుతుంది. పనుల్లో నిమగ్నం అవుతారు కాబట్టి అల్లరి చేయడం మొదలగు క్రమశిక్షణా సమస్యలు ఉత్పన్నం కావు.
- అభ్యసనం అనేది పరిసరాలలో పిల్లలు పరస్పర ప్రతిస్పందనాల ద్వారా, పరిశీలనల ద్వారా, సమాజంలోని వివిధ వ్యక్తులతో జరిపే పరస్పర చర్చల ద్వారా జరుగుతుంది.
- పిల్లలు తమకున్న పూర్వ జ్ఞానం ద్వారా కొత్త జ్ఞానం పొందడానికి ప్రయత్నిస్తారు. జ్ఞాన నిర్మాణం అనేది పిల్లలు సొంతంగా పరిసరాలలో, వ్యక్తులలో పరస్పర చర్చ, ప్రతిస్పందనల (interactive) ద్వారా జరుగుతుంది. పిల్లలందరికీ పూర్వ జ్ఞానం వేరు వేరుగా ఉంటుంది. కాబట్టి కొత్త అంశాల పట్ల అవగాహన చేసుకోవడం కూడా వేరుగా ఉంటుంది. కాబట్టి పిల్లలు తమ అభ్యసనంలో ఒకే రీతిలో ఉండరు. పిల్లల జ్ఞాన నిర్మాణానికి, తగిన అనుభవాలు, కృత్యాలు, చర్చల ద్వారా ఆలోచింపజేయడం అనేవి చేయాలి.

- నేర్చుకోవడానికి ముఖ్యమైనది తరగతి గది వాతావరణం, అనగా భయరహిత వాతావరణం. పిల్లలకు భద్రత, ప్రేమ ఆప్యాయత చూపించడం, ఉపాధ్యాయుడు పిల్లలతో కలిసిపోయి వారు నేర్చుకునేటట్లు చేయడం, వ్యక్తిగతంగా చెప్పడం, తెలియని విషయాలు అడగమని పిల్లలు ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి. తరగతిగది పరిశుభ్రంగా ఉండాలి. నల్లబల్ల, చార్టులు ఉపయోగించి బోధించాలి. పాఠానికి సంబంధించి వివిధ భావనల అవగాహనకు, కొన్ని ప్రశ్నలు నల్లబల్ల పై రాసి, ఆ ప్రశ్నలపై చర్చింపజేయాలి. చర్చ జరిపిన అంశాలతో పోల్చుకోవాలి. పిల్లలచే పాఠం చదివించి, చర్చలు చేయించాలి. ముఖ్యమైన వాటిని నల్లబల్లపై రాయాలి. దీనివల్ల పిల్లలు ఆ ప్రశ్నల గురించి ఆలోచిస్తారు. తామే జవాబులు సొంతంగా చెబుతారు. ఇతరులు చెప్పిన దాన్ని వింటారు. ఇలా తరగతి గదిలో నేర్చుకోవడం జరుగుతుంది. దీన్నే (interactive learning) చర్చలు, ప్రతిస్పందనల ద్వారా నేర్చుకోవడం అంటారు. ఒక మంచి సామాజిక వాతావరణం తరగతి గదిలో ఏర్పడుతుంది. పిల్లలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం ఇలాంటి విధానాల ద్వారా లభిస్తుంది. అందరు పిల్లలు చురుకుగా ఉంటారు. చర్చల్లో పాల్గొంటారు. ఇలాగే కృత్యాలు, ప్రయోగాలు, పరిశీలనలు కూడా చేయించడం ద్వారా అభ్యసనాన్ని ఉత్సాహభరితం చేసి పిల్లలందరూ నిమగ్నం అయ్యేటట్లు చెయ్యెచ్చు.
- ఐతే నేర్చుకొనేటప్పుడు తప్పులు జరగడం చోటుచేసుకుంటుంది. పిల్లల తప్పులను ఎత్తి చూపడం, నిందించడం, ఇతరులతో పోల్చడం కించపరచడం వంటివి చేయకూడదు. పిల్లలు చేసిన వాటిలో ఏమేం చేశారో గుర్తించాలి. అభినందించాలి. వారు చేసిన తప్పులను పిల్లలే సరిదిద్దుకునేలా తరగతిలో చర్చ నిర్వహించాలి. సరైనది ఏదో ఉపాధ్యాయుడు వివరించి, పిల్లల్ని తాము రాసిన వాటిని సరిపోల్చుకోమని అనాలి. (competition) దీని వల్ల పిల్లలు నేర్చుకొనే ప్రక్రియలో తమకోసం పాల్గొంటారు. అదే పనిగా తప్పులు వెదికి 'X' లు పెట్టి ఎత్తిచూపినంత మాత్రాన, ఆ తప్పు ఎందుకు జరిగిందో గుర్తించలేడు. తప్పులు పోతాయన్న భయంతో/ న్యూనతా భావంతో మాట్లాడటానికి, తెలియజేయడానికి, ప్రదర్శించడానికి ముందుకు రారు. దీనివల్ల అభ్యసనం కుంటుపడుతుంది.జరగదు.

### భాగస్వామ్య అభ్యసనం (Collaborative learning)

'నేర్చుకోవడం' అనేది ఒక సామాజిక ప్రక్రియ, ఇతరులతో మాట్లాడుతూ, ఇతరులు మాట్లాడేది వింటున్నప్పుడు, చర్చల్లో పాల్గొంటున్నప్పుడు, తోటి వారితో కలిసి పనిచేయడం ద్వారా అప్రయత్నంగానే అనేక విషయాలను గ్రహిస్తుంటారు. ఇది సందర్భోచితంగా కూడా ఉంటుంది. ఐతే సాధారణంగా పెద్దలకు గానీ, తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులు తాము చెప్పడం వల్లే అన్ని విషయాలను పిల్లలు నేర్చుకుంటున్నారని భావిస్తుంటారు. కొన్ని పిల్లలకు మనం ఏమి విషయాలు చెప్పాలి? కేవలం ఇవి మాత్రమే పిల్లలకు తెలుసా? మిగతావి పిల్లలకు ఎలా తెలుసు? అని ఆలోచిస్తే పిల్లలు నేర్చుకొనే విధానం బోధపడుతుంది. పిల్లలు తమ తోటి వారితో కల్సి ఆడడం, పాడడం, ముచ్చటించడం, చర్చించడం, వాదించడం, కల్సి పనిచేయడంవంటి కార్యకలాపాల ద్వారా ఎక్కువగా నేర్చుకొంటారు. విషయాలు తమ తోటి వారితో చర్చించడం వల్ల వారి జ్ఞానం విస్తృతమౌతుంది. ఇలా ఇతరులతో కలిసి నేర్చుకొనే పద్ధతిని జట్టు పనుల ద్వారా కల్పించవచ్చు. ఇది భాగస్వామ్య అభ్యసనానికి తోడ్పడుతుంది.దీనినే పాల్గొనడం ద్వారా నేర్చుకోడం అనవచ్చు.

### పిల్లలు ఎలా నేర్చుకొంటారు?

ఆలోచన అభ్యసనానికి మూలం. మానసిక శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పరిశోధనల ప్రకారం పిల్లలలో నేర్చుకోగలిగిన శక్తి అంతర్గతంగా ఉంటుంది. ఇది పుట్టుకతోనే సంక్రమిస్తుంది. పిల్లలు సాధారణంగా పరిసరాల ద్వారా వస్తువులతో పరస్పర ప్రతిచర్యలు జరిపి సమవయస్కులు, పెద్దల సహకారంతో నేర్చుకొంటారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు కల్పించిన సందర్భోచితమైన అర్థవంతమైన కృత్యాలలో పాల్గొని పూర్వజ్ఞానం ఆధారంగా నూతన జ్ఞానాన్ని నిర్మించుకుంటాడు. అయితే పిల్లలు నేర్చుకోవడంలో ముఖ్యపాత్రను పోషించే ప్రక్రియలను తెలుసుకొందాం. అవి:

- ఆలోచించడం
- పరిశీలించడం
- ప్రశ్నించడం
- భాగస్వాములు కావడం
- పరస్పర ప్రతిచర్య జరపడం
- నిరంతర అన్వేషణ
- కనుగొనడం
- చర్చించడం
- పరస్పరం భావాలను పంచుకోవడం
- భౌతిక, మేధోపరమైన కృత్యాలలో పాల్గొనడం
- సందర్శించడం

అయితే పిల్లలకు అభ్యసనానుభవాలను కల్పించేటప్పుడు మనం ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొంటున్నామా? అభ్యసనంలో ఈ ప్రక్రియలు చోటుచేసుకోకపోతే నేర్చుకున్నది తాత్కాలికమా? శాశ్వతమా? సంపూర్ణమా? అసంపూర్ణమా? ఆలోచించండి!

**కృత్యాధార అభ్యసనం:**

తరగతి గదుల్లో పిల్లల అభ్యసనం కృత్యాల ఆధారంగా జరిగే దానిని కృత్యాధార అభ్యసనం అని చెప్పవచ్చు. ఈ పద్ధతి గత కొన్ని సంవత్సరాలుగా ఆచరణలో ఉంది కాని చాలామంది ఇప్పటివరకు ఈ పద్ధతిపైన సరైన అవగాహన లేకుండా, సరిగా అన్వయించకుండానే ఈ పద్ధతి ద్వారా బోధించడానికి ప్రయత్నం జరుగుచున్నది. కృత్యాధార పద్ధతిని అవలభించాలి? నిజంగా ఇది అవసరమా? అసలు ఈ పద్ధతి ఎలా ఆవిర్భవించింది? అనే ప్రశ్నలు ఉపాధ్యాయున్ని ఇప్పటికీ వేధిస్తూనే ఉన్నాయి.

స్థూలంగా చెప్పాలంటే కృత్యం అనే భావన చాలా పురాతనమైనది. పిల్లల అభ్యసన ప్రక్రియ మౌళిక నియమాలపై ఆధారపడి ఉంది. నిజమైన కృత్యాధార అభ్యసనం అంటే కేవలం శారీరక కదలికలే కాకుండా మానసిక అంశాలతో మిళితమై ఉండాలి.

**పిల్లలు ఈ సందర్భాలలో బాగుగా నేర్చుకుంటారు:**

అభ్యసనంలో వారిని భాగస్వామ్యం చేసినప్పుడు అనగా ప్రశ్నించి వారిని ఆలోచింప చేసినప్పుడు.

**కృత్యము :** కృత్యాల ద్వారా నేర్చుకోవడం అనేది అనుభవ పూర్వకంగా నేర్చుకోవడం (experiential learning) కృత్యాలు పనిచేయడం కావచ్చు, పరిశీలనలు కావచ్చు, గ్రూపు చర్చ కావచ్చు.

**కృత్యాలు : అపోహలు :**

కృత్యం అంటే నేటికి కూడా చాలా మంది ఉపాధ్యాయులు రకరకాలుగా అభిప్రాయపడ్తుంటారు. ఉదా:

- కృత్యం అంటే కేవలం శారీరకమైనది. అసలు అభ్యసనప్రక్రియతో దీనికి ఎలాంటి సంబంధం ఉండదు.
- కృత్యాలు 1, 2 తరగతులకు మాత్రమే ఉపయోగకరం. పై తరగతులలో వీటిని ఉపయోగించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు.

- కృత్యం నిర్ధారిత లక్ష్యాలు, విధానాలు, ఫలితాలతో కూడి ఉండాలి.
- కృత్యాధార బోధనవల్ల సకాలంలో సిలబస్ పూర్తి చేయడం సాధ్యం కాదు మొ॥వి.

**కృత్యం - ఉదాహరణలు:**

ఇవన్నీ కేవలం అపోహలు మాత్రమే. పిల్లలు చర్చించడం ద్వారా సాంఘిక శాస్త్ర అంశాలను సులభంగా అవగాహన చేసుకొనగలరు.

ఉదా: 1. గ్లోబును పరిశీలించి, అక్షాంశ-రేఖాంశాల మధ్య భేదాలు రాయండి - చర్చ, పరిశీలన.

2. మీ గ్రామం చుట్టుపక్కల గల జలవనరుల సమాచారాన్ని సేకరించండం - జట్టుపని.

3. బాలలను కార్మికులుగా ఎందుకు నియమించరాదో తెలపండి - చర్చ.

**కృత్యానికి ఉండవలసిన లక్షణాలు:**

పిల్లలలో ఆశించిన విధంగా అభ్యసనం వేగంగా, అర్థవంతంగా ఉండాలంటే కృత్యానికి నిర్దిష్ట లక్షణాలు ఉండాలి. ఉదా.

- ఆలోచనలు రేకెత్తించాలి.
- సవాలుతో కూడి ఉండాలి.
- వ్యక్తిగతంగా, జట్లలో, పూర్తి తరగతిలో చేసేదిగా ఉండాలి.
- బహుళ తరగతి బోధనకు ఉపయోగపడేదిగా ఉండాలి.
- స్థాయికి తగినట్లు ఉండాలి.
- లక్ష్యాత్మకంగా, ఆచరణాత్మకంగా ఉండాలి.
- ఆసక్తికరంగా, పాల్గొనడాన్ని పురికొల్పేదిగా ఉండాలి.
- చేర్పులు, మార్పులకు వీలైనదిగా ఉండాలి.
- తక్కువ ఖర్చు, ఖర్చులేనిదిగా ఉండాలి.

పిల్లల ఆసక్తులు, అభిరుచులు, అనుభూతులు, యిష్టాయిష్టాల ఆధారంగా పాఠ్యాంశాల ఇతివృత్తాల ఆధారంగా కృత్యాలు ముందే రూపొందించుకొని తరగతిగదిలో కల్పించాలి. ఇవి వ్యక్తిగతంగా, జట్లుగా, పూర్తి తరగతి పనులుగా ఇవ్వాలి. కృత్యాలు కల్పించడానికి ముందు కృత్యాలలో ఎలా పాల్గొనాలో తెలిపే సూచనలు స్పష్టంగా అందరికీ అర్థమయ్యే విధంగా ఇవ్వాలి. కృత్యాలలో పాల్గొనే సందర్భంలో పిల్లలు ఎలా పాల్గొంటున్నారో గమనించాలి. అందరూ పాల్గొనేలా ప్రోత్సహించాలి. అవసరమైన సాయం అందించాలి. పిల్లలు నేర్చుకునే తీరును అంచనావేయాలి. నేర్చుకున్న అంశాలను పిల్లలతో చర్చించాలి. పిల్లల ప్రతిస్పందనలను టీచర్ తన డైరీలో రికార్డు చేయాలి.

**కనుగొనడం (Discovery):**

ఏదైనా పత్రాన్ని మనం చెప్పడం కాకుండా పిల్లలే స్వయంగా కనుక్కునేలా ప్రోత్సహించాలి. ఉదా: దిక్కులు సూర్యోదయం ఆధారంగా గ్రామం దిక్కులను తెలుసుకొనేటట్లు పిల్లలను ప్రోత్సహించాలి. తర్వాత గ్రామపటం గీయించి, అందులో దిక్కులను సూచించమనాలి. ఇలాగే పాఠశాల, ఇల్లు మొ॥ ప్రాంతాలకు దిక్కులను ఊహించమనాలి. ఆతర్వాత సూర్యోదయం ఆధారంగా వాటిని సరిచూసుకోమనాలి. వారు మొదట ఊహించింది తప్పు లేక ఒప్పు తెలుసుకుంటారు. ఇలాగే కొన్ని దృగ్విషయాలను మనం చెప్పకుండా పిల్లలు చేసి తమంతట తాము కనుక్కోవాలి.

ఈ రకమైన అభ్యసనం పిల్లలలో ఉత్సుకతను ఇనుమడింపచేస్తుంది. సవాలుతో కూడి ఉండడంవల్ల పిల్లలు చురుకుగా పాల్గొంటారు. ఒక నూతన అంశాన్ని కనుగొన్నామన్న తృప్తి వారికి నూతనోత్తేజాన్ని కలిగిస్తూ మరింత వేగంగా నేర్చుకునేలా చేస్తుంది. ఇది అర్థవంతమైన అభ్యసనానికి పురికొల్పుతుంది. ఈ పద్ధతి వల్ల పిల్లలు బాలశాస్త్రవేత్తలుగా అనుభూతి చెందుతారు.

**అన్వేషణ (పరిశోధన) (Explorative Survey)**

అన్వేషణకు సంబంధించిన కృత్యాలు పిల్లలలో తెలుసుకోవాలన్న తపనను రగిలిస్తాయి. రకరకాల కోణాలలో తమదైన శైలిలో సమాచారం కోసం అన్వేషిస్తారు. సమాచారాన్ని విశ్లేషిస్తారు. ఫలితంగా ఒక సాధారణీకరణకు రాగలుగుతారు. తమ అభిప్రాయాలను ధృడపరచుకుంటారు. ఉపాధ్యాయులు విశ్లేషణాత్మక ప్రశ్నలు అడిగి పిల్లల అన్వేషణ, పరిశోధన ద్వారా కనుగొన్న విషయాన్ని సహేతుకంగా రాబట్టాలి. ఇటువంటి కృత్యాలు కల్పించడంవల్ల పిల్లలు తమంతటతామే తెలుసు కున్నామన్న భావన కలుగుతుంది. పాఠ్యపుస్తక సమాచారం ద్వారా పొందిన జ్ఞానాన్ని అన్వయిస్తారు. వృద్ధి పరచుకుంటారు.

ఉదా : మీ జిల్లాలోగాని, మీ రాష్ట్రంలోగాని ఏ ఏ ఖనిజాలు ఉన్నాయి. అవి ఏ ఏ రకాలుగా ఉపయోగపడుతున్నాయి. సమచారాన్ని సేకరించి పట్టికలో నమోదుచేసి, విశ్లేషించమనాలి.

**అన్వేషణ ద్వారా అభ్యసనం (Learning through exploration):**

ఉదా:

- అభ్యసనం అనేది శిశుకేంద్రీకృతంగా జరగాలి.
- పిల్లలు తమ చుట్టు ఉన్న ప్రపంచాన్ని నిత్య జీవిత అనుభవాలు, ఉత్సుకతతో పలు అంశాలను అన్వేషిస్తూ నూతన అంశాలను కనుగొంటారు.
- భావనలు చెప్పితే విని పిల్లలు నేర్చుకుంటారనుకోవడం కాదు. పిల్లలు చేయడం, పరిశీలించడం ద్వారా భావాలను అవగాహన చేసుకోవాలి లేదా సొంతంగా కనుక్కోవాలి.
- కనుగొన్న అనుభవాల నుండి అన్వేషణ ద్వారా పిల్లలు స్వీయ అవగాహనను నిర్మించుకుంటారు. అదే సందర్భంలో ముఖ్యమైన ఇతర నైపుణ్యాలు, వైఖరులు పెంపొందించుకుంటారు.
- ఉపాధ్యాయులు పిల్లల అన్వేషణలు, కనుగొన్నవి అర్థవంతంగా ఉండేట్లు వారిని ప్రోత్సహిస్తూ తగు సహకారాన్ని వారికి అందించాలి.
- పిల్లలకు వారంతట వారే పలు నూతన విషయాలను కనుగొనడం అనేది వారికి మంచి ప్రేరణను కల్గిస్తుంది. కనుగొనే అంశాలు అభ్యసన లక్ష్యాలకు చెందినవై ఉండాలి. ఇది ప్రత్యేక వనరులను కల్పించడం, సవాలుతో కూడి ఉండడం, అభ్యసన లక్ష్యాల సాధనకు ఉపకరించే ప్రశ్నలు వేయడం వంటి వాటివల్ల సాధ్యమవుతుంది.
- ఉపాధ్యాయులు పిల్లల అభ్యసనాన్ని పూర్తిగా తాము అనుకున్న రీతిలో జరగాలనుకొని కృత్యాలను రూపొందించుకొని కల్పిస్తే వారు నూతన అంశాలను కనుగొనే స్వేచ్ఛను కోల్పోతారు. వారి సృజనాత్మకను కట్టడి చేసిన వారౌతారు.
- ఎప్పుడైతే పిల్లలు అన్వేషించాలని, కొత్త అంశాలను కనుగొనాలని నిర్ధారించుకుని ప్రయత్నిస్తారో, ఉదా॥ అప్పుడు వారు శ్రద్ధగా ఆయా కృత్యాలలో పాల్గొనడం, అసలైన అభ్యసనం జరగడం మనం చూడవచ్చు. ఎప్పుడైతే పిల్లలను అన్వేషణకు, కనుగొనేందుకు అనుమతిస్తామో అప్పుడు వాళ్లు తమ అభ్యసనంపై పూర్తి నియంత్రణను కలిగి ఉంటారు. తమ అవగాహనను, నైపుణ్యాలను, వైఖరులను తమ అవసరాలు, అనుభవాలకు తగ్గట్టుగా అభివృద్ధి

పరచుకొంటారు. ఒక పాఠం రాసి, దానిని ఏ విధంగా కృత్యాల ద్వారా, కనుక్కోవడం (Discovery) ద్వారా, అన్వేషణ (Exploration) ద్వారా పిల్లలు స్వయంగా చేసి, చూసి నేర్చుకుంటారు.

### శిశుకేంద్రీకృత విద్య (Child Centred Education)

చదువు అనేది శిశుకేంద్రంగా పిల్లలు నేర్చుకునేవిధంగా కొనసాగాలి. అంటే పిల్లల అనుభవాలకు, వారి ఆలోచనలకు, క్రియాశీల భాగస్వామ్యానికి పెద్దపీట వెయ్యడం. ఇందుకోసం ఉపాధ్యాయులు పిల్లల మానసికాభివృద్ధిని, వారి అభిరుచులను, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని బోధనాభ్యసన ప్రక్రియలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి. ఇవి వైవిధ్యభరితంగా ఉండి, పిల్లల భౌతిక, సాంస్కృతిక, సామాజిక ప్రాధమ్యాలకు ప్రాధాన్యతనిచ్చేవిగా ఉండాలి. పిల్లల అభిప్రాయాలకు విలువనిచ్చేవిగా ఉండాలి. తరగతి గదులలో బోధనాసందర్భంగా పిల్లలు ప్రతిక్షణం చురుకుగా పాల్గొంటూ తమంతట తాము నేర్చుకునే అవకాశాలు అందిపుచ్చుకోవడం ప్రధానం కావాలి. ఉపాధ్యాయుడు ఒక సలహాదారుగా, మార్గదర్శిగా, సౌలభ్యకర్తగా వ్యవహరించాలి.

### పిల్లల స్వభావంపై అవగాహన (Understanding Childhood)

- పిల్లలు ఈ విశ్వంలో ఉన్న ప్రతి వస్తువును, దృగ్విషయాలను తెలుసుకోవాలనే ఉత్సుకతతో ఉంటారు. ఈ ఉత్సుకత స్వాభావికం. పిల్లలందరిలో ఉంటుంది. దీనిని కొనసాగించడానికి, పెంపొందించడానికి ప్రయత్నం జరగాలి.
- పిల్లలు శక్తి వంతంగా ఉంటారు (Children are energitic) పిల్లలు ఒక చోట కూర్చోకుండా ఎప్పుడు ఏదో ఒక పని చేస్తుంటారు. మాట్లాడుతుంటారు. ఆడుతుంటారు. ఎందుకంటే ఎప్పుడు వారు ఉత్సాహంగా మరియు శక్తితో ఉంటారు. దీనిని నేర్చుకోవడంలో ఉపయోగించాలి. బలవంతంగా కూర్చోబెట్టి సవాలుతో కూడిన (challenging learning tasks) ఏ పని ఇవ్వకుండా, వారిని శాశ్వతంగా ఏ పని చేయకుండా ఒక అలవాటును చేయకూడదు (Culture of silence and idealness).

#### పిల్లలు ఇతరులతో కలిసే సామాజిక స్వభావం కల్గి ఉంటారు

పిల్లలు ఇతరులతో కలిసి పని చేయడానికి ఇష్ట పడతారు. పెద్దలతో కలిసి ఉండటానికి ఉత్సవాల్లో, పండుగల్లో అందరితో కలిసి ఉండాలని, పనులు చేయాలని కోరుకుంటారు. ఇలా పాల్గోనటం ద్వారా సామాజిక నైపుణ్యాలు అలవడుతాయి కావున గ్రూపు పని, మొత్తం తరగతి పని ద్వారా కృత్యాలు, ప్రాజెక్టులు చేయించాలి.

#### పిల్లలు ప్రశంసను, ప్రోత్సాహాన్ని కోరుకుంటారు

ప్రశంసలు, ప్రోత్సాహం వల్ల పిల్లలు బాగా ఉత్తేజితులై అభ్యసనంలో పాల్గొంటారు. నేర్చుకోవడానికి ప్రయత్నిస్తారు. మంచి ప్రవర్తనను అలవర్చుకోవడానికి ప్రయత్నిస్తారు. తమను గమనించాలని కోరుకుంటారు. ప్రాధమికంగా అభ్యసనం ప్రశంస, ప్రోత్సాహంతోనే జరుగుతుంది. దండన, భయం వల్ల నేర్చుకోలేరు. చదువునుండి, అలాంటి ప్రదేశం నుండి దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తారు.

#### పిల్లలు దండనను విమర్శను, అవమాన పరచడాన్ని స్వీకరించడానికి ఇష్టపడరు.

పిల్లలు దండన, అవమాన పరచడం, విమర్శ, భయపెట్టడం, తక్కువచేసి మాట్లాడటం, ఒక రకమైన సీరియస్ వాతావరణాన్ని ఇష్టపడరు. వీటికి దూరంగా ఉంటారు. అలాంటి వ్యక్తులనూ ఇష్టపడరు. ద్వేషిస్తారు.

## స్నేహపూరిత వాతావరణం (Child Friendly Environment)

పిల్లలు ఆనందంగా, ఆహ్లాదకరంగా నేర్చుకోవాలి. భయం, ఒత్తిడిలేని స్వేచ్ఛాయుత వాతావరణం ఉన్నచోటనే పిల్లల్లో వికాసం బాగా జరుగుతుందని మనందరికి తెలిసిందే. పిల్లల అభిప్రాయాలకు, అభిరుచులకు తగిన స్థానం కల్పించినప్పుడు మాత్రమే వారు ఆహ్లాదంగా, ఆనందంగా ఉండగల్గుతారు. శిశుకేంద్రీకృత బోధనాభ్యసన ప్రక్రియలు కల్పించి బోధనలో పిల్లలు చురుకుగా పాల్గొనేలా చేయాలి. ఇటువంటి వాతావరణం తరగతి గదిలో కల్పించినప్పుడు మాత్రమే అది స్నేహపూరిత వాతావరణం అని చెప్పవచ్చు.

**స్నేహపూరిత వాతావరణ లక్షణాలు:**

- భయం లేకుండా ఉపాధ్యాయుడు పిల్లలకు స్వేచ్ఛనిచ్చి, తెలియని అర్థంకాని విషయాలను జంకులేకుండా పిల్లలు అడిగే వాతావరణం కల్పించడం.
- పిల్లలు ప్రశ్నించేలా ప్రోత్సహించడం.
- పిల్లలందరూ పాల్గొనడం.
- స్థాయికి తగిన బోధనాభ్యసన ప్రక్రియలు కల్పించబడడం.
- కృత్యాలు ఉత్సాహం, ప్రేరణ, ఆసక్తి కలింగించేవి ఉండాలి.
- ఉపాధ్యాయుడు మార్గదర్శిగా, సలహాదారుగా, సౌలభ్యకర్తగా, స్నేహితుడిలా వ్యవహరించడం.
- పరస్పరం, తోటి వారి ద్వారా నేర్చుకునే అవకాశం ఉండడం.
- అభిప్రాయాల్ని గౌరవించడం.
- ఒత్తిడి, దండనలేని భయరహిత వాతావరణం.
- అనుభవాలు, భావాలు, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం ఉండడం.
- అభినందన, ప్రోత్సాహం, ప్రేరణ, అవకాశం వంటి వాటికి ప్రాధాన్యత ఉండడం. మొదలగునవి.

దీనికి సంబంధించిన తరగతిగది ఉదాహరణ ఈ అధ్యాయంలోనే తెలుసుకుందాం.

## కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా అభ్యసనం యొక్క అమలు - బాధ్యతలు (Learning through Activities, Explorations and Discovery - Implementation and Responsibilities)

ఉచిత నిర్బంధ విద్యకు బాలలహక్కు-2009 చట్టంలో అభ్యసనం అనేది కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా జరగాలని విస్పష్టంగా పేర్కొంది. దీనిని అమలు చేయాల్సింది క్షేత్రస్థాయిలో తరగతిగదిలో బోధనాభ్యసన ప్రక్రియలు చేపట్టే ఉపాధ్యాయులు. కొన్ని దశాబ్దాలుగా కృత్యాధార బోధన విధానాల గురించి పలు కార్యక్రమాలలో పలు వేదికలపై చర్చించుకోవడం జరిగింది. పాఠ్యపుస్తకాలు కూడా కృత్యాధార పద్ధతి ఆధారంగా రూపొందించడం జరిగింది.

1. తరగతి స్థాయిలో కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా అభ్యసనం జరిగేలా చూసే పూర్తి బాధ్యత ఉపాధ్యాయులదే. దీనికి ఉపాధ్యాయుడు బోధించేముందే చర్చకు సంబంధించి ప్రశ్నలు, కృత్యాలు మొదలగునవి సిద్ధం చేసుకొని తరగతి గదిలోకి రావాలి. అంటే ఉపాధ్యాయుని తయారీ, చదవడం, నోట్స్ రాసుకోవటం అనేవి అత్యంత ముఖ్యమైనవి. అన్వేషణ, కనుగొనడం, కృత్యాలకు తగిన ఉదాహరణలు లేక పనులు ఇచ్చి అవి చేయడం

ద్వారా కొత్త విషయాలను నేర్చుకునేటట్లు ఉపాధ్యాయుడు చేయాలి. కొత్త కృత్యాలు, అన్వేషణలు, ప్రాజెక్టులు ఉపాధ్యాయులు తమ టీచింగ్ నోట్స్‌లో రాయాలి.

2. తరగతి గది బోధన ఎప్పటికప్పుడూ పరిశీలిస్తూ ఉపాధ్యాయులకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయునిది.

3. జరిగిన అభ్యసనాన్ని, ప్రగతిని నివేదికల రూపంలో ఎస్.ఎం.సి. సమావేశాలలో, మండలస్థాయిలో జరిగే సమీక్షా సమావేశాలల్లో సమర్పించి చర్చించే బాధ్యతను ప్రధానోపాధ్యాయులు స్వీకరించాలి.

4. పాఠశాలలను సందర్శించే మానిటరింగ్ అధికారులు, విషయనిపుణులు తరగతి గది బోధనను పరిశీలించి కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా అభ్యసనం ఆశించిన విధంగా జరుగుతుందో లేదో గమనించాలి. తగిన మార్గదర్శనం చేయాలి.

5. విద్యాశాఖ DIET, CTE, ఎస్.సి.ఇ.ఆర్.టి. క్షేత్రస్థాయిలో బోధించే ఉపాధ్యాయులకు కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా సమర్థవంతమైన అభ్యసనం ఏ విధంగా జరుగుతుందో తెలిపే / అవగాహన ఏర్పరిచే విధంగా చక్కటి మెటీరియల్స్ రూపొందించి శిక్షణను నిర్వహించాలి. శిక్షణానంతరం అనుసరణీయ కార్యక్రమం చేపట్టాలి. పాఠశాలల్లో బోధన అభ్యసన ప్రక్రియలను పరిశీలించాలి. శిక్షణకంటే ఎక్కువగా ఉపాధ్యాయుడు స్వయం ప్రేరేతుడై ఉపక్రమించాలి.

**అమలుకు సూచికలు (Indicators of Implemntation)**

- ఉపాధ్యాయుని ప్రణాళిక, Teaching Notes లో పిల్లలను చర్చింపచేసే ప్రశ్నలు, కృత్యాలు కలిపించాలి.
- పిల్లలు అడ్డు/నిలువు వరుసల్లో సిర్థంగా కూర్చొనకుండా వలయాకారం, అర్థ వృత్తాకారం, గ్రూపుల్లో తరచుగా మారుతూ ఉండాలి.
- పిల్లలు కేవలం ఉపాధ్యాయుడు చెప్పేది వినడం కాకుండా – ప్రశ్నించడం, చెప్పడం, తోటివారితో చర్చించడం, గ్రూపుల్లో పనిచేయడం, నివేదించడం వంటివి చేయాలి.
- బోధన ఉపన్యాసన పద్దతి, నేర్చుకోవడం, వినడం ద్వారా కాకుండా చర్చలు, ప్రశ్నించడం, కృత్యాలు చేయడం, ప్రాజెక్టు మొదలగువాటి ద్వారా జరగాలి.
- నిఘంటువులు, అట్లాసులు, లాగరిథమ్స్, గ్రాఫ్‌లు, మ్యాప్‌లు, పట్టికలు, పటాలు వంటి వనరులను పిల్లలు స్వయంగా వినియోగిస్తూ నేర్చుకోవాలి.
- ఉపాధ్యాయుని వద్ద బోధనా సామగ్రి, పిల్లలందరి వద్ద అభ్యసన సామగ్రి ఉండాలి.
- ఉపాధ్యాయుని సంసిద్ధత – పాఠ్య ప్రణాళికలో కృత్యాలు, ప్రయోగాలు, ప్రాజెక్టులు, క్రీడలు వంటి కృత్యాలను స్పష్టంగా పేర్కొనాలి. సామగ్రిని సేకరించాలి.
- పిల్లలు బొమ్మలను, సామగ్రిని పరిశీలిస్తూ, గణిత క్రీడలు, భాషాక్రీడల్లో చురుకుగా పాల్గొంటూ, ప్రయోగాలు చేస్తూ అభ్యసన కృత్యాలలో నిమగ్నం కావాలి.
- మూల్యాంకనం నిరంతరంగా సమగ్రంగా నిర్వహిస్తూ ఉండడం, ఆ ప్రగతిని నమోదు కల్పించాలి.
- ప్రారంభ పరీక్ష, Formative, Summative Assessment లలో పిల్లల స్థాయిలో ప్రగతి కనిపించడం.

ఈ అధ్యాయంలో మనం విద్యాహక్కు చట్టంలో పొందుపర్చిన విధంగా అభ్యసనం ఏ విధంగా ఉండాలో తెలుసుకున్నాం. అలాగే పిల్లలు నేర్చుకునే విధానాలు, ఆహ్లాదకర, స్నేహపూరిత, శిశుకేంద్రీకృత వాతావరణం ఎలా కల్పించవచ్చో తెలుసుకున్నాం. ఈ అంశాలలో పేర్కొన్న విధంగా తరగతి గదులు రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. నేర్చుకోవడం అంటే కేవలం పాఠ్యపుస్తకంలోని సమాచారాన్ని విన్పించి ఏవో కొన్ని ప్రశ్నలు అడిగి, ప్రశ్నలకు జవాబులు గైడులు, స్టడీ మెటీరియల్ చూసి రాయమని, ఈ విధంగా పిల్లలు ఆశించిన విధంగా స్పందించారని తద్వారా బాగా నేర్చుకున్నారని భావించకూడదు. పిల్లలు అన్వేషణల ద్వారా, పరిశోధనల ద్వారా కృత్యాధార పద్ధతిలో తమంతట తామే కనుగొనడానికి అనువుగా ఉండే బోధనాభ్యసన ప్రక్రియలు కల్పించినప్పుడు, పిల్లలు వాటిలో చురుకుగా పాల్గొని అభ్యసానుభవాల్ని పొందినప్పుడు మాత్రమే నేర్చుకోవడం జరుగుతుందని భావించాలి. ఈ దిశలో ఉపాధ్యాయులు సృజనాత్మక, ఉత్తేజపూరిత, స్నేహపూర్వక, సమ్మిళిత వాతావరణం కలిగి ఉండేలా తరగతి గదుల ప్రక్రియలను నిర్మించుకోవాలి.

### ముగింపు

మన రాష్ట్రంలో 2010 ఏప్రిల్ మాసం నుండి RTE చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టంలో చర్చించిన గుణాత్మక అంశాల ఆధారంగా రాష్ట్ర విద్యా ప్రణాళికను (State Curriculum), పాఠ్య ప్రణాళికలను (Syllabus), విద్యా ప్రమాణాలను (Academic Standards) రూపొందించారు. వీటి ఆధారంగా 1వ తరగతి నుండి 10వ తరగతి వరకకు పాఠ్యపుస్తకాలను శిశుకేంద్రీకృతంగా ఉండేలా, కృత్యాధారపద్ధతిలో బోధించే వీలుగా రూపొందించారు. కాబట్టి నూతన పాఠ్యపస్తకాలను అర్థం చేసుకొని ఆశించిన రీతిలో ప్రణాళికా బద్ధంగా బోధించడం ద్వారా పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించవచ్చు... నాణ్యమైన విద్యను పొందడం పిల్లలకు హక్కు అయితే అందించడం ఉపాధ్యాయుల బాధ్యత.

# 3 జ్ఞానం - జ్ఞాననిర్మాణం - తరగతి గది అన్వయం

## 1. జ్ఞానం అంటే ఏమిటి?

జ్ఞానం అంటే సమాచారం కాదు. జ్ఞానం అనేది ఒకరు ఇస్తే ఇంకొొకరు పుచ్చుకునేది కాదు. జ్ఞానం అనేది బట్టీపట్టడం, పునశ్చరణ చేసుకోవడం, ఉన్నది ఉన్నట్టుగా అప్పజెప్పడం కాదు. జ్ఞానం అనేది పిల్లల మదిలో జరిగే మానసిక ప్రక్రియల ద్వారా ఉత్పన్నమయ్యే భావన. ఇది అనుభవాల నుండి ఆలోచనల నుండి వ్యక్తీకరింపబడే అంశం. జ్ఞానమనేది ఎలా ఆలోచించాలో, ఎలా పరిశీలించాలో, ఎలా విశ్లేషించాలో, ఎలా ప్రతిస్పందించాలో, ఎలా వ్యక్తీకరించాలో అనే విషయాలను ఆవిష్కరిస్తుంది. పిల్లలు తమ అనుభవాలు, ఆలోచనలతో ఏదైనా విషయాన్ని పరిశీలించడం, గుర్తించడం, సంబంధాలు ఏర్పరచడం, సాధారణీకరణ చేయడం, నిర్ధారణకు రావడం, పూర్వజ్ఞానాన్ని నూతన సందర్భాలలో, తదుపరి అభ్యాసాలలో ఉపయోగించడం వంటివి చేయగలగడమే జ్ఞానం ప్రకటితమైనదనడానికి నిదర్శనం.

పిల్లలు తమ పరిసరాలు, తమ చుట్టూ ఉన్న ప్రపంచంతో మమేకమై పరస్పర ప్రతిచర్యలు, అన్వేషణలు, ప్రతిస్పందించడం, కనుగొనడం, పాల్గొనడం వంటివి చేయడం ద్వారా అర్థవంతమైన భావనలను పొందుతారు. ఇదే జ్ఞానం అవుతుంది.

'జ్ఞానం'లో మనం చేర్చే అంశాలు, మనం 'విద్యాలక్ష్యాలుగా భావించేవాటిని' ప్రతిబింబిస్తామని NCF పేర్కొన్నది. విద్యాలక్ష్యాలు పిల్లవాన్ని విమర్శనాత్మకంగా ఆలోచించేలా, పరిశీలించేలా, విశ్లేషించేలా, హేతుబద్ధంగా ఉండేలా, నమూనాలను గీయగల్గేలా, వైవిధ్యభావాలపట్ల, జీవనంపట్ల స్పందించేలా చేయాలని పేర్కొంటున్నందువల్ల జ్ఞానాన్ని ముక్కలుగా అందించడం సాధ్యపడదు. జ్ఞానం ఆలోచనల, అనుభూతుల సంగమం. బట్టీపట్టడం, పునశ్చరణ చేసుకోవడం ద్వారా పిల్లవాడు పొందే సమాచారాన్ని మనం జ్ఞానం అని తరచు భావిస్తున్నాం. కానీ జ్ఞానమంటే మనం తలచినట్టు పదేపదే వల్లించడం, బట్టీయంకాదు. జ్ఞానాత్మక రంగంలో ఎక్కాల బట్టీయంగానీ, ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ అనిగాని అక్బర్ జన్మసంవత్సరం ఇది అనిగానీ; భూగురుత్వాకర్షణ శక్తిని తెల్సుకోవడమో కానీ కాదు. కానీ నిజమైన జ్ఞానం పిల్లవానిలో ఎట్లా పరిశీలించాలో, ఎలా విశ్లేషించాలో అమూర్త లేక హేతుబద్ధత, పరిస్థితులపట్ల తాను ఎలా అనుభూతి చెందాలో, ఎలా కనికరం కలిగిఉండాలో వైవిధ్యభావాలపట్ల ఎలా సున్నితత్వం కల్గిఉండాలో అన్న విషయాలు సమ్మిళితం కావాలి. అందువల్ల విద్యాలక్ష్యం విద్యార్థికి సమాచారాన్ని ముక్కలు ముక్కలుగా చెంచాతో తినిపించినట్టుకాకుండా విద్యార్థి ఆలోచనా నైపుణ్యాలను సానపట్టినట్టుగా ఉండాలి.

అందువల్ల జ్ఞానమనేది సమాచారం కాదు అని చెప్పగలం. 'జ్ఞానం' అనేది విద్యార్థికి ఇవ్వబడేది కాదు. **ఇదొొక స్వయంచోదక శక్తి, అనుభవం ద్వారా సముపార్జించబడేది. నూతన సమాచారంపట్ల పిల్లవాడు ఆచరణాత్మక నిర్ణయాత్మక అవగాహన కలిగినప్పుడు మాత్రమే సముపార్జించబడుతుంది. పిల్లలకు సరైన సమయంలో అవసరమైనంతమేర స్థాయికి తగినట్లుగా సహాయం కావాలి.** పిల్లలు తాము భాగస్థులయిన ఈ ప్రపంచంలో చురుకైన పాత్ర పోషించి తమంతట తామే జ్ఞానాన్ని సముపార్జన చేయాలి. పిల్లవానికి విషయాన్ని బదలాయింపు చేసి జ్ఞప్తికి చేసిన విషయాలను ప్రశ్నలద్వారా ఉన్నదున్నట్లుగా తిరిగి చెప్పించడం జ్ఞానం కాదు. దీనిద్వారా పిల్లవాన్ని విద్యావంతుని చేయడంగా భావించలేం. మనం జ్ఞానాన్ని ఎలా సంపాదించాలని నిర్వచించామో అది పిల్లవాన్ని ఆలోచింపజేసేలా, ప్రతిస్పందింపచేసేలా అమూర్త, భావనలను అర్థంచేసుకునేలా వ్యక్తపర్చేలా ఉండాలి. కేవలం బట్టీయంగా ఉండరాదు. తన భావనలను సమాచారాన్ని విశ్లేషించి సాధారణీకరించేలా ఉండాలి. విద్య ఈ విధంగా ప్రేరేపించేలా, ప్రోత్సహించేలా ఉండాలి.

జ్ఞానం అనేది నియమిత కాలంలో పూర్తిగా ఇవ్వగలిగేదే అయితే పిల్లవాని మేధస్సులోకి సమాచార రూపంలో వ్యవస్థీకృతంగా బదిలీ చేయవచ్చు. విద్య మానవ మేథోభండాగారాన్ని బదలాయింపు చేసే వ్యవస్థ అయితే విద్యార్థి పరోక్షగ్రాహకుడుగానే మిగిలిపోతాడు. విద్యను బదలాయింపు చేయడమనేది అభ్యసనమయితే పిల్లవాని జ్ఞానచలనాత్మక రంగంలో పరిశీలన, అనుభూతులు ప్రతిబింబించేతత్వం, భాగస్వామ్య ప్రవర్తనలు (NCF P.25) నష్టపోతాయి. జ్ఞానం వ్యక్తిగతమైంది. ఇది బదలాయింపు సంకుచిత పరిధి దాటిన విశ్వజనీనమైంది అని (NCF 2005) పేర్కొన్నది.

ప్రతి జ్ఞానాత్మక రంగం ప్రత్యేక పదజాలం, భావనలు, సిద్ధాంతాలు, వర్ణనలు, పద్ధతులను కలిగి ఉంటుంది. మానవ కృత్యాలు, అభ్యసన సాధనాల విశాల చట్రంలో సాంఘీక జీవనం, సంస్కృతి ఉంటుంది. వృత్తిపనులైన నేత, వడ్రంగం, కుండల తయారీ, వ్యవసాయం, దుకాణ నిర్వహణ వాటితోబాటు దృశ్యకళలు, క్రీడలు విలువైన జ్ఞానాత్మక రూపాలను కల్గిఉంటాయి. జ్ఞానాత్మక రంగం యొక్క ఈ రూపాలు ఆచరణాత్మక స్వభావాన్ని, అర్థం చేసుకున్న తీరును, పాక్షికంగా చెప్పబడతాయి. వాటిలో చాలా వరకు అభివృద్ధి చెందిన సామర్థ్యాలు కలిగి ఉంటాయి. స్వయం సామర్థ్య జ్ఞానం సామూహిక కృషి, ప్రశంసలు, వైఖరులు, పట్టుదల, క్రమశిక్షణలు కల్గిఉంటుంది.

## 2. జ్ఞానం Vs సమాచారం

తరగతిగదిలో పాఠ్యపుస్తకాలు సమాచారాన్ని అందిస్తాయి. ఈ సమాచారాన్ని పొందే క్రమంలో తనకున్న పూర్వజ్ఞానాన్ని వినియోగించుకుంటూ తెలుసుకున్న సమాచారం ఆధారంగా జ్ఞాన నిర్మాణం చేసుకోవాలి. ఈ దిశలో మన ఉన్నత పాఠశాలలు, మన పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయులుగా మనం కళ్ళు తెరవాలి. ఇందుకోసం మనం సమాచారం, జ్ఞానం, పునరుక్తి జ్ఞాన నిర్మాణాత్మకత, గ్రహించడం వంటి అంశాల గురించి తెలుసుకోవాలి.

వ్యక్తి ద్వారా కాని, పుస్తకాల ద్వారాగాని, సామాగ్రి ద్వారాగాని విషయాన్ని పొందినట్లైతే అది సమాచారం అవుతుంది. పొందిన సమాచారం తనదైన శైలిలో అనవసరమైనవి వదిలివేయడం లేదా సవరించుకోవడం, అవసరమైన కొత్త సందర్భాలలో పూర్వజ్ఞానాన్ని సృజనాత్మకంగా అన్వయించుకోవడం చేస్తారు. ఇదే జ్ఞాన నిర్మాణ ప్రక్రియ.

తరగతి గదుల్లో ఉపాధ్యాయులుగా మనం దేనికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి? సమాచారానికా? లేక జ్ఞాన నిర్మాణ ప్రక్రియలకా?

సాధారణంగా తరగతి గదుల్లో మనం చెప్పిన విషయాలనే పిల్లలు పదే పదే వల్లెవేస్తుంటారు. మనం అడిగిన ప్రశ్నలకు జవాబులిస్తుంటారు. పుస్తకంలో ఇచ్చిన సమాచారాన్ని, మనం అందించిన సమాచారాన్నే తిరిగి అప్పచెప్తుంటారు. దీన్నే పునరుక్తి (Repetetion) అంటారు. ఇది జ్ఞాన నిర్మాణానికి దోహదం చేస్తుందా? పిల్లల్లో జ్ఞాన నిర్మాణం జరగాలంటే మనం ఏం చేయాలి? కేవలం సమాచారాన్ని భద్రపరచడమే కాకుండా (బట్టీపట్టడం కాకుండా) అవసరమైన సందర్భాల్లో సందర్భోచితంగా సృజనాత్మకంగా, తనదైన శైలిలో వినియోగించుకోవడం జరగాలి. అలా జరగాలంటే మనమేం చేయాలి? ఆలోచించండి.

**జ్ఞాన నిర్మాణం అంటే పిల్లలు తమంతట తాముగా తనకి తెలిసిన పూర్వజ్ఞానాన్ని వినియోగించుకొని కొత్త సందర్భాలలో నూతన విషయాలను ఆవిష్కరించడాన్ని జ్ఞాన నిర్మాణం అనవచ్చు.**

**ఉదాహరణకు 6వ తరగతిలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు కొన్ని ప్రశ్నలు-జవాబులను నల్లబల్లపై రాశాడు. పిల్లలని రాసుకోమన్నాడు పరీక్షలలో ఆ ప్రశ్నలే ఇచ్చినప్పుడు పిల్లలంతా బట్టీపట్టి ఒకేవిధంగా టీచర్ రాయించినట్లు గానే జవాబులు రాశారు. ఇది జ్ఞాన నిర్మాణం అవుతుందా? దీనిని ఏం అంటారు?**

**ఒకవేళ అవే ప్రశ్నలను తమ సొంతమాటల్లో సమకాలీన అంశాలతో జోడించి చర్చించేటట్లు చేస్తే పిల్లలు అర్థవంతంగా సందర్భోచితంగా అవసరాలకనుగుణంగా ఆ జ్ఞానాన్ని నిర్మించుకున్నట్లే. అప్పుడు పిల్లలు రాసే జవాబులు తమ దృక్పథాలనుబట్టి వేరువేరుగా ఉండవచ్చు.**

పిల్లలు స్వయంగా పాల్గొంటు జ్ఞానాన్ని నిర్మించుకునే క్రమంలో టీచర్లు కూడా క్రియాశీల భాగస్వాములు కావాలి. నేర్చుకునే క్రమంలో పిల్లలు సహజ వాతావరణంలో, అభ్యసన ప్రక్రియల్లో పాల్గొంటు జ్ఞానాన్ని నిర్మించుకుంటారు. ఇలా నిర్మించుకోవడంలో ఆలోచించడం, పూర్వ అనుభవాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయి. పిల్లలు ప్రశ్నించడం, బడిలో నేర్చుకున్న దానిని బయటి అనుభవాలతో అన్వయించుకోవడం, ఆ సమస్యకు వివిధ కోణాల్లో చక్కగా స్పందించడం. తమ అభిప్రాయాలను అద్భుతంగా వ్యక్తీకరించడం వంటి సందర్భాలలో జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. జ్ఞానం ఒకరు అందించేది కాదు. ఇది సృష్టించబడేది. పిల్లల మదిలో జరిగే ప్రక్రియల ద్వారా ఇది ఉత్పన్నమవుతుంది. ఈ జ్ఞానం ఒక్కో విషయంలో వివిధ రూపాలను కలిగి ఉంటుంది.

జ్ఞాన నిర్మాణం, సమాచారం మొదలగు అంశాల గురించి జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2005 ఏం చెబుతుందో చూద్దాం.

**క్రమబద్ధమైన అనుభవమే జ్ఞానంగా మనం పరిగణిస్తున్నాం. ఇది భాష ద్వారా, భావనా రూపాలుగా ఏర్పడి అర్థాన్ని సృష్టిస్తుంది. ఫలితంగా మనం జీవిస్తున్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంంది. జ్ఞానాన్ని మనం ఆచరణ పద్ధతులుగా లేదా ఆలోచనలతో కూడిన శారీరక నైపుణ్యంగా కూడా భావించవచ్చు. ఇది వస్తూత్పత్తి ద్వారా సమాజ పురోగమనానికి దోహదంచేస్తుంది. చారిత్రక క్రమంలో మానవులు వివిధ ఆలోచనలు, భావాలు గల విజ్ఞాన మూర్తులుగా, వస్తూత్పత్తి చేయగల సమర్థులుగా పరిణితి చెంది మరింత జ్ఞానాన్ని నిర్మించుకున్నారు. పిల్లలందరూ ఈ జ్ఞాన సంపదను తమకు తాము పునరుత్పత్తి చేసుకోవాలి. మరింత సమర్థవంతంగా ఈ ప్రపంచంలో వ్యవహరించేందుకు కావాల్సిన మరిన్ని ఆలోచనలు దీనివల్ల వారికి లభిస్తాయి. పిల్లలు ఈ జ్ఞానోత్పత్తి క్రమంలో ఎలా భాగస్వాములు కావాలో నేర్చుకోవాలి. ఉత్పత్తి క్రమంలో కూడా వారు భాగస్వాములు కావాలి. ఈ రూపంలో మనం జ్ఞానాన్ని కేవలం ఉత్పత్తిగా చూడం. అలాగాక జ్ఞానాన్ని మనం తయరుచేసిన ఉత్పత్తిగా భావించినట్లైతే అది సమాచార రూపంలో మారి పిల్లల మెదళ్లలోకి బదలాయించడమే జరుగుతుంది. అప్పుడు అభ్యాసకులు కేవలం సంగ్రహీతలుగా మారతారు. అభ్యసనంలో వారి ప్రమేయమేమి ఉండదు. దీనికి భిన్నమైన దృక్పథం మనకుంటే ప్రపంచాన్ని పరిశీలిస్తూ, ప్రపంచంపట్ల స్పందిస్తూ, ప్రపంచంలో పనిచేస్తూ, భాగస్వాములవుతూ నేర్చుకునేవాళ్ళుగా పిల్లల్ని మనం చూడగలం.**

## 3. జ్ఞాన నిర్మాణం అంటే ఏమిటి?

పిల్లలు సహజ అభ్యాసకులు తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఆసక్తితో అన్వేషించడం, ప్రతిస్పందించడం, ఆలోచించడం, విశ్లేషించడం ద్వారా తమదైన శైలిలో జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం జరుగుతుంది. అలాగే తమ జ్ఞానాన్ని సృజనాత్మకంగా ఆవిష్కరించగల శక్తిసామర్థ్యాలు పిల్లలు బాల్యంలోనే కలిగి ఉంటారు.

జ్ఞానం కలిగి ఉన్న పిల్లలు తాము చూసిన, విన్న, చదివిన, పాల్గొన్న అంశాల ద్వారా పొందిన అనుభవాలను పలురకాలుగా, నూతనంగా, సృజనాత్మకంగా వ్యక్తీకరించడంతో జ్ఞాన నిర్మాణం జరిగినట్లు భావించాలి.

జ్ఞాన నిర్మాణం అంటే అభ్యసనమే.

ప్రతి తరం సమాజం ద్వారా తాము పొందిన జ్ఞానాన్ని ముందుతరానికి అందించడానికి తమదంటూ ఒక ప్రత్యేక జ్ఞాననిధిని ఏర్పరచుకుంటూ అర్థవంతమైన జ్ఞాన నిర్మాణానికి తోడ్పడతారు. వీటిని అనుభవాల ద్వారా అర్థంచేసుకోవడం ద్వారా జ్ఞాన సంస్కృతిని ఆకళింపు చేసుకోవడం ద్వారా అనియత, స్వేచ్ఛావాతావరణాలలో జ్ఞానాన్ని నిర్మించుకుంటారు. ఈ జ్ఞాన నిర్మాణ

ప్రక్రియలో సామాజిక పరిసరాలలో భాగస్వాములవుతూ అవకాశాలు వెతుకుతూ, ప్రయత్నాలు చేస్తున్న సందర్భంలో తప్పులుచేస్తూ, వారు చేసిన తప్పులను వారికి వారే సరిదిద్దుకుంటూ జ్ఞాన నిర్మాణం చేసుకుంటారు. ఇవన్నీ అత్యంత సహజ సామర్థ్యాలుగా పిల్లలు చేయగలరు.

అర్థవంతమైన అభ్యసనం అనేది ఒక ఉత్పాదక ప్రక్రియ. ఇది కేవలం సమాచారాన్ని వెలికి తీసే ప్రక్రియకాదు. ఆలోచించడం, వ్యక్తీకరించడం, కృత్యాలు నిర్వహించడం వంటివి అభ్యసనాంశాలు. పిల్లలు చాలా విషయాలను గుర్తుంచుకుంటారు కాని అర్థం చేసుకోలేరు. నిజజీవితంలో అన్వయించలేరు. అందుకే జ్ఞాపకం ఉంచుకోవడమే జ్ఞానమనే భ్రమ నుండి మనం బయటపడాలి.

భావనల అభివృద్ధి అనేది నిరంతరం జరిగే ప్రక్రియ. సంబంధాలను ఏర్పరచుకుంటూ, అవగాహన చేసుకుంటూ కారణాల ఫలితాలను అన్వేషిస్తూ, వైఖరులను, ఉద్వేగాలను, విలువలను సమ్మిళితం చేసుకుంటూ సమకాలీన అంశాలను అనుసంధానం చేసుకొని వ్యక్తీకరించడంలో జ్ఞాన ఆవిష్కరణ జరుగుతుంది.

సామాజిక శాస్త్రాలలో ఒక భావనను విశ్లేషించటానికి తగిన సమాచారం, వాస్తవాలు అవసరం. ఇవి లేకుండా అమూర్తంగా చర్చించలేం. అయితే ఈ సమాచారం ఎప్పుడూ నిష్పక్షపాతంగా ఉండదని, దానిని మనం చూసే దృష్టికోణం బట్టి ఒక ప్రత్యేక రంగు ఉంటుందని గుర్తుంచుకోవాలి.

ఇందులో వినడం, అనర్గళంగా అంశాల గురించి చర్చించడం, చదవడం, ప్రశ్నించడం, ఆలోచించడం చర్చించడం, ప్రతిస్పందించడం, వ్యక్తీకరించడం, ప్రశంసించడం, అర్థం చేసుకోవడం. ఉన్నత వైఖరులు కలిగి ఉండడమనేవి ఇమిడి ఉంటాయి.

అభ్యసనమనేది బడిలోను, బడిబయట, నిరంతరంగా జరుగుతూనే ఉంటుంది. ఇది పరస్పర ప్రతిచర్యలద్వారా అభివృద్ధి చెందుతుంది.

పిల్లల జ్ఞాన నిర్మాణంలో పిల్లలే ఊహించడం, ప్రకల్పనలు చేయడం, అన్వేషణలు, పరిశోధనలు, ప్రశ్నించడం, చర్చించడం, సిద్ధాంతీకరణ చేయడం, ప్రతిస్పందించడం, సమూహాలలో పనిచేయడం మొదలగునవి కీలక పాత్రపోషిస్తాయి. జ్ఞాన నిర్మాణంలో ప్రతిచర్యలు ముఖ్యభూమిక పోషిస్తాయి. పిల్లలు విశ్లేషించడానికి, వ్యాఖ్యానించడానికి, ఇతరులలో కలిసి నేర్చుకోవడానికి ప్రతిచర్యలు తోడ్పడతాయి. ఆలోచింపజేయడం, వాటిని వ్యక్తీకరించడం, జ్ఞాన నిర్మాణంలో ముఖ్యమైనవి.

పిల్లలు స్వయంగా పాల్గొంటూ జ్ఞానాన్ని నిర్మించుకొనే క్రమంలో ఉపాధ్యాయులు క్రియాశీల భాగస్వాములు కాగల్గితే వారి పాత్రకు ప్రాధాన్యత పెరుగుతుంది. నేర్చుకొనే శిశువు తనకుతాను పాల్గొంటూ జ్ఞాననిర్మాణం చేసుకుంటారు పిల్లలు ప్రశ్నించడం, బడిలో నేర్చుకున్నదాన్ని బయట అనుభవాలతో అన్వయించుకోవడం, మౌనంగా ఉండకుండా ఒక ప్రశ్నకు పలురకాలుగా స్పందించడం ఇవన్నీ చిన్న విషయాలుగా కన్పించవచ్చు, కానీ పిల్లల అవగాహన పెరగడంలో ఆలోచించడంలో ఇవి చాలా కీలకమైన మెట్లు. పిల్లలకు తరచుగా తమ అనుభవాల నుంచిగానీ, ప్రసారమాధ్యమాల నుంచిగానీ కొత్త కొత్త ఆలోచనలు వస్తుంటాయి. ఉపాధ్యాయునికి నచ్చేవిధంగా వాటిని చెప్పడం పిల్లలకు చేతగాకపోవచ్చు – పూర్తిగా తెలిసినదానికి, దాదాపు తెలిసిన దానికీ మధ్య ఒక జోన్ ఉంటుంది. అక్కడే జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. ఈ జ్ఞానం నైపుణ్యాలుగా రూపాంతరం చెందుతుంది. స్కూలు బయటా, ఇంటిలో, సమాజం మధ్యా పనిచేసే క్రమంలో ఈ సామర్థ్యాలు పదునెక్కుతాయి. వీటిని మనం గౌరవించాలి.

## 4. సాంఘికశాస్త్రంలో జ్ఞానం ఏ ఏ రూపాల్లో ఉంటుంది?

సాధారణంగా జ్ఞానం వివిధ రూపాల్లో ఉంటుంది. నియమాలు (Rules), సిద్ధాంతాలు (Theories), సూత్రాలు (Peinciples) భావనలు (Concepts) మొదలగు రూపాలలో ఉంటుంది. 'భావన' అంటే ఇక్కడ వాస్తవ ప్రపంచానికి

చెందిన వస్తువు లేదా ఘటన అని అర్థం. దేశం, పండగ ఇల్లు, మార్కెట్, పౌరులు, సమాజం, కుటుంబం వంటివి – ఇవన్నీ భావనలే.

చర్చించడం, వివరించడం, కారణాలు చెప్పడం, పోలికలు, భేదాలు చెప్పడం, సంబంధాలను గుర్తించడం, సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం, నమూనాలు తయారుచేయడం, బొమ్మలు, పటాలు గీయడంవంటి ప్రక్రియలద్వారా జ్ఞానం నిర్మించబడుతుంది.

## 5. జ్ఞానం Vs అభ్యసనం

ఎన్నో అభ్యసనా సిద్ధాంతాలున్నప్పటికీ ఈ సంక్లిష్ట ప్రక్రియను అర్థంచేసుకోవడంలో మన అవగాహనలో స్వల్ప తేడా ఉంది. ప్రవర్తనావాదులు చెప్పినట్లు పిల్లవాడు ఖాళీబకెట్టు, ఏమీ రాయబడని నల్లబల్ల అనే విషయాలను NCF 2005 మరియు APSCF 2011 నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాయి. పిల్లవాడు పుట్టుకతోనే అనేక నిగూఢ సామర్థ్యాలను కల్గిఉంటాడు. కానీ పిల్ల(వాడు) ఒంటరి ప్రయత్నం ద్వారానే ఎంత కృషిచేసినా మొత్తం అభ్యసన జరగదు. పిల్లవాడు బోధనలో అంతర్భాగం కావడానికి శ్రద్ధతో ప్రణాళిక రూపొందించి అమలు చేయడానికి వీలుపడే పథకం అత్యవసరమని APSCF భావిస్తుంది. అంతేకాకుండా – అభ్యసనా వనరులైన గ్రంథాలయం, ఇంటర్నెట్‌తోపాటు పిల్లవాని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చట్టూఉన్న సమాజం పాల్గొనేలా శ్రద్ధతో కూడిన ప్రణాళిక అమలు అత్యవసరం. పిల్లవాడు పాఠశాలకు వచ్చేముందే తన జనచేతనలో విషయ జ్ఞానాన్ని కల్గిఉంటాడు. తల్లిదండ్రుల పెంపకం, పరిసరాలు పిల్లవాని జ్ఞానానికి తొలి రంగాలవుతాయి. సామాజిక శాస్త్రాల పరంగా సంక్లిష్ట నిర్మాణాలను సమాజపరంగానే నేర్చుకొని ఉంటాడు. అయినా పాఠశాల ఒక నియత విద్యాకేంద్రంగా నిలుస్తుంది. పాఠశాలలో పిల్లవాడు వర్ణనాత్మక వివరణాత్మక జ్ఞానరంగాన్ని స్వీకరిస్తాడు. సామాన్యశాస్త్రం, గణితశాస్త్రం అమూర్తభావాలు, పరిసరాల విజ్ఞానం వంటి విషయాలలో ఉపాధ్యాయుని, సమవయస్కుల, తల్లిదండ్రుల క్రియాశీలక జోక్యం లేనిదే పిల్లల జ్ఞానరంగం పరిపూర్ణంకాదు. పిల్లలకు చెందిన ఈ పరస్పరచర్యలు సాధ్యపడడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేయాలని APSCF ప్రతిపాదిస్తుంది. అభ్యసనం నిరంతర ప్రక్రియ. ఈ వ్యవస్థ సరిగా కొనసాగించకపోతే విద్యలో అపరిపక్వత చోటుచేసుకుంటుంది. ఈ విధానం పిల్లలు వల్లెవేసే పద్ధతిని వ్యతిరేకిస్తుంది. పిల్లలు పుట్టుకనుంచి తనకుగల అభ్యసనశక్తితో పరిశీలన, గుర్తించడం, వర్గీకరించడం మొదలైన అవగాహనలను పరిసరాల నుంచి నేర్చుకొని విభిన్న రీతుల్లో వ్యక్తీకరిస్తాడు, కొనసాగిస్తాడు. మూడు సంవత్సరాల పిల్లల సామర్థ్యాలను విశ్లేషించినట్టయితే సాంఘికశాస్త్ర భావనలను ఉన్నదున్నట్లుగా కాకుండా, సందర్భోచితంగా తగిన విధానంలో వినియోగిస్తారు. ఇది అభినందించాల్సిన అంశం. దురదృష్టమేమంటే చాలావరకు ఉపాధ్యాయులు ఈ సత్యాన్ని అంగీకరించరు. వారిని ప్రవర్తనావాదులుగా ఒక దృష్టాంతం నుంచి మరొక దృష్టాంతంలోకి తీసుకెళ్ళతారు. అనుకరణ, అభ్యాసం ద్వారా మాత్రమే లభిస్తుందని అపోహపడతారు. పిల్లలను కేవలం సమాచార గ్రహీతలుగా పరిగణించి తమకు తామే జ్ఞానదాతలుగా భావిస్తారు. ఇది క్రియాశీలక, ఆచరణాత్మక నిరంతర అభ్యసన విధానానికి విరుద్ధం. పిల్లల జ్ఞాన నిర్మాణానికి ఈరకమైన వాస్తవ విరుద్ధమైన అవగాహనలను తొలగించుకోవాలి. దీనిని సున్నితంగా అర్థవంతమైన సందర్భోచిత పరిస్థితులను కల్గించి తొలగించాలి. పైవాటి ఆధారంగా కింది విషయాలను చెప్పవచ్చు.

1. ఒత్తిడి, భారం లేని పరిస్థితులలోనే పిల్లల్లో అభ్యసన జరుగుతుంది.
2. ఆరోగ్యకరమైన అభ్యసన వాతావరణంలో పిల్లలు అత్యంత ఆసక్తులతో సూక్ష్మ పరిశీలనలు చేస్తారు.
3. పిల్లల అభ్యసనలో విమర్శ, తప్పులు ఎంచడం జరగకూడదు.
4. అభ్యసనల ద్వారా తమ పొరపాట్లు తామే తెలుసుకొని సరిదిద్దుకునేలా ఉండాలి.
5. విభిన్న పరిస్థితులలో తాము సముపార్జించిన జ్ఞానాన్ని వినియోగిస్తారు.

## 6. జ్ఞాన నిర్మాణం ఎప్పుడు జరుగుతుంది?

### a) పూర్వభావన / పూర్వరంగం (Pertext)

ఏ పాఠ్యాంశం గురించైనా భావన గురించైనా, పిల్లల్లో పూర్వజ్ఞానం లేదా అనుభవాలు లేదా అవగాహన ఉందా అని నిర్ధారించుకోవాలి లేకపోతే కల్పించాలి.

### b) తపన కల్గించడం (Urge creation)

పిల్లలు ఏ విషయాన్నైనా, ఎంత కష్టమైనా అవసరం ఉంటే తమకోసం తాము పాల్గొంటారు, నేర్చుకుంటారు. కాబట్టి తపన కల్గేలా (Urge creation) చూడాలి. అవసరం ఉంటే తపన కల్గుతుంది. ఆసక్తి ఏర్పడుతుంది. భావోద్రేకాన్ని పెంపొందించడంవల్ల కూడా తపన కల్గుతుంది.

### c) మానసిక ప్రక్రియలు (Mental Process)

జ్ఞాన నిర్మాణంలో మానసిక ప్రక్రియలు కీలక పాత్ర పోషిస్తాయి. పిల్లలందరూ జన్మతః నేర్చుకోగల్గే సామర్థ్యాన్ని కల్గి ఉన్నారు. అందరు పిల్లలు పోల్చడం, వర్గీకరించడం, విశ్లేషణ, సంశ్లేషణ, జ్ఞాపకం ఉంచుకోవడం, పునరుక్తి చేయడం, నిర్ధారించడం, వ్యక్తపర్చడం, గుర్తించడం, సాధారణీకరించడం, ఊహించడం, కల్పనాశక్తి వంటి అంతర్గత సామర్థ్యాలను కల్గి ఉన్నారన్న విషయం ఇంతకు ముందే మనం చర్చించుకున్నాం. వీటి వల్ల పిల్లల మదిలో అనేక చర్యలు సృష్టించుకోగల్గుతారు. పిల్లల మెదళ్ళలోని నాడీకణజాలం ఉత్తేజానికి లోనైనప్పుడు అవి పరస్పర చర్యలు ప్రక్రియలు చోటుచేసుకొంటాయి. కొత్త బంధాలను ఏర్పరచుకొంటాయి. ఆ సందర్భంగా ఉత్పత్తయ్యే దాన్నే మనం 'జ్ఞానం' అని పిలుస్తుంటాము. ఈ నాడీ కణజాలం (Neorans) ఉత్తేజమవ్వాలంటే అవసరం. ఆసక్తి, తపన, భావోద్రేకానికి లోనుకావడం అవసరం. తద్వారా మానసిక చర్యలు చోటుచేసుకుంటాయి. జ్ఞాననిర్మాణం జరుగుతుంది. అలా కాకుండా శ్రోతగా కేవలం సమాచారాన్ని గ్రహిస్తే నాడీకణజాలం ఉత్తేజితమవదు. కేవలం నిక్షిప్తం చేసుకుంటుంది. దీనివల్ల ఎలాంటి అనుభవాలను పొందలేరు. జ్ఞాన నిర్మాణం జరగదు.

కాబట్టి పిల్లలు తమ అంతర్గత శక్తులను వీలైనంతమేర వినియోగించుకునేలా, మానసిక ప్రక్రియల వల్ల చర్యలు చోటుచేసుకునేలా చూడాలి. ఇందుకు అవసరమగు వాతావరణం కల్పించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. పిల్లలు భయరహితమైన స్వేచ్ఛాపూరిత వాతావరణంలో మాత్రమే తమ అంతర్గత శక్తులను వినియోగించగల్గుతారు.

### d) ఆలోచింపజేయడం

జ్ఞాన నిర్మాణంలో ఇది మరొక కీలకాంశం. సాధారణంగా ఆలోచించడానికి బదులు, విభిన్న కోణాల్లో ఆలోచింపజేయడంవల్ల పిల్లలు జ్ఞానాన్ని సృష్టించుకోగల్గుతారు.

### e) ప్రోత్సాహం, అవకాశం కల్పించడం, పిల్లల్ని భాగస్వాములను చేయడం కూడా అతి ముఖ్యమైనవి.

## 7. జ్ఞాన నిర్మాణం జరగడానికి తరగతి గది వాతావరణం ఎలా ఉండాలి?

**విద్య పోస్టు ద్వారానో, టీచర్ ద్వారానో చేరవేసే వస్తువు కాదు. నిజమైన విద్య బిడ్డ భౌతిక, సాంస్కృతిక క్షేత్రంలో సృష్టించబడుతుంది. దాగి ఉంటుంది. తల్లిదండ్రులతో, టీచర్లతో, తోటి పిల్లలతో, సమాజంతో నెరపే ప్రతిచర్య ద్వారా అది క్రమ వికాసం పొందుతుంది. ఇలాంటి విద్య పటిష్ఠంగా, ఫలప్రదంగా ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయుడి పాత్రను, ఔన్నత్యాన్ని మనం గుర్తించాలి. దృఢపరచాలి. జ్ఞానసముపార్జన ఎప్పుడు పరస్పరాశ్రితంగా ఉంటుంది. పెద్దలకంటే పిల్లలు బాగా పరిశీలిస్తారు. బాగా గ్రహిస్తారు. జ్ఞానాన్ని సృష్టించడంలో వాళ్లకున్న సామర్థ్యాన్ని, పాత్రను మనం గుర్తించాలి. నాకున్న ఈ కొద్ది అవగాహన పిల్లలతో మాట్లాడ్డం వల్లనే లభించిందని అనుభవంతో చెబుతున్నాను.**

**ప్రొ.యశ్‌పాల్, జాతీయ పాఠ్యప్రణాళిక-2005**
**సారథ్య సంఘం అధ్యక్షులు**

పై అంశాన్ని చదివారు కదా! ఒకసారి ఆలోచించండి. సమాచారాన్ని పొంది, దాన్ని స్వల్పకాలం పాటు నిల్వ ఉంచుకొనే జ్ఞాపకాన్నే జ్ఞానంగా భావిస్తుండడం నేడు మనం చూస్తున్నదే! దీన్ని అవగాహనగా కూడా పరిగణించడం జరుగుతున్నది. వాస్తవంగా జ్ఞానం అనేది సృష్టించబడేది. ఆలోచనల ద్వారా ఉద్భవించబడేది. ఈ జ్ఞానాన్ని సృష్టించుకోవడంలో మన పిల్లలకున్న శక్తి అపారమైనది. వారు పొందే అనుభవాల ద్వారా, ఆలోచనల ద్వారా పిల్లలు ఎంతో జ్ఞానాన్ని సృష్టించుకుంటున్నారు.

పిల్లలు బడిబయట లేదా బడికి రాకముందు జరిపే ప్రతిచర్యల ద్వారా, తమకున్న అంతర్గత శక్తుల ద్వారా ఈ జ్ఞానాన్ని సృష్టించుకోవడం చేస్తున్నారు. కేవలం సమాచారాన్ని గ్రహించే వారుగా కాకుండా ప్రశ్నించడం, ఆలోచించడం, ప్రతిచర్యలు జరపడం, ద్వారా తమకున్న జ్ఞానపరిధిని మరింత విస్తృతపర్చుకోవడం గురించి ఇంతకు ముందు అధ్యాయాల్లో చర్చించుకున్నాం కూడా! ఐతే ఈ ప్రక్రియలకు లేదా ఈ విధానాలకు మన తరగతి గదులు ఏ రీతిలో స్థానం కల్పిస్తున్నాయి? అసలు అవకాశం ఉందా? పిల్లలు తమకున్న జ్ఞానం ఆధారంగా దాన్ని మరింత విస్తృతపర్చుకోవడానికి అవకాశం ఉందా? జ్ఞాననిర్మాణం జరగడానికి వీలయ్యేరీతిలో మన తరగతి గది ప్రక్రియలు ఉండాలంటే, మనం ఏం చెయ్యాలి? లేదా మన తరగతి గది ప్రక్రియలు ఎలా ఉండాలి? ఆలోచించండి!

### అ) జ్ఞాన నిర్మాణం - ప్రస్తుత పరిస్థితి విశ్లేషణ

ప్రస్తుతం మన తరగతిగదుల్లోని ప్రక్రియలు జ్ఞాన నిర్మాణానికి తోడ్పడుతున్నాయా? ఆలోచిద్దాం! మన తరగతిగదుల్లో ఏం జరుగుతున్నది? ఏ తరగతైనా, ఏ విషయంలోని పాఠ్యాంశాన్నైనా ఎలా బోధిస్తున్నారు? ఉపాధ్యాయుడు చదవడం, వివరించడం, కొంత అభ్యాసం చేయించడం, తిరిగి ప్రశ్నించడం, సంతృప్తి చెందడం చూస్తున్నదే! ఇవి మనకు సాధారణంగా ఎదురౌతున్న బోధనాభ్యసన ప్రక్రియలకు చెందిన తీరుతెన్నులు లేదా అనుభవాలు. ఈ ప్రక్రియల్లో జ్ఞాన నిర్మాణానికి ఉన్న ప్రాధాన్యత ఎంత? జ్ఞాన నిర్మాణానికి పై ప్రక్రియలు ఏ రీతిలో సహకరిస్తాయి? ఆలోచించండి.

ఒకరకంగా చెప్పాలంటే, ప్రధానంగా ప్రస్తుతం మన తరగతిగదుల్లో సమాచారాన్ని అందించడం, దాన్ని జ్ఞాపకం పెట్టుకోడానికి తోడ్పడే విధానాలపై దృష్టి పెట్టడం, ఎంతమేరకు జ్ఞాపకం పెట్టుకున్నారో పరీక్షించడం వంటివి బోధనాభ్యసన ప్రక్రియల్లో కీలకాంశాలుగా చోటుచేసుకున్నాయి. జ్ఞాపకం ఉంచుకోవడమే పరమార్థంగా మన విధానాలు ఉన్నాయనేది వాస్తవం! దీనివల్ల జ్ఞాన నిర్మాణానికి అవకాశం లభించడంలేదని చెప్పవచ్చు.

**అందుకే జ్ఞాపకం ఉంచుకోవడం మాత్రమే జ్ఞానం కాదు అని మనం నమ్మితే, మరేం చేయాలనే ఆలోచనలకు శ్రీకారం చుట్టవచ్చు. అదే సర్వస్వం అని నమ్మి దాని చుట్టే పరిభ్రమిస్తే, జ్ఞాన నిర్మాణానికి సమాధికట్టిన వారమవుతాం!**

కాబట్టి సమాచారం అందించే వ్యక్తిగా ఉపాధ్యాయులు, దాన్ని స్వీకరించే వారుగా పిల్లలు, వీటిని పటిష్టపరిచే విధానాలు బోధనాభ్యసన ప్రక్రియల్లో చోటుచేసుకునే పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉందన్న వాస్తవాన్ని అందరం గుర్తిద్దాం! దీని నుంచి ఎలా బయటపడదామో, ఆలోచిద్దాం!

కింది సన్నివేశాలను పరిశీలించండి.

### సన్నివేశం-1:

అది 8వ తరగతి. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు "పేదరికం అవగాహన" అనే పాఠంలోని ప్రజాపంపిణీ వ్యవస్థ అనే అంశం గురించి చెబుతున్నారు. పాఠ్యపుస్తకంలో 199వ పేజీ తెరవమన్నాడు. పిల్లలందరూ పుస్తకం తెరిచారు. ఉపాధ్యాయుడు ఒక్కొక్క వాక్యాన్ని చదువుతూ అందులోని అంశాలను వివరిస్తున్నాడు. ఏదైనా కొత్తపదాలు లేదా అర్థంకాని పదాలను వివరిస్తూ పాఠ్యాంశాన్ని పూర్తిచేసెను.

- తర్వాత పాఠం మధ్యలో ఉన్న ప్రశ్నలకు జవాబులు కూడా తానే వివరించెను
- చివరగా పిల్లలను ఎవరికి తెల్లకార్డులు యిస్తారు? BPL అంటే ఏమిటి? వంటి ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టి పాఠాన్ని ముగించెను.

### సన్నివేశం-2 :

మరొక పాఠశాలలో ఇదే పాఠాన్ని మరొక ఉపాధ్యాయుడు ఎలా చెబుతున్నాడో చూద్దాం.

- ఉపాధ్యాయుడు పిల్లల్ని గుడ్‌మార్నింగ్ అంటూ పలకరించాడు.
- ఇంతకుముందు పీరియడ్‌లో చర్చించాం కదా! జీవనోపాది పథకాల గురించి మీకు తెలిసిన విషయాలు చెప్పండి అని మైండ్ మ్యాపింగ్ చేయించాడు. ఇలాంటి ఒక పథకమే PDS అని తెలిపెను.
- 199వ పేజీలోని సరసమైన ధరలకు అందుబాటులో ఆహారం అంశాన్ని చదివి మీకు తెలియని పదాలు గుర్తించమనెను.
- పిల్లలు గుర్తించిన పదాలను బోర్డుపై వ్రాసి, వాటిని చర్చించి తెలిసినవారినుండి వివరణ రాబట్టెను. మిగిలిన తెలియని పదాలను తాను వివరించెను. పాఠ్యాంశం గురించి క్లుప్తంగా వివరించెను.
- తరువాత క్రింది ప్రశ్నలు యిచ్చి జట్లుగా చర్చించమనెను.
  1. PDS వ్యవస్థ అవసరమా? ఎందుకు?
  2. మీ గ్రామంలో PDS వ్యవస్థ అమలు తీరు ఎలా ఉంది?
  3. PDS ను మెరుగుపరచటానికి మరికొన్ని సూచనలు యివ్వండి.
- విద్యార్థులు జట్లలో చర్చించేటపుడు, వారిని పరిశీలిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు యిస్తూ వారి చర్చలలో ఉపాధ్యాయుడు పాలుపంచుకొనెను.
- విద్యార్థుల సమాధానాలను, అభిప్రాయాలను బోర్డుపై వ్రాసి చర్చించి, అవసరమైనచోట సమకాలీన అంశాలను జోడించి, తగిన వివరణ యిస్తూ పాఠ్యాంశాన్ని అవగాహన కల్పించెను.
- చివరగా కొన్ని ప్రశ్నలు వేసి వారి అవగాహనను తెలుసుకొనెను. అర్థంకాని అంశాలకు తిరిగి తగిన వివరణ యిచ్చెను. 203వ పేజీలోని ప్రాజెక్టుపనిని ఇంటిపనిగా ఇచ్చెను.

పై రెండు సన్ని వేశాలలో ఏ సందర్భంలో పిల్లలు సొంతంగా నేర్చుకోవడానికి జ్ఞాననిర్మాణానికి అవకాశం కలిగిందని మీరు భావిస్తున్నారు? ఎందుకు?

**a) పూర్వభావనల నిర్మాణం (Pertext)**

తమకున్న జ్ఞాన పరిధిని ఎవరు విస్తృతపర్చుకోవాలన్నా, పూర్వఅనుభవాలు లేదా భావనలు కల్గిఉండడం అవసరం. అంటే పిల్లలు గ్రహించే విషయానికి చెందిన పూర్వావగాహన లేదా పునాది ఉండడం వల్లే జ్ఞాన నిర్మాణం ఆధారపడి ఉంటుందని గ్రహించాలి. కాబట్టి ఉపాధ్యాయులు తప్పనిసరిగా పిల్లలకు ఉన్న పూర్వానుభవాలు ఏమిటి? ఏ మేరకు అవగాహన కల్గిఉన్నారో పరిశీలించాలి. ఉదా: మనం గోల్ఫ్ ఆటకు చెందిన వార్త చదివితే ఎలా ఉంటుంది? అదే క్రికెట్ ఆటకు చెందిన వార్త చదివితే ఎలా ఉంటుంది? ఏది బాగా అర్థమవుతుంది? ఎందుకు? ఆలోచించండి.

క్రికెట్‌కు చెందిన పూర్వ జ్ఞానం లేదా, అవగాహన ఉంటుంది కాబట్టి, ఆ వార్తను చదివితే, బాగా అవగాహన చేసుకోగల్గుతారు. అదే గోల్ఫ్‌ను చదివితే అంత బాగా అర్థంకాకపోవచ్చు. దీనికి కారణం గతానుభవంగానీ, అవగాహనగానీ లేకపోవడం కారణమవుతుంది.

కాబట్టి జ్ఞానం అనేది అంతకు ముందు ఆయా వ్యక్తులకున్న అనుభవాల మీద, అవగాహనల మీద, ఆలోచనల మీద నిర్మించబడుతుందని పేర్కొనవచ్చు. మొదట ఇవి ఉన్నాయా లేదా? అని నిర్ధారించాల్సి ఉంటుంది. ఒకవేళ అటువంటి పునాది, పూర్వభావనలు లేదా అనుభవం లేదా అవగాహన లేనట్లయితే, వీటిని నిర్మించాల్సి ఉంటుంది. అంటే ఉదాహరణకు గోల్ఫ్ వార్తను చదవడానికి ముందు, దానిపై చర్చింపజేసే అనుభవాన్ని కల్గించి, విషయాన్ని అవగాహనపర్చిన పిదప చదవమంటే, అవగాహన చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఉపాధ్యాయులు ఏ విషయంలోనైనా జ్ఞాన నిర్మాణం చేయించాలన్నా, దానికి చెందిన పూర్వభావనల గురించి పరిశీలించి నిర్ధారించి తర్వాతనే అభ్యసనా కార్యక్రమాలను నిర్వహించాలి.

**b) పూర్వభావనలతో, పాఠ్యాంశ భావనలను సంధానం చేయాలి (Contextualisation of pretest with texual part)**

అభ్యసనా సన్నివేశాలు, నిర్మాణాత్మకంగా ఉండాలంటే పూర్వభావనలను లేదా భావనల పూర్వ రంగాన్ని, పునాదులని కల్పించాల్సి ఉంటుంది. దీని ఆధారంగా, పాఠ్యాంశభావనలను నిర్మించుకునేలా చేయాలి. రెండవ సన్నివేశంలో ఏంజరిగిందో ఒక్కసారి అవలోకించండి. పిల్లలకు తెల్సిన అంశాలు చెప్పించడం, దాని ఆధారంగా, మైండ్ మ్యాపింగ్ చేయడం జరిగింది. తర్వాత పిల్లలు తామే చర్చించుకొని, PDS పథకం అమలును నిర్ధారించుకొని రాయడం జరిగింది. అంటే గతానుభవాల పునాదుల ఆధారంగా జ్ఞాన నిర్మాణం జరిగింది. ఇలా పూర్వభావనలను, అనుభవాలను పాఠ్యాంశభావనలతో అనుసంధానం చేయాల్సి ఉంటుంది.

**c) జ్ఞానాత్మక శిక్షణ (Cognitive apprentiship)**

పిల్లలు జ్ఞానాన్ని నిర్మించుకోవడంలో ఉపాధ్యాయులుగా తమ సహకారాన్ని, సహాయాన్ని అందించాల్సి ఉంటుంది. అంటే పిల్లలను ఆలోచింపజేసేలా, ప్రోత్సహించాలి. ఆ ఆలోచనలను క్రమబద్ధీకరించాల్సి ఉంటుంది.

సాంఘికశాస్త్రంలో మరొక ఉదాహరణ పరిశీలిద్దాం! ఒక సమస్యను ఒక పద్ధతిలో ఉపాధ్యాయుడు పరిష్కారమార్గం చూపాడు. ఆ తదుపరి పిల్లలను, ఇంకేరీతుల్లో సమస్యకు సమాధానం కనుగొనవచ్చు, ఆలోచింపజేయడం, అందుకు సూచనలు ఇవ్వడం జ్ఞానాత్మక శిక్షణగా పేర్కొనవచ్చు. జ్ఞానాత్మక శిక్షణ అంటే ఆలోచింపజేసే అవకాశం కల్పించడం. ఆ ఆలోచనలను క్రమబద్ధీకరించమని అర్థం. ఇది ఎంత సక్రమంగా, సందర్భోచితంగా ఉంటే, జ్ఞాన నిర్మాణం అంత బాగా జరుగుతుంది. పిల్లలకిచ్చే స్వేచ్ఛ, ఆలోచింపజేయడం, అవకాశం కల్పించడం, ప్రోత్సహించడం వంటివి కీలకపాత్ర పోషిస్తాయి.

**d) భాగస్వామ్య అభ్యసనం (Collaborative Learning)**

పిల్లలు స్వభావరీత్యా తమతోటి వారితో గడపడానికి ఇష్టపడతారు. ప్రాథమికోన్నత స్థాయిలో ఐతే పిల్లలు కేవలం కలిసి ఉండడమేగాదు, తమ అనుమానాలను, సమస్యలను కూడా తోటివారితో చర్చిస్తారు. నివారణల కోసం ప్రయత్నిస్తారు. ఒకరకంగా చెప్పాలంటే పిల్లలు ఎన్నో విషయాలను తమ తోటివారి ద్వారా అభ్యసిస్తారని. గత అధ్యాయంలో కూడా చర్చించుకున్నాం. జ్ఞాననిర్మాణంలో ప్రతిచర్యల పాత్ర గురించి కూడా మాట్లాడుకున్నాం. అంటే, పిల్లలు తమ తోటివారి ద్వారా ప్రతిచర్యలు జరపడం ద్వారా నేర్చుకొంటారని జ్ఞానాన్ని నిర్మించుకుంటారని చర్చించుకున్నాం!

కాబట్టి మన బోధనాభ్యసన ప్రక్రియలు భాగస్వామ్య అభ్యసనానికి అవకాశం కల్పించాలి. అంటే పిల్లలు తమతోటి వారితో చర్చించడం, మాట్లాడడం, కలిసి ఆలోచించడానికి అవకాశాలు కల్పించాలి. ఇందుకోసం జట్టు పనులను నిర్వహించాలి. ఏ

విషయం గురించైనా, ప్రశ్నలివ్వడం, ఆలోచించమనడం, లేదా ప్రశ్నించమనడం, కృత్యాలు ఇచ్చి చేయమనడం, సమస్య ఇచ్చి సాధించమనడం వంటివి జట్టులో చేయించవచ్చు. తద్వారా భాగస్వామ్య అభ్యసనం చోటు చేసుకొంటుంది. భాగస్వామ్య అభ్యసనం వల్ల ప్రజాస్వామిక విధానాలపట్ల, అవగాహన ఏర్పడుతుంది. అంతేకాకుండా కల్సిపనిచేయడం, కల్సి ఆలోచించడం, సమస్యాసాధన, ఆత్మవిశ్వాసం వంటివి కూడా పెంపొందుతాయి. పిల్లలు తమతోటి పిల్లలతోనే గాదు, ఉపాధ్యాయుడితో కూడా చర్చిస్తుంటారు. కాబట్టి భాగస్వామ్య అభ్యసనంలో పిల్లలేకాదు, ఉపాధ్యాయులు కూడా భాగస్వాములే!

### e) బహుళ ప్రతిస్పందనలు ఆలోచనలకు రూపాన్నివ్వడం (Multiple manifestations)

పిల్లలు వ్యక్తిగతంగా ఏమి ఆలోచించగలరో దానికి ఒక రూపాన్ని ఇవ్వగల్గాలి. అంటే, తమ ఆలోచనలను బహిర్గతపర్చాలి. దీన్నే వ్యక్తిగతమైనదిగా చెప్పవచ్చు. అట్లే జట్టు పనుల్లో పాల్గొనడం వల్ల భాగస్వామ్య అభ్యసనం వల్ల కూడా తమ ఆలోచనలను క్రమబద్ధీకరించుకుంటారు. వాటి వల్ల విభిన్న కోణాల్లో ఆలోచించగల్గుతారు. ఈ ఆలోచనలకు రూపాన్నిచ్చి, వ్యక్తపర్చగల్గాలి. ఇలా బహిర్గతమయ్యే జ్ఞానం వివిధ వ్యవహార రూపాల్లో, నైపుణ్యాల పాత్ర ఉంటుంది. నిర్మాణాత్మకత ఒక క్రమ పద్ధతిలో జరుగుతుంటుంది, వ్యక్తపరచబడుతుంటుంది.

### f) నిర్ధారణ

పిల్లలు తరగతి గదుల్లో వ్యక్తిగతంగా ఆలోచించడం, జట్లలో ఆలోచించడం, వాటిని వ్యక్తపర్చడం వల్ల జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. దాన్ని వివిధ రూపాల్లో బహిర్గతపరుస్తుంటారు. ఇది ఆయా స్వభావాన్ని బట్టి వివిధ విషయాలలోని జ్ఞాన భాండాగారంలోకి వెళ్తుంది. ఈ క్రమంలో పిల్లలు తామేం గ్రహించారో, తమకు తాము నిర్ధారించగల్గాలి. ఇలా నిర్ధారించగల్గినప్పుడే మన బోధనాభ్యసన ప్రక్రియలు ఫలప్రదమైనట్లుగా భావిస్తాం.

## 8. తరగతి గది అన్వయనం

### అ) జ్ఞాన నిర్మాణం - విద్యాప్రణాళిక అనువర్తనాలు (Implication of the curriculum)

విద్యా వ్యవస్థలో పిల్లలు, ఉపాధ్యాయులు కీలకమైనవారు. పిల్లలు ఉన్న అన్ని రకాల ప్రక్రియలు, పరస్పర చర్యలు పిల్లల అభ్యసనాన్ని ప్రభావితం చేస్తాయి. పిల్లలను జ్ఞాన నిర్మాతలుగా భావించినప్పుడు ఉపాధ్యాయులలో, పాఠ్యపుస్తకాలలో బోధనాభ్యసన ప్రక్రియలలో బృహత్తరమైన మార్పులు చోటుచేసుకోవాలి. విద్యయొక్క, లక్ష్యం పిల్లలను పరీక్షలకు తయారుచేయడం కాదు. జ్ఞాన నిర్మాణానికి తోడ్పడేలా బోధనాభ్యసన ప్రక్రియలు తోడ్పడాలి. ఇవి అనేక రకాలైన అనుభవాలను కల్పించాలి. పిల్లలు పాఠశాలకు వచ్చే ముందే కొంత జ్ఞానాన్ని కల్గిఉంటారు. దీన్ని ఆధారం చేసుకొని బోధనాభ్యసన ప్రక్రియలు నిర్మించాలి. సాంఘిక శాస్త్ర అధ్యయనంలో 'చర్చలు' కీలకమైనవి. తరగతి గదిలో స్వేచ్ఛగా జరిగే ఈ చర్చ ఒక్కొక్కసారి వ్యవస్థను విమర్శించవచ్చు లేదా ఖండించవచ్చు. ఇబ్బందికర ప్రశ్నలు అడగటం సాంఘికశాస్త్రంలో స్వాభావికం. అయితే చర్చ ఎంత దూరందాకా వెళ్ళాలన్నది ఆ టీచరు సందర్భాన్ని బట్టి తగిన నిర్ణయానికి రావాల్సి ఉంటుంది.

### ఆ) పాఠ్యపుస్తకాల పాత్ర

ప్రస్తుత పాఠ్యపుస్తకాలు అధిక సమాచారంతో నిండి విద్యార్థుల అంతర్గతశక్తుల అభ్యసనకు జ్ఞాన నిర్మాణానికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఉన్నాయి. విద్య కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం అయింది. ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడం విమర్శనాత్మక ఆలోచనా విధానానికి పూర్తిగా స్థానం లేకుండా పోయింది. ఏది మంచిది? ఏది చెడు? ఈ మంచి చెడుల విచక్షణకు కూడా స్థానం లేకుండా పోయింది. ఈ పరిస్థితి తప్పుడునమ్మకాలకు, ఊహాజనితాలకు దారిచూపుతుంది. ఈ విషయంలో పాఠ్యపుస్తకాల పాత్ర ఎంత ముఖ్యమైందో తెలుసుకోవాలి. పాఠ్యపుస్తకాల ద్వారా ఏ విలువలు పిల్లవానిలో ప్రవేశపెట్టాలి? జ్ఞాన నిర్మాణానికి అనుగుణంగా పాఠ్యపుస్తకాలను ఎలా రూపొందించాలి? పిల్లలకు చాలా ఉపయోగకరంగా పాఠ్యపుస్తకాలను

ఎలా తయారుచేయాలి? అనేవి చాలా కీలకమైన విషయాలుగా గుర్తించాలి. విద్యాప్రణాళికలో ఈ విషయాల పట్ల స్పష్టత చాలా అవసరం. విద్యాప్రణాళికను అమలుజరిపే సాధనంగా పాఠ్యపుస్తకం అందరికీ తెలిసిన విషయమే. విద్యాలక్ష్యాలను సాధించడంలో బోధనాభ్యసన ప్రక్రియలకు మార్గనిర్దేశనం చేయడంలో పాఠ్యపుస్తకాలు గొప్ప పాత్రను నిర్వహించాలి.

**మౌఖిక, మౌఖికేతర సాంప్రదాయిక కళలు అనేకం సమాజంలో ఉన్నాయి. ఇవి సమాజంలోని అట్టడుగు కుతర్క పురాతన అంశాలు అలిఖితంగా అనేక సాంఘిక సమూహాలయిన తెగలలో, గిరిజనులలో స్త్రీలలో ఉన్నాయి. వీటన్నింటిని పాఠ్యప్రణాళికలో అంతర్లీనం చేయాలి. దీనివల్ల వారి ఆలోచనా ద్వారం తెరచినట్లవుతుంది. విస్తారమైన పరిష్కారాలను, నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించవచ్చు. వాటి నవీన రూపకల్పనలకు, సమృద్ధి చేయడంలో తోడ్పడినవారమవుతాం. పాఠశాల అనేది అక్షరాస్యులకు విశేషగుణం కల్గినది అయినప్పటికీ సంప్రదాయక, నిరక్షరాస్యులను నిర్లక్ష్యం చేసేదిలా ఉండకూడదు. అన్నిరకాల మౌఖిక నైపుణ్యాలు, సంప్రదాయాలు, కళలలకు ప్రాధాన్యతనివ్వాలి - NCF-2005, పేజి 27.**

ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాప్రణాళికా పరిధి పత్రంలో పాఠ్యపుస్తకాల గురించి ఈ కింది ప్రతిపాదనలు చేసింది.

- పిల్లల అభ్యసన పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకూడదు.
- పిల్లల గతానుభవాలను, పూర్వజ్ఞానాన్ని, అంతర్గత శక్తులను ఉపయోగించడానికి, స్థానిక పరిసరాలతో కలిసి పనిచేయుటకు పాఠ్యపుస్తకాలు విస్తృత అవకాశాలను కల్గించాలి.
- పాఠ్యపుస్తకాలు పిల్లల్లో ఆలోచనా నైపుణ్యాలు పెంపొందింపజేసి హేతుబద్ధంగా విచక్షణతో వ్యవహరించేలా దోహదపడాలి.
- విషయ పరిజ్ఞానంతోపాటు, పని అనుభవం, స్థానిక కళలు, సాహిత్యం, జానపద విజ్ఞానం మొదలైన సామాజిక జ్ఞానాంశాలతోపాటు స్థానిక సమాజ శాస్త్రీయ ఆచరణలను ప్రతిబింబించేలా, పాఠ్యపుస్తకాలు ఉండాలి.
- జ్ఞాననిర్మాణం విధానాలు, వాస్తవిక సూత్రాల ఆధారంగా జరిగిన వాటి నిరూపణలు పిల్లలు అవగాహన చేసుకోవాలి. పాఠ్యపుస్తకం అందుకు దోహదకారిగా ఉండాలి.
- సమాజంలోని వివిధ వర్గాల సాంఘిక నియమాలు, వారి జ్ఞానపద్ధతులు పాఠ్యపుస్తకాలలో ప్రతిబించించాలి.
- బడుగు, అణగారిన వర్గాల సామాజిక నేపథ్యం, సంస్కృతి ఆచారాలు పాఠ్యపుస్తకాలలో ప్రతిబింబించాలి. ఉన్నత వర్గాల పరిజ్ఞాన భావనలు వీరిపై రుద్దకూడదు. పాఠ్యపుస్తకాలు ఇలాంటి అన్ని సమస్యలపై శ్రద్ధ వహించాలి.
- పాఠ్యపుస్తకాలు శిశుకేంద్రంగా ఉండాలి. ఇటీవల అందరినోట ఇదేమాట విన్పిస్తున్నది. ఇది కేవలం అలంకారప్రాయమైంది. మొత్తం విద్యాప్రణాళిక విద్యాకేంద్రీకృతమే అయితే విద్యార్థుల ఆసక్తులు, అభిరుచులు, అభ్యసనాశైలి, వాటి మూలాలు, నేపథ్యము - పాఠ్యపుస్తకాలను అభివృద్ధిపర్చడంలో కీలకాంశాలు కావాలి.
- కృత్యాధారంగా పాఠ్యపుస్తకాలుండాలి. కృత్యాధార బోధన అనేది ఆచారప్రాయంగా మిగిలిపోకూడదు. ఎక్కువ సందర్భాలలో కృత్యాలనేవి అర్థరహిత యాంత్రిక ప్రక్రియలకు దారితీస్తున్నాయి. కృత్యమనేది ఆలోచనను రేకెత్తించేలా ఉండాలి కానీ అక్షరాన్ని దిద్దించడమో, పాఠాన్ని చదివించడమో, సామగ్రిని విద్యార్థిముందు పడేయడమో కాదు. కృత్యము విద్యార్థిలో ఆలోచన రేకెత్తించాలి. అభ్యసనను అర్థవంతంగా చేసి వాస్తవిక లక్షణాలను ప్రతిబింబించాలి. భవిష్యద్దర్శినిగా కార్యకారణ హేతువులు కనుగొనేదిలా ఉండాలి. మన రాష్ట్ర విద్యాలక్ష్యాల ప్రకారం, రాష్ట్ర విద్యాప్రణాళికా పరిధి పత్రం 2011 ప్రకారంగా విద్య అనగా సహకార భావనను, శాంతిని, విలువలను, మానవహక్కులను గౌరవించాలి. పాఠ్యపుస్తకం మానవ హక్కులను ఆచరింపజేసేటట్టు పిల్లలలో నైతిక ప్రవర్తనను సముపార్జించేటట్టుగా ఉండాలి.
- పిల్లలు సమాజ సమకాలీన పరిస్థితులను అవగాహన చేసుకోవాలి. ప్రచారసాధనాల్లో వచ్చే సమస్యలను విద్యార్థి విశ్లేషించి అర్థం చేసుకోగలగాలి. పాఠ్యపుస్తకాలు ఇలాంటివాటికి దోహదపడాలి.

- విద్య ద్వారా సమాజంలోని విభిన్నవర్గాలు అభివృద్ధి చెందాలి. ఏదో ఒక వర్గానికే చెందిన జ్ఞానం పాఠ్యపుస్తకంలో ప్రాతినిధ్యం వహించకూడదు. అణగారిన వర్గాలయిన స్త్రీలు, దళితులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, అన్నిరకాల అల్పసంఖ్యాక వర్గ ప్రజలకు ఇబ్బందిగా పాఠ్యపుస్తకం ఉండకూడదు.
- ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ నేపథ్యంలో విద్య ఒక వ్యాపారకృత్యమైంది. విద్య పేరుతో అనవసర ప్రచార ఆకర్షణలతో ప్రజలు దోపిడీకి బలిఅవుతున్నారు. ప్రస్తుత ప్రధాన సమస్య ఏమిటంటే విద్య అనేది పిల్లలను సమాజ సంక్షేమం కోసం పనిచేసే బాధ్యతాయుతమైన పౌరులను తయారుచేస్తుందా? లేక వైద్యులను, ఇంజనీర్లను, ఇతర ఉద్యోగులను తయారుచేస్తుందా? సమాజంలోని భిన్న వర్గాలకు భిన్న వాంఛలు ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలు తమకన్నా అభివృద్ధి చెందాలని కోరుకుంటారు.

**వస్తువుకు సమాజంలో గల విలువపట్ల అవగాహన కల్గి (సాంఘిక - సాంస్కృతిక సౌందర్య, ఆర్థిక ప్రాముఖ్యతలు కలిగి) వడ్రంగి తన చేతిపని కళానైపుణ్య భావనను రూపొందించుకొని దానికి సంబంధించిన వస్తు నిర్మాణం చేస్తాడు. వస్తులభ్యతా జ్ఞానం, వస్తు తయారీలో నాణ్యత, ధర తగినటువంటి వస్తు ఉత్పత్తికి తగిన జ్ఞానం, వస్తు వనరుల లభ్యతాజ్ఞానం, ప్రారంభం నుంచి చివరిదాకా నిర్మాణంలో పథకం మరియు అమలుజరిపే జ్ఞానం, సొంత నైపుణ్యాల ఉపయోగం, ఇతరుల నైపుణ్యాలను అనుకూలంగా మలచుకునే నైపుణ్యం, అవసరమైన పనిముట్ల నిర్వహణ, నాణ్యతపట్ల, సృజనపట్ల, శ్రేష్టతపట్ల ఉత్తమ ఉత్పత్తిపట్ల నిర్ణయాత్మకత కల్గిఉంటాడు.**

**కబడ్డి వంటి క్రీడ భౌతిక దేహదారుఢ్యంతోపాటు, క్రీడానియమాల జ్ఞానాన్ని, తన సొంత తాహతును, శారీరక నైపుణ్యజ్ఞానాన్ని వ్యక్తీకరించే ప్రణాళికను, జట్టు సహకార భావనను, ఇతర జట్టులను అంచనావేసే, గెలిచే వ్యూహరచన చేసే జ్ఞానాన్ని కల్గిఉంటుంది. - NCF-2005, పేజి 26.**

**ఇ) బోధనాభ్యసన ప్రక్రియలు ఎలా ఉండాలి?**

అనుభవాలు మరియు పూర్వజ్ఞానం ద్వారా సమవయస్కులయిన పిల్లల, గ్రూపులలో పరస్పర జ్ఞానవినిమయం జరుగుతుంది. వారు వ్యక్తిగతంగానైనా, సమూహంలోనైనా పరస్పర చర్చలద్వారా అవగాహనను పొందగలరు. ముందంజ వేయగలరు. జ్ఞానాత్మక భవిష్యద్దర్శనాన్ని సుగమనం చేయగలరు. ప్రశ్నించి కారణాలు తెలుసుకోవడం వల్ల హేతుబద్ధత దృక్పథాన్ని, భావాత్మక అవగాహనను అలవచ్చుకుంటారు. వారు చర్చద్వారా అవగాహనకు సంబంధించిన కార్యకారణ సంబంధాలను వివరించాల్సి వస్తుంది కనుక హేతుబద్ధతను అలవర్చుకుంటారు. ఇటువంటి విధానం వల్ల పిల్లలు తమదైన స్వంత అవగాహనతో జ్ఞానాన్ని నిర్మించుకుంటారు. ఈ విధానంలో 'పరిపూర్ణ మార్పు'కు ఉపాధ్యాయుని పాత్ర అత్యవసరమైంది. పిల్లల అనుమానాలను నివృత్తి చేయడానికి వారితో సహ అభ్యాసకునిగా ఉంటూ చర్చలకు నాయకత్వం వహిస్తూ, అన్వేషణాత్మకమైన ప్రశ్నలను ప్రోత్సహిస్తుండాలి. ఉపాధ్యాయుడు పిల్లలతో కలిసి పనిచేస్తూ, వారిని భాగస్వాములను చేస్తూ వ్యక్తీకరణలద్వారా, భాగస్వామ్యం వల్ల తన వైఖరులను చెపుతూ బోధనాభ్యసనలో కీలకాంశాలను వ్యక్తీకరించాలి. అప్పుడే ఉపాధ్యాయుడు తానూ ఒక పరిశోధకుడుగా సహకార అభ్యాసకుడుగా సూచనలిచ్చేవానికన్నా దోహదకారిగా మారగలడు.

**జ్ఞాననిర్మాణ ప్రక్రియలో ప్రతిస్పందించే బోధన (Reflective teaching) అవసరం.**

ప్రతిస్పందించే బోధన లక్షణాల గురించి జాన్ డివే (John Deway) ఈ కింద విధంగా సూచించారు.

1) **ఉద్దేశ్యాలు, పర్యవసానాలు :** ప్రతిస్పందించే బోధన పిల్లలను ప్రత్యక్ష సంబంధం కలవారుగా, లక్ష్యాల పర్యవసానాన్ని అంతేకాకుండా సాంకేతిక పరిపూర్ణులుగా తీర్చిదిద్దుతుంది.

2) **చక్రీయ పద్ధతి (Cyclical method) :** ఇది బోధనను చక్రీయ, సర్పిల పద్ధతులు కలిగి ఉంటుంది. ఉపాధ్యాయుని బోధనలో మూల్యాంకనం తమదైన పద్ధతిలో పునశ్చరణ, నిరంతరంగా జరుగుతుండాలి.

3) **తరగతిగదిలో అన్వేషణ సామర్థ్యం (Competence in Classroom Inquiry) :** దీని అన్వేషణానికి బోధనాసామర్థ్యం అవసరం ఈ పద్ధతి దత్తాంశ సమాచార సేకరణ, విశ్లేషణ, మూల్యాంకనం, ప్రతిస్పందన, ప్రణాళిక రచన, సౌకర్యాల కల్పన వంటి చర్యలను కల్గి ఉంటుంది.

4) **బోధనపట్ల వైఖరి (Attitude towards teaching) :** ప్రతిస్పందిత బోధనకు విశాల భావనావైఖరి, బాధ్యతాయుతమైన పరిపూర్ణ హృదయం అవసరం.

5) **ఉపాధ్యాయుని నిర్ణయాత్మకత (Teacher Judgement) :** ఎఫెక్టివ్ టీచింగ్‌కు ఉపాధ్యాయుని నిర్ణయాత్మకత ఆధారం పాక్షికంగా ఈ నిర్ణయాత్మకత ఉపాధ్యాయుని క్రమశిక్షణతో వచ్చిన అంతర్‌దృష్టిపై, స్వయంప్రతిస్పందనలపై ఆధారపడి ఉంటుంది.

6) **సహచరులతో అభ్యసన (Learning with Colleagues) :** సహచరులతో సంభాషణ, సహకారం ద్వారా ప్రతిస్పందిత బోధన, వృత్తిపర, అభ్యసన, వ్యక్తిగత పరిపూర్ణతలు పెంపొందుతాయి.

**ఈ) విమర్శనాత్మక బోధనాశాస్త్రం, అనువర్తనాలు (Critical pedalogy, its implications)**

విమర్శనాత్మక (విశ్లేషణాత్మ) బోధన విధానం. విద్యార్థులు తమపై చేసే పెత్తనాన్ని ప్రశ్నించేట్లు చేసి సందేహాలను, అపనమ్మకాలను నివృత్తిచేయడానికి దోహదపడుతుంది. విద్యార్థిలో విమర్శనాత్మక చేతనకు దోహదకారి అవుతుంది. Ira Shore (1992) ప్రకారం "విద్యార్థి రాయడం, మాట్లాడడం వంటి వాటికే పరిమితం కాకుండా, అర్థాల పరిధిని దాటి తులనాత్మకంగా, చైతన్యంతో ఆలోచిస్తాడు. విద్యార్థి అపోహలు, ఊహాజనితభావనల నుంచి బైటపడి తెలివి పెంచుకుంటాడు. విద్యార్థి అంతర్గత అర్థాలు, మూలకారణాలు, సాంఘిక పరిస్థితులను, ఏదైనా ఒక చర్యయొక్క వ్యక్తిగత పర్యవసానాలను, వస్తువులను, సంఘటనలను, ప్రక్రియలను, అనుభవాలను, ప్రణాళిక, పాఠ్యవిషయం, నియమాలు, బహుళ ప్రచారసాధనాలు లేదా వ్యవహారాల గురించి తప్పక అవగాహన చేసుకోవాలి".

విమర్శనాత్మక బోధనాశాస్త్రం ముఖ్య ఉద్దేశం విద్యార్థిని సమర్థవంతంగా, శక్తివంతునిగా తయారుచేయడమే, స్వేచ్ఛకు దోహదపడడమే. సర్వ వ్యాకులతల నుండి, బాధల నుండి విముక్తులను చేయడమే. విద్యార్థులలో జ్ఞాన నిర్మాణమందు సాంప్రదాయక బోధనాపద్ధతుల పాత్ర అతి పరిమితమైంది. ఇతరుల సంస్కృతిని గౌరవించడం, తనకు తాను, ప్రపంచాన్ని విభిన్న దృక్కోణాలలో విమర్శనాత్మకంగా పరిశీలించడం కూడా విద్యాలక్ష్యాలలో ఒకటి. విమర్శనాత్మక బోధనాశాస్త్రం పిల్లవానికి దేశీయ మరియు అణగారిన పీడిత ప్రజల సంస్కృతిని అర్థం చేసుకోవడానికి దోహదపడాలి.

అప్పుడే అణగారిన పీడితవర్గాల కుటుంబాలకు చెందిన పిల్లలు వారి వారి సంస్కృతి, చరిత్ర వారి వైవిధ్య ప్రవృత్తులు, మతం, వారసత్వాలను క్షుణ్ణంగా తెలుసుకుంటారు. ఇది వారసత్వ విలువల సంక్రమణ ప్రభావం వారి జీవితాలపై కల్గిస్తుంది. వారు సమర్థవంతులు కావడానికి దోహదపడుతుంది.

విద్య అనేది రాజకీయమైనది. ఈ విమర్శనాత్మక బోధనాశాస్త్రం పిల్లలు, ఉపాధ్యాయులలో విద్య చుట్టూ పరిభ్రమించే రాజకీయ వ్యవహారాలపట్ల అప్రమత్తులను చేస్తుంది. ఇది రాజకీయ భావనలను అర్థంచేసుకునేలా పిల్లలను శక్తిమంతులను చేస్తుంది. సమాజాన్ని అర్థంచేసుకొనే శక్తినిస్తుంది.

### విమర్శనాత్మక బోధనాశాస్త్రం అనువర్తనాలు :

- జ్ఞాననిర్మాణానికి విమర్శనాత్మక బోధనాశాస్త్రం ఒక వ్యూహంగా పనిచేస్తుంది.
- ప్రతిస్పందిత ఆలోచనా నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలు, భాషాభేద సంబంధ నైపుణ్య ఆలోచనా నైపుణ్యాలు విమర్శనాత్మక బోధనాశాస్త్రంలో ప్రధానపాత్ర వహిస్తాయి. ఈ నైపుణ్యాలను పెంపొందించడానికి బోధనాభ్యసన ప్రక్రియలు దోహదపడాలి. ఇది అన్ని విషయాలకు (Subjects) వర్తించాలి.

  ఉదా : సామాజిక శాస్త్ర అధ్యయనంలో మానవులు, సమాజం హేతుబద్ధంగా, వస్తుగతంగా, నిష్పాక్షికంగా ఉండరు. తన పరిసరాలతో అనేక సంబంధాలు, అనుభవాలతో పిల్లలు పాఠశాలకు వస్తారు. సమానత్వం, నమ్మకాల వ్యవస్థ వంటి అంశాలను తరగతి గదిలో చర్చకు పెట్టినపుడు పిల్లల గత అనుభవాల ఆధారంగా వారి దృక్పథాలుంటాయి. ఇక్కడ ఒకే ఉమ్మడి దృష్టికోణం ఉండదని మనం గుర్తుంచుకోవాలి. ఇక్కడ హేతుబద్ధ విశ్లేషణకు అవకాశం ఉండాలి. అనేక కోణాలలో పిల్లలను ఆలోచింపచేసి తగిన నిర్ణయానికి వచ్చేలా చేయాలి. అంతేగాని మంచి-చెడు పనుల జాబితా యివ్వటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.

- విద్యార్థులకు జీవితానుభవం, స్వీయజ్ఞానం ఉండి విద్యను, అభ్యసన నిర్మాణంలో కీలకపాత్ర వహిస్తాయనే విషయం ఉపాధ్యాయులకు తెలియాలి.
- మంచి విద్యావ్యవస్థ లేదా పాఠశాల విద్యార్థుల వైఫల్యాలను నిందించడమో లేక వారు తరగతిగదికి తెచ్చిన జ్ఞానం పట్ల విమర్శచేయదు.
- ఉపాధ్యాయునికి, విద్యార్థికి మధ్య ఉన్నతమైన గౌరవభావం ఉండాలి.
- మనం ఉపాధ్యాయ - విద్యార్థి - ఉపాధ్యాయ అనగా ఉపాధ్యాయుడు కూడా నేర్చుకుంటాడు. అలాగే నేర్చుకునేవాడు బోధిస్తాడు అనే విధంగా ఆలోచించాలి.
- ఉపాధ్యాయునికి, విద్యార్థికి మధ్య ఉన్నతమైన గౌరవభావం ఉండాలి.
- మనం ఉపాధ్యాయ - విద్యార్థి, విద్యార్థి - ఉపాధ్యాయ అనగా ఉపాధ్యాయుడు కూడా నేర్చుకుంటాడు, అలాగే నేర్చుకునేవాడు బోధిస్తాడు అనే విధంగా ఆలోచించాలి.
- ఉపాధ్యాయునికి వృత్తిపట్ల గౌరవభావం కల్గిఉండాలి.
- ఉపాధ్యాయునికి విద్యార్థియొక్క సంస్కృతి, పూర్వజ్ఞానం, భాషాసామర్థ్యం తెలుసుకొనుట చాలా ముఖ్యం.
- ఉపాధ్యాయుడు ఎల్లప్పుడూ ప్రతిభావంతుడైన పరిశోధకుడుగా ఉండాలి.
- అభ్యసన సమాహారం అనేది ఒక సమస్యా పరిష్కార పద్ధతి. ఇందులో సమస్యలను గుర్తించుట, పరిష్కార మార్గాలను అన్వేషించుట, ఆచరణ, ప్రణాళిక రూపకల్పన, దాని అమలు, మూల్యాంకనం అనేవి ముఖ్యం.

### ఉ) సామాజిక నిర్మాణాత్మక వాదం (Social Constructivism)

సామాజిక నిర్మాణాత్మవాదం అనేది సామాజికశాస్త్ర సిద్ధాంతాలపట్ల అవగాహన. ఇది సాధారణ తాత్త్విక జ్ఞాననిర్మాణానికి వాస్తవిక జీవితానికి అన్వయిస్తుంది. విద్యార్థులు సమూహాలుగా ఏర్పడి ఒక చిన్న 'భాగస్వామ్య సంస్కృతిని, అవగాహనను నిర్మించుకుంటారు'. "ఎప్పుడైతే విద్యార్థి ఇలాంటి సంస్కృతియందు నిమగ్నుడవుతాడో, వివిధ దశలలో ఒక సంస్కృతియందు భాగస్వామి అగుటను నేర్చుకుంటాడు." అని Lev Vygotsky (1896-1934) అన్నారు.

బోధన అభ్యసన అనువర్తనాల విషయమై విద్యామనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు సామాజిక నిర్మాణాత్మక వాదాన్ని అధ్యయనం చేశారు. నిర్మాణాత్మకత అనేది పిల్లవాని పురోభివృద్ధి సాధనకు సంబంధించిన సిద్ధాంతాలలో (ప్రవర్తనావాదం, సామాజిక అభ్యసన సామాజిక నిర్మాణం) ప్రముఖమైనది. ఇది Jean Piaget ప్రతిపాదించిన సంజ్ఞానాత్మక పురోభివృద్ధి సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. Piaget ప్రతిపాదించిన దశల సిద్ధాంతం (నాలుగు అభివృద్ధి దశలు) నిర్మాణాత్మకతగానే గుర్తించబడింది. ఎందుకంటే పిల్లలు తమంతట తాము ప్రాపంచిక అవగాహనను నిర్మించుకోవాలి. సామాజిక నిర్మాణ అభివృద్ధిలోని ఇతర అంశాలను , సంస్కృతిని ఇముడ్చుకొని నిర్మాణాత్మకత సాంఘిక నిర్మాణాత్మకతగా రూపొందుతుంది.

Vygotsky's తన రచనలయిన Mind in Society (1930, 1978) Thought and Language (1934, 1986) నందు పిల్లవాని నిర్మాణాత్మక స్వభావము గూర్చి Piaget తో ఏకీభవించాడు. బోధనాభ్యసన యందు విద్యార్థి కేంద్రీకృత తరగతి ఉండాలి అనే భావన సామాజిక నిర్మాణాత్మక సిద్ధాంతం ఆధారంగానే రూపొందించబడింది. తరగతిగదిలో విద్యార్థులచే సామూహిక చర్చ అమలుచేయడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయి. దీని ద్వారా విద్యార్థి సాధారణీకరించడాన్ని, తరగతియందు అభ్యసన బదలాయింపును మరియు మౌఖిక భావ ప్రసరణకు గొప్ప పునాదులు ఏర్పర్చుకుంటాడు. స్వీయ క్రమబద్ధీకరణ, స్వీయ నిర్ణయాలు మరియు కృత్యాలలో పాల్గొనుటపట్ల ఆసక్తిని పెంచుకుంటాడు. చర్చలు విద్యార్థులలో ఉన్ముఖీకరణను, సామూహిక నైపుణ్యాలు, సమస్యా పరిష్కార సామర్థ్యాలను పెంపొందిస్తాయి. ఈరకమైన అభ్యసనం విద్యార్థి నేర్చుకున్న విషయాలను నిలకడగా ఉంచి మనసునుండి విజ్ఞాన అనుభవాలు తొలగిపోకుండా ఉంచుతుంది.

**ఊ) ఉపాధ్యాయుని పాత్ర**

ఇంతవరకు జ్ఞాన నిర్మాణం, జ్ఞాన రూపాలు, జ్ఞాన నిర్మాణ పరిస్థితులు గురించి తెలుసుకున్నారు. నిర్మాణాత్మక అభ్యసనం అంటే మన అభ్యసనా సన్నివేశాలు జ్ఞాన నిర్మాణానికి దోహదపడాలి. ఇది జరగడంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకమైంది. ఉపాధ్యాయుడు సహభాగస్వామి. తాను కేవలం బోధకుడిగా, వాహకుడిగా, సమాచారం అందించే వ్యక్తిగా ఉండకూడదు. పిల్లల్లో జ్ఞాన నిర్మాణం జరపడానికి సరైన అభ్యసన వాతావరణం కల్పించాలి. ప్రోత్సాహకుడిగా వ్యవహరించాలి, పిల్లలతో కలిసిపాల్గొనాలి. పిల్లలు పూర్తిగా మానసికంగా అభ్యసనలో నిమగ్నమయ్యేలా చూడాలి. పిల్లలు వారి ఆసక్తుల ఆధారంగా అభ్యసనా ప్రక్రియల్లో నిమగ్నమయ్యేలా చూడాలి. దురదృష్టవశాత్తు పలు సందర్భాలలో లక్ష్యాత్మకత పేరుతో ఉపాధ్యాయులు సరళతను, సృజనాత్మకతను వదిలిపెడతారు. తరచుగా పాఠ్యపుస్తకాలలోని సమాధానాలు తప్ప, ఇతర సమాధానాలేవి కూడా సరైనవి కావని భావిస్తారు. పలు విధానాలైన సమాధానాలుంటే వాటిని ఎలా అంగీకరించాలి? అని వాదిస్తారు. ఈ విధమైన వితండవాదం అభ్యసనాన్ని, దాని అర్థాన్ని అవహేళన చేస్తుంది.

మన విద్యాబోధన, ఆచరణ కేవలం పాఠ్యపథకాలకే పరిమితమైంది. ఇదికూడా కేవలం మదింపు చేయదగిన ప్రవర్తనల సాధన కోసమే. ఈ దృష్టిననుసరించి పిల్లవాణ్ణి శిక్షణ పొందే ప్రాణిగానో లేదా మనం రూపొందించే కార్యక్రమాన్ని నిర్వహించే ఒక కంప్యూటర్‌గానో భావిస్తున్నాం. దీనివల్ల పాఠ్యాంశాలలోని జ్ఞానాంశాలను ముక్కలు ముక్కలుగా చేసి నేరుగా కంఠస్థం చేయించడం లేద ఏవో కొన్ని కృత్యాలు చేయించి, వారి జ్ఞాపకశక్తికి పరీక్ష పెట్టడం జరుగుతున్నది. బోధన అనేది హెర్బార్షియన్ సోపానాలకు పరిమితమై మూసపోసిన విధంగా మారుతున్నది. ఈ విధానం మారాలి.

బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లల ఆసక్తులు, స్థాయి, వైవిధ్యతలకు అనుగుణంగా కృత్యాలతో కూడి ఉండాలి. పిల్లలందరూ భాగస్వాములయ్యేలా సరైన వ్యూహాలతో కూడి ఉండాలి. విద్యార్థులు ఆలోచించే విధంగా, సవాళ్ళను ఎదుర్కొనే విధంగా ఏం అభ్యసిస్తున్నారో పిల్లలే గ్రహించే విధంగా, ఉపాధ్యాయులు పాఠ్యపథకాలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. తరగతిలో ఉపాధ్యాయుడు చెప్పినదాన్ని విద్యార్థులు తిరిగి అప్పచెప్పడం వంటివి నివారించబడాలి. విద్యార్థులందరూ పాల్గొనేలా వైయక్తిక

కృత్యాలు, జట్టు కృత్యాలు, మొత్తం తరగతి కృత్యాలు చోటుచేసుకునేలా పాఠ్యపథకాలు రూపొందించాలి. విద్యార్థులు స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి, వ్యక్తీకరణతోపాటు వారి మధ్య ప్రతిచర్యలు జరపడానికి అవకాశాలు కల్పించాలి.

ఉపాధ్యాయులు పిల్లలపై అధికారాన్ని చెలాయించే వారుగా కాకుండా వారి భిన్న వ్యక్తీకరణలను, అభిప్రాయాలను వినాలి, మన్నించాలి. ఇందుకు పాఠశాల, తరగతులు ఆటంకం కలిగించవన్న భద్రత ప్రపంచాన్నే మార్చవచ్చు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ వైయక్తిక, సామూహిక అనుభవాలను ఏ విధమైన భయసంకోచాలు లేకుండా ఇచ్చిపుచ్చుకోగలిగితే వారు తమ సొంతంగా అభ్యసించడానికి అవకాశాలు లభిస్తాయి. పిల్లలు తమకు లభించిన జ్ఞానాన్ని విమర్శనాత్మకంగా ప్రశ్నించగలగాలి. ఈ జ్ఞానం పక్షపాతధోరణితో కూడా పాఠ్యపుస్తకాలలోనిది కావచ్చు. తమ చుట్టూ ఉన్న సాహిత్య వనరుల్లోది కావచ్చు. పిల్లలు తాముపొందిన జ్ఞానాన్ని తమ పరిసరాలలోని అనుభవాలతోపోల్చి, వ్యాఖ్యానించడం ద్వారా విమర్శనాత్మక దృక్పథాన్ని అలవర్చుకునేలా చూడాలి. ఇందుకనుగుణంగా పాఠ్యపథకాలను / యూనిట్ పథకాలను రూపొందించుకోవాలి. మూసపోసిన విధానాలకే పరిమితమై బోధనాభ్యసనను అనాసక్తి కలిగించేదిగా మార్చకూడదు.

**ముగింపు :**

పిల్లలు సమాచార గ్రహీతలుగా పరిమితం కాకుండా జ్ఞాన నిర్మాతలుగా మారాలి. ఇందుకు దోహదపడే రీతిలో పాఠ్యపుస్తకాలు, బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన విధానాలు ఉండాలి. వీటిని సాకారంచేసేలా ఉపాధ్యాయుడు సౌకర్యకర్తగా, సహ అభ్యాసకులుగా నూతన పాత్ర పోషించాల్సి ఉంటుంది. పిల్లలకు కేవలం సమాచారం అందించే వ్యక్తిగా కాకుండా పిల్లలను ఆలోచింపజేయడం, సమకాలీన పరిస్థితులకు అన్వయించడం, విశ్లేషించడం, ప్రతిస్పందింపజేయడం వంటి వాటిపై దృష్టిపెట్టి అమలుపర్చాలి. తద్వారా ఆలోచనాత్మక, జ్ఞానాత్మక సమాజాన్ని నిర్మించగలం.

# 4 సాంఘికశాస్త్ర విద్యా ప్రమాణాలు - అవగాహన

సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాలు కేవలం సమాచారం అందించేవిగా కాకుండా పిల్లల్లో జ్ఞాననిర్మాణం చేయడానికి గానూ రూపొందించడం జరిగింది. బోధనాభ్యసన ప్రక్రియలో వ్యక్తిగత కృత్యాలు, జట్టు కృత్యాలు, చర్చలు, చిత్రాలు గీయడం, పట్టికలు చదవటం, విశ్లేషించటం వంటి వాటికి ప్రముఖ స్థానం ఇవ్వటం వలన తార్కిక ఆలోచన, విమర్శనాత్మక దృష్టి పెరుగుతుంది.

జాతీయ విద్యా ప్రణాళికా చట్రం - 2005, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం - 2011, సాంఘికశాస్త్రం ఆధారపత్రం ప్రతిపాదనల ఆధారంగా విద్యా ప్రమాణాలను రూపొందించారు. సాంఘిక శాస్త్రంలో నిర్ధారించిన ఆరు విద్యా ప్రమాణాలను సాధించుటకు వీలుగా తరగతి గది సమయాన్ని ప్రణాళిక బద్ధంగా విభజించి బోధనాభ్యసన కృత్యాన్ని నిర్వహించాలి. తరగతిలో అన్నీ ఒకే విధమైన ప్రశ్నలు కాకుండా విద్యా ప్రమాణాలను దృష్టి యందుంచుకొని వివిధ కోణాలలో విద్యార్థి ఆలోచించి, సమాధానం చెప్పడానికి అవకాశం కల్పించే ప్రశ్నలు ఇవ్వాలి. ఒకే ప్రశ్న పిల్లలందరినీ అడిగినా, వారు ఒక ప్రశ్నకు అనేక కోణాల నుండి సమాధానాలు చెప్పడానికి తరగతిలో అవకాశం ఇవ్వడం వలన మనం ఏ ఉద్దేశ్యంతో విద్యా ప్రమాణాలు నిర్ధారించుకున్నామో ఆ ఉద్దేశ్యం నెరవేరుతుంది. అన్ని విద్యా ప్రమాణాలు తరగతి గదిలోనే సాధించాలనే నియమం లేదు. ప్రాజెక్టులు, క్షేత్ర పర్యటనల ఆధారంగా, ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పిల్లల్లో కల్పించాలి. సమాచార సేకరణ సమయంలో కూడా ఈ కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమౌతాయి. వీటన్నింటికీ అవసరమైన విద్యా ప్రమాణాలను విపులంగా తెలిసికొందాం.

**విద్యా ప్రమాణాలు** (Academic Standards) :

I. విషయావగాహన (Conceptual Understanding)

II. ఇచ్చిన పాఠ్యాంశాన్ని చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం (Reading the text given, understanding and interpretation)

III. సమాచార నైపుణ్యాలు (Information gathering & processing Skills)

IV. సమకాలీన అంశాలపై ప్రతిస్పందించుట - ప్రశ్నించుట. (Reflection on Contemporary Issues and Questioning)

V. పటనైపుణ్యాలు (Mapping Skills)

VI. ప్రశంస / అభినందన - సున్నితత్వం. (Appreciation and Sensitivity)

## I. విషయావగాహన :

పాఠ్యాంశాల్లోని కీలక పదాలు, కీలక భావనలు విద్యార్థులు అర్థం చేసికొని వారికి అర్థమయిన అంశాలను చెప్పగలగాలి. కారణాలు చెప్పడం, వర్గీకరించటం, ఉదాహరణలు ఇవ్వడం, పోలికలు, భేదాలు తెలియజేయడం, విశ్లేషించటం, ఊహించటం, వివరించటం వంటివన్నీ విషయావగాహన క్రిందికి వస్తాయి.

- తాను చూసిన సంఘటన గురించి గానీ, తాను చేసిన పనిని గురించి గానీ తన సొంత మాటల్లో వివరించగల్గాలి.
- ఇతరులు చెప్పే వాటిని వింటూ సహేతుకంగా ఆలోచించ గల్గాలి.
- తాను పరిశీలించిన వివిధ అంశాల మధ్య గల సంబంధాలను గుర్తించ గల్గాలి.

- తాను పరిశీలించిన అంశాల యొక్క లక్షణాల ఆధారంగా వాటిని వర్గీకరించ గల్గాలి. వాటి మధ్యగల పోలికలు, భేదాలు చెప్పగల్గాలి.
- ఉపాధ్యాయుడు చెప్పిన పాఠ్యాంశం యొక్క ముఖ్యాంశాలను సొంతమాటల్లో చెప్పగల్గాలి.

**విషయావగాహన ఎలా పెంపొందించాలి?**

పాఠ్యాంతర ప్రశ్నలను జట్లలో చర్చించటం ద్వారా పిల్లల్లో విషయావగాహన పెంపొందుతుంది.

**ఉదా:** 1. యుద్ధ సమయంలో సైన్యానికి పటాలు ఏవిధంగా ఉపయోగపడతాయి? (8వ తరగతి పేజి నెం. 8). పిల్లలు ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు చర్చించి రాస్తారు.

2. నీలగిరి చెట్లు – తేయాకు, తోటలకు – అడవికీ మధ్య ఏమైనా తేడాలున్నాయా? తరగతిలో చర్చించండి: (8వ తరగతి పేజి 57) చర్చతో బాటు ఈ దిగువ కృత్యాలను నిర్వహించటం ద్వారా విషయావగాహన కలిగించవచ్చు.


- చిత్రాలను పరిశీలించడం, చర్చించడం.
- చదివి భావనలను అర్థం చేసుకోవటం
- వివిధ కార్యాలయాలు
  ఉదా: పోలీస్ స్టేషన్, న్యాయస్థానం వంటివి పరిశీలించి భావనలను అర్థం చేసుకోవటం.
- ప్రాజెక్టులు పూర్తిచేసి వాటి నివేదికను తరగతిలో సమర్పించటం.

**పిల్లలకు ఉపాధ్యాయుడు అందించాల్సిన సహాయం ఏమిటి? (ఉపాధ్యాయుని పాత్ర)**

- పిల్లలు సమాచారం కోసం ఉపాధ్యాయునిపై ఆధారపడే వాతావరణం సృష్టించరాదు. స్వయంగా నేర్చుకొనేలా ప్రోత్సహించాలి.
- భావనలు అవగాహన పొందేలా బోధనాభ్యసన ప్రక్రియలుండాలి.
- పిల్లలు ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి. జట్టు పనులను, చర్చలను ప్రోత్సహించాలి.
- పిల్లల అభిప్రాయాలు అసంబద్ధమైనవిగా ఉన్నప్పుడు వారిని నిరుత్సాహపరచరాదు. సరియైన పద్ధతిలో ఆలోచించేలా సలహా లివ్వాలి. అవసరమైతే తాను ఆ గ్రూపులో కొద్దిసేపు పాల్గొనాలి.
- క్షేత్ర సందర్శనలు, ఇంటర్వ్యూ, ప్రాజెక్టు పనులు పూర్తయిన తర్వాత వారి అనుభవాలు, అభిప్రాయాలు, విశ్లేషణలు ఆధారంగా వారు తయారు చేసిన నివేధికలను తరగతి గదిలో చెప్పించి ప్రోత్సహించాలి.

ఉదాహరణలుగా కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దామా?

1. ఏడవ తరగతిలో మీరు భూమధ్య రేఖా ప్రాంతం గురించి చదివిన దాన్ని బట్టి, దానికి ధృవ ప్రాంతంలో గల తేడాలు ఏమిటో చెప్పండి. (8వ తరగతి పేజి 48)
2. డబ్బు మార్పిడిని చెక్కులు ఏవిధంగా సులభతరం చేశాయి? (8వ తరగతి పేజి 88)
3. ప్రభుత్వం విధించిన భూమి శిస్తును గిరిజనులు కట్టలేక పోవడానికి గల కారణాలు ఏవి? (8వ తరగతి పేజి 58)
4. వివిధ భూస్వరూపాలను తెలిపి వాటిని శ్రేణి వారీగా వర్గీకరించడం : (8వ తరగతి)




[Process (Activities, Projects,
Roleplay, Discussion)]

విద్యార్థి memory లో Long memory, Short memory ఉంటాయి. Long memory లో ఉన్న విషయానికి Short memory ద్వారా మనం చర్చించే విషయాన్ని Connect చేయాలి. తరగతిలో చర్చించడం, విద్యార్థి భాగస్వామికావటం, Sharing ద్వారా జ్ఞాననిర్మాణం జరగటంవల్ల ఇది విద్యార్థి కేంద్రితమై అర్థవంతమైన అభ్యసనం (Meaningful learning) అనబడుతుంది. దీనిని Active learning అని అంటారు. దీనిలో విద్యార్థి పూర్తిగా పాల్గొంటారు.

**II. ఇచ్చిన పాఠ్యాంశాన్ని చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం :** పిల్లలు పాఠ్యాంశాన్ని చదివి. అందులోని విషయాన్ని అర్థం చేసుకొని వివిధ సందర్భాలలో పొందిన అనుభవం ఆధారంగా వ్యాఖ్యానం చేయగల్గాలి

ఉదాహరణ :

1. ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ఆహారధాన్యాల పంపిణీ ( ప్రజా పంపిణీ వ్యవస్థ) ని ప్రభుత్వమే నిర్వహిస్తూ వాటికి సబ్సిడీని కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. మనం గతంలో చూసిన విధంగా పేదల ఆహార భద్రతకు ఇది చాలా కీలకమైనది. (9వ తరగతి పేజి 130)

   - పేదలకోసం ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వడం సమంజసమేనా? ఎట్లు?

| |
|---|
| పిల్లలు తమ తమ అభిప్రాయాలను చెప్పే విధంగా ప్రోత్సహించాలి. ఇది ప్రశ్నకు జవాబివ్వడం అనేది కాకుండా వాస్తవస్థితులను అర్థం చేసుకొని వ్యాఖ్యానించేలా చేయాలి. |

2. గాలి, నీరు, నేలలో విషపూరితమైన పదార్థాలు కలవటం మరొక ఉదాహణ, అనేక పరిశ్రమలు లోహాలు, రసాయనాలు వినియోగిస్తాయి. వాటి నుంచి వ్యర్థాలు వాగులు, నదులలో కలుస్తాయి. దీనివల్ల నీటిలో రసాయనాల మోతాదు గణనీయంగా పెరిగిపోతుంది. నీటిలోని పాదరసం వంటి రసాయనాలు సూక్ష్మజీవుల శరీరాల్లోకి ప్రవేశిస్తాయి ఈ సూక్ష్మజీవులను చేపలుతిన్నప్పుడు అవి చేపల శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఈ చేపలను మనుషులు తిన్నప్పుడు వాళ్ళ ఆరోగ్యం దెబ్బతినే స్థాయికి పాదరసం చేరుకునే అవకాశం ఉంది.

   - పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థాల వల్ల ఇంకా ఏ ఏ అనర్థాలున్నాయో తెలియజేయండి. ఈ పేరాలోని విషయంతో మీరు ఏకీభవిస్తారా?

3. పేజి 99 మరియు 100 లలో (9వ తరగతి) గల అసీమ్ గురించి చదివిన తర్వాత మీకు కలిగిన అభిప్రాయమేమి? మీ సొంత మాటలలో రాయండి.

| |
|---|
| సాధారణంగా మనం వార్తా పత్రికల్లో వార్తలు చదివి, అర్థం చేసుకొని వెంటనే దానిపై ఒక వ్యాఖ్య Comment చేస్తాం. అలాంటిదే ఈ విద్యా ప్రమాణం. |

## III. సమాచార నైపుణ్యాలు

విద్యార్థుల పాఠ్యాంశాల అవగాహనకు అవసరమైన సమాచారాన్ని సేకరించాలి. సేకరించిన సమాచారాన్ని పట్టికల రూపంలో నమోదు చేయగలగాలి. విశ్లేషించాల్సిన అంశాలను దృష్టియందుంచుకొని పట్టికలో కాలమ్స్ నిర్ణయించుకోవాలి. సమాచార పట్టికలను పరిశీలించి, విశ్లేషించి వాటి ఆధారంగా నిర్ధారణ చేసి నివేదికలు రూపొందించాలి. దీని ద్వారా ఇతరులతో మాట్లాడటం. అవసరమైన విధంగా ప్రశ్నించడం, జట్టులో కలిసి పనిచేయడం వంటి లక్షణాలు పిల్లలకు అలవడతాయి.

ప్రాజెక్టుపనులు కూడా సమాచార నైపుణ్యాలలో భాగంగా నిర్వహించాలి. పిల్లలు సహజ వాతావరణములో తమంతట తాముగా అన్వేషించి, పరిశోధించి అవసరమగు సమాచారం సేకరించి ఒకే విషయం పట్ల గానీ, అంశం పట్ల గానీ అవగాహన ఏర్పరచుకొని నిర్ధారణకు రావడానికి దోహదపడే కృత్యాలనే ప్రాజెక్టులు అని పిలుస్తారు.

సమాచార నైపుణ్యాలలోని సేకరణ, నమోదు, విశ్లేషణ, నిర్ణయానికి రావడం, నివేదిక తయారీ, నివేదికను సమర్పించుట అనే విషయాలు ఒక అంశానికి వర్తింపజేసిన అది ప్రాజెక్టుగా భావించాలి.

సమాచార నైపుణ్యాలలో దిగువ విధంగా చేయించవచ్చు.


ఉ॥ 1. Text to table 2. Table to questions 3. Table to Graph 4. Graph to Questions 5. Graph to table 6. Graph to Text 7. Text to Graph... వీటిలో ఏది తగినది అనిపిస్తే దానికి సంబంధించిన కృత్యం ఇవ్వవచ్చు.

ఉదా :-

1. మీ ప్రాంతంలో పండే పంటల జాబితా తయారు చేసి వాటిని ఈ కింది పట్టికలో పొందుపరచండి.

| క్ర.సం. | పంటలు రకాలు | పంటలు |
|---|---|---|
| 1. | ప్రధాన పంటలు | |
| 2. | పప్పు ధాన్యాలు | |
| 3. | నూనె గింజలు | |
| 4. | ఆహారేతర పంటలు | |

**2. ఆహార ధాన్యాల ఉత్పత్తి**




**పై గ్రాఫ్‌ను పరిశీలించి దిగువ ప్రశ్నలకు సమాధానం రాయండి.**

1. 2000-01 నుండి 2010-11 వరకు ఆహారధాన్యాల ఉత్పత్తి ఎన్ని మి.టన్నులు పెరిగింది?

2. ఏ దశాబ్దంలో పెరుగుదల శాతం ఎక్కువగా ఉంది?

3. 1950-51 నాటి ఉత్పత్తికి 2010-11 నాటి ఉత్పత్తి దాదాపు ఎన్నిరెట్లు పెరిగింది?

| |
|---|
| ప్రశ్నలు అన్నీ ఒకే అంశాన్ని ప్రతిబింబించేలా ఉండకూడదు. విభిన్న కోణాలు స్పృశించేలా ప్రశ్నలుండాలి. విశ్లేషణకు అవకాశం ఇవ్వాలి. |

**3. చేనేత యూనిట్లలో మార్పు**

**చేనేత యూనిట్లలో మార్పు**

| రాష్ట్రం | 1988 | 2009 |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 5,29,000 | 1,24,700 |
| గుజరాత్ | 24,000 | 3,900 |
| కర్నాటక | 1,03,000 | 40,500 |
| మహారాష్ట్ర | 80,000 | 4,500 |
| మధ్యప్రదేశ్ | 43,000 | 3,600 |
| పంజాబ్ | 22,000 | 300 |
| తమిళనాడు | 5,56,000 | 1,55,000 |

పై పట్టికను పరిశీలించి దిగువ ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. ఏ రాష్ట్రంలో చేనేత యూనిట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది?

2. 1988లో అత్యధిక, అత్యల్ప యూనిట్లు గల రాష్ట్రాలేవి?

3. 2009 నాటికి ఏ రాష్ట్రంలోనూ యూనిట్ల సంఖ్య పెరుగలేదు. ఎందుకో తెలుసా? విశ్లేషించుము.

## IV. సమకాలీన అంశాలపై ప్రతిస్పందించుట - ప్రశ్నించుట

విద్యార్థులు పాఠ్యాంశాలను విమర్శనాత్మకంగా అవగాహన చేసుకొని, జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను పరిష్కరించుకోగలిగిన జ్ఞానం పొందవలసి యుంటుంది. కాబట్టి తరగతి గదిలో పాఠ్య విషయానికి మాత్రమే పరిమితం కాకుండా సమకాలీన అంశాలను విశ్లేషించడం ద్వారా విద్యార్థి ఫలితాలను రాబడతాడు. జరుగబోయే ఫలితాలను ఊహిస్తాడు. పాఠ్యాంశంలోని విలువలను అన్వయించుకుంటాడు. వివిధ సమకాలీన అంశాలపై తనకు గల వైఖరిని వ్యక్తం చేయగల్గుతాడు.

పాఠ్యాంశమును నిత్య జీవితానికి సంబంధించిన అంశాలతో జోడించాలి. పాఠాన్ని నేర్చుకుంటున్న సమయంలో ఆ కాలానికి సంబంధించిన సంఘటనలను తరగతిగదిలో చర్చించాలి. పిల్లలు ప్రశ్నించేలా చేయాలి. ఒక ప్రాంత ప్రజల జీవన విధానం గురించి చర్చించేటప్పుడు తమ ప్రాంత ప్రజల జీవన విధానంతో పోల్చమనడం ద్వారా సమకాలీన అంశాలు ప్రశ్నించబడతాయి. మయన్మార్ దేశంలో ప్రజాస్వామ్య ఉద్యమం గురించి చర్చించేటప్పుడు మన దేశంలో ప్రజాస్వామ్యం గురించి, ఇతర ఉద్యమాల గురించి ప్రతిస్పందించే విధంగా, పిల్లలకు ప్రశ్నించే అవకాశం కల్పించి లోతుగా ఆలోచించే విధంగా చేయాలి.

ఉదా॥ 9వ తరగతి 24వ పాఠం "రోడ్డు భద్రతా విద్య" బోధన జరిపేటప్పుడు హైదరాబాద్ నగరంలోని ప్రమాదాల గురించి చర్చిస్తాడు. ఆ సమయంలో "ఈ రోజుల్లో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుటకు కారణాలు ఏమై ఉంటాయి? అనే ప్రశ్నవేసి చర్చింపజేయాలి. ఇతర ప్రశ్నలు పిల్లలు వేసేలా ప్రోత్సహించాలి.

2. 9వ తరగతి 15వ పాఠం "పారిశ్రామికీకరణ – సామాజికమార్పు" బోధించేటప్పుడు బాల కార్మికుల పరిస్థితి గురించి చర్చిస్తాం (పేజి193). బాల కార్మికుల పరిస్థితిపై పిల్లల్ని ప్రశ్నించమనాలి. వారి స్థానిక ప్రాంతాలలో బాల కార్మికులు ఉంటే వారి గురించి మాట్లాడమనాలి.
3. 8వ తరగతి – 7వ పాఠం "ద్రవ్యం – బ్యాంకింగ్" బోధన చేసేటప్పుడు రహీం,లీల, శాంతల గురించి మాట్లాడేటప్పుడు అలాంటి పరిస్థితులున్నవారు మీ ప్రాంతాల్లో ఉన్నారా? అని ప్రశ్నించి, వారి పరిస్థితులపై చర్చింపచేయాలి.

## V. పటనైపుణ్యాలు

సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తకాలలో వివిధ చిత్రాలు, పటాలు ఇవ్వబడినాయి. పటాలు అందం కోసం పొందుపరచినవి కావు వాటిని చదవడం కోసం, చర్చించడం కోసం, వాటి గురించి మాట్లాడటం కోసం ఇవ్వబడినాయి. దీనితో విషయం సులభంగా అర్థమౌతుంది.

**పటనైపుణ్యాలలో ప్రధానంగా మూడు అంశాలుంటాయి.**

1. పటాలు గీయడం (Map Drawing)
2. పటాలు చదవడం (Map Reading)
3. పటాలలో వివిధ అంశాలను గుర్తించటం (Map Pointing)

**పటనైపుణ్యాలు పెంపొందించడం ఎలా?**

1. పటాలు పాఠ్యపుస్తకంలో వివిధ రంగుల్లో ఇవ్వడమైనది. వాటిని చదివి వివిధ ప్రదేశాలకు సంబంధించిన అంశాలను రాయించవచ్చు.
2. నదులు, రవాణా మార్గాలు, వివిధ ప్రదేశాలను గుర్తింపజేయవచ్చు.
3. గుర్తులు, సంకేతాలను బట్టి (పంటలు, ఖనిజాలు, పరిశ్రమలు మొ॥) విశ్లేషణలు చేయించవచ్చు.
4 రాజకీయ పటాల విశ్లేషణ – సరిహద్దులు, సరిహద్దు జిల్లాలు / రాష్ట్రాలు : సామ్రాజ్యాల విస్తరణ వంటి వాటిని గుర్తించటం, చదవటం చేయించవచ్చు.
5. అట్లాస్, గోడపటాల ద్వారా రకరకాల కృత్యాలు చేయించవచ్చు.

ఉదాహరణలు:

**పటాలు గీయడం :** 1. భారతదేశం ఔట్ లైన్ పటం గీయండి.
2. గ్రామం/పాఠశాల పటం గీయడం.

**పటాలను చదవటం :**

ఉదా: 9వతరగతిలోని 12వ పాఠం పేజి నెం. 145 లోని "ఇటలీలోని ప్రాంతాలు పటం పరిశీలించండి.

a) ఈ పటములో కనిపిస్తున్న దీవులేవి?

b) ఇటలీలోని వివిధ నగరాలు, పట్టణాల పేర్లు తెలుపుము?

**పటంలో గుర్తించడం :**

ఉదా : భారతదేశ పటంలో దిగువ సూచించిన ఇనుము - ఉక్కు కర్మాగారాలను గుర్తించుము.

1. భద్రావతి 2. భిలాయ్ 3. రూర్కెలా 4. బొకారో 5. జంషెడ్‌పూర్.

## VI. ప్రశంస / అభినందన - సున్నితత్వం

పాఠ్యబోధన ద్వారా పిల్లల్లో "తోటి వారితో కలిసి పనిచేయటం, ఇతరుల అభిప్రాయాలను గౌరవించటం, స్వేచ్ఛగా ప్రశ్నించటం, అవసరమైన వారికి సహాయం చేయడం వంటి లక్షణాలు, వైఖరులు అలవర్చడం ద్వారా ప్రశంస / అభినందన అనే విద్యా ప్రమాణం సాధించగలం.

**ఈ విద్యా ప్రమాణం పెంపొందించడానికి ఉపాధ్యాయులు ఏమేం చేయాలి?**

- పిల్లలచే వివిధ సమస్యలపై తమ స్పందనను తెలిపే నినాదాలు, పోస్టర్లు, కరపత్రాలు తయారు చేయించవచ్చు.
- వివిధ సమస్యలపై విశ్లేషణ చేస్తూ పత్రికలకు, అదికారులకు లేఖలు రాయించవచ్చు.
- స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, దేశ సమైక్యత వంటి రాజ్యాంగ పరమైన విలువలు కూడా పెంపొందించాలి.
- సభలు, సమావేశాల్లో, పాల్గొనేలా ప్రోత్సహించాలి.
- జీవన నైపుణ్యాలు పెంపొందించాలి.
- వివిధ వ్యక్తులు, తోటి వారు చేసిన మంచి పనులను ప్రశంసించగలిగే వైఖరిని నిర్మాణం చేయాలి.
- దయ, ప్రేమ, వంటి మానవతా విలువలు పిల్లల్లో కల్పించాలి.
- పాఠం చర్చించేటప్పుడు పిల్లల్లో సంబంధిత images రూపం దాల్చుతాయి. ఆ images గురించి మౌఖికంగా చెప్పించాలి. లేదా రాయించాలి.

ఉదా॥ ప్రశ్నలు

1. కళాకారులను మనం ఏ విధంగా గౌరవించాలి?
   ఈనాడు కళకారుల స్థితి ఎలా ఉంది? (8వ తరగతి - పాఠం 21)
2. మీ ప్రాంతంలో మత సామరస్యం సాధించడానికి ఏమి చేయాలో తెలియజేస్తూ ఒక కరపత్రం తయారుచేయండి. (8వ తరగతి పాఠం 20)
3. 'సమానత్వం' ప్రధాన భావనగా 2 నినాదాలు తయారు చేయండి. (8వ తరగతి - పాఠం 13)

విద్యా ప్రమాణాలు కేవలం పరీక్షల సమయంలో, ప్రశ్నాపత్రంలో ఇవ్వడానికి, విద్యార్థిని ప్రశ్నించడానికి ఉద్దేశించినవికావు. ప్రతి పాఠం బోధించేటప్పుడు ఆ పాఠంలో ఎక్కడెక్కడ ఏయే విద్యా ప్రమాణాలు పొందుపరచబడి ఉన్నాయో ఉపాధ్యాయుడు గుర్తించి, వాటిని దృష్టి యందుంచుకొని పాఠం బోధించాలి. సమకాలీన అంశాలు ఏ సందర్భంలో చర్చించాలో ముందుగా ఆలోచించుకోవాలి. పటనైపుణ్యాలు, సమాచార నైపుణ్యాలు తరగతిగదిలో ఏయే అంశాలపై దృష్టి ఉంచాలో, అవి ఏ సమయంలో నిర్వహించాలో ప్లాన్ చేసుకోవాలి. పాఠం పూర్తయ్యేసరికి ఆ పాఠంలోని ఆరు విద్యా ప్రమాణాలు పూర్తిగా చర్చించబడాలి. విద్యార్థి ఏం నేర్చుకున్నాడో తెలుసుకోవడానికి మూల్యాంకనం ఉద్దేశింబడలేదు. మూల్యాంకనం విద్యార్థి నేర్చుకోవడానికి దోహదపడేది అనే విషయం మరువరాదు.

# 5 సాంఘికశాస్త్ర స్వభావం - నూతన పాఠ్యపుస్తకాల ప్రత్యేకతలు

నూతన సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాల రూపకల్పనకు NCF-2005, RTE- 2009, APSCF-2011, సాంఘికశాస్త్ర ఆధారపత్రాలను పరిగణలోకి తీసుకొన్నారు.

సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాలు పిల్లలకు సమాచారాన్ని అందించడానికి బదులుగా సమాచారాన్ని అర్థంచేసుకోవడానికి, విశ్లేషించడానికి విభిన్న అవకాశాలు, అనుభవాలు కల్పించడం ద్వారా పిల్లలు తమ సొంత భావనలను పెంపొందించుకోవడమే కాకుండా బోధనలో మార్పులు చోటుచేసుకున్నాయి. తరగతిగదిలో ఎంత ఎక్కువ వైవిధ్యాలు, సామాజిక నేపథ్యాలు ఉంటాయో పిల్లలు అంత ఎక్కువగా అనుభవాలు పొందగల్గుతారు. కాబట్టి నూతన పాఠ్యపుస్తకాలలో స్థానికవనరులు, స్థానిక చరిత్ర, అనుభవాలు, కేస్‌స్టడీలకు చోటు కల్పించడం జరిగింది. పాఠ్యపుస్తకాలలోని పాఠాలు పిల్లలు ఆలోచించడానికి, పాల్గొనడానికి, చర్చించడానికి, ప్రశ్నించడానికి అవకాశం కల్పిస్తున్నాయి. కాబట్టి పిల్లల్లో జ్ఞాన నిర్మాణం జరగడానికి అవకాశం ఇస్తున్నాయి.

## A) సాంఘికశాస్త్ర స్వభావం

వివిధ రకాలైన సబ్జెక్టులు అనగా చరిత్ర, భూగోళం, రాజనీతిశాస్త్రం, ఆర్థికశాస్త్రం మొదలగు వాటితో సాంఘికశాస్త్రం ఏర్పాటైంది. ఐతే వీటిలో ప్రతి సబ్జెక్టుకూడా దానికి చెందిన ప్రత్యేకమైన పద్ధతులను దృక్పథాలను కలిగిఉన్నది. ఆయా సబెజక్టులకున్న ప్రత్యేకతలను గౌరవిస్తూనే, వివిధ సబ్జెక్టుల మధ్య అంతర్గత సంబంధం ఉండే విధానాలను అభివృద్ధిపరచడం అవసరం. ఇది వివిధ సామాజిక అంశాలను సమగ్రంగా అర్థంచేసుకోడానికి దారితీయాలి. ఈ కారణాల దృష్ట్యా జాతీయ ఫోకస్ గ్రూపు వివిధ సబ్జెక్టుల మధ్య అంతర్గత సంబంధం ఉండే విధాన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ వివిధ అంశాలను జోడిస్తూ రూపొందించాలని ప్రతిపాదనచేసింది.

సాంఘిక శాస్త్రంలోని విభిన్న విభాగాల మధ్య సంబంధం ఏర్పడడానికి ముందుగా ఆయా విషయాలను మొత్తంగా అర్థం చేసుకోవడం అవసరం. సాంఘిక శాస్త్రం మానవ జీవితంలో జరిగే వివిధ సామాజిక దృగ్విషయాలను వివిధ కోణాలలో అర్థం చేసుకోడానికి ఉపకరిస్తుంది. అంతే కాకుండా సామాజిక ధర్మాలను మరియు విధానాలను అర్థం చేసుకోడానికి కూడా ఉపకరిస్తుంది. అందువల్ల సాంఘిక శాస్త్రం అధ్యయనం ద్వారా ఏమి పెంపొందించాలనుకుంటామో వాటి నుండి దూరం కాకుండా ఉండడానికి వీలుకలుగుతుంది. ఇదే సందర్భంలో సామాజిక విషయాలను అర్థం చేసుకోవడంతో పాటు ప్రపంచాన్ని విస్తృత దృష్టితో చూడడాన్ని నేర్పుతుంది. అందువల్ల సున్నితంగా ఆలోచించడం, సహానుభూతి కలిగి ఉండడాన్ని పెంపొందిస్తుంది.

సాంఘికశాస్త్రం సమాజాన్ని ఖచ్చితమైన పద్ధతులద్వారా అధ్యయనం చేస్తుంది.ఇది పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా ఉంటుంది. పరిమాణాత్మక విధానంలో వివిధ అంశాలను అధ్యయనం చేసిన తర్వాత సాంఖ్యకశాస్త్ర పద్ధతులను ఉపయోగించి నిర్దిష్టమైన, విశ్వసనీయమైన ఫలితాలను సాధారణీకరణాలను సృష్టించడంద్వారా పరిమాణాత్మకమైన ఆధారాలతో సామాజిక దృగ్విషయాలను అధ్యయనం చేస్తారు. గుణాత్మక విధానంలో సామాజిక దృగ్విషయాలను ప్రత్యక్ష పరిశీలనలద్వారా, వ్యక్తి తన ప్రత్యక్ష, పరోక్ష ప్రతిచర్యలద్వారా, నివేదికలను ముద్రిత సామగ్రిని విశ్లేషించడం ద్వారా అధ్యయనం చేస్తారు.

సాంఘిక శాస్త్ర విషయాలను అధ్యయనం చేయడానికి ఉపయోగించే పద్ధతులలో సర్వేలు విభిన్న వర్గాలకు చెందిన పరస్పర విశ్లేషణలు, అధ్యయనాలు పెద్ద మొత్తంలో నమూనాలు సేకరించి ప్రతి విభాగాన్ని లోతుగా నిశితంగా విశ్లేషించడం,

కాలానుగుణంగా వస్తున్న మార్పులను పోల్చుకోవడం సమకాలీన అంశాలను మానిటరింగ్ చేయడం, చారిత్రక డాక్యుమెంట్ల ద్వారా వాస్తవాలను రాబట్టడం ముఖ్యమైనవి. ఈ విధమైన పద్ధతులన్నీ సాంఘికశాస్త్ర విద్యాప్రణాళికలో చోటుచేసుకొన్నాయి.

సాంఘికశాస్త్రాలు కోరిన విధంగానే ఉండేలా చేయడాన్ని (Determinism), మూసతత్వాన్ని ఒకేరకంగా ఉండడాన్ని (Typification), తరతరాలుగా ప్రోత్సహించింది. భౌగోళికంగా ఒకే రకంగా ఉండడం (Geographic determinism), లేక ఆర్థికంగా ఒకేవిధంగా ఉండడం (Economic determinism), సమాజాలను మరియు దేశాలను మూసపోసిన విధంగా తయారుచేయడం సాంఘికశాస్త్ర బోధనలో ప్రత్యేకమైన / అధికారకమైన ముద్రగా (Hallmark), ఉంటున్నది. దీనిని తొలగించాల్సిన అవసరం ఉంది. దీనిస్థానంలో విశాలదృక్పథాన్ని బహుళ సకారణాత్మక వివరణలు అనుమతించాలి. ఉదాహరణకు 'అడవులు' అనే అంశం భూగోళ శాస్త్రంలో విషయంగానే చర్చించబడుతుంది తప్ప దానిని చారిత్రక, పౌరసంబంధ, ఆర్థిక అంశాల దృష్టిలో చూడడం కానీ విశ్లేషించడం గానీ జరగడం లేదు అందువల్ల విస్తృతంగా ఆలోచించడానికి వీలుగా సాంఘిక శాస్త్ర విభాగాల మధ్య ఉన్న అడ్డుగోడలు ఛేదించాలి. సమన్వయ పరిచే చర్యలకు శ్రీకారం చుట్టాలి.

సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన మరొక కీలకమైన విషయమేమిటంటే సామాజికంగా జరిగే మానవ ప్రతిచర్యలను బహుళ దృష్టి కోణాలలో చూడాలి తప్ప ఏదో ఒక కోణంలో మాత్రమే చూడడానికి, అర్థం చేసుకోవడానికి వీలుకాలేదు. ఇది ప్రజాస్వామ్య నియమాలను లోబడి జరగాలి. బహుళ దృక్పథ విధానాలు సమగ్రంగా, అర్థవంతంగా ఉంటాయి. ఇవి వివిధ వనరులను గుర్తించడానికి, వినియోగించడానికి తోడ్పడుతుంది. విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మక ఆలోచనలను వృద్ధిపరుస్తుంది.

ఏ సాంఘిక దృగ్విషయమైనా వ్యక్తుల పైన వివిధ రకాలుగా ప్రభావాన్ని చూపుతుంది. అయితే ఇది వ్యక్తి సమాజంలో తాను ఉన్న స్థానంపై ఆధారపడి ఉంటుంది. అంటే ద్రవ్యోల్బణం అయితేదాని ప్రభావం ఆయా వర్గాలపై వేరువేరు రకాలుగా ఉండడాన్ని గుర్తిస్తాం. అందువల్ల విభిన్న దృష్టికోణాలలో ఆలోచించడం బహుళ రీతుల్లో ప్రతిస్పందిచడం అవసరం. సంపూర్ణ మైనదిగా ఉండివివిధ వనరులను సమన్వయించుకుని విశ్లేషించడానికి, విమర్శనాత్మకంగా ఆలోచించడానికి ఉపయోగపడుతుంది.

సాంఘిక శాస్త్రం అంశాలను మరింత లోతుగా విచారించినప్పుడు మాత్రమే సాంఘిక శాస్త్ర విషయ స్వభావాన్ని నిశితంగా పరీక్షించడానికి దాని స్వరూపానికి ఒక స్పష్టత చేకూర్చడానికి వీలుగలుగుతుంది. అంటే సాంఘిక శాస్త్రాలను సంస్కరించడమనేది ఆయా సాంఘిక శాస్త్ర విభాగాల చారిత్రక మూలాలను అర్థంచేసుకోవడం, తులనాత్మకంగా విశ్లేషించడం తద్వారా వివిధ సాంఘిక శాస్త్ర విభాగాల మధ్య సంబంధాన్ని బలపరచడానికి ఒక విషయాన్ని అన్ని విభాగాల దృష్టి కోణంలో చర్చించడానికి వీలుకలుగుతుంది.

సాంఘిక శాస్త్రంలోని విభిన్న విభాగాలు అన్నీ పైన తెల్పిన ఉమ్మడి లక్షణాలను పొందినపుడు ఒక దానికొకటి సంబంధం కలిగిన అంశాలుగా మారినపుడు విభిన్న బోధనా పద్ధతులు, విభిన్న బోధనావ్యూహాలు అభివృద్ధి చెందుతాయి. ఈ విధంగా సాంఘిక శాస్త్రం అనే పేరు మీద అందులోని విభిన్న విభాగాలను సమన్వయపరచడం నూతనంగా వర్గీకరించడం ద్వారా సాంఘిక శాస్త్రాన్ని కొత్త కోణంలో చూడడానికి వినియోగించడానికి వీలుకలుగుతుంది.

**చరిత్ర:**

చరిత్ర కేవలం కాలక్రమేణా వచ్చే మార్పులను అవగాహన పరచడమే కాకుండా, ఆ మార్పులు ఏ ఏ సామాజిక వర్గాలను ఏవిధంగా ప్రభావితం చేస్తాయో, ఆ మార్పులు తర్వాత తరాలకు ఎలా అందించబడతాయో తెలిపే శాస్త్రం. చరిత్రలోని అంశాలను మనకు తెలియని అంశాలకు లభించిన ఆధారాలు, సమాచారాలను విశ్లేషించడం ద్వారా వర్తమానానికి అన్వయించుకోడానికి చరిత్ర దోహదం చేస్తుంది. అందువల్ల చరిత్ర పట్ల చర్చకు, అవగాహన పెంపొందించడానికి

వీలుకలుగుతుంది. తద్వారా ప్రతి అంశం వెనుక మంచిచెడులుంటాయని గ్రహించగలం. వాటిని నిర్ధారించేందుకు ఉన్న ఆధారాలు, సమాచారాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించటానికి అందరికీఆమోదయోగ్యమైన పద్ధతులను వినియోగించటం జరుగుతుంది. అందువల్ల చరిత్ర బోధన రెండు అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. అవి. 1. కాలక్రమేణా వచ్చే మార్పులు 2. ఎందుకు? ఎలా? చరిత్రను విభిన్న కోణాలలో రాశారు?

చరిత్రను బోధించేటపుడు స్థానిక, ప్రాంతీయ, దేశీయ, ప్రాపంచిక అంశాల పట్ల సమతుల్యం పాటించాలి. స్థానిక చరిత్రకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాల్సి ఉండగా, స్థానిక వర్గాల ఆధిపత్యానికి భయపడి వాటిని చరిత్రలో చేర్చడానికి వెనుకంజ వేస్తున్నారు. ఆ భయాల నుండి బయటకు వచ్చి, చరిత్రను విద్యార్థులు అధ్యయనం చేయాల్సిన సమయం వచ్చింది. ఆ రకంగా మనకు చారిత్రక అంశాలను విశాల ధృక్పథంతో చర్చించటానికి, వివిధ సామాజిక వర్గాలు, వాటి మధ్య గల సంబంధాలు, ఒప్పందాలు, సాంకేతిక అంశాలు, సంస్కృతి, సాంప్రదాయాలను ఆధునిక రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల కోణంలో చర్చించడానికి అవకాశం కలుగుతుంది.

**భూగోళ శాస్త్రం:**

సాధారణంగా సామాజిక దృగ్విషయాల్లో స్థలాలకు చెందిన ఆవర్తన క్రమాలను అర్థంచేసుకోవడం, స్థలానికి సంబంధించిన వైవిధ్యాలను వివరించడానికి భూగోళశాస్త్రం ఉపయోగపడుతుంది. ప్రకృతి, మానవుడు (సమాజం) మధ్యగల సంబంధాలను ఇది అధ్యయనం చేస్తుంది. గతంలో నుండే సమాజానికి ప్రకృతికి గల సంబంధాలు సహజ పరిసరాలలో దృఢమైనవిగా చూడబడుతున్నాయి. దేనికదే ప్రత్యేకమైనదిగా భావించబడుతున్నాయి. కానీ శతాబ్ధకాలంగా ఈ ధోరణిలో మార్పులు వస్తున్నాయి. ప్రకృతి – సామాజిక సంబంధాలపై ప్రశ్నించడం మొదలయింది. ప్రకృతి వల్ల సమాజం వల్ల ప్రకృతి మార్పులకు గురికావడమే ప్రధాన కారణం. అంటే సమాజంలోని మానవ చర్యలు ప్రకృతికి నష్టం కలిగించేవిగా ఉండడం వల్ల అనేక ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో దేశాలు, ప్రాంతాల మధ్య అంతరాలు తొలగిపోయి ప్రపంచమంత ఒక గ్రామంగా మారుతున్న సందర్భంలో సమాజం – ప్రకృతి మధ్య సంబంధాలను నూతన యుగంలో అర్థం చేసుకోవడం అవసరం. ప్రపంచీకరణ వల్ల ప్రాంతాల మధ్య అంతరాలు తొలగిపోతున్నప్పటికీ కొత్త కొత్త ప్రాంతీయ అసమానతలు, వైవిధ్యాలు తలెత్తుతున్నాయని భౌగోళికశాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. నగరీకరణల వల్ల గ్రామీణ వనరులు పట్టణాలకు తరలి నగరవాసులకు అందుబాటులో ఉండగా, గ్రామీణ ప్రాంతాలు వెనకబడిపోవడం జరుగుతున్నదని విశ్లేషిస్తున్నారు. భౌగోళిక వనరులు వాటి వినియోగం, వనరుల పంపిణీ మొదలైన వాటి దృష్ట్యా భూగోళం సాంఘీకశాస్త్ర విభాగంగా సమకాలీన సమాచారంతో పరిపుష్టిపొంది మరింత సమర్థవంతంగా రూపొందించబడాలి.

సహజ ప్రాకృతిక వాతావరణానికి, మానవ సమాజానికి గల అంశాల సంబంధాలు, విభిన్న సమాజాల మధ్య సంబంధాలను, వివిధ ప్రాంతాలలో విస్తరించి ఉన్న సమాజాల మధ్య సంబంధాలు గుర్తించడం ద్వారా సాంఘికశాస్త్రాల నిర్మాణం జరగాలి. ఇది పిల్లల స్థానిక ప్రపంచానికి విశ్వప్రపంచానికి గల సంబంధాలను అర్థం చేసుకోడానికి తోడ్పడుతుంది.

భౌగోళికంగా విభిన్న ప్రాంతాలను, ప్రదేశాలను పటాలలో గుర్తించడంలో పిల్లలకు శిక్షణ నివ్వడమనేది భూగోళశాస్త్రాల ముఖ్యకర్తవ్యంగా గుర్తించాలి. అయితే సాంఘికశాస్త్ర అధ్యయనం అంటే కేవలం పటంలో ప్రదేశాలను గుర్తించడం మాత్రమే కాదు ఆయా ప్రదేశాల సామాజిక సందర్భాలను, చారిత్రక నేపథ్యాలను కూడా అర్థం చేసుకోవాలి. పటాలు గీయడం, గుర్తించడం, అధ్యయనంలో ఈ విషయాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. అంటే ఈ భూగోళం మీద విభిన్న ప్రాంతాలను గుర్తించడమంటే ఆయా ప్రాంతాలలోని ప్రజలు, వారి జీవన విధానం, వారి అవసరాలు వారికున్న వనరుల మొదలైన వాటన్నింటిని అర్థంచేసుకోవడమనే దిశగా మార్పుకు నాంది పలకాలి.

**సామాజిక – రాజకీయ జీవనం :**

దీనిని సాంఘికశాస్త్ర విద్యా ప్రణాళికలో ఒక కొత్త విషయంగా పేర్కొన్నారు. రేపటి పౌరులకు వారు నివసిస్తున్న ప్రాంతాలు / సహజంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను పరిస్థితులను ఎదురవుతున్న సవాళ్ళను చర్చించేందుకు, అర్థం చేసుకునేందుకు పిల్లలను సిద్ధం చేస్తుంది. అంటే ఇది సామాజిక, ఆర్థిక, రాజనీతి శాస్త్రాల సమన్వయంగా కూడా కనిపిస్తుంది. ఇది సమాజంలో ఉన్న బహుళత్వం, సమానత్వం, న్యాయం మొదలైన అంశాలను యథాతథంగా చర్చించడానికి వీలు కలిగిస్తున్నది. ఇది సాంఘిక, రాజకీయపరమైన మౌలిక విషయాలను వాటి విశ్లేషణలను తెలుపడానికి వేగవంతం చేయడం ద్వారా, రాజ్యాంగబద్ధంగా మానవ విలువలను పెంపొందించడానికి ప్రయత్నిస్తున్నది.

విలువలను బోధించడానికి సాధారణ పద్ధతులను, బోధనా విధానాలను ఉపయోగించడం వల్ల అది సరయిన ఫలితాన్నివ్వదు. పైగా విద్యార్థులలో విలువల పట్ల అలసత్వాన్ని పెంపొందిస్తుంది. ఏ విలువలనైనా సమాజంలో ఎదురవుతున్న, ప్రత్యక్షంగా కనిపిస్తున్న సన్నివేశాల పరంగా చర్చించినపుడు మాత్రమే వాటి పట్ల ఒక వైఖరి పెంపొందించవచ్చు. సమాజానికి దూరంగా, వాస్తవాలను కప్పిపుచ్చి ఆదర్శాలు వల్లించడం ద్వారా విలువల బోధన, బోధనకే పరిమితమవుతుంది తప్ప పిల్లలలో ఆచరణాత్మక మార్పుకు సహాయపడదు.

**ఆర్థికశాస్త్రం, రాజనీతిశాస్త్రం, సామాజికశాస్త్రాలు :–** ఈ సబ్జెక్టులను ప్రత్యేకంగా చదువుకోడానికి వీలుగా హయ్యార్ సెకండరీ స్థాయిలో వేరువేరుగా ప్రవేశపెట్టారు. ఈ సబ్జెక్టులను వేర్వేరుగా చదువుకోడానికి అవసరమైన ప్రాథమిక అవగాహన, భావాలను హయ్యర్ సెకండరీ అంటే ఇంటర్మీడియట్ స్థాయిలో అందించారు. ఇది మరింత విస్తృతంగా డిగ్రీ స్థాయిలో చదువుకోడానికి వీలు కల్పిస్తుంది.

## B) సాంఘికశాస్త్ర ప్రస్తుత విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకాల విశ్లేషణ

ప్రస్తుతం సాంఘికశాస్త్రాలను ప్రాథమిక స్థాయిలో ఐదవ తరగతి వరకు పరిసరాల అధ్యయనంగానూ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయిలో ప్రత్యేక పాఠ్య విషయంగానూ బోధిస్తున్నారు. ఇది ఒక పాఠ్యవిషయంగా బోధిస్తున్నప్పటికీ దీనిని భూగోళం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం అనే నాలుగు ఉప విభాగాలుగా బోధిస్తున్నారు. సెకండరీ స్థాయిలో సామాజిక శాస్త్రాన్ని ప్రత్యేక విషయంగా బోధించడం జరుగుతున్నది.

చాలాకాలంగా సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాలను రూపొందించడంలో విశేషంగా కృషి జరుగుతున్నది. పాఠ్యవిషయాలను ఉపాధ్యాయులు తరగతి గదులలో సమర్థవంతంగా బోధిస్తున్నారు. అయితే ఈ పాఠ్యపుస్తకాల ద్వారా సనాతన ఆలోచనలు, సామాజిక అంతరాలు తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ ఆ ప్రయత్నాలు నెరవేరడం లేదు. ఇంకా సమాజంలో కుల, మత, లింగ వివక్షతలు కొనసాగుతూనే ఉండడాన్ని గమనించవచ్చు.

1993 లో వచ్చిన యశ్‌పాల్ కమిటీ పాఠ్యపుస్తకాలను వివరణాత్మక సమాచారంతో నింపడానికి బదులుగా సామాజిక – రాజకీయ సత్యాలను విశ్లేషించడంలో పిల్లల సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేయాలని పేర్కొన్నది. ఈ కమిటీ పౌరశాస్త్ర బోధనలో విప్లవాత్మక మార్పులు రావాలని సూచించింది. సాంప్రదాయకంగా వస్తున్న క్లిష్టమైన పాఠ్యాంశాల స్థానంలో సరళంగా, సులభంగా అర్థమయ్యే రీతిలో ఉండే విషయాలు ఉండడం అవసరమని పేర్కొన్నది. జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2005 సాంఘికశాస్త్ర విద్యా ప్రణాళికలో తీసుకురావలసిన కీలక మార్పుల గురించి చర్చించింది. సమానత్వం, సామాజిక న్యాయం, వ్యక్తి గౌరవం మొదలైన అంశాలను లింగ వివక్షత లేకుండా పాఠ్యప్రణాళికలో పొందు పరచాలని సూచించింది. ప్రస్తుత పాఠ్యాంశాలలో పై విషయాలపట్ల ప్రదర్శిస్తున్న ఉదాసీనతను తీవ్రంగా విమర్శించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాపరిశోధనా శిక్షణా సంస్థ కూడా ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సాంఘికశాస్త్రాల బోధన, ప్రణాళికలో విప్లవాత్మక మార్పులు అవసరమని పేర్కొంది. సాంఘికశాస్త్రం అనగానే అది అంత ప్రాధాన్యత లేని పాఠ్య విషయమని, అనాసక్తికరంగా ఉంటుందని, ఉపాధి అవకాశాలు లేవనే అభిప్రాయం సమాజంలో బలంగా నాటుకుని ఉంది. పిల్లల అవసరాలు, ఆసక్తులు, సామర్థ్యాలను సాంఘికశాస్త్రాల విద్యాప్రణాళిక ఏమాత్రం ప్రతిబింబించడంలేదు. దీనిలో వివరించే విషయాంశాలు ఏవీ పిల్లల స్థానిక అంశాలకు సంబంధించినవి కానీ, వారి వారి సామాజిక అనుభవాలను, అవసరాలను ప్రతిబింబించేవిగా గానీ లేకపోవడం వల్ల పిల్లలకు అనాసక్తిని కల్గిస్తున్నాయి. ఇవి నిరాసక్తతతోపాటు స్తబ్దతకు దారితీస్తున్నది.

పాఠశాల ఉపాధ్యాయులు సాంఘికశాస్త్రానికి కేటాయించిన పీరియడ్లు, మార్కుల దృష్ట్యా సాధారణంగా ఒకే సబ్జక్టుగా పరిగణిస్తున్నారు. వారు దీనిని ఎన్నోమార్లు మళ్ళీమళ్ళీ ప్రస్తావించారు. ఐతే సిలబస్ రూపకర్తలు వివిధ సబ్జక్టులయొక్క డిమాండు, అవసరాలను దృష్టిలో పెట్టుకొని సాంఘికశాస్త్రాన్ని మూడు లేదా నాలుగు సబ్జక్టులుగా చూస్తున్నారు. ఇది పాఠ్యపుస్తక రచయితలపై తీవ్రమైన ఒత్తిడిని చూపుతున్నది. దీనివల్ల పాఠ్యపుస్తక రచయితలు పాఠాలలో సంక్షిప్త లేదా ముఖ్యమైన సమాచారాన్ని నింపుతున్నారు. దీనివల్ల విషయావగాహన జరగడానికి, భావనలు రూపుదిద్దుకోవడానికి, విశ్లేషణాత్మకంగా ఆలోచించడానికి అవకాశం లేకుండా పోయింది. ఇది పిల్లల్లో సందిగ్ధతకు కారణమవుతున్నది. దీనివల్ల పిల్లలు సబ్జక్టునుండి దూరమౌతున్నారు. విద్యా ప్రణాళికలో విపరీతంగా విషయాన్ని చొప్పించడం ద్వారా పిల్లలపై కలుగుతున్న ఒత్తిడిని తగ్గించడం అవసరం. సాంఘికశాస్త్రాలలోని నాలుగు విభాగాలను సమన్వయపరచి ఒక ఉమ్మడి ప్రణాళికను రూపొందించడం అవసరం.

బోధనాంశాలకోసం పాఠ్యపుస్తకాన్నే ఏకైక వనరుగా భావిస్తున్నారు. ఈ పాఠ్యపుస్తకాల్లో కూడా సమకాలీన అంశాలు, వివిధ సబ్జక్టులలో చోటుచేసుకొన్న అభివృద్ధిని పొందుపర్చడంలేదు. సాధారణంగా తరగతి గదులలో పాఠ్యపుస్తకాలలో ఉన్న సమాచారాన్ని యధాతథంగా అందజేయడమే తప్ప పిల్లల అనుభవాలను, సమాజంలోని పెద్దలకు దీనిలో ఏమాత్రం భాగస్వామ్యం ఉండడంలేదు. స్థానిక అనుభవాలు పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల సాంఘికశాస్త్రం క్లిష్టమైన విషయంగా మారిపోయింది. ఇంతేగాకుండా పాఠ్యపుస్తకాలలో సైతం విషయాన్ని సంక్షిప్తంగా, వివరించడం సమకాలీనంగా వివిధ రంగాలలో వస్తున్న మార్పులను ప్రగతిని పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల కూడా సాంఘికశాస్త్రం నిరాసక్తికరంగా మారింది.

పాఠ్యపుస్తకంద్వారా అందించే అన్నిరకాల జ్ఞానాన్ని వివరించడానికి **"పదాలను"** మాత్రమే వినియోగిస్తున్నారు. ఇతర ముఖ్యమైన చార్టులు, చిత్రాలు, ప్రత్యక్ష అనుభవాలకు అవకాశం లేదు. కృత్యాలకు చోటు లేదు. ఇది పిల్లకు ఆకర్షణీయంగా ఉండదు. ఈ పాఠ్యపుస్తకాలు పెద్దవిగా, అనాసక్తికరంగా తయారయినవి. వీటితోపాటు నాసిరకమైన కాగితం, ముద్రణతో కూడినవిగా ఉండడం వల్ల పిల్లలను సంతృప్తిపరచలేకపోతున్నాయి.

విద్యాప్రణాళికను అమలుచేయడంలో విద్యార్థులు చురుకుగా పాల్గొనడమనేది చాలా తక్కువగా లేదా అసలు లేకుండా ఉంటున్నది. వారు కేవలం సమాచార గ్రహీతలుగా మిగులుతున్నారు. వ్యక్తీకరించడానికి సిద్ధపడరు. అయితే ఏమి నేర్చుకుంటున్నారనేది మాత్రం తెలిసి ఉంటున్నది. పాఠ్యపుస్తకంలో కృత్యాధారంగా నేర్చుకోడానికి అవకాశం తక్కువగా ఉంటున్నది. సొంతంగా నేర్చుకోవడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనానికి ఈ పాఠ్యపుస్తకాలలో అవకాశం తక్కువగా ఉంటున్నది.

ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో పిల్లల సామర్థ్యాలు, సబ్జక్టు స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని బోధనాకృత్యాలను తయారుచేయడంలో ఉపాధ్యాయులపాత్ర సంక్లిష్టంగా మారింది. ఉపాధ్యాయుడు తరగతిలో పాత్రకు, సన్నద్ధతల మధ్య

సమన్వయం ఉండడంలేదు. ఎక్కువమంది ఉపాధ్యాయులకు చరిత్ర, భౌగోళికశాస్త్రం, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం మొదలైన సాంఘికశాస్త్ర విభాగాలలో నిపుణత ఉండదు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధికి అవకాశాలు కల్పించే సెమినార్లు, గోష్ఠులు, సదస్సులు, వర్కుషాపులు అందుబాటులో లేకపోవడంవల్ల సబ్జక్టు స్వభావాన్ని బోధనాశాస్త్రంతో సమన్వయపరచడంలో ఇబ్బంది పడుతున్నారు.

ఉపాధ్యాయుల తయారీ (Teacher Preparation) అతి బలహీనంగా మారినందువల్ల తరగతిగదిలో బోధనాభ్యసన ప్రక్రియలు అత్యంత స్తబ్ధంగా మారాయి. ఇవి ఉపాధ్యాయ కేంద్రంగానో లేక పాఠ్యపుస్తక కేంద్రంగానో మారి పరీక్షలకు శిక్షణనివ్వడానికి పరిమితమౌతున్నాయి. నిర్మాణాత్మకవాదానికి చెందిన తాత్వికతను అనుసరించకపోవడంవల్ల పిల్లల యొక్క సామర్థ్యాలు, నైపుణ్యాల అభివృద్ధికి తక్కువ అవకాశం లభిస్తున్నది. పిల్లలకు అర్థవంతమైన అభ్యసనా కృత్యాలను రూపొందించే ప్రయత్నం, స్థానిక, సామాజిక వనరుల వినియోగం కూడా అత్యల్పంగా మారింది.

**పాఠశాలల్లో ఉన్న వనరులు :**

పాఠశాలల్లో వివిధ రకాల మ్యాపులు, గ్లోబులు ఉన్నాయి. మన రాష్ట్రంలో సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో పాఠశాలలకు బోధనాభ్యసన సామాగ్రి సరఫరా చేశారు. ప్రతీ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలకు గ్రంథాలయాల పుస్తకాలను సరఫరా చేశారు. దీనిని మరింత బలోపేతం చేయడం అవసరం. దాదాపు 40 శాతం పాఠశాలలకు కంప్యూటర్లు కూడా ఉన్నాయి. అట్లాసులు, రిఫరెన్సు పుస్తకాలు సరఫరా చేయడం అవసరం. అట్లే పాఠశాలలకు సి.డి.లు, సినిమాలు, విజ్ఞాన సర్వస్వాలు వంటివి అందచేసి కంప్యూటర్లు సద్వినియోగం చేసుకునేలా చూడాలి.

**మూల్యాంకనం :**

ప్రస్తుతం పాఠశాలలో బట్టీపట్టడాన్ని, గుర్తుంచుకుని పరీక్షలలో గుప్పించడానికి ప్రాధాన్యతనిచ్చేదిగా మూల్యాంకనం ఉంటున్నది. పాఠశాలలో నిర్వహించే యూనిట్ పరీక్షలు మొదలు వార్షిక పరీక్షలు / బోర్డు పరీక్షలు సైతం ఇదేవిధంగా జరుగుతున్నాయి. కాబట్టి మూల్యాంకనం నిరంతర సమగ్ర మూల్యాంకనంగా మార్పుచెందాలి. మూల్యాంకనం సాంఘికశాస్త్ర బోధనా లక్ష్యాలు సాధించేవిగా ఉండాలి.

## C) నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పన – కీలక సూత్రాలు

1) సమ్మిళిత విధానం
2) నిత్యజీవిత అనుభవాలకు, పాఠ్యాంశాలకు అనుసంధానం
3) బట్టీ విధానానికి దూరం – అర్థవంతమైన అభ్యసనానికి అనుకూలం.
4) ఉపాధ్యాయులు – విద్యార్థుల మధ్య చర్చ.
5) విద్యార్థులు ప్రశ్నించుట
6) విద్యార్థులు సొంతంగా చదివి, విషయాలను అర్థం చేసుకోవడం.
7) స్వీయ మూల్యాంకనానికి అవకాశం
8) ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులే నిర్వహించేటట్లుగా ప్రయోగాలు, ప్రాజెక్టులు ఇవ్వడం
9) సొంతంగా మరింత అభ్యసనం కొరకు లక్ష్యాలు నిర్దేశించడం.
10) పాఠ్యాంశాలను సులభంగా అర్థంచేసుకొనే విధంగా తీర్చిదిద్దడం
11) ఇతర సబ్జెక్టులతో అనుసంధానం

12) పట/చిత్ర నైపుణ్యాలను పెంపొందించడం

13) పిల్లలలో ఆలోచించే నైపుణ్యాలను పెంపొందించడం

14) నిరంతర సమగ్ర మూల్యాంకనం

### 1. సమ్మిళిత విధానం :

భౌగోళిక ప్రాంతాల విస్తృతిని గుర్తించడం, వివిధ రకాల పటాలుగీసి వివరించడం, పటాలను చదవడం లాంటి నైపుణ్యాలు భూగోళశాస్త్ర విద్య అందిస్తుంది. పటాలను కేవలం భౌగోళిక సమాచారం ఇచ్చేసాధనాలుగానే గాక సామాజిక సందర్భాలలో చారిత్రక పటాలు గీయటంలో కూడా ఉపయోగించగలగాలి.

చరిత్ర బోధనలో స్థానిక, ప్రాంతీయ, ఉపఖండ, ప్రపంచ విషయాల మధ్య సమతుల్యతను పాటించాలి. విద్యార్థులు సామాజిక పరిస్థితులను, చరిత్రను విమర్శనాత్మకంగా అధ్యయనం చేయాలి. ఇవి వివిధ సామాజిక శ్రేణుల, సంస్కృతి, శాస్త్రసాంకేతిక, జానపదాల, రాజనీతి, సాంఘిక, ఆర్థిక పరిస్థితుల వంటి వాటి చర్చకు దోహదం చేయాలి.

భావి పౌరులుగా కాబోయే బడిపిల్లలకు తాముజీవించే ప్రపంచ సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలను అందజేయడం సాపేక్షంగా విద్యాప్రణాళిక భావన. ఈ ప్రణాళికలో సామాజిక శాస్త్రం. అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రాలు కలిసి ఉంటాయి. సామాజిక శాస్త్రాలు అనేక విభాగాలుగా ఉన్నాయి. ఒక విభాగంతో మరొక విభాగం అంత: సంబంధాన్ని కల్గి ఉంది. అందువల్ల ఈ సంబంధాలను గుర్తెరిగి మనం సమన్వయాన్ని పాటించడం జరిగింది.

ఒక విభాగం బహుళ విభాగాలతో సంబంధం కల్గి ఉన్నందున ఉపాధ్యాయుడు కుటుంబం, వ్యవసాయం, చరిత్ర భూగోళం వంటి విభిన్న అంశాలను బోధించేటప్పుడు ఆయాకాలాల సమకాలీనతలను తెలుసుకోవాలి. గతంలో వ్యయసాయం, పరిశ్రమలు, జనాభా పాఠాలను భూగోళ శాస్త్రంలోనూ, అర్థశాస్త్రంలోనూ చర్చించేవారు. అదేవిధంగా పరిపాలన సంబంధ వ్యవహారాలు, చట్టం, న్యాయం, సంస్కృతి, కళలు వంటి అంశాలను చరిత్ర, పౌరశాస్త్రంలోనూ చర్చించేవారు కొన్నిసార్లు ఒకే పాఠ్యాంశం రెండు సామాజిక శాస్త్రాలలోనూ చెప్పబడేది. కాని నూతన పాఠ్యపుస్తకాల తయారీలో పదే పదే పాఠ్యాంశాన్ని రెండింటిలో చర్చించే వీలులేకుండా సమ్మిళిత విధానాన్ని అనుసరించారు.

ఎందువలనఅంటే భౌతికశాస్త్రంలోని అంశాలకు, ఆర్థికశాస్త్రంలోని అంశాలకు చాలా దగ్గరి సంబంధం ఉంటుంది. అలానే చరిత్ర, రాజనీతిశాస్త్ర అంశాలకు కూడా అదేవిధమైన దగ్గరి సంబంధం ఉంటుంది. అందువల్ల 6 నుండి 8వ తరగతి సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాలలో విభాగాలుగా పాఠ్యాంశాలను రూపొందించలేదు. తద్వారా ఒక పాఠం ఏ శాస్త్ర పరిధిలోకి వస్తుందనే దానికంటే పాఠ్యాంశాలలోని అన్ని విషయాలను కూలంకషంగా తెలుసుకునే విధంగా సమ్మిళిత విధానంలో రూపొందించబడ్డాయి.

భూగోళశాస్త్రం, చరిత్ర, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం విడివిడిగా కాకుండా సమ్మిళితంగా పాఠ్యాంశాలను రూపొందించారు. సమ్మిళితవిధానం రెండు రకాలుగా కనిపిస్తుంది.

మొదటిది ఏదైనా ఒక ప్రాంతం గురించి తెలియజేసేటప్పుడు ఆ ప్రాంతపు భౌగోళిక పరిజ్ఞానం, చారిత్రక విషయాలు, పరిపాలనా సంబంధ వ్యవహారాలు, ఆర్థికపరమైన విషయాలు చర్చించడం.

రెండోది ఒక పాఠ్యాంశంలో నాలుగు భాగాలుగా సంబంధించిన విషయాన్ని కలిపి ఒకేసారి చెప్పడం.

ఉదా :- 8వ తరగతి పాఠ్యపుస్తకంలో 4వ పాఠం ధృవప్రాంతాలు. ఈ పాఠాన్ని పరిశీలిస్తే భౌగోళిక అంశాలైన టండ్రాల్లో కాలాలు, వేసవి, వృక్షజాలం, సమాజ శాస్త్ర అంశాలైన టండ్రాప్రాంత ప్రజలు, సామూహిక జీవనం, మతపరమైన

నమ్మకాలు, ఆర్థికఅంశాలైన వేట, చేపలుపట్టడం, రాజనీతి అంశాలైన బయటి ప్రపంచంతో సంబంధాలు, సాంస్కృతిక అంశాలైన బట్టలు, కళలు అన్నింటికి సంబంధించిన వివరణలున్నాయి.

అంతేకాక పైన పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే ఇదీ ఫలానా సామాజిక శాస్త్రానికి చెందినదని చెప్పడం కూడా కష్టమే అవుతుంది. 6 నుండి 8 తరగతులలో 6 ఇతివృత్తాల ఆధారంగా పాఠాల రూపకల్పన జరిగింది. 9, 10 తరగతి పాఠాల రూపకల్పనకు అంశాల పద్ధతిని ఉపయోగించడం జరిగింది.

## సాంఘికశాస్త్రం - 6 నుండి 8 తరగతులు ఇతివృత్తాలు

| క్ర.స. | ఇతివృత్తాలు | లక్ష్యాలు |
|---|---|---|
| 1. | భూమి–వైవిధ్యం | అ) ప్రపంచవ్యాప్త వైవిధ్యాలను కింది అంశాల ఆధారంగా తెలుసుకొనుట<br>– శీతోష్ణస్థితి మండలాలు<br>– భూ స్వరూపాలలో విభిన్నతలు<br>– అభివృద్ధి చెందే మండలాలు<br>ఆ) ప్రకృతి అంశాల మధ్యన ఉండే సంబంధాలను అర్థం చేసుకొనుట.<br>ఇ) మానవ సమాజాలు ఈ విభిన్నతలను ఉపయోగించుకొని మార్పుచెందిన క్రమాన్ని అర్థం చేసుకొనుట.<br>ఈ) పటాన్ని చదివి అర్థం చేసుకోవడం, అన్వయించుకోవడం మొదలైన పట నైపుణ్యాలను పెంచుకొనుట.<br>ఉ) పోల్చడం, చిత్రాలను, సంభాషణలను చదివి అర్థంచేసుకోవడం మొదలైన నైపుణ్యాలను పెంచుకొనుట. |
| 2. | ఉత్పత్తి, వినిమయం మరియు జీవనాధారాలు | అ) వివిధ ఉత్పత్తులను, జీవనాధారాలను అవగాహన చేసుకొనుట.<br>ఆ) ఉత్పత్తులు మరియు జీవనాధారాలపై జాతీయకరణ, ప్రత్యేకీకరణ, భూస్వామ్య విధానం, పారిశ్రామికీకరణ, వలస విధానం, ప్రపంచీకరణల ప్రభావాన్ని అవగాహన చేసుకొనుట.<br>ఇ) అనాదిగా అభివృద్ధిలో శ్రామికుల పాత్రను ప్రశంసించుట.<br>ఈ) వినిమయము మరియు మారక ప్రక్రియలను మరియు సంస్థలను అర్థం చేసుకొనుట.<br>ఉ) ఛార్టులు, రేఖాచిత్రాలు, పట్టికలను చదువుట, మార్పులను అర్థం చేసుకొనుట మొదలైన నైపుణ్యాలను పెంపొందించుకొనుట.<br>ఊ) నటన ద్వారా, చిత్రాలను గీయడంద్వారా, మట్టితో నమూనాలను తయారు చేయడం ద్వారా అవగాహనను వ్యక్తపరచుట. |
| 3. | రాజకీయ వ్యవస్థలు–పరిపాలన | అ) చారిత్రకంగా వృద్ధిచెందుతూ వస్తున్న రాజకీయ సంస్థలు, నిర్ణయాలు తీసుకోవడంలో ప్రజల పాత్రను అర్థం చేసుకొనుట.<br>ఆ) ఆచరణలో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రజాస్వామిక పరిపాలనా సూత్రాలను అర్థం చేసుకొనుట. |

| క్ర.స. | ఇతివృత్తాలు | లక్ష్యాలు |
|---|---|---|
| | | ఇ) నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ప్రజాస్వామిక సంస్థలు పనిచేస్తున్నాయా లేదా అనే విషయాన్ని అంచనా వేయుట.<br>ఈ) సర్వే మరియు ఇంటర్వ్యూలను నిర్వహించుట, పోల్చుట, సామాజిక అనుభవాల వినియోగం మొదలైన నైపుణ్యాలను అభ్యాసము చేయుట.<br>ఉ) చారిత్రక వనరుల అన్వయము మరియు వార్తాపత్రికల ద్వారా అనాదిగా వస్తున్న మార్పుల గుర్తింపు మరియు వివరించగలిగే నైపుణ్యాలను పెంచుకొనుట. |
| 4. | సామాజిక వ్యవస్థీకరణ మరియు అసమానతలు | అ) సామాజిక మరియు సాంస్కృతిక వైవిధ్యాలను అర్థం చేసుకొనుట మరియు ప్రశంసించుట.<br>ఆ) లింగ, కుల, వర్గ, సామాజిక, ప్రాంతాల ఆధారంగా చూపబడే వివిధ రూపాల అసమానతలు, వివక్ష మరియు సామాజిక బహిష్కరణలను అర్థంచేసుకొనుట.<br>ఇ) సమాజాన్ని ఒకటిగా, సమన్యాయంతో ఉండే విధంగా దృక్కోణాన్ని ఏర్పరచుకొనుట.<br>ఈ) సామాజిక ఆదర్శాలు, నీతికి సంబంధించిన విషయాలను అవగాహన చేసుకొనుట.<br>ఉ) అల్పసంఖ్యాక, అల్పాదాయ సమాజాల మరియు వర్గాల అభివృద్ధిని ప్రభావితం చేస్తున్న అంశాల గురించి అవగాహన చేసుకొనుట.<br>ఊ) అణగారిన, అల్పాదాయ, సమాజానికి దూరంగా ఉంచబడిన వర్గాల రక్షణ కోసం చేపట్టిన చర్యలను, వాటి ప్రభావాన్ని అంచనా వేయుట.<br>ఋ) సర్వేను, ఇంటర్వ్యూలను చేపట్టుట, వార్తాపత్రికలలో వచ్చిన సమాచారాన్ని సేకరించుట, ముఖ్యపత్రాలలోని అంశాలను అవగాహన చేసుకొనుట మొదలైన నైపుణ్యాలను అభ్యాసం చేయుట. |
| 5. | మతం–సమాజం | అ) వివిధ మతాల విశ్వాసాలు, అలవాట్లు, ఆచరణలలోని విభిన్నతలను ప్రశంసించుట.<br>ఆ) మతాచారాలు మరియు ఆదర్శాలను అర్థం చేసుకొనుట – అనాదిగా వస్తున్న సామాజిక మార్పులకు అనుగుణంగా వివిధ మతాచారాలలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొనుట.<br>ఇ) మతాలు వివిధ ఆలోచనలను ఇచ్చిపుచ్చుకుంటాయని, వాటిని ఆచరించే ప్రజలు వివిధ మతాల విశ్వాసాలను తమ జీవనంలో భాగంగా మలచుకుంటారని అవగాహన చేసుకొనుట.<br>ఈ) వివిధ మతాల మధ్య గొడవలు రావడానికి కారణాలను, ప్రస్తుత కాలంలో మతతత్వవాదం ఏర్పడిన విధానాన్ని అవగాహన చేసుకొనుట. |

| క్ర.స. | ఇతివృత్తాలు | లక్ష్యాలు |
|---|---|---|
| 6. | సంస్కృతి–సమాచారం | అ) భారతదేశ సంస్కృతి లోని విభిన్నతలు, గొప్పతనాన్ని ప్రశంసించుట.<br>ఆ) జానపద, సాంప్రదాయ, ప్రాంతీయ సంస్కృతులు మరియు ఉపఖండేతర సంస్కృతుల ప్రభావంతో అనాదిగా భారతీయ సంస్కృతి వృద్ధిచెందడాన్ని అవగాహన చేసుకొనుట.<br>ఇ) సంస్కృతీ ఆవిర్భావం మరియు సంస్కృతిలో వచ్చే మార్పులను అర్థంచేసుకొనుట, సామాజిక, రాజకీయ పరిస్థితుల ప్రభావాన్ని అవగాహన చేసుకొనుట.<br>ఈ) కళల పోషణ వలన కళలపై కలిగే ప్రభావాన్ని అవగాహన చేసుకొనుట.<br>ఉ) స్థానిక కళలు, కట్టడాల సంస్కృతిని, నిర్మాణాన్ని అధ్యయనం చేయుట.<br>ఊ) చిత్రాలు చదివి అర్థం చేసుకొనుట, పోల్చుట, సామాజిక అనుభవాలను వినియోగించుట మొదలైన నైపుణ్యాలను అభ్యసించుట. |

పై పట్టిక 6 నుండి 8 తరగతుల సాంఘిక శాస్త్ర సిలబస్‌ను తెలుపుతుంది. మొత్తం సిలబస్‌ను 6 ఇతివృత్తాలుగా (Themes) విభజించటం మీరు పరిశీలించి వుంటారు. NCF-2005, APSCF-2011 లు సాంఘిక శాస్త్ర విషయంలో తెలిపిన అంశాల ఆధారంగా పై ఆరు ఇతివృత్తాలను ఎన్నుకోవటం జరిగింది. ఇదేవిధంగా 9, 10 తరగతులకు కూడా వివిధ ఇతివృత్తాల ఆధారంగా యూనిట్లను రూపొందించడం జరిగింది.

## 2) నిత్యజీవిత అనుభవాలకు అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన

విద్యార్థులు తమచుట్టూ ఉన్న సమాజంలోని నిజజీవిత అంశాల ఆధారంగా పాఠ్యాంశాలున్నాయి. పిల్లలలో ఉన్న ఆయా అంశాల పూర్వ భావనలను మరింత బలోపేతం చేస్తూ వాటికి సంబంధించిన తరగతి స్థాయి అంశాలను పాఠ్యాంశాలుగా ఇవ్వడం జరిగింది. పిల్లలు బడికిరాకముందే సమాజంలోని అనేక అంశాలపై అవగాహన కలిగి ఉంటారు. వారికి సమాజంలోని వివిధ జ్ఞాన వ్యవస్థలపై అవగాహన ఉంటుంది.

ఉదా :- 8వ తరగతిలో ద్రవ్యం – బ్యాంకింగ్ పాఠంలోని స్వయం సహాయక సంఘాలు, ప్రజారోగ్యం – ప్రభుత్వంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో జరిగే కార్యకలాపాలను పాఠ్యాంశాలకు అనుసంధానం చేసి విద్యార్థి సరిచూస్తాడు.

9వ వరగతిలోని భారతదేశ వ్యవసాయం పాఠంలోని వివిధరకాల పంటలలో తమ ప్రాంతాలలో పండే పంటలను, ధరలు – జీవనవ్యయం అనే పాఠంలో వారి వారి కుటుంబ బడ్జెట్‌ను తరగతిగదిలో చదివిన పాఠ్యాంశాలకు అనుసంధానం చేసేవిధంగా రూపొందిచబడ్డాయి.

## 3) బట్టీ విధానానికి దూరం – అర్థవంతమైన అభ్యసనానికి అనుకూలం

బట్టీ విధానాలకు అతీతంగా అర్థవంతమైన అభ్యసనాన్ని చేకూర్చేలా బోధనాభ్యసన ప్రక్రియలు ఇవ్వబడ్డాయి. పాఠ్యాంశాలలోని ప్రశ్నలు ఆలోచింపజేసేవిగా, బట్టీ పట్టడానికి అవకాశం లేకుండా అర్థం చేసుకున్న పాఠ్యాంశాన్ని నిత్యజీవిత అనుభవాలకు అనుసంధానం చేసేటట్లుగా ఉన్నాయి. పాఠం చివరలో ఇచ్చిన “మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి” లోని అంశాలకు పాఠంలో నేరుగా జవాబులు ఉండవు. ఒకే ప్రశ్నకు విద్యార్థులు విభిన్న సమాధానాలు పేర్కొనే వీలుంది. వారి స్వీయ అనుభవాలద్వారా ఇవ్వబడిన కృత్యాలు, ప్రాజెక్టులను పూర్తిచేసే అవకాశం ఉంది.

ఉదా : 8వ తరగతిలోని సాంఘిక, మత సంస్కరణోద్యమాలు పాఠంలో "మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి" లోని రెండవ ప్రశ్నను పరిశీలిద్దాం.

సంస్కరణ ఉద్యమం బలోపేతం కావడంలో ముద్రణాయంత్రం ప్రాముఖ్యత ఏమిటి?

ఈ ప్రశ్నకు విద్యార్థులు సాంఘిక, మత సంస్కరణోద్యమాలు పాఠం మొదటి పేజీలోని బాక్స్‌లో వున్న సమాచారాన్ని చదివి సాంఘిక, మత సంస్కరణోద్యమాలకు మధ్యగల సంబంధాన్ని విశ్లేషించుకొని సమాధానాన్ని తెలపాల్సి ఉంటుంది. ఈ సమాధానం కూడ ప్రతి విద్యార్థికి వేరువేరుగా ఉండే అవకాశం ఉంది.

9వ తరగతి లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికాలలో వలసవాదం అనే పాఠంలో 3వ ప్రశ్న వలస ప్రాంతాలుగా మార్చటంలో వ్యాపారం పోషించిన పాత్ర ఏమిటి?

ఈ ప్రశ్నకు విద్యార్థి జవాబును చెప్పాలంటే పాఠం అంతాచదివి అర్థంచేసకుంటేనేగాని చెప్పలేడు. ఇలా ప్రతి ప్రశ్న ప్రతి పని, ప్రాజెక్టులు, కృత్యాలు, విద్యార్థి బట్టీపట్టి పాఠంలో ఉన్నదున్నట్లు చెప్పడానికి, రాయడానికి వీలులేకుండా రూపొందించబడ్డాయి. ఈవిధంగా విద్యార్థిని బట్టీ విధానం నుండి దూరం చేయడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులను అర్థవంతమైన అభ్యసనానికి దగ్గర చేసింది.

### 4) ఉపాధ్యాయులు - విద్యార్థుల మధ్య చర్చకు అవకాశం

ప్రతిపాఠం ప్రారంభంలో, మధ్యలో అనేక చిత్రాలు, ఆలోచింపజేసే ప్రశ్నలు ఉన్నాయి. ఈ అంశాలపై చర్చ జరగాలి. పిల్లలు ఆలోచించేటట్లు ఉపాధ్యాయులు ప్రశ్నించడం, విద్యార్థులు తమ అనుభవాలు పంచుకోవడం, విద్యార్థులమధ్య చర్చ జరగాలి.

ఉదా : 1. 8వ తరగతి ఖనిజాలు - గనులు తవ్వకం పాఠంలోని 6.1, 6.2, 6.3 చిత్రాలపై చర్చలను నిర్వహించుట.

2. 9వ తరగతి భారతదేశంలో సేవా కార్యకలాపాలు పాఠంలోని కేస్‌స్టడీ-2 తర్వాత బాక్స్‌లో ఇచ్చిన ఒక ప్రశ్నను పరిశీలిద్దాం.

- కొత్త వైద్య విద్యాసంస్థలను ప్రభుత్వరంగంలో నెలకొల్పవచ్చా లేక ప్రైవేట్ రంగంలోనా? ఎందుకు?

3. 8వ తరగతి హక్కులు-అభివృద్ధి పాఠంలోని ప్రశ్న "ఒక రోడ్డు లేదా ఇళ్ళ నిర్మాణానికి సంబంధించిన సమాచారాన్ని గుత్తేదారులు ఎలా నిర్వహిస్తున్నారో చర్చించండి?"

### 5) విద్యార్థులు ప్రశ్నించగలగాలి

పాఠ్య పుస్తకంలోని వివిధ అంశాలు అభ్యసించేందుకు ఉపాధ్యాయులు చెబితే వినడం కాకుండా విద్యార్థులు ప్రశ్నించి విషయాలు తెలుసుకోవాలి. బోధనాభ్యసన ప్రక్రియలో అన్ని సందర్భాలలో విద్యార్థులకు ప్రశ్నించే అవకాశాన్నిచ్చే రకంగా ఇవ్వబడింది.

ఉదా :
- గనుల తవ్వకం వల్ల కలిగే లాభనష్టాలు తెలుసుకొనుటకు సంబంధిత వ్యక్తులను ఇంటర్వ్యూ చేయుటకు ప్రశ్నలు రూపొందించుట.
- బ్యాంకును సందర్శించే సమయంలో బ్యాంకు సిబ్బందిని బ్యాంకు పనితీరును అడిగి తెలుసుకొనుటకు ప్రశ్నలను రూపొందించుకొనుట.

### 6) విద్యార్థులు సొంతంగా చదివి విషయాలను అర్థం చేసకోగలగడం

పాఠ్యపుస్తకాన్ని విద్యార్థులు సొంతంగా చదువుకొని విషయాలను అర్థం చేసుకునేట్లుగా వాడుకపదజాలంలో భాష, పాఠ్యాంశాలు, చిత్రాలు, ఉదాహరణలు, కృత్యాలు ఇవ్వబడ్డాయి. నిఘంటువులు, పదకోశాల అవసరం లేకుండా విద్యార్థులు అన్ని పాఠ్యాంశాలను అర్థం చేసుకోగలరు.

ఉదా : సాంఘికశాస్త్రం 9వ తరగతి 23వ పాఠం విపత్తుల నిర్వహణ, ఈ పాఠంలో మానవుల కారణంగా ఏర్పడే వైపరీత్యాలు, ప్రమాద సంబంధిత వైపరీత్యాలు, ట్రాఫిక్ నియమాలు తెలుసుకోవడం, రైలు, విమాన, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు చేయవలసిన, చేయకూడని వాటిని తెలుసుకోవడం, చివరకు ఉగ్రవాదం ముప్పు గురించి కూడా విద్యార్థులు చిత్రాల ద్వారా, టేబుల్స్ ద్వారా సులభంగా సొంతంగా నేర్చుకునే రకంగా రూపొందించడం జరిగింది. ఇదేవిధంగా ప్రతి పాఠంలోనూ ప్రశ్నలు, బాక్సులు, గ్రాఫులు, టేబుల్స్, రంగురంగుల చిత్రాలు, ఆలోచింపజేసే బొమ్మలు, కార్టూన్లు, కల్పిత కథలు, యదార్థగాథలు, కేస్‌స్టడీలు, ప్రాజెక్టుల ద్వారా విద్యార్థి స్వీయ అభ్యసనాన్ని పెంపొందించే విధంగా పాఠ్యపుస్తకాలు రూపొందించబడ్డాయి.

### 7) స్వీయ మూల్యాంకనానికి అవకాశం

ఒక పాఠం పూర్తయ్యాక ఏఏ అంశాలలో విద్యార్థికి అవగాహన కలిగిందో సొంతంగా తెలుసుకొనుటకు వీలుగా ప్రతిపాఠం చివర స్వీయ మూల్యాంకన అంశాలు ఇవ్వబడ్డాయి. అదేవిధంగా ఎప్పటికప్పుడు పాఠం మధ్యలోని ప్రశ్నలుకూడా విద్యార్థి తాను ఏ స్థాయిలో ఉన్నాడో తెలుసుకొనుటకు అవకాశం ఇచ్చునట్లుగా పాఠ్యాంశాలన్నీ స్వీయ మూల్యాంకనానికి అనుకూలంగా ఉన్నాయి.

ఉదా : 9వ తరగతి 9వ పాఠంలో నియత, అనియత రుణాలు : ఎవరు, ఏం పొందుతారు? అనే భావనను అధ్యయనం చేసి విద్యార్థులు సొంతంగా మూల్యాంకనం చేయగల్గుతారు.

### 8) ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులే నిర్వహించేటట్లుగా ప్రయోగాలు, ప్రాజెక్టులు

విద్యార్థులు సొంతంగా సామగ్రిని సేకరించుకొని, రూపొందించుకొని కృత్యాలు, ప్రయోగాలు, ప్రాజెక్టులు, పరిశోధనల వంటివి ఉపాధ్యాయ మార్గదర్శకత్వంలో నిర్వహించేటట్లుగా ఇవ్వబడ్డాయి. విద్యార్థులు ఉపాధ్యాయ మార్గదర్శకత్వంలో నిర్వహించడం, నిర్వహించిన అంశాల పరిశీలనలపై చర్చించడం, తద్వారా అర్థవంతమైన అభ్యసనం జరుగునట్లుగా అన్ని పాఠ్యాంశాలున్నాయి.

ఉదా : 8వ తరగతిలోని 7వ పాఠం ద్రవ్యం – బ్యాంకింగ్‌లో ఇవ్వబడిన ప్రాజెక్టు.

- బ్యాంకుకు వెళ్లండి లేదా బ్యాంకు అధికారిని మీ బడికి ఆహ్వానించి ఈక్రింది విషయాలు తెలుసుకోండి.
  17వ పాఠం పేదరికం – అవగాహనలో ఇవ్వబడిన ప్రాజెక్టు.
- మీ ప్రాంతంలోని చౌకధరల దుకాణాన్ని సందర్శించి ఈ దిగువ విషయాలు తెలుసుకోండి.
  ఉదా : 9వ తరగతిలోని 2వ పాఠం – భూమి – ఆవరణములు.
- వివిధ వార్తాపత్రికలు, మ్యాగజైన్స్ ద్వారా భూకంపాలు, అగ్నిపర్వతాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఒక క్రమంలో అమర్చండి. ఇవి ఏవిధంగా ఏర్పడతాయి? మానవ జీవనాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి?
- 12 వ పాఠం – యూరప్‌లో మారుతున్న సాంస్కృతిక సంప్రదాయాలు (1300–1800) లో ఇచ్చిన పునరుజ్జీవనం కాలంనాటి ప్రముఖ కళాకారుల చిత్రాలను సేకరించి, వాటిని ఒక పుస్తకంలో అంటించండి.

### 9) సొంతంగా, మరింత అభ్యసనం కొరకు లక్ష్యాలు నిర్దేశించడం

పాఠ్యపుస్తకంలో ఇచ్చిన కృత్యాలు, చర్చనీయాంశాలు, క్షేత్ర సందర్శనలు, సమాచార సేకరణ, ప్రాజెక్టు పనుల వంటి వాటి ద్వారా పాఠ్యాంశాలకు సంబంధించి, సొంతంగా మరిన్ని అంశాలను తెలుసుకొనుటకు అవకాశం ఉండునట్లుగా పాఠ్యాంశాలున్నాయి. ఒక పాఠ్యాంశానికి సంబంధించి మరింత జ్ఞానం సొంతంగా పొందుటకు వీలుగా అన్ని పాఠ్యాంశాలున్నాయి.

ఉదా : 8వ తరగతి – ద్రవ్యం – బ్యాంకింగ్

- చెక్కుల ద్వారానే కాకుండా డ్రాఫ్టులు/ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా కూడా డబ్బులు బదిలీ చేయవచ్చు. ఆ వివరాలు తెలుసుకోండి.

9వ తరగతి – జీవావరణం

- అంతరించి పోతున్న అడవులను ఎలా సంరక్షించుకోవచ్చు.

### 10) పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా తీర్చిదిద్దడం

పాఠ్యాంశాలలో ఇచ్చిన రంగురంగుల బొమ్మలు, చిత్రాలు, నిజజీవిత సన్నివేశాల నుండి సేకరించిన ఫోటోలు, ఉదాహరణలు, చిన్న చిన్న అభ్యాసాలు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోవడానికి తోడ్పడుతాయి. అదేవిధంగా, పాఠాల సంఖ్య, అక్షరాల పరిమాణం, పుస్తక పరిమాణం, నాణ్యత, పేజీలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం, భాష, ముందు వెనుక పేజీలు, లోగోలు వంటివి అనేకం ఇందుకు దోహదపడతాయి.

ఉదా : 8వ తరగతి

- పటాల అధ్యయనం పాఠంలోని చిత్రం 1.1 ఆఫ్రికా, యూరప్, అమెరికాలను చూపే ఫోటో.
- బ్రిటీష్, నిజాంల పాలనలో భూస్వాములు, కౌలుదార్లు పాఠంలో కార్టూన్లు ఉపయోగించడం జరిగింది.
- భారత రాజ్యాంగం పాఠంలో ఇచ్చిన భారత ప్రభుత్వ చిహ్నం (లోగో).

9వ తరగతి

- ప్రజాస్వామిక జాతీయవాద విప్లవాలు – 19వ శతాబ్దం పాఠంలో చిత్రం 14.1 ఆలోచనాపరుల బృందం.
- మానవహక్కులు, ప్రాథమిక హక్కులు పాఠంలోని మానవహక్కుల లోగో. ఇదే పాఠంలోని బాలల హక్కులపై గోడపత్రిక.
- భారతదేశంపై వలసవాద పాఠంలోని చిత్రం (18.9) : 1931 లో ఇంగ్లాండులోని లాంక్‌షైర్‌లో మిల్లు కార్మికులు గాంధీజీని కలిసి భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. (నిజజీవిత సన్నివేశం)

### 11) ఇతర సబ్జెక్టులతో అనుసంధానం

భాష, గణితం, ఆరోగ్యం, పర్యావరణం వంటి అనేక సబ్జెక్టులతో పరిసరాలను అనుసంధానం చేస్తూ పాఠ్యాంశాలున్నాయి. ఏ పాఠం అయినా పరిపుష్టం కావాలంటే ఇతర సబ్జెక్టులపై ఎంతో కొంత ఆధారపడక తప్పదు.

ఉదా : 8వ తరగతి

- సూర్యుడు – శక్తి వనరు అనే పాఠంలో ఉష్ణోగ్రతలను కొలవడం, నమోదుచేయడం, వీటి ఆధారంగా గ్రాఫులు తయారుచేయడంలో భౌతిక, గణిత శాస్త్ర సబ్జెక్టులతో అనుసంధానం అవసరమవుతుంది.

9వ తరగతి

- జీవావరణం పాఠంలోని అంశాలను బోధించుటకు జీవశాస్త్రంలోని అంశాలను తెలుసుకోవాల్సి ఉంటుంది.

## 12) పటనైపుణ్యాలను పెంపొందించడం - చిత్రాలను పరిశీలింపజేయడం

నూతన సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలోని పాఠ్యాంశాలు విద్యార్థులలో చక్కటి నైపుణ్యాలను పెంపొందించేవిధంగా రూపొందించబడ్డాయి. గత పాఠ్యపుస్తకంలో మాదిరిగా కేవలం పటాలలో ప్రదేశాలను గుర్తించడమే కాకుండా, పటాలను తయారుచేయడం, పటాలను చదవడం వంటి విషయాలను కొత్తగా పరిచయం చేయడం జరిగింది.

ఉదా : 8వ తరగతి

- అడవులు - వినియోగం, సంరక్షణ (5వ పాఠం) 55వ పేజీలోని "అడవులు" పటాన్ని పరిశీలించండి. "ఆంధ్రప్రదేశ్ - అడవులు" పటాన్ని పరిశీలించి ఏఏ జిల్లాలలో అత్యధికంగా అడవులు ఉన్నాయో పేర్కొనండి.

9వ తరగతి

- యూరప్‌లో మారుతున్న సాంస్కృతిక సాంప్రదాయాలు 1300-1800 (12వ పాఠం) 155వ పేజీలోని ప్రపంచపటాన్ని చదవండి.

  ప్రశ్న : సముద్ర మార్గాలలో జరిపిన వివిధ అన్వేషణల జాబితా తయారుచేయండి.

- **చిత్రాల ద్వారా కూడా పాఠాలలోని భావాలను మరింత సులభంగా అర్థం చేసుకునే రకంగా పాఠ్యాంశాలు రూపొందించారు :**

  చిత్రాలు విద్యార్థులలో అవగాహనకు ఉపయోగపడటమే గాకుండా వారిలో నూతన ఆలోచనలు రేకెత్తించే రకంగా, సహజసామర్థ్యాలను వెలికితీసే రకంగా, సృజనాత్మకతను పెంపొందించే రకంగా రూపొందించబడ్డాయి.

  ఉదా : 8వ తరగతి

- అడవుల-వినియోగం, సంరక్షణ (5వ పాఠం) 53వ పేజీలోని నాలుగు చిత్రాలను పరిశీలించి ఆ చిత్రాల ద్వారా పరిసరాలు - మానవుడికి మధ్య నున్న సంబంధాన్ని విద్యార్థులు విశ్లేషించుకుంటారు.

9వ తరగతి

- ప్రజాస్వామిక జాతీయవాద విప్లవాలు - 19వ శతాబ్దం (14వ పాఠం) 180 పేజీ నుండి బిస్మార్క్ చిత్రం.

  ఈ వ్యంగ్యచిత్రాన్ని వివరించండి. బిస్మార్క్‌కీ, ఎన్నికైన పార్లమెంటు డిప్యూటీలకీ మధ్య సంబంధాన్ని ఇది ఎలా చూపిస్తోంది? ప్రజాస్వామిక ప్రక్రియల గురించి చిత్రకారుడు ఏం వ్యాఖ్యానించదలుచుకున్నాడు?

## 13) పిల్లల్లో ఊహాత్మకశక్తిని, ఆలోచించే నైపుణ్యాలను పెంపొందించే రకంగా రూపొందించబడ్డాయి

నూతన సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాలలో, పిల్లలలో వివిధ సన్నివేశాలను, జరగబోయే పరిస్థితులను ఊహించేరకంగా ప్రశ్నలు ఇవ్వబడ్డాయి. అన్నింటికంటే ముఖ్యంగా ఉన్నత ఆలోచనలను పెంపొందించే రకంగా ప్రశ్నలు రూపొందించబడ్డాయి. పిల్లలలో సమైక్య ఆలోచన ప్రజ్ఞను, విభిన్న ఆలోచన వారిలో సృజనాత్మకతా శక్తిని పెంపొందిస్తాయి. ఇలా పిల్లలలో వివిధ రకాల ఆలోచనలను పెంపొందించే రకంగా పాఠ్యాంశాలు రూపొందించడం జరిగింది. 8, 9వ తరగతులలో ఇవ్వబడిన కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దాం.

ఉదా : 8వ తరగతి

- కొత్త పాఠశాలలు, కళాశాలలను నెలకొల్పటానికి అనువైన ప్రాంతాన్ని ఎంచుకోవాలనుకుంటున్న వ్యక్తికి ఏఏ పటాలు అవసరమవుతాయి? జాబితా తయారు చేయండి? (8వ పేజి)
- భూమిలేని కౌలు రైతుల స్థితిగతులను ఊహించి ఒక వ్యాసం రాయండి. (116వ పేజి)

- ఉప్పు సత్యాగ్రహం తన ఉద్దేశాలలో ఏమేరకు విజయవంతం అయ్యింది? మీ అంచనా ఏమిటి? (139వ పేజి)
- రైతాంగ సమస్యలు పరిష్కరించడం ఒక్కటే తెలంగాణ సాయుధ పోరాట ఉద్దేశమా, ఇంకేమైనా ఉన్నాయా? (147వ పేజి)
- "దున్నేవానిదే భూమి" అన్న నినాదంతో కౌలుదారులకు భూమి లభిస్తుంది. మరి కూలీకి, పనిచేసే వ్యవసాయ కూలీల పరిస్థితి ఏమిటి? (185వ పేజి)
- ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపరచడానికి మరికొన్ని సూచనలు చేయండి. (201 పేజి)
- బాలికల విద్య, సంఘసంస్కరణల మీద మీ అభిప్రాయాన్ని తెల్పండి. (222 పేజి)
- క్రికెట్టు వాణిజ్య క్రీడగా మారటం వల్ల సంభవించిన పరిణామాలపై ఒక కరపత్రం తయారు చేయండి. (253వ పేజి)
- చంద్రుడి మీద జీవనం ఎందుకు సాధ్యం కాదో ఊహించండి. (37వ పేజి)
- అంతరించిపోతున్న అడవులను ఎలా సంరక్షించుకోవచ్చు? (58వ పేజి)
- నూలు వడకడం, ఖద్దరు నేయటానికి మహాత్మాగాంధీ ఎందుకు ప్రాధాన్యతనిచ్చారు? (78వ పేజి)
- వ్యాట్ వస్తువులపై పన్ను ఎగవేతను ఏ విధంగా తగ్గిస్తుంది? (142 పేజి)
- బైబిలును ముద్రించడం ద్వారా దేవుడు, చర్చిపై భావనలు ఎలా ప్రభావితం మయ్యాయి? (158వ పేజి)
- "సార్వజనీన హక్కుల ప్రకటన వైరుధ్యాలతో కూడుకుని ఉందన్న" అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా? వివరించండి? (170వ పేజి)
- బ్రిటీషు పారిశ్రామికీకరణను ప్రోత్సహించిన 18వ శతాబ్దం నాటి బ్రిటన్, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల పరిణామాలను చర్చించండి. (186వ పేజి)
- మన్రో సిద్ధాంతం లాటిన్ స్వాతంత్ర్యాన్ని ఏ విధంగా కాపాడింది? ఇది వాటి స్వాతంత్ర్యాన్ని పరిమితం కూడా చేసిందా? (210వ పేజి)
- భారతదేశ వివిధ ప్రాంతాలలో ఆదివాసీల తిరుగుబాటులను తెలియజేసే కాల పట్టిక తయారు చేయండి. ఆదివాసీల తిరుగుబాటులు ఎక్కడెక్కడ జరిగాయో తెలుసుకొని ఆ ప్రదేశాలను భారతదేశ పటంలో గుర్తించండి.

### 14) నిరంతర సమగ్ర మూల్యాంకనానికి వీలుగా రూపొందించబడ్డాయి:

పాఠం ప్రారంభానికి ముందు, పాఠం మధ్యలో, ప్రతి కొత్త "భావన" పరిచయం చేయునప్పుడు, పాఠం పూర్తయ్యే సమయంలో, కృత్యాలు, ప్రాజెక్టులు, ప్రయోగాలు, పరిశోధనల వంటిచోటా, ఇలా ప్రతి సందర్భంలో నిరంతర మూల్యాంకనం చేయడానికి వీలుగా, "అభ్యసనం కొరకు మూల్యాంకనం" అనే విధంగా పాఠ్యాంశాలు ఉన్నాయి. ఆయా సందర్భాలలో విద్యార్థుల ప్రతిస్పందనను బేరీజు వేసే విధంగా 'సమగ్ర' మూల్యాంకన ప్రక్రియకు దోహదం చేసేటట్లుగా పాఠ్యాంశాలన్నీ ఉన్నాయి. స్వీయ మూల్యాంకనం, "అభ్యసనాన్ని మెరుగు పరుచుకుందాం" వంటివి కూడా నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా ప్రతిపాఠంలో చేర్చబడ్డాయి.

## D) నూతన సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాలు - పాఠం నిర్మాణక్రమం (Lesson Structure)

**పాఠ్యాంశ పరిచయము :**

- ప్రతి పాఠ్యాంశ పరిచయం / ఉపోద్ఘాతం సన్నివేశం, సంఘటన, చిత్రం, కథనాలు, మేథోమథనం, ఆలోచింపజేసే ప్రశ్నలతో ఆరంభించడం జరిగింది.

  ఉదా: 8వ తరగతిలోని 5పాఠం అడవులు - వినియోగం, సంరక్షణ పాఠ్యాంశ పరిచయం పూర్వజ్ఞానాన్ని పరీక్షించే, ఆలోచింపజేసే ప్రశ్నలతో ప్రారంభించడం జరిగింది. 9వ తరగతిలో 1వ పాఠం 'భూమి-మనం' పాఠ్యాంశ ప్రారంభాన్ని చిత్రం చూపించి, ప్రశ్నించడం, చర్చించడం ద్వారా పరిచయం చేయడం గమనించవచ్చు.

  8వ తరగతిలో 6వ పాఠం 'ఖనిజాలు, గనుల తవ్వకం', మన ఇంట్లో ఖనిజాలు ఉపశీర్షికతో ఇండ్లలో / స్థానిక వనరులను ఆయా అంశాలను గురించి మాట్లాడుతూ పాఠ్యాంశ పరిచయాన్ని చేయడం జరిగింది.

**భాష :**

- పాఠ్యాంశాలలో వాడిన భాష పిల్లలకు అర్థమయ్యే, సరళమైన, వ్యావహారిక భాషతో, బహుభాషత్వాన్ని దృష్టియందుంచుకొని వ్రాయబడినది.

**భావనల వివరణ :**

- ప్రతి పాఠ్యాంశం నందు బోధనాంశాలు, భావనలు చిన్న చిన్న పేరాలుగా విభజింపబడి ఉపశీర్షికలతో పొందుపరచడం జరిగింది.

**భిన్న కోణాలలో ఆలోచనలు రేకెత్తించే అంతర్గత ప్రశ్నలు:**

- పాఠ్యాంశ బోధనాభ్యసన ప్రక్రియలో అంతర్భాగంగా ప్రతి ఉపశీర్షికలో, పాఠం మధ్యలో ఆలోచింపజేసే అదనపు సమాచార బాక్సులు, అభ్యసనాంశాలు, ఎంతవరకు అవగాహన పొందారో తెలుసుకునేందుకు ప్రశ్నలబాక్సులు ఇవ్వబడి నిరంతర సమగ్ర స్వీయ మూల్యాంకనానికి దోహద పడ్డాయి. 'తెలుసుకోండి' వంటి ప్రశ్నలు పిల్లలు బహుకోణాల్లో ఆలోచించడానికి, ప్రతిస్పందించడానికి, స్థానికాంశాల అన్వయానికి, అనుభవాల వ్యక్తీకరణకు దోహదపడతాయి.

  ఉదా: 8వ తరగతి 13వ పాఠం 'భారత రాజ్యాంగం' పాఠ్యాంశంలో తెలుసుకోండి, భిన్న కోణాల్లో ఆలోచించే ప్రశ్నల బాక్సులు అదనపు సమాచారం కోసం రాజ్యాంగ తొలి ప్రతులు, మహాత్మాగాంధీ, డా.బి.ఆర్. అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి మహనీయుల సందేశాలు, 'రాజ్యాంగ పీఠిక' పై అదనపు సమాచారం పొందుతారు. 12వ పాఠంలోని 'తెలంగాణ పోరాటంలో మహిళలు' వంటి అదనపు సమాచార బాక్సులు చదవడానికి విద్యార్థులలో ఆసక్తిని పెంచుతాయి.

**స్వీయ అభిప్రాయాలను విద్యార్థులు వెలిబుచ్చే అవకాశం:**

పాఠ్యాంశాలలో స్వీయ అభిప్రాయాలను, సమకాలీన అంశాలను వ్యక్తం చేసే అవకాశం కల్పించబడి, చర్చలో పాల్గొనడం ద్వారా అవగాహన పెంపొందించడం జరిగింది. ఉదా : 8వ తరగతి పాఠ్యాంశం 12 'హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్ర్యోద్యమం' లో ప్రశ్నల బాక్సులలో ఇవ్వబడిన మీ ప్రాంతములో ఏఏ భాషలు మాట్లాడతారు? బోధన అంతా మాతృభాషలోనే ఉండాలన్నది మీ అభిప్రాయమా? వంటి ప్రశ్నలు విద్యార్థుల మెదళ్ళకు పదును పెడతాయి.

**కేస్ స్టడీలుగా స్థానిక అంశాల వివరణ:**

- ప్రతి పాఠ్యాంశం ఏదో ఒక నూతనత్వాన్ని ప్రతిబింబించే విధంగా రూపకల్పన జరిగింది. ఉదా: 8వ తరగతిలో 17వ పాఠ్యాంశం 'పేదరికం – అవగాహన' ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దుస్థితి శీర్షికలో రామాచారి, చంద్రయ్య కేస్ స్టడీలు (ఉదంతాలు) కళ్ళకు కట్టినట్లు వర్ణించబడ్డాయి. ఇలాంటి వారు తమ ప్రాంతాల్లోను ఉంటే వారి గురించి విద్యార్థులు ఆరా తీసి తెలుసుకొనే ప్రయత్నం చేస్తారు.
- ఇంకా 8వ తరగతి 18వ పాఠం 'హక్కులు – అభివృద్ధి' లో పవన్ అనే బాలుడి, 9వ తరగతిలో 22వ పాఠం 'మహిళా రక్షణచట్టాలు' ఆప "బడి" న 'బాల్య వివాహం – ఒక విజయగాథ' శీర్షికల ద్వారా రావిరాళ్ళ కవిత వివాహాన్ని ఆపడానికి మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్ చేసిన (MVF) కృషిని, బాల్యవివాహాలు చట్ట విరుద్ధమనే వాస్తవాలను గ్రహిస్తారు.

**గ్రాఫ్‌ల వినియోగం :**

- సందర్భానుసారంగా పాఠ్యాంశాలలో గ్రాఫ్‌ల ద్వారా విషయాలను పరిచయం చేయడానికి ప్రయత్నించడం జరిగింది. ఉదా : 8వ తరగతిలోని 8వ పాఠం 'జీవనోపాధులు– సాంకేతిక విజ్ఞాన ప్రభావం' పాఠ్యాంశంలో కమ్మీగ్రాఫ్‌లు, సమాచార పట్టికలు, వృత్తరేఖాచిత్రాల ద్వారా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఉపాధిపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో విస్తృత అవగాహన చేసుకోవడానికి దోహదపడతాయి.

అదేతరగతిలో 9వ పాఠ్యాంశం "ప్రజారోగ్యం – ప్రభుత్వం" నందు కుటుంబ, ఆరోగ్య, సంక్షేమ మంత్రిత్వశాఖ వివిధ విభాగాలను ఫ్లోచార్టు ద్వారా ప్రదర్శించడం – పిల్లల అభ్యసనను మెరుగు పరుస్తుంది. ఆసుపత్రి ఖర్చులను సమకూర్చుకునే ఆర్థిక మార్గాలను వృత్త రేఖా పటముల ద్వారా, పరిమాణాత్మక వర్ణనలతో వివరించడం జరిగింది.

**విజయగాథలద్వారా విద్యార్థులలో ప్రేరణ :**

- 8వ తరగతిలోని 23వ పాఠం 'క్రీడలు, జాతీయత, వాణిజ్యం' లో జి. హెచ్. విహారితో జరిపిన ఇంటర్వ్యూ – విజయగాథ ద్వారా క్రికెట్ కున్న ప్రజాదరణ, మిగతా ఆటలకు లేక పోవడం, జాతీయ సమైక్యత, భావాల వృద్ధికి, భారతదేశ ఖ్యాతిని పెంచడానికి, విద్యార్థుల్లో ప్రేరణ కల్గించి సమాచారాన్ని సేకరించే నైపుణ్యాన్ని వృద్ధి పరుస్తుంది.

**చిత్రాల ద్వారా విషయ అవగాహన :**

- 8, 9వ తరగతి పాఠ్యపుస్తకాలలోని, పాఠ్యాంశాలలో అనేకరకాల చిత్రాలు ఇవ్వబడినాయి. అన్ని చిత్రాల కింద చిత్రాన్ని గురించిన వాక్యం చదవండి. ఉదా: 8వ తరగతిలోని 8వ పాఠం 'జీవనోపాధులు – సాంకేతిక విజ్ఞాన ప్రభావం' లోని 8.1, 8.6 చిత్రాల్ని పరిశీలించండి. రెండు చిత్రాలు అల్లికలు చేసే మహిళల్ని చూపుతాయి. ఇద్దరు స్త్రీలు చేసేపని, స్థాయిని వారి జీవితాలను పోల్చండి. ఇలాంటి చిత్రాలు పిల్లల్లో ఆసక్తిని రేపి, ఆలోచింపజేసి తమ భావాలను ప్రకటిస్తారు. ఇదే తరగతిలోని పాఠ్యాంశంలో గాంధీజీ మూడు బొమ్మలున్నాయి. వీటిలో ఏవి ఫోటోలు, ఏవి చిత్రాలో తెల్పండి. ఇవి గాంధీజీ గురించి ఏమి తెల్పుతాయి. ఇవి గాంధీజీ గురించి ఏ సమాచారాన్ని ఇస్తాయి? ఇదే పాఠంలో నెహ్రూజీ ఎర్రకోట నుండి మాట్లాడుతున్న ఫోటో ఉంది, ప్రతి ఆగస్టు 15 నాడు మన ప్రధాని ఎర్రకోట నుండి ప్రజల నుద్దేశించి మాట్లాడుతాడని తెలుసు. 1947 స్వాతంత్ర్య సంబరాలకు, ప్రస్తుతం నిర్వహించే స్వాతంత్రదినోత్సవ సంబరాలకు మధ్యనున్న మార్పులు ఏవి? అవి ఎందుకు చోటుచేసుకున్నాయి?

**కార్టూన్లు :**

- నూతన పాఠ్యపుస్తకాలలో సందర్భోచితంగా అనేక కార్టూన్లు పొందుపరచడమైంది. ఇవి ఫోటోలకు ఏ విధంగా భిన్నమైనవో, వాటి ఉపయోగాలను చర్చించండి. వివిధ కార్టూన్లు ప్రత్యేకమైన విషయాన్ని పరిచయం చేయడానికి, వ్యాఖ్యలతో పాటు పొందుపరచడం జరిగింది. ఉదా: 9వ తరగతి 20వ పాఠంలో "ప్రజాస్వామ్యం–రూపుదిద్దుకుంటున్నభావన" ఇవ్వబడిన కార్టూన్ల నుండి పిల్లలు ఏమి గ్రహిస్తారు? ఏ అనుభవాలు పొందుతారు? విమర్శనాత్మకంగా కార్టున్ల ద్వారా తమ అభిప్రాయాలు ప్రకటిస్తారు. 8వ తరగతిలో 10వ పాఠం 'బ్రిటీషు, నిజాంల పాలనలో భూస్వాములు, కౌలుదార్లు' నందు గీయబడిన కార్టూన్లు, వాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వర్ణించాయి. వాటిలో వ్యక్తుల భావాలు వ్యాఖ్యలతో ప్రకటించబడినాయి.

**ప్రాజెక్టులు :**

- భూ సంస్కరణలపై 8వ తరగతి 16వ పాఠం 'జమీందారీ వ్యవస్థ రద్దు' ద్వారా విద్యార్థులు భూ సంస్కరణలపై ప్రాజెక్టు పనిని చేపట్టి పెద్దల సహకారంతో సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి, ప్రదర్శనకోసం నివేదికను తయారు చేయడం ద్వారా, వారిలో సహకారభావం, అభిప్రాయాలు గౌరవించడం, పంచుకోవడం, వ్యక్తంచేయడం, సమిష్ఠి నిర్ణయాలు తీసుకోవడం వంటి సామర్థ్యాలు పెంపొందుతాయి.

**కీలకపదాలు :**

- ప్రతి పాఠ్యాంశం చివరన ముఖ్య భావనలు కీలకపదాలుగా ఇవ్వబడినాయి. వీటి అర్థాలు తెలుసు కోవడటం ద్వారా పాఠ్యాంశంలోని సందేహాలు నివృత్తి చేయబడి, పదజాలాభివృద్ధి పెంపొందును.

**మూల్యాంకనం ద్వారా మెరుగుకానున్న విషయ అవగాహన :**

- మూల్యాంకనం కోసం ఇవ్వబడిన 'మీ అభ్యసనాన్ని మెరుగు పరుచుకోండి' శీర్షిక కిందనీయబడిన ప్రశ్నలు ఆశించిన విద్యాప్రమాణాలు సాధించడానికి అనువుగా రూపొందించబడినాయి. ఇవి విద్యార్థి బట్టీ పట్టి సమాధానాలు చేప్పేవి కాకుండా, చర్చించి, ఆలోచించి, విభిన్న కోణాల్లో, సొంత మాటల్లో, అనుభవాల ప్రాతిపదికగా సమాధానాలు ఇచ్చేవిధంగా పొందుపరచడం జరిగింది. ఇందులో వ్యక్తిగత, జట్టు కృత్యాలు, ప్రాజెక్టు పనులు కూడా పాఠ్యాంశాల ననుసరించి పాఠాల్లో పొందుపరచడం జరిగింది.

# 6 సాంఘిక శాస్త్ర బోధనా లక్ష్యాలు - విధానాలు

సాంఘిక శాస్త్ర బోధనలో అనేక పద్ధతులు (methods), వ్యూహాలు (stratagies), అమలు చేస్తుంటాం. ఇవి సాంఘికశాస్త్ర స్వభావాన్ని బట్టి, పిల్లల స్వభావాన్నిబట్టి సరైనది ఎన్నుకుంటాం. సాంఘికశాస్త్రబోధనా విస్తృత లక్ష్యాలు, బోధనా విధానాలు, అనుసరించే బోధనా వ్యూహాల గురించి వివరంగా తెలుసుకుందాం.

## సాంఘిక శాస్త్ర బోధన విస్తృత లక్ష్యాలు

1. సామాజిక నేపథ్యంలో కారణాలు చెప్పడం, కారణాలను అన్వేషించే నైపుణ్యాలను పెంపొందించడం.
2. తక్షణ సామాజికాభివృద్ధి అంశాలను ప్రపంచ పోకడలతో పరస్పరం అన్వయించడం.
3. స్థల, కాల సంబంధాలకు చెందిన విభిన్న మానవ అనుభవాలను అర్థం చేసుకోవడం.
4. సామాజిక ప్రపంచాన్ని పలు కోణాలలో చూసి అర్థం చేసుకోవడం.
5. విభిన్న వర్గాల ప్రజలపై సామాజిక దృష్టాంతాల ప్రభావాన్ని అర్థం చేసుకోవడం.
6. పొందిన సమాచారం, పరికల్పనలు, ఊహాత్మక అంశాలను మూల్యాంకనం చేసే నైపుణ్యాన్ని పెంపొందించడం.
7. ముద్రిత అంశం, డేటా, చిత్రాలు (ఉదా:- వివిధ పద్ధతులలో సమాచారం జ్ఞానాన్ని చిత్రరూపంలో పేర్కొనడం/అన్వయించడం/దార్మనికతను ప్రదర్శించడం) మొదలగు వాటిని నిర్వహించే నైపుణ్యాలను పెంపొందించడం.
8. సామాజిక, రాజ్యాంగ విలువలతో మమేకమవడం.

### చరిత్ర

1. సమాజంలో వచ్చే మార్పు ప్రక్రియలను అర్థం చేసుకోవడం.
2. సమాజం ఎందుకు, ఎలా మార్పులకులోనవుతుందో అవగాహన చేసుకోవడం.
3. సమాజంలో వచ్చే మార్పులు వివిధ సామాజిక వర్గాల వారిని ఏవిధంగా ప్రభావితం చేస్తుంది. అర్థం చేసుకోవడం.
4. మన గుర్తింపు పొందిన విధానాలలో భాగంగా చరిత్రను అధ్యయనం చేయడం ఎలా అవసరమో అర్థం చేసుకోవడం.
5. చరిత్ర నిర్మాణంలో గుర్తింపు పొందే విధానం ఏ విధమైన ప్రభావం చూపుతుందో అర్థం చేసుకోవడం
6. చరిత్రలో మానవ వ్యవస్థ పరిధి, ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం.
7. వనరుల సహాయంతో చరిత్రను అర్థం చేసుకోవడానికి విమర్శనాత్మక, నిశిత పద్ధతులను అవలంబించడం.
8. చరిత్ర సామాజిక సందర్భరచన గతాన్ని పునర్నిర్మించడం, దానిని అందించే పద్ధతిని ప్రభావితం చేస్తుందని అర్థం చేసుకోవడం.

### భూగోళ శాస్త్రం

1. మానవ సమాజాలు, సహజ పరిసరాల మధ్య ఉన్న గతిశీల సంబంధాన్ని అర్థం చేసుకోవడం.

2. అంతరిక్ష, భౌతిక క్రమం సహజ ప్రాంతాలుగా మారడాన్ని అర్థం చేసుకోవడం, సమాజాలు వాటిని ఏ విధంగా మార్చాయో తెలుసుకోవడం.
3. సామాజిక క్షేత్రీయ సంబంధాలు అంటే కాలనీ మరియు మహానగర, పట్టణ ముఖ్య ప్రాంతాల వంటి వాటి మధ్య గల సంబంధాలను అర్థం చేసుకోవడం.
4. ప్రపంచ వ్యాప్తంగా విస్తృత విభిన్నతతో కూడిన మానవ అనుభవాలను పిల్లల ముందు బహిర్గతం చేయడం. అదే సమయంలో మానవుల మధ్య సహచర భావనను పెంపొందిచడం.
5. భౌగోళిక పరిశోధనలో సాంఘిక, చారిత్రక సందర్భాన్ని అర్థం చేసుకోవడాన్ని అభివృద్ధి పరచడం.
6. స్కేలు, వర్షమాపని, థర్మామీటర్ మొదలగు పరికరాలను ఉపయోగించి పటాలను రూపొందించడం, వాటిని చదవడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి పరచడం, భూగోళశాస్త్ర పరిణామక్రమంలో వీటి పాత్రను అర్థం చేసుకోవడం.

**సాంఘిక, రాజకీయ జీవన బోధనా లక్ష్యాలు**

1. సామాజిక, ఆర్థిక, విశ్లేషణా పద్దతులకు ఉపోద్ఘాతాన్నివ్వడం.
2. మౌళిక రాజ్యాంగ విలువలు, లక్ష్యాలను పిల్లలకు పరిచయం చేయడం.
3. ప్రజాస్వామిక పాలన, చట్టంలోని నిబంధనలపై అవగాహనను పెంపొందించడం.
4. క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవాన్ని, సాధారణ లేదా ఆదర్శస్థితిని పోల్చే పద్ధతులను అభివృద్ధి చేయడం.
5. వివిధ జీవన విధానాలనుండి మానవ అనుభవాల విభిన్నతపై విస్తృత అవగాహనను ఏర్పరచడం.
6. వివాదాస్పద అంశాలను పక్కనపెట్టకుండా ఆదరించడం, పరిగణలోనికి తీసుకోవడం.

## సాంఘిక శాస్త్ర బోధన విధానాలు

సాంఘికశాస్త్ర బోధన అనేది సమాచారాన్ని అందించడానికి పరిమితం కావడం వల్ల దానిని బట్టీపట్టి గుర్తుంచుకొని చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. ఇది ఒక సాంప్రదాయంగా నేటికీ కొనసాగుతోంది. పాఠ్యపుస్తకాలకు అసాధారణ ప్రాముఖ్యతను ఇవ్వటం అనేది దీనికి ఒక కారణంగా చెప్పవచ్చు. పాఠ్యపుస్తకాన్ని చదివి, అందులోని (సాంకేతిక) పారిభాషిక పదాలను వివరించి పాఠం చివరి ప్రశ్నలకు జవాబులు రాబట్టడమే ప్రస్తుత బోధనా విధానంగా ఉన్నది. ఎన్.సి.ఎఫ్ – 2005ను అనుసరించి, తరగతి గదిలో పరస్పర చర్యల ద్వారా జ్ఞాన నిర్మాణం జరగాలి. కాబట్టి పిల్లలు ఒక అంశాన్ని నేర్చుకునే క్రమంలో,వారి నిత్యజీవిత సంఘటనల అన్వయం ఆధారంగా అనుభవాలను పరస్పరం పంచుకోవడం, చర్చించడం ద్వారా అభ్యసనం జరగాలి.

జ్ఞాన నిర్మాణం అనేది ఒక సామాజిక ప్రక్రియ. పాతతరంచే అందించబడిన జ్ఞానాన్ని కొత్తతరం జీర్ణించుకొని, అభివృద్ధిపరచి దానిని ముందు తరాలకు అందిస్తుంది. అందువల్ల పిల్లలు తమంతట తామే ఒంటరిగా నేర్చుకోవటం అనే పద్ధతి అనుసరణీయంకాదు. తరగతిగదిలో విషయ నిపుణులు, ఉపాధ్యాయులు (పాఠ్యపుస్తకాల ద్వారా) పిల్లల మధ్య పరస్పర చర్య ద్వారా (Interaction) మాత్రమే జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.

జ్ఞాన సముపార్జన అనేది యాంత్రికంగా జరిగే బదిలీ ప్రక్రియ కాదు. పిల్లలు వ్యక్తిగతంగా తమ స్వీయ అనుభవాల ఆధారంగా ఆలోచించి నిర్మించుకునే ప్రక్రియ కనుక పాఠశాల అనేది కేవలం సమాచార బదిలీని ప్రోత్సహించే స్థలంగా కాకుండా జ్ఞాన నిర్మాణానికి, అభివృద్ధికి అనువైన కేంద్రంగా రూపొందాలి.

సామాజిక శాస్త్రాల బోధనలో నిర్మాణాత్మక అభ్యసనానికి ప్రత్యేక స్థానం కలదు. దీనికై మూడు ప్రధాన ప్రక్రియలను తరగతి గదిలో అనుసరించాల్సిఉంది. మొదటగా ప్రతి విద్యార్థి భౌతిక మరియు మేధోపరమైన కృత్యాలలో పాల్గొనడం. రెండవది – ప్రతిపిల్లవాడు తమ ఆలోచనలను, సందేహాలను తోటి విద్యార్థులతో మరియు ఉపాధ్యాయులతో పంచుకోవడం. మూడవది తాము చర్చిస్తున్న అంశాలకు తమ అనుభవాలను జోడించడం.

పిల్లలలో వివిధ అంశాలపై అవగాహనను అభివృద్ధి పరచడానికి, భావవ్యక్తీకరణకు పాత్రాభినయం, మాదిరి ఎన్నికలు, మాదిరి పార్లమెంట్ / అసెంబ్లి, పాఠశాల సంక్షేమం, వాతావరణం వంటివాటికి సంబంధించిన అంశాలు / సమస్యలపై సమిష్టిగా స్పందించగలగడం, సర్వే, జట్లు ప్రాజెక్టు పనులు సమాచారాన్ని పట్టికల రూపంలో నమోదుచేయడం వంటి కృత్యాలను కల్పించాలి.

సాంఘికశాస్త్ర అభ్యసనలో పాఠ్యాంశాలతో పిల్లలు మమేకం అయ్యేలా ఆలోచింపజేసే కృత్యాలైన – అవగాహన చేసుకోవటం, తమ అనుభవాలను, అవగాహనను దృష్టియందుంచుకొని నిశితంగా సమీక్షించడం, పోల్చడం, భేదాలు చెప్పడం, అనుబంధ అంశాలను జోడించడం, ఊహాత్మక వివరణలివ్వడం మొదలగునవి కీలక పాత్రవహిస్తాయి.

తరగతి గదిలో చర్చను నిర్వహించటంలో ఉపాధ్యాయుడు చాలా సున్నితమైన పాత్రను పోషించాల్సిన అవసరముంది. తరచుగా ఉపాధ్యాయులలో కులం, మతం, లింగం, మొదలగు వాటికి సంబంధించిన సునిశిత అంశాలను నిర్వహించే సందర్భాలలో ఆత్మవిశ్వాసం కొరవడుతుంది. ఎందుకంటే ఇవి తరగతిగదిలో పిల్లల మధ్య వైరుధ్యాలను, వైషమ్యాలను సృష్టిస్తాయని భావిస్తారు. అయిన్పటికి వీటిని అధిగమించడానికి, అవగాహనను కల్పించటానికి, విరుద్ధ భావనలను తొలగించడానికి సమ్మిళిత విధానం (Inclusive Education), విమర్శనాత్మక బోధనా విధానం (Critical pedagogy) ఉపాధ్యాయునికి దోహదపడుతుంది. వీటిద్వారా ఉపాధ్యాయులలో ఆత్మవిశ్వాసం, నమ్మకం, సున్నితత్వం పెంపొందుతాయి.

**పాఠ్యపుస్తకాల పాత్ర :**

కేవలం పాఠ్యపుస్తకాలలో ముద్రిత రూపంలో ఉన్న సమాచారాన్ని బట్టీపట్టి చెప్పడమే / రాయడమే జ్ఞానమనే భావనకు స్వస్తిపలకాలి. పాఠ్యపుస్తకాలే సర్వస్వంకాదు. కాని కొన్ని పరిస్థితులలో పిల్లలకు సాంఘికశాస్త్ర అంశాలకు సంబంధించిన సంప్రదింపు గ్రంథాలు అందుబాటులో ఉండవని మనకు తెలుసు అలాంటి సందర్భాలలో తగిన నాణ్యతతో కూడిన ముద్రిత సామగ్రి కేవలం పాఠ్యపుస్తకాల ద్వారానే పిల్లలకు అందుబాటులో ఉంటుంది. పాఠ్యపుస్తకాలు పాఠ్యపుస్తకేతర అంశాల అభ్యసనకు కూడా దోహదపడటంలో కీలకపాత్ర పోషించాలి. దీనికి అనేక మార్గాలను అనుసరించవచ్చు. ఉదాహరణకు పిల్లలకు సుపరిచితమైన భాషను ఉపయోగించడం, పాఠ్యాంశాలపై ప్రశ్నించడానికి అవకాశమివ్వటం, తమ అనుభవాలను ముద్రించి అంశాలకు జోడించటం, తెలుసుకున్న అంశాలను వివిధ దృక్పథాలతో సరిచూసుకొని నిర్ధారణకు వచ్చేలా చూడటం మొదలైనవి. వాస్తవానికి పాఠ్యపుస్తకాలు అసంపూర్ణమైనవి. ప్రతి తరగతి గదిలో దీనిని బోధనాభ్యసన కృత్యాల ద్వారా మాత్రమే సంపూర్ణం చేయగలమని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు స్పష్టంగా తెలియజెప్పాలి.

పై అంశాల ఆధారంగా ప్రస్తుత పాఠ్యపుస్తకాలను విశ్లేషిస్తే అవి ఆశించిన మేరకు రూపొందించ బడలేదని, ఆకర్షణీయంగా లేవని మనకు తెలుస్తుంది అంతేకాకుండా పాఠ్యపుస్తకంలోని అంశాలను ఏకపక్షంగా (ఇంటరాక్షన్‌కు తావులేకుండా) ఉన్నాయి. కాబట్టి పాఠ్యపుస్తకాల ద్వారా పిల్లలకందించే సామగ్రిపట్ల పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ఈ సందర్భంగా జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్.సి.ఇ.ఆర్.టి.) రాత, దృశ్యరూపంలో పిల్లలకు సవాలు విసిరే విధంగా విస్తృతంగా వైవిధ్యభరితమైన సామగ్రిని రూపొందించటం సాధ్యమేనని ప్రయోగపూర్వకంగా తమ పుస్తకాల ద్వారా తెలిపింది.

ముక్కలు ముక్కలుగా, వేరు వేరుగా వేటికవే సమాచార రూపంలో జ్ఞానాన్ని అందించడంకంటే ఒకదానికొకటి అనుసంధానం చేస్తూ సమ్మిళితంగా అందించటం మేలు.

**పిల్లల భాష :**

పిల్లలు తమకు తెలిసిన, సామాజిక అంశాలను మాతృభాషలో చర్చించటానికి ఎక్కువ ఇష్టపడతారు. సాంఘికశాస్త్ర అంశాలను మాతృభాషలో బోధించడమే ఉత్తమం లేదా తరగతి గదిలో బహుబాషా విధానాన్ని అనుసరించాలి. 'పిల్లల భాషను' మనం వారి సహజ భావవ్యక్తీకరణగా అభివ్యక్తీకరించవచ్చు. సాంప్రదాయ బోధనా పద్ధతులలో పిల్లలు తమ భావాలను స్వంత మాటలలో వ్యక్తీకరించడానికి అవకాశం ఉండదు. అంతేకాకుండా వల్లెవేయడం, పాఠ్యపుస్తకంలో ఉపయోగించిన భాషలో లేదా ఉపాధ్యాయుని భాషలో లిఖితరూపంలో వ్యక్తీకరించేలా పురికొల్పుతుంది. ఇలాంటి బోధనాపద్ధతులకు స్వస్తిచెప్పి, పిల్లల భయాన్ని పోగొట్టి వారి భావాన్ని స్వంతమాటలలో వ్యక్తపరచేందుకు దోహదంచేసే మార్గాలను అనుసరించాల్సి ఉంది. సాంఘికశాస్త్ర అభ్యసనలో పిల్లలు అన్వేషించటం, స్వీయ అనుభవాలను, అవగాహనను స్వంతమాటలలో వ్యక్తీకరించటానికి అవకాశమివ్వటం అత్యంత కీలకం.

# 7 ఉపాధ్యాయుని సంసిద్ధత - ప్రణాళికలు

ఇంతవరకు మనం సాంఘికశాస్త్ర బోధనా లక్ష్యాలు, విధానాలకు చెందిన అంశాలను చర్చించాం. ఇవి ఉపాధ్యాయుని పాత్ర మారాల్సి ఉందని సూచిస్తున్నాయి.

సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ వ్యవస్థ పునర్నిర్మాణం జరగాలి. కేవలం ఉపాధ్యాయుడు ఇతరులు రూపొందించిన విధాన ప్రణాళిక, సిలబస్‌ను ఆచరణలో పెట్టే వ్యక్తికాదు. విద్యాప్రణాళిక, సామాగ్రికి సంబంధించి నిర్ణయం తీసుకోగలిగే వ్యక్తులుగా ఉపాధ్యాయులను గుర్తించాలి. విద్యార్థి లోకానికి, విస్తృత విద్యాప్రణాళిక లక్ష్యాలకు మధ్య ఉన్న అంతరాలను పూడ్చటానికి వీరు కృషి చేయాల్సివుంది. కార్యక్షేత్రంలో తుది నిర్ణయం తీసుకొనే సాధికారత వీరికే వుంది.

సాంఘికశాస్త్ర విద్యలో నిర్ణయాలు చేయటంలో, అవకాశాల కల్పనలో ఉపాధ్యాయుల సాధికారత కీలకమైనది. దీనికి నిర్మాణాత్మక మార్పులతోపాటు ఉపాధ్యాయుల సంసిద్ధత కూడా అవసరం. నిర్ధారిత సమయంలో ఏం చెప్పాలి? ఎలా బోధించాలి? ఏ సామాగ్రి ఉపయోగించాలి? అనే అంశాలలో ఉపాధ్యాయులు స్వతంత్రులై ఉండాలి. అదేవిధంగా ఫలితాలకు కూడా వారు జవాబుదారీతనం వహించాల్సి ఉంటుంది.

## A) ఉపాధ్యాయుల తయారీలో ఈకింది అంశాలు చోటుచేసుకోవాలి :

- బోధనకు అవసరమైన వార్షిక, పాఠ్య ప్రణాళికలను ఉపాధ్యాయులు ముందుగానే తయారుచేసుకోవాలి.
- సాంఘికశాస్త్రాల బోధనా ఉపగమం (Approach), బోధనా పద్ధతులు, విభిన్న సామగ్రి, తరగతి గదిలో అనుసరించాల్సిన బోధనావిధానాలు, వ్యూహాలపై పునశ్చరణ / శిక్షణ ఉండాలి.
- సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు అవసరమైన, ఉపయుక్త గ్రంథాలు, పాఠ్యపుస్తకాలు, గ్లోబు, మ్యాప్, అట్లాస్ వంటి సామగ్రి, పిల్లలకు చేపట్టవలసిన కృత్యాలు, వాటికి తగిన బోధనాభ్యసన సామాగ్రి మొదలగునవి ముందుగానే సిద్ధం చేసుకోవాలి.
- వెబ్‌సైట్లను వీక్షించి, వివిధ అంశాలపై సమగ్ర అవగాహనను పెంపొందించుకోవాలి.
- ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాదం, సమానత్వం మొదలగు అంశాలను అవగాహన పరచుటకై తరగతి గదిలో చేపట్టవలసిన చర్చలు, కృత్యాలపై ఉపాధ్యాయులకు అవగాహన కొరకు చర్చలు నిర్వహించాలి.
- విద్యాహక్కు చట్టం – 2009 ప్రకారం మాధ్యమిక తరగతులు బోధించే సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు సంబంధిత విషయంలో గ్రాడ్యుయేట్ అయిఉండాలి. వీలుకాని పక్షంలో ఉపాధ్యాయులకు తాము అభ్యసించిన విషయాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.
- వృత్తి పూర్వక శిక్షణలో కూడా మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ బోధన సాగాల్సిన అవసరముంది.
- సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులలో వృత్తి నైపుణ్యాలను పెంచడానికై విషయపరమైన నిపుణులతో కూడిన సంస్థలు/ సంఘాలు ఏర్పాటుచేయాలి. సాంఘికశాస్త్ర బోధనోపాధ్యాయుల సంసిద్ధతకు / తయారీకి ప్రేరణ కల్పించడం, వృత్తిపర అభివృద్ధి వంటి కార్యక్రమాలు నిర్వహించాలి.
- CCE, RTE-2009 లను దృష్టిలో ఉంచుకొని పై అంశాలన్నీ నిరంతరంగా కొనసాగాలి.

పిల్లలకు ఏం నేర్పడానికి, లేక ఏ సామర్థ్యాలు సాధించడానికి బోధన చేయాలి అనే అంశంపై ఉపాధ్యాయునికి పూర్తి అవగాహన, పట్టుఉండాలి. నేర్చుకోవడం అనేది పరిశీలించడం, చేయడం, చర్చలు, ఆలోచించడం ద్వారా జరుగుతుంది. కాబట్టి ఎలాంటి చర్చలు ఏ ఏ అంశాలపై చేయించి పిల్లలచే ఆలోచింపచేయాలి, ఎలాంటి కృత్యాలు ఇస్తే పిల్లలు అనుభవం ద్వారా స్వయంగా నేర్చుకుంటారు, ఎలాంటి టి.ఎల్.ఎం.లు ఉపయోగించాలి, వెనుకబడ్డ విద్యార్థులకు ఎలా సహాయం చేయాలి అని ముందుగానే ఆలోచించి ప్రతియూనిట్ లేక పాఠంనకు ప్రణాళిక తయారుచేసుకోవాలి. పాఠ్యపుస్తకాలు పిల్లలను ఉద్దేశించి వ్రాయబడినవి కాబట్టి ఉపాధ్యాయుడు ఇతర రిఫరెన్స్ పుస్తకాలు చదివి, భావనలకు (concepts) తగిన ఉదాహరణలు, కృత్యాలు అదనపు సమాచారం తన టీచింగ్ నోట్స్‌లో రాసుకొని పిల్లలకు అందించాలి. ఉపాధ్యాయులు చదవకుండా, రిఫరెన్స్ పుస్తకాలు చూడకుండా పిల్లల అభ్యసనానికి న్యాయం చేయలేరు. ఉపాధ్యాయుని తయారీ అనేది ఒక వృత్తిపరమైన అభివృద్ధి, బోధన ఉత్తేజపరంగా, పిల్లలకు ప్రేరణ కలిగించే విధంగా ఉండాలి. పరస్పర ప్రతిచర్యలతో, చర్చలతో కూడిన బోధనాభ్యసన ప్రక్రియలలో పిల్లలు ఏకాగ్రతతో పాల్గొని బాగా నేర్చుకొంటారు.

## B) ప్రణాళికలు – వార్షిక మరియు యూనిట్ / పాఠం :

ప్రతి ఉపాధ్యాయుడు తాను బోధించే తరగతికి మరియు సబ్జక్టుకు సంవత్సరాంతానికి పిల్లల్లో ఏమిరావాలి? పిల్లలు ఏ సామర్థ్యాలు సాధించాలి? ఆ సామర్థ్యాల సాధనకు ఎటువంటి బోధన మరియు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి అని ముందే ప్రణాళిక చేసుకోవాలి. ఈ ప్రణాళికలు ముఖ్యంగా రెండు. 1. వార్షిక ప్రణాళిక 2. యూనిట్ / పాఠ్యప్రణాళిక. వీటిపై ప్రతి ఉపాధ్యాయుడికి మంచి అవగాహన ఉండాలి మరియు ఆశించిన సామర్థ్యాలు సాధించడం కోసం ముందే ఆలోచించి ప్రణాళిక తయారు చేసుకొని నిర్వహించాలి. ఈ ప్రణాళికల యొక్క మాదిరి ఫార్మాట్లు ఈ కింద ఇవ్వబడ్డాయి.

### I. వార్షిక ప్రణాళిక (Annual Plan) – సోపానాలు :

1. తరగతి :
2. సబ్జక్టు :
3. సంవత్సరంలో ఈ సబ్జక్టుకు కేటాయించబడిన మొత్తం పీరియడ్లు :
4. సంవత్సరాంతానికి పిల్లల్లో ఆశించే అభ్యసన సామర్థ్యాలు :
5. వార్షిక ప్రణాళిక (నెల మరియు యూనిట్ వారీగా) :

| క్ర.సం. (Sl.No.) | నెల (Months) | యూనిట్/పాఠం (Unit/Lesson) | పీరియడ్ల సంఖ్య (No. of periods) | బోధనా వనరులు మరియు సామగ్రి (Resources for teaching and TLM) | నిర్వహించాల్సిన కార్యక్రమాలు (Activities/programmes to be performed) |
|---|---|---|---|---|---|
| 1 | | | | | |
| 2 | | | | | |
| 3 | | | | | |

6. వార్షిక ప్రణాళిక అమలుపై ఉపాధ్యాయుల ప్రతిస్పందన :
7. వార్షిక ప్రణాళిక మరియు దాని అమలుపై ప్రధానోపాధ్యాయుని సలహాలు మరియు ప్రతిస్పందన

### వార్షిక ప్రణాళిక సోపానాలపై వివరణ :

**సంవత్సరాంతానికి పిల్లల్లో ఆశించే అభ్యసనా సామర్థ్యాలు :** విద్యా ప్రమాణాల ఆధారంగా, పాఠ్యపుస్తకంలోని యూనిట్లను మరియు అంశాలను ఒకసారి చదివి, ఆశించే విద్యా ప్రమాణాలను రాయాలి. ఈ విద్యా ప్రమాణాలను పాఠ్యపుస్తకంలో కూడా రాయడం జరిగింది. ప్రతి విద్యా ప్రమాణానికి సంవత్సరాంతానికి విద్యార్థులలో ఆశించే అభ్యసనా సామర్థ్యాలను రాయాలి.

**బోధనా వనరులు మరియు సామగ్రి (Resources for teaching (TLM)) :** ప్రతి ఉపాధ్యాయుడు ఆ సంవత్సరం బోధించాల్సిన సబ్జక్టుకు కావలసిన వనరులను ముందే సిద్ధం చేసుకోవాలి. వనరులు అనగా ఉపయుక్త గ్రంథావళి ( reference books), ఉపాధ్యాయుల కరదీపికలు, చార్టులు, మ్యాప్‌లు, గ్లోబు, అట్లాస్, ప్రయోగాలకు సంబంధించిన సామగ్రి, బోధనలో ఉపయోగించే సామగ్రి, నిఘంటువులు, సి.డిలు / వీడియోలు, మ్యాగజైన్స్, కంపాస్ బాక్సు, కిట్స్, మోడల్స్, మైక్రోస్కోప్, ఆయారంగాలలో నిపుణులైన వ్యక్తుల సేవల వినియోగం, దినపత్రికల క్లిప్పింగ్స్, టీచింగ్ నోట్స్ మొదలగునవి. ఉపాధ్యాయులు (ఇంకనూ ఆలోచించి) బోధించే విషయాన్ని అనుసరించి తగిన బోధనా వనరులను సొంతంగా తయారు చేసుకోవాలి. బోధన ఆసక్తికరంగా ఉండాలంటే, పిల్లలు అభ్యసనంలో ఉత్సాహంగా పాల్గొనాలంటే ఉపాధ్యాయుడు ముందే ఆలోచించి తగిన వనరులు ఉపయోగించి ఆసక్తికరంగా బోధించుటకు ప్రయత్నించాలి.

**నిర్వహించాల్సిన కార్యక్రమాలు (Activities / programmes to be performed) :** కార్యక్రమాల్లో భాగంగా కేవలం తరగతి గదుల్లో కాకుండా కొన్నిప్రత్యేక కార్యక్రమాలు అనగా క్షేత్ర సందర్శన (field visit), సాంస్కృతిక కార్యక్రమాలు (cultural activities), విజ్ఞాన యాత్రలు (educational tours), సామాజిక సంస్థల సందర్శన (visiting of social institutions), సమాజ సేవ (Social Service), క్విజ్ (Quiz), యూత్ పార్లమెంట్, మాదిరి / నమూనా అసెంబ్లీ (youth parliament / model assembly), పత్రికా సమావేశం (meet the press), సెమినార్లు (seminars), వివిధ రకాలైన చార్టులు, టేబుల్స్, మ్యాప్స్ తయారు చేయుటకు కార్యశాలలు (workshops for material development), దినపత్రికలకు వ్యాసాలు రాయడం (writing articles / case studies to newspapers), పోస్టర్లు తయారు చేయడం (poster writing), కవి సమ్మేళనం, విషయనిపుణులచే ఉపన్యాసాలు (lecturers from experts), కథలు, కవితలు, డ్రాయింగ్స్ మొదలగు సృజనాత్మక అంశాలు (creative activities), మొదలగు కార్యక్రమాలను కూడా వార్షిక ప్రణాళికలో చూపాలి. మరియు అమలు చేయాలి. ఈ కార్యక్రమాల వల్ల విద్యార్థులలో వివిధ సామర్థ్యాలు, అభిరుచులు పెంపొందించబడతాయి. మరియు పాఠశాల ఒక ఆహ్లాదకర ప్రదేశంగా మారుతుంది. దీనికి ప్రతి ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు వృత్తిపరంగా ఆలోచించి వృత్తికి న్యాయం చేయాలి.

### వార్షిక ప్రణాళిక అమలుపై ఉపాధ్యాయుల ప్రతిస్పందన :

నెలవారీగా ఉపాధ్యాయుడు అమలుపై తమ ప్రతిస్పందనలు రాయాలి. అనగా ఉపయోగించిన బోధనాభ్యసన ప్రక్రియలు, వనరులు ఏ రకంగా పిల్లల అభ్యసనానికి తోడ్పడ్డాయి. ఈ పద్ధతుల వల్ల పిల్లలు ఏ మేరకు భాగస్వామ్యం వహించారు? పిల్లల అభ్యసనా ప్రగతి ఎలా ఉంది? వీటిపై ఉపాధ్యాయుడి యొక్క అనుభవాలు, అభిప్రాయాలు రాయాలి. ప్రణాళికపరంగా ఒక్కోసారి నెలవారీ యూనిట్లు పూర్తి చేయలేకపోవచ్చు. అందుకుగల కారణాలను కూడా ఇక్కడ రాయాలి.

### వార్షిక ప్రణాళిక మరియు దాని అమలుపై ప్రధానోపాధ్యాయుని సలహాలు మరియు ప్రతిస్పందన :

పాఠశాల ఆరంభంలోనే ప్రతి ఉపాధ్యాయుడు తమ వార్షిక ప్రణాళికను ప్రధానోపాధ్యాయునికి సమర్పించాలి. మంచి వార్షిక ప్రణాళికను ఉపాధ్యాయులు తమ వేసవి సెలవుల్లోనే తయారు చేసుకోవాలి. ఇందుకు ప్రధానోపాధ్యాయుడు ఏప్రిల్

మాసంలోనే ఉపాధ్యాయులచే ఒక సమావేశం నిర్వహించి వార్షిక మరియు పాఠ్యప్రణాళికలపై చర్చించాలి. ఈ విధంగా సమర్పించిన వార్షిక ప్రణాళికలను ప్రధానోపాధ్యాయుడు పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలను రాయాలి. వార్షిక ప్రణాళిక అమలుపై నెలవారీగా సమీక్షించి తమ అభిప్రాయాలను ఆయా టీచర్ల వార్షిక ప్రణాళికలలోనే నమోదుచేయాలి. పాఠశాలను సందర్శించే పర్యవేక్షణ అధికారులు తప్పనిసరిగా వార్షిక, పాఠ్యప్రణాళికలను చూసి తమ సూచనలను, అమలుతీరును నమోదు చేయాలి.

## I) వార్షిక ప్రణాళిక (Annual Plan)

1. తరగతి : 9వ
2. విషయం : సాంఘికశాస్త్రం
3. సంవత్సరంలో ఈ సబ్జెక్టుకు కేటాయించబడిన మొత్తం పీరియడ్లు : 220

   బోధనకు అవసరమయ్యే పీరియడ్లు : 180
4. సంవత్సరాంతానికి పిల్లల్లో ఆశించే అభ్యసన సామర్థ్యాలు

   1. విషయావగాహన :

      ★ భూమి పరిణామం, భూస్వరూపం, నీటిచక్రం, శీతోష్ణస్థితి, పర్యావరణం, వ్యవసాయ విధానాలు, హరితవిప్లవం, పరిశ్రమలకు అవసరమైన మౌళిక అవసరాలు, పొరుగుసేవలు, రుణాలు, ద్రవ్యోల్బణం, ప్రభుత్వ ఖర్చులు, పునరుజ్జీవనం, రక్తరహిత విప్లవం, జాతీయతాభావం, పారిశ్రామికీకరణం, సామ్యవాదం, వలసవాదం, ప్రజాసామ్యం, హక్కులు, చట్టాలు, ట్రాఫిక్ విద్య గురించి వివరిస్తారు.

      ★ భూ అంతర్గత నిర్మాణం, పవనాలు, వర్షపాతం, అడవులు, పంటలు, పన్నులు, రవాణా, హక్కులను వర్గీకరిస్తారు.

      ★ అక్షాంశాలు-రేఖాంశాలు, శీతోష్ణస్థితి-వాతావరణస్థితి, అడవులు, జీవనవ్యయం-జీవనప్రమాణం, ప్రత్యక్ష పన్నులు-పరోక్షపన్నులు, రాచరికం-ప్రజాస్వామ్యం, లుద్దిజం-సామ్యవాదం, నియంతృత్వం-ప్రజాస్వామ్యం, లోక్అదాలత్-న్యాయస్థానాలకు గల పోలికలు, తేడాలు చెప్పుతారు.

      ★ హిమానీనదాలు, సముద్రాలు, స్థానిక పవనాలు, ఆహారేతపంటలు, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు, సేవారంగం, మానవహక్కులు, ప్రమాదసంబంధిత వైపరీత్యాలకు ఉదాహరణలివ్వగల్గాలి.

   2. ఇచ్చిన అంశాన్ని చదివి అర్థంచేసుకొని, వ్యాఖ్యానించడం :

      ★ శిలాశైథిల్యం, క్రమక్షయం, నిక్షేపణలకు సంబంధించి ఏమి అర్థంచేసుకున్నారో రాస్తారు/చెప్తారు.

      ★ 32వ పేజీలోని విషయాన్ని చదివి, ఉష్ణోగ్రతను ప్రభావితం చేసే మూడు ముఖ్యమైన అంశాలను వివరిస్తారు.

      ★ 113 లో నియత, అనియత రకాలు పేరా చదివి, తమ సొంతమాటల్లో వ్యక్తీకరిస్తారు.

      ★ 137వ పేజీలోని విషయాన్ని చదివి, ప్రత్యక్ష పన్నుల గురించి ఐదు ముఖ్యమైన విషయాలు చెప్తారు.

      ★ 247 పేజీలోని ప్రజాస్వామ్యం గురించిన పేరాలను చదివి, దానిపై తన అభిప్రాయాన్ని చెప్తారు.

      ★ పేజీ 119 లోని బడ్జెట్ గురించి చదివి ఫలితాలను ఊహిస్తారు.

      ★ పేజీ నెం. 245 లోని పేరా చదివి, దీనితో నీవు ఏకీభవిస్తున్నావా? అభిప్రాయాలు చెప్తారు.

      ★ పేజీ నెం. 99 లోని 'పొరుగుసేవలు' పేరా చదువుతారు. దానిపై వాఖ్యానిస్తారు.

   3. సమాచార నైపుణ్యాలు :

      ★ వాతావరణ విస్తరణ చిత్రాన్ని పరిశీలించి, వాతావరణ పొరల పట్టిక తయారుచేస్తారు.

      ★ పేజీ నెం. 64 లోని వ్యవసాయ పంటల పట్టికను అట్లాసు సహాయంతో పూర్తిచేస్తారు. దానిని విశ్లేషిస్తారు.

★ 65వ పేజీలోని వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలకు సంబంధించిన బార్‌గ్రాఫ్‌ను పరిశీలించి, దాని ఆధారంగా విశ్లేషిస్తారు.
★ పేజి నెం. 112 లోని పై (Pie) గ్రాఫ్‌ను పరిశీలించి, పట్టిక తయారుచేస్తారు. దానిని విశ్లేషిస్తారు.
★ పేజి నెం. 125 లోని టోకు ధరల సూచికల గ్రాఫ్ ఆధారంగా చేసుకొని విశ్లేషిస్తారు.
★ వినియోగదారుల ధరల సూచికను అర్థంచేసుకోవడానికి వినియోగ వస్తువుల ధరలను సేకరిస్తారు. పట్టిక తయారుచేస్తారు. విశ్లేషిస్తారు.
★ పేజి నెం. 132 లోని పై (Pie) ఆధారంగా ప్రభుత్వ వ్యయం గురించి ఒక పేరా రాస్తారు.
★ మహిళ రక్షణ చట్టాలు పాఠం చదివి చట్టాలను క్రొనలాజికల్ వరుసలో పట్టిక రూపంలో రాస్తారు.
★ పేజి నెం. 88, 89 లోని బార్‌గ్రాఫ్‌లను పరిశీలిస్తారు. ఒక్కొక్క దానిగురించి ఒక పేరా రాస్తారు.

4. సమకాలిన అంశాలపట్ల ప్రతిస్పందన – ప్రశ్నించడం :
★ అడవులు నరకడం వల్ల కలిగే ఫలితాలను ఊహిస్తారు. నివారణ కొరకు సూచనలిస్తారు.
★ ఆధునిక కాలంలో ఏర్పడే పర్యావరణ సమస్యలకు కారణాలు ఊహిస్తాడు. పర్యావరణ సమస్యలకు కారణాలు సూచిస్తారు.
★ ఆహారపంటలు పండించడం తగ్గటంవల్ల ఏర్పడే పరిణామాలను సహేతుకంగా చెప్తారు.
★ సాగుభూమి యొక్క విస్తీర్ణం రోజురోజుకు తగ్గడంవల్ల ఏర్పడే సమస్యలు చెప్తారు.
★ ప్రకృతి వైపరీత్యాలు, మానవతప్పిద విపత్తుల నిర్వహణ గురించి ప్రశ్నిస్తారు.
★ బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడుల నివారణకు సూచనలిస్తారు.
★ ప్రజలు పొందే హక్కులు, స్వేచ్ఛల గురించి ప్రశ్నిస్తారు.

5. పటనైపుణ్యాలు :
★ ప్రపంచ పటంలో స్థానిక పవనాలను గుర్తిస్తారు.
★ భారతదేశ పటంగీసి, వరి పండించే రాష్ట్రాలకు రంగులు వేస్తారు.
★ భారతదేశపటం ఆధారంగా వస్త్ర పరిశ్రమలు, ఖనిజాలు, బొగ్గుక్షేత్రాలు, బొగ్గుగనులు, ఇనుము ఉక్కు కర్మాగారాల పటాలను పరిశీలించి, విశ్లేషిస్తారు.
★ భారతదేశ పటంలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కులను గుర్తిస్తారు.
★ పారిశ్రామిక విప్లవ కాలంలో ఇంగ్లాండులో ఇనుము, వస్త్ర పరిశ్రమలు కేంద్రీకృతమైన ప్రదేశాలను గుర్తిస్తారు.
★ సామాజిక నిరసనలు జరిగిన ప్రదేశాలను ప్రపంచపటంలో గుర్తిస్తారు.
★ గ్లోబు నమూనాలను తయారుచేస్తారు.

6. ప్రశంస, సున్నితత్వం :
★ అంతరించిపోతున్న అడవులను సంరక్షించడానికి పోస్టర్ తయారుచేస్తారు.
★ వ్యవసాయ రంగంలో రైతు పాత్ర గురించి ప్రశంసిస్తారు.
★ స్త్రీల ఆర్థిక స్వాలంబనకు స్వయం సహాయక బృందాల పాత్రను గుర్తిస్తారు.
★ ప్రమాదాలు జరిగినపుడు తమకు చేతనైన సహాయం చేస్తారు.
★ బాల్యవివాహాలవల్ల జరిగే అనర్థాల గురించి ఒక కరపత్రం తయారుచేస్తారు.
★ ఓటుహక్కు వినియోగించడం గురించి ప్రజలను చైతన్యం చేయడానికి కొన్ని నినాదాలు రాస్తారు.
★ ప్రాథమిక హక్కులు, మానవ హక్కుల గురించి వివరించి, వాటిని పాటిస్తారు.
★ రోడ్డు భద్రతా విద్య గురించి ప్రమాదాల నివారణకు కొన్ని నినాదాలు రాస్తారు.

## 5. వార్షిక ప్రణాళిక (నెల మరియు యూనిట్‌వారిగా) - 9వ తరగతి

| నెల | పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు, సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు |
|---|---|---|---|---|
| జూన్ | 1. భూమి-మనం | 8 | - భూ అంతర్గత నిర్మాణం నమూనాలు<br>- గ్లోబు - నమూనా<br>- ప్రపంచ పటం | వనమహోత్సవం-ప్రకృతిని కాపాడటం; |
| జూలై | 2. భూమి-ఆవరణములు | 8 | - ప్రపంచ పటం<br>- అగ్నిపర్వతాల నమూనా | నమూనాల ప్రదర్శన నిర్మాణాత్మక మూల్యాంకన వివరాల నమోదు |
| | 12. యూరప్‌లో మారుతున్న సాంస్కృతిక సంప్రదాయాలు 1300-1800 | 9 | - యూరప్ పటం<br>- మైఖెలాంజిలో, లియోనార్డో డావెన్సి జీవితచరిత్ర | |
| ఆగస్టు | 3. జలావరణం | 7 | - ప్రపంచ పటం<br>- భౌతిక, భూగోళశాస్త్రం (ఇంటర్, డిగ్రీస్థాయి) | స్వాతంత్రోద్యమానికి సంబందించిన చిత్రాలు వ్యాసాలు, ఉత్తరాల సేకరణ - ప్రదర్శన. |
| | 13. 17, 18వ శతాబ్దాలలో ప్రజాస్వామిక, జాతీయవాద విప్లవాలు | 8 | - ఫ్లోఛార్ట్ - ఎస్టేట్<br>- జాన్‌లాక్, రూసో చిత్రాలు | |
| ఆగస్టు-సెప్టెంబరు | 4. వాతావరణం | 8 | - గ్లోబు<br>- ప్రపంచ పటం | |
| సెప్టెంబరు | 5. జీవావరణం | 7 | - ప్రపంచ పటం<br>- కాలుష్యకారక చిత్రాలు<br>- 2011 జనాభా లెక్కలు | జీవవైవిధ్యానికి చెందిన వార్తల ప్రదర్శన. |
| సెప్టెంబరు-అక్టోబరు | 14. 19వ శతాబ్దంలో ప్రజాస్వామిక జాతీయవాద విప్లవాలు | 8 | - యూరప్ పటం | నిర్మాణాత్మక మూల్యాంకన వివరాల నమోదు |
| అక్టోబరు | 15. పారిశ్రామికీకరణం, సామాజిక మార్పు | 8 | - బ్రిటన్ పటం<br>- జేమ్స్ వాట్, స్టీవెన్సన్ చిత్రాలు | సంగ్రహణాత్మక మూల్యాంకన వివరాల నమోదు |
| నవంబరు | 6. భారతదేశంలో వ్యవసాయం | 8 | - భారతదేశ పటం<br>- పంటల చిత్రాలు<br>- చార్ట్ - పంటలు (బార్‌గ్రాఫ్) | పిల్లలు చేసిన ప్రాజెక్ట్ పనుల ప్రదర్శన |

| నెల | పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు, సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు |
|---|---|---|---|---|
| | | | - రైతులను పాఠశాలకు ఆహ్వానించడం<br>- చిరుధాన్యాలు | |
| | 7. భారతదేశంలో పరిశ్రమలు | 8 | - పరిశ్రమల చిత్రాలు<br>- భారతదేశ పటం<br>- ఖనిజాలు<br>- చార్ట్ - 'పై' (Pie)<br>- సమాచార పట్టికలు | |
| నవంబరు-డిసెంబరు | 16. సామాజిక నిరసనోద్యమాలు | 7 | - పత్రికలలో వచ్చిన ఉద్యమాల క్లిప్పింగ్స్<br>- మానవహక్కుల ప్రకటన | పేదప్రజల స్థితిగతులపై పోస్టర్ తయారి, ప్రదర్శన - ఎగ్జిబిషన్ |
| డిసెంబరు | 17. లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికాలలో వలసవాదం | 8 | - లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికాల పటాలు<br>- ప్రపంచ పటం | |
| | 18. భారతదేశంపై వలసవాద ప్రభావం | 8 | - అడవుల నరికివేత చిత్రాలు<br>- అటవీ ఉద్యమాల గురించి పత్రికలలో వచ్చిన క్లిప్పింగ్స్<br>- అల్లూరి, కొమరంబీమ్ జీవిత చరిత్రలు<br>- స్థానిక కార్మిక ఉద్యమాలు (పేపర్ క్లిప్పింగ్స్) | నిర్మాణాత్మక మూల్యాంకన వివరాల నమోదు |
| జనవరి | 8. భారతదేశంలో సేవా కార్యకలాపాలు | 6 | - టైమ్‌లైన్ చార్ట్<br>- సేవారంగానికి చెందిన చిత్రాలు<br>- సేవారంగంలోని వ్యక్తిని పాఠశాలకు ఆహ్వానించడం<br>- బ్యాంకింగ్, కంప్యూటర్, టెలికమ్యూనికేషన్‌కు సంబంధించిన డేటా పట్టికలు | సంగ్రహణాత్మక మూల్యాంకన వివరాల నమోదు. |
| జనవరి | 19. విస్తరిస్తున్న ప్రజాస్వామ్యం | 6 | - ఆఫ్రికా పటం<br>- ఇతరదేశాల ఉద్యమాలు<br>- ప్రపంచ పటం | సెమినార్ పత్రసమర్పణ |
| జనవరి-ఫిబ్రవరి | 20. ప్రజాస్వామ్యం రూపుదిద్దుకుంటున్న భావన | 6 | - ఆదాయ అసమానతల పట్టిక (ప్రపంచదేశాలు)<br>- ఎన్నికల సామాగ్రి | మాదిరి ఎన్నికలు నిర్వహించడం |

| నెల | పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు, సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు |
|---|---|---|---|---|
| | 9. ద్రవ్యవ్యవస్థ - రుణం | 8 | - స్వయంసహాయక సంఘాల సభ్యులను పాఠశాలకు పిలవడం - మాట్లాడించడం<br>- రుణాలు - ఛార్టు<br>- రుణానికి సంబంధించి నింపే ఫారాలు | బ్యాంక్ సందర్శన |
| ఫిబ్రవరి | మానవహక్కులు-ప్రాథమికహక్కులు | 8 | - ప్రాథమికహక్కుల ఫ్లోచార్టు<br>- మానవహక్కుల సంఘం సభ్యులను పాఠశాలకు అహ్వానించడం<br>- వివిధ సంస్థల లోగోలు | నాటకీకరణ నిర్మాణాత్మక మూల్యాంకన వివరాల నమోదు |
| ఫిబ్రవరి-మార్చి | మహిళా రక్షణ చట్టాలు | 5 | - పత్రికలలో వచ్చిన మహిళలకు సంబంధించిన ఉద్యమాలు, సంఘటనలు.<br>- మహిళలకు సంబంధించిన చట్టాలు.<br>- స్థానికంగా ఉండే మహిళ న్యాయవాదిని పాఠశాలకు పిలవడం. | పోలీస్‌స్టేషన్ సందర్శన-ఎస్.ఐ.తో ముఖాముఖి |
| మార్చి | ధరలు జీవన వ్యయం | 7 | - కుటుంబ బడ్జెట్ చార్ట్<br>- వివిధ రకాల వస్తువుల ప్యాకింగ్ సేకరణ | |
| మార్చి | ప్రభుత్వ బడ్జెట్ పన్నులు | 11 | - దినపత్రికల నుండి సేకరించిన బడ్జెట్ వివరాలు. | నమూనా అసెంబ్లీ-బడ్జెట్ సమర్పణ |
| | విపత్తుల నిర్వహణ | 5 | - దినపత్రికలనుండి సేకరించిన విపత్తులకు సంబంధించిన చిత్రాలు | నినాదాలు, కరపత్రాలు, పోస్టర్స్, దినపత్రికల ప్రదర్శన |
| ఏప్రిల్ | రోడ్డు భద్రతా విద్య | 3 | - ట్రాఫిక్ గుర్తులు<br>- డ్రైవింగ్‌లైసెన్స్ వివిధ ఫారాలు | రవాణావిద్యకు సంబంధించిన నమూనాల ప్రదర్శన సంగ్రహణాత్మక వివరాల నమోదు. |

6. వార్షిక ప్రణాళిక అమలుపై ఉపాధ్యాయుల ప్రతిస్పందన. (నెలకొకసారి రాయాలి)

7. వార్షిక ప్రణాళిక మరియు దాని అమలుపై ప్రదానోపాధ్యాయుని సలహాలు మరియు ప్రతిస్పందన.

## II. యూనిట్ / పాఠ్య (lesson) ప్రణాళిక :

ఏమి బోధించాలి? ఎలా బోధించాలి? ఎటువంటి అభ్యసన కృత్యాలు ఇవ్వాలి? పిల్లల్ని ఏవిధంగా అభ్యసనంలో భాగస్వాములను చేయాలి? ఏమి కొత్త విషయాలు చెప్పాలి? అనేవి ఉపాధ్యాయుడు ముందు ఆలోచించి ప్రణాళిక తయారు చేసుకోవాలి. కావున, ప్రణాళిక సులభతరంగా, ఆచరణయోగ్యంగా, ఆలోచించేవిధంగా ఉండటానికి ఒక కొత్త ఫార్మాట్ తయారుచేయడమైనది. ఈ ప్రణాళిక రెండింటికి కలిపి అనగా యూనిట్ మరియు పీరియడ్ ప్లాన్‌లను కలిగి ఉంటుంది. ఈ ప్రణాళికలోని సోపానాలు ఈకిందివిధంగా ఉంటాయి. అన్ని సబ్జక్టులకు ఇదే ఫార్మాట్‌ను ఉపయోగించాలి.

### యూనిట్ / పాఠ్య (lesson) ప్రణాళికలోని సోపానాలు :

1. యూనిట్/పాఠం పేరు :
2. తరగతి :
3. యూనిట్‌కు కేటాయించిన మొత్తం పీరియడ్ల సంఖ్య :
4. సాధించాల్సిన విద్యా ప్రమాణాలు :
5. పీరియడ్ వారీగా భావనలు, బోధనాభ్యసన అంశాలు మరియు విధానాలు :

| పీరియడ్ సంఖ్య (Periods) | బోధించాల్సిన అంశం/భావనలు (Teaching item/ concepts) | బోధనా వ్యూహాలు/అభ్యసనా అనుభవాలు (Teaching learning strategies/learning experiences) | బోధనాభ్యసన సామగ్రి (Resources for teaching [TLM]) | విద్యార్థుల అవగాహన పరిశీలన |
|---|---|---|---|---|
| 1<br>2<br>3 | | | | |

6. టీచింగ్ నోట్స్ – Teaching Notes : (బోధనాంశాలు మరియు విధానాలపై ఉపాధ్యాయుడు అదనంగా సేకరించుకోవాల్సిన సమాచారం.
7. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు :

### పాఠ్యప్రణాళికలోని సోపానాలపై వివరణ

**సాధించాల్సిన విద్యా ప్రమాణాలు :** యూనిట్/మొత్తం పాఠంను ముందే ఒకసారి పూర్తిగా చదివి అవగాహన చేసుకొని ఆ పాఠం ద్వారా సాధించే సామర్థ్యాలను విద్యాప్రమాణాల వారీగా రాయాలి. విద్యా ప్రమాణాల గురంచి పాఠ్యపుస్తకాలలో కూడా వివరణ ఇవ్వడం జరిగింది. పాఠం చివరలో ఉన్న అభ్యాసాలు కూడా విద్యా ప్రమాణాల ఆధారంగానే ఉన్నాయి. కావున, ఉపాధ్యాయులు చదివి, ఈ విద్యా ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాలి. ఇవి ముందే రాయడం వల్ల ఇవి సాధించడానికి ఎలాంటి బోధనాభ్యసన ప్రక్రియలను మరియు వనరులను వినియోగించాలో ఉపాధ్యాయునికి ఒక అవగాహన కలుగుతుంది.

### పీరియడ్ వారీగా భావనలు, బోధనాభ్యసన అంశాలు మరియు విధానాలు :

**భావనలు / అంశాలు (concepts / areas) :**

ప్రతి పాఠంలో కొన్ని ముఖ్యమైన భావనలు ఉంటాయి. భాషేతర సబ్జక్టులలో వీటిని ముఖ్యంగా పాఠంలో శీర్షికలు (side headings) గా చూపడం జరిగింది. ఇవేకాకుండా ఈ భావనలు ఒక్కోసారి పాఠంలో అంతర్లీనంగా ఉంటాయి.

ఉపాధ్యాయుడు వీటిని గుర్తించి ఈ భావనలను పీరియడ్ల వారీగా ప్రణాళిక చేసుకోవాలి. ఈ భావనలకు సంబంధించిన సమాచారాన్ని ఉపయుక్త గ్రంథావళి చదవడం ద్వారా సేకరించి మంచి సమాచారాన్ని పిల్లలకు ఇవ్వడానికి ప్రయత్నించాలి. ఈ అదనపు సమాచారాన్ని టీచింగ్ నోట్స్ కింద ప్రణాళికలో రాసుకోవాలి.

**బోధనాభ్యసన విధానాలు :**

బోధనా వ్యూహాలు ప్రతి సబ్జక్టుకు వివిధ రకాలుగా ఉంటాయి. నేర్చుకోవడం అనేది వినడం ద్వారా, చదవడం ద్వారా కాకుండా ఇతర పద్ధతులు అంటే చర్చలు (dialogues and discussions), కృత్యాలు (activities), ప్రాజెక్టులు (projects), ప్రశ్నించడం (questioning), పరిశీలన (observation), అన్వేషణ (exploration), కనుగొనడం (discovery), విశ్లేషణ (analysis), సంశ్లేషణ (synthesis), మూల్యాంకనం (evaluation) మొ॥వి.

బోధనాభ్యసన విధానాలు ముఖ్యంగా కాన్సెప్ట్ మ్యాపింగ్ (concept mapping), ప్రశ్నలు మరియు చర్చ (questions and discussions), చదవడం మరియు ప్రతిస్పందించడం (reading and reflection), పదజాలంపై చర్చ (discussion on vocabulary), పటాలు (mapping activity), క్షేత్ర సందర్శన (field visit), కేస్ స్టడీ (case study), జట్టుపని–ప్రదర్శన మరియు చర్చ (group work, presentation and discussion), ప్రశ్నించడం మరియు వాదనలు (questioning and arguments), పరిస్థితి విశ్లేషణ మరియు ప్రతిస్పందన (situation analysis and reflection), సమాచార సేకరణ–సేకరణ–విశ్లేషణ మరియు ప్రదర్శన (information collection, analysis and presentation). ప్రాజెక్టు పనులు (project works), KWL technique - Waht I know ? What additionally I want to know? and What I learnt? (prior knowledge, knowledge to be acquired through lesson transactions and knowledge gained finally).

**బోధనా వనరులు మరియు సామగ్రి (Resources for teaching [TLM]) :**

ప్రతి ఉపాధ్యాయుడు బోధించాల్సిన యూనిట్/పాఠానికి కావలసిన వనరులను ముందే సిద్ధం చేసుకోవాలి. వనరులు అనగా ఉపయుక్త గ్రంథావళి (reference books). ఉపాధ్యాయుల కరదీపికలు, చార్టులు, మ్యాప్‌లు, గ్లోబు, అట్లాస్, ప్రయోగాలకు సంబంధించిన సామగ్రి, బోధనలో ఉపయోగించే సామగ్రి, నిఘంటువులు, సి.డి.లు/వీడియోలు, మ్యాగజైన్స్, కంపాస్ బాక్సు, కిట్స్, మోడల్స్, మైక్రోస్కోప్, ఆయా రంగాలలో నిపుణులైన వ్యక్తుల సేవల వినియోగం, దినపత్రికల క్లిప్పింగ్స్, టీచింగ్ నోట్స్ మొదలగునవి. ఉపాధ్యాయులు ఇంకనూ ఆలోచించి బోధించే విషయాన్ని అనుసరించి తగిన బోధనా వనరులను సొంతంగా తయారుచేసుకోవాలి. బోధన ఆసక్తికరంగా ఉండాలంటే పిల్లలు అభ్యసనంలో పాల్గొనాలంటే ఉపాధ్యాయుడు ముందే ఆలోచించి తగిన వనరులు ఉపయోగించి ఆసక్తికరంగా బోధించుటకు ప్రయత్నించాలి.

**పాఠ్యపుస్తకంలో ఉన్న సమాచారాన్ని టీచింగ్ నోట్స్ కింద రాయకూడదు**

- ఈ ప్రణాళికకు ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఒక పెద్ద నోట్‌బుక్ పెట్టుకోవాలి. ప్రతి యూనిట్/పాఠానికి దాదాపు 20 పేజీల వరకు వదిలేయాలి. ప్రతి ఉపాధ్యాయుడు సొంతంగా తయారై ఆ పాఠానికి సంబంధించిన బోధనాంశాలు / భావనలపై సమాచారం అనగా ఆ అంశాలకు సంబంధించిన అదనపు సమాచారం, కొత్త ఉదాహరణలు, ఆలోచింపజేసే ప్రశ్నలు, అదనపు కృత్యాలు, సంబంధించిన కథలు, సంఘటనలు మొదలగునవి సేకరించి అనగా రెఫరెన్స్ పుస్తకాలు మరియు మ్యాగజైన్లు, వార్తాపత్రికల నుంచి సేకరించి టీచింగ్ నోట్స్ కింద రాసుకోవాలి. ప్రతి సంవత్సరం కొత్త విషయాలు ఈ టీచింగ్ నోట్స్‌కు చేర్చాలి. దీనికి ఎక్కువ పేజీలు కేటాయించాలి. ఒక ఉపాధ్యాయుని యొక్క వృత్తిపరమైన తయారీ ఈ టీచింగ్ నోట్స్ పరిశీలిస్తే తెలిసిపోతుంది. పాఠ్యపుస్తకంలో ఉన్న సమాచారాన్ని మాత్రం ఈ టీచింగ్ నోట్స్ కింద రాయకూడదు. కేవలం అదనపు సమాచారం మాత్రమే ఉదాహరణలు, కృత్యాలు, ఆలోచింపజేసే ప్రశ్నలు మొదలగునవి రాయాలి.

**ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :**

- ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు అంటే పాఠం ఏరకంగా జరిగింది? పిల్లలు ఏమి నేర్చుకున్నారు? ఏ పద్ధతి నేర్చుకోవడానికి బాగా ఉపయోగపడింది? ఏఏ పిల్లలు సృజనాత్మకంగా జవాబులు చెప్పారు? మంచిగా జరిగిన తరగతులు, జరగని తరగతులు, కారణాలు, మంచిగా అనిపించిన అంశాలు, విజయవంతమైన వ్యూహాలు మొదలగునవి మరియు తన అనుభవాలను ఉపాధ్యాయుడు ఇక్కడ రాయాలి.

  **ప్రతి సంవత్సరం ఉపాధ్యాయుడు ఈ పాఠ్య ప్రణాళికలను మరియు వార్షిక ప్రణాళికలను తయారుచేసుకోవాలా?**

  ప్రతి సంవత్సరానికి మరియు యూనిట్/పాఠాలకు ప్రణాళికలను రాయవలసిన అవసరం లేదు. ఒకసారి రాసుకున్న తరవాత పుస్తకాలు మారనంత వరకు వాటినే కొనసాగించవచ్చు. కానీ ప్రతి సోపానం కింద అదనపు సమాచారాన్ని అనగా బోధనాభ్యసన ప్రక్రియలు, వనరులు, టీచింగ్ నోట్స్, ప్రతిస్పందనలు అదనంగా అవసరమైనది మెరుగుకోసం ప్రతి సంవత్సరం రాసుకోవాలి.

- ప్రతి యూనిట్‌కు, ప్రతి సంవత్సరానికి టీచింగ్ నోట్స్ కింద మరియు ఉపాధ్యాయుని ప్రతిస్పందనల కింద ఉపాధ్యాయుడు రాసుకోవాలి. ఈ ప్రణాళిక కొన్ని సంవత్సరాల వరకు పనిచేస్తుంది. కొత్త విషయాలను ఎప్పటికప్పుడు వివిధ పుస్తకాలు చదివి టీచింగ్ నోట్స్ కింద రాసుకోవాలి.

- ముఖ్యంగా టీచింగ్ నోట్స్ కింద ప్రతి ఉపాధ్యాయుడు ఆధార మరియు ఉపయుక్త గ్రంథాలు, మ్యాగజైన్లు, దినపత్రికలు, ఉపాధ్యాయ కరదీపికలు చదివి, అదనపు సమాచారాన్ని, పిల్లలను ఆలోచింపజేసే ప్రశ్నలు, పజిల్స్, కృత్యాలు, ఉదాహరణలు, ఆలోచింపజేసే కేస్‌స్టడీలు, టీచింగ్ నోట్స్ కింద ప్రతి సంవత్సరం రాయాలి. వీటిని బోధనలో ఉపయోగించడం ద్వారా బోధనాభ్యసనం ఆసక్తికరంగా ఉంటుంది. పిల్లలు ఆలోచించడం మరియు వారి భాగస్వామ్యం పెరుగుతుంది. కావున ప్రతి టీచరు ప్రతిరోజు బోధనకు ఉపయోగపడే ఉపయుక్త గ్రంథావళి మరియు మ్యాగజైన్లను చదవడం అలవాటు చేసుకోవాలి. ఉపాధ్యాయ వృత్తిపరమైన నైపుణ్యాలకు మరియు పిల్లలకు న్యాయం చేయాలంటే ఇది తప్పనిసరి. చదవడం ఆగిపోతే చదివే అలవాటు లేకపోతే వృత్తిలో స్తబ్ధత చోటు చేసుకుంటుంది. దీనివల్ల చెప్పేవారికి, వినేవారికి అనాసక్తి ఏర్పడుతుంది. కావున పుస్తక పఠనం, ప్రతిస్పందించడం, చర్చించడం, అనేవి వృత్తిపరమైన అభివృద్ధికి మూలాధారాలు. ఇవి లేకుండా మనం బోధించేది ఉండదు, పిల్లలు నేర్చుకునేదీ ఉండదు.

# పాఠ్యప్రణాళిక (Lesson Plan)

1. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు
2. తరగతి : 9వ
3. పీరియడ్‌ల సంఖ్య : 11
4. పాఠం లక్ష్యాలు లేదా పాఠం ద్వారా ఆశించే సామర్థ్యాలు

**(a) విషయావగాహన :**

★ ప్రభుత్వానికి బడ్జెట్ అవసరం గురించి వివరిస్తారు.

★ ఆదాయపుపన్ను, ఎక్సైజ్ సుంకానికి మధ్యగల వ్యత్యాసాలు చెబుతారు.

★ పన్నుల విధింపు వల్ల పేదవారికి కలిగే ఇబ్బందులకు కారణాలు చెబుతారు.

★ ఎక్సైజ్ సుంకానికి, కస్టమ్స్ సుంకానికి మధ్యగల వ్యత్యాసాలు చెబుతారు.

★ పన్నుల విధింపులో సరైన విధానం గురించి వివరిస్తారు.

★ ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు ఉదాహరణలిస్తారు.

★ పన్నుల ఎగవేతకు కారణాలు చెబుతారు.

★ ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు గల తేడాలను చెబుతారు.

**(b) పాఠ్యాంశాన్ని చదివి అర్థంచేసుకొని, వ్యాఖ్యానించడం :**

★ పేజీ నెం. 139 లోని రెండవపేరా చదివి దానిపై వ్యాఖ్యానించడం.

★ ప్రత్యక్ష పన్నులు అనే పేరాను చదివి తన అభిప్రాయాలు చెబుతారు.

**(c) సమాచార నైపుణ్యాలు :**

★ కుటుంబాల ఆదాయ, వ్యయ సమాచారాన్ని సేకరించి, పట్టికలో నమోదుచేసి, విశ్లేషిస్తారు.

★ పేజీ నెం. 132 లోని పై (Pie) ఛార్టును గ్రాఫ్ రూపంలోకి మారుస్తారు.

★ పై (Pie) ఛార్టు ఆధారంగా ప్రభుత్వ వ్యయం గురించి విశ్లేషిస్తూ రాస్తారు.

★ వివిధ రకాల వస్తువులను సేకరించి, ధరల పట్టికను తయారుచేస్తారు.

**(d) సమకాలీన అంశాలపై ప్రతిస్పందన – ప్రశ్నించుట :**

★ తరచుగా పెరుగుతున్న బస్సుచార్జీల వల్ల కలిగే పరిణామాలపై ప్రతిస్పందిస్తాడు.

★ రకరకాల పన్నులపై ప్రశ్నిస్తారు.

★ పన్నుల పెంపువల్ల నేటి మానవుని జీవన విధానములో కలిగే మార్పులపై ప్రతిస్పందిస్తారు.

**(e) పట నైపుణ్యాలు :**

★ భారతదేశ పటంలో ప్రభుత్వరంగ సంస్థలుండే కొన్ని నగరాలను గుర్తిస్తారు.

**(f) ప్రశంస, సున్నితత్వం :**

★ పన్నుల ఎగవేత గురించి కొన్ని నినాదాలు రాస్తారు.

★ పన్నులు సక్రమంగా చెల్లించేవారిని ప్రశంసిస్తారు.

★ ప్రభుత్వం కల్పించే ప్రజాసంక్షేమ పథకాలకు పన్నుల రాబడి మూలాధారం అని గుర్తిస్తారు.

## 5. పీరియడ్‌వారిగా భావనలు, బోధనాభ్యసన అంశాలు మరియు విధానాలు

| పీరియడ్ | భావనలు/బోధనాంశం | బోధనా వ్యూహాలు, పద్ధతులు / అభ్యసన అనుభవాలు | TLM / వనరులు | పిల్లల అవగాహన - పరిశీలన |
|---|---|---|---|---|
| 1వ | ప్రభుత్వ బడ్జెట్-పన్నులు<br>- ప్రభుత్వ పాత్ర | ★ కాన్సెప్ట్ మ్యాపింగ్<br>★ పదజాలంపై చర్చ<br>★ చదువుట - ప్రతిస్పందించుట<br>★ ప్రశ్నలు మరియు చర్చ | ★ ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించే చిత్రాలు<br>★ బడ్జెట్‌కు సంబంధించిన పేపరు కటింగ్స్ | ★ ప్రభుత్వానికి బడ్జెట్ ఎందుకు అవసరం?<br>★ ప్రభుత్వాలు ప్రజలకు రాయితీలు ఎందుకిస్తాయి ? |
| 2వ | - ప్రభుత్వ ఖర్చులు | ★ ప్రశ్నలు మరియు చర్చ<br>★ చదువుట - ప్రతిస్పందించుట<br>★ విశ్లేషణ (Pie chart) | ★ బడ్జెట్‌కు సంబంధించిన పేపరు కటింగ్స్ | ★ ప్రభుత్వాలు వేటిపై ఖర్చు చేస్తాయి?<br>★ ప్రభుత్వ బడ్జెట్ ప్రతి సం॥రం ఎందుకు పెరుగుతుంది? |
| 3వ | - పన్నులు<br>- పరోక్ష పన్నులు<br>★ ఎక్సైజ్ సుంకం<br>★ అమ్మకపు పన్ను | ★ పరిస్థితి విశ్లేషణ - ప్రతిస్పందన<br>★ ప్రశ్నించుట<br>★ సమాచార సేకరణ, ప్రదర్శన విశ్లేషణ | ★ వివిధ వస్తువుల సేకరణ<br>★ (సబ్బుకవర్లు, టూత్‌పేస్ట్ డబ్బాలు, ఉప్పుప్యాకెట్ లాంటివి) | ★ ఎక్సైజ్ సుంకానికి, కస్టమ్స్ సుంకానికి మధ్య గల వ్యత్యాసాలు ఏవి ?<br>★ పన్ను వలన ఇనుముధర పెరిగితే ఏమౌతుంది?<br>★ పరోక్ష పన్నులకు ఉదాహరణ లివ్వండి. |
| 4వ | - విలువ ఆధారిత పన్ను (VAT) | ★ కాన్సెప్ట్ మ్యాపింగ్<br>★ చదువుట - ప్రతిస్పందించుట<br>★ జట్టు పని - ప్రదర్శన - చర్చ<br>★ ప్రశ్నించుట | ★ VAT సూచించే బిల్లులు | ★ వ్యాట్ (VAT) వల్ల కలిగే ప్రయోజనాలు ఏవి ?<br>★ విలువ ఆధారిత పన్నుపై మీ అభిప్రాయం చెప్పండి. |
| 5వ | - ప్రత్యక్ష పన్నులు<br>★ ఆదాయపు పన్ను<br>★ కార్పొరేట్ పన్ను | ★ చదువుట - ప్రతిస్పందించుట<br>★ ప్రశ్నించుట<br>★ ప్రశ్నలు - చర్చ<br>★ జట్టుపని - ప్రదర్శన - చర్చ | ★ పన్నులకు సంబంధించిన సమాచార పట్టికలు | ★ ప్రత్యక్ష పన్నులకు, పరోక్ష పన్నులకు గల తేడాలు ఏమిటి ?<br>★ ప్రత్యక్ష పన్నులకు ఉదాహరణ లివ్వండి<br>★ ఆదాయపుపన్ను, ఎక్సైజ్‌సుంకానికి మధ్య గల వ్యత్యాసాలు చెప్పండి. |

| పీరియడ్ | భావనలు/బోధనాంశం | బోధనా వ్యూహాలు, పద్ధతులు / అభ్యసన అనుభవాలు | TLM / వనరులు | పిల్లల అవగాహన - పరిశీలన |
|---|---|---|---|---|
| 6వ | పన్నుల విదింపు | ★ ప్రశ్నలు - చర్చ<br>★ చదువుట - ప్రతిస్పందించుట ప్రశ్నించుట - వాదనలు | ★ విలాస వస్తువుల చిత్రాలు | ★ పన్నుల విధింపులో ఏది సరైన విధానం? ఎందుకు?<br>★ విలాస వస్తువులపై పన్నులు ఎక్కువ ఎందుకు విధిస్తారు?<br>★ పన్ను పెంపు మానవ జీవనంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? |
| 7వ | - పన్నుల వసూలు<br>- పన్నుల ఎగవేత | ★ చదువుట - ప్రతిస్పందించుట<br>★ ప్రశ్నించుట<br>★ పదజాలంపై చర్చ | ★ నల్లధనంపై వచ్చిన పేపర్ స్టేట్‌మెంట్స్<br>★ పన్నుల వసూలుకు సంబంధించిన కేంద్రప్రభుత్వం ఇచ్చే అడ్వర్టయిజ్‌మెంట్స్ | ★ నల్లధనంపై నీ అభిప్రాయం చెప్పండి.<br>★ పన్నులు ఎందుకు ఎగవేస్తారు?<br>★ పన్ను ఎగవేయకుండా ఉండాలంటే ఏమి చేయాలి? |
| 8వ | - కీలక పదాలు | ★ పూర్తి తరగతిలో చర్చ | | |
| 9వ | మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి<br>★ విషయావగాహన | ★ ప్రశ్నలు - చర్చ | | |
| 10వ | ★ ఇచ్చిన అంశాన్ని చదివి అర్థంచేసుకొని వ్యాఖ్యానించడం<br>★ సమాచార నైపుణ్యాలు | ★ చదువుట - ప్రతిస్పందించుట<br>★ సమాచార విశ్లేషణ | ★ సమాచార పట్టికలు | |
| 11వ | ★ సమకాలీన అంశాలపై<br>★ ప్రతిస్పందన<br>★ పట నైపుణ్యాలు<br>★ ప్రశంస, సున్నితత్వం | ★ మ్యాపింగ్<br>★ ప్రశ్నలు - చర్చ<br>★ ప్రతిస్పందన | ★ ఇండియా పటం | |

6. ఉపాధ్యాయుని నోట్స్ : (అదనపు సమాచారం, ఆలోచింపచేసే ప్రశ్నలు, అదనపు కృత్యాలు)

★ ప్రత్యక్షపన్నులు : (i) ఆదాయం, వ్యయంపై పన్నులు. ఉదా : వ్యక్తి ఆదాయపన్ను, కార్పొరేట్‌పన్ను, వడ్డీపై పన్ను, వ్యయపన్ను.

(ii) ఆస్తి, మూలధన ఆస్తులపై పన్నులు. ఉదా : సంపదపన్ను, కానుకపన్ను, ఎస్టేట్‌డ్యూటీ.

★ పన్నేతర రాబడి : ప్రభుత్వం ఇతర మార్గాల ద్వారా సేకరించే రాబడి.

◆ పరిపాలనా సంబంధ రాబడికి ఉదాహరణ : లైసెన్స్ రుసుము, ప్రవేశ రుసుము, ట్యూషన్ ఫీజు, పెనాల్టీలు.

★ వాణిజ్య సంబంద రాబడి : ప్రభుత్వరంగ సంస్థల ద్వారా వచ్చే రాబడి.

ఉదా : IOC, BSNL, BHEL, ఇండియన్ రైల్వేస్, ఇండియన్ ఎయిర్‌లైన్స్

★ రుణాలు, సహాయక గ్రాంట్స్, విరాళాలు.

★ ఆలోచింపచేసే ప్రశ్నలు :

◆ ప్రభుత్వాలు ప్రజలకు రాయితీలు ఎందుకివ్వాలి? ఇవ్వకపోతే ఏమవుతుంది?

◆ పన్నుల విధింపు విధానం ఎలా ఉంటే బాగుంటుంది?

◆ విలాస వస్తువులపై పన్ను ఎక్కువగా ఉండడం సమర్థిస్తావా? ఎందుకు?

(ఈ సోపానం కింద కనీసం 10 పేజీలు వదిలిపెట్టాలి)

7. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు (ఉపాధ్యాయుని తరగతిగది అనుభవాలు, ఫీలింగ్స్ రాయాలి).
దీనికొరకు కూడ 10 నుంచి 20 పేజీలు వదలాలి.

## III. బోధనా సోపానాలు

**సాంఘికశాస్త్ర బోధన :**

### I. ఉపోద్ఘాతం

1. పలకరింపు :
2. మైండ్ మ్యాపింగ్ / పునశ్చరణ ప్రశ్నలు :
3. పాఠ్యాంశ ప్రకటన :

### II. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట

1. గుర్తించుట :
2. అవగాహన కల్గించుట :

### III. భావనల అవగాహన - చర్చ

1. మాట్లాడించుట : పిల్లలు చదివిన అంశంపై మాట్లాడించుట
2. ప్రశ్నించుట : చదివిన పాఠ్యాంశంపైన, అర్థంకాని అంశాలపైన పిల్లలు ప్రశ్నలు అడుగుట
3. పాఠ్యాంశ భావనలపై అవగాహన ప్రశ్నలు

ఉపాధ్యాయుడు సమకాలీన అంశాలను జోడిస్తూ, పాఠ్యాంశం అవగాహన ప్రశ్నలు / చిత్రం లేదా పటంపై ముందుగా తయారుచేసుకున్న ప్రశ్నలను నల్లబల్లపై రాయుట.

**4. నైపుణ్యాలను అభ్యాసం చేయుట :**

సమాచార నైపుణ్యాలు :

పట నైపుణ్యాలు :

బోధనా సోపానాల గురించి తెలుసుకున్నారు కదా మరి తరగతి గదిలో వీటిని నిర్వహించడానికి ఒక్కొక్క సోపానం గురించి వివరంగా తెలుసుకుందామా!

**1. ఉపోద్ఘాతం :**

ఉపాధ్యాయుడు తరగతి గదిలోకి ప్రవేశించిన తరువాత మొదట తానే పిల్లలను పలకరించాలి. తరువాత చెప్పబోయే పాఠ్యాంశానికి సంబంధించి భావనలపై మైండ్ మ్యాపింగ్ / కాన్సెప్ట్ మ్యాపింగ్ ద్వారా పిల్లల పూర్వ అనుభవాలను తెలుసుకోవాలి.

దీనివల్ల చెప్పబోయే భావనల గురించి పిల్లలకు ఏమి తెలుసో, ఉపాధ్యాయుడు తెలుసుకోవచ్చు. దీని ద్వారా ఉపాధ్యాయునికి తాను ఏమి అందించాలో ఒక అవగాహన ఏర్పడుతుంది. అలాగే భావన రెండో పీరియడ్‌లో కూడా చెబుతున్నప్పుడు మొదటి పీరియడ్‌లో నేర్చుకొన్న అంశాలపై పునశ్చరణ ప్రశ్నలు అడగాలి. తరువాత పాఠ్యాంశ ప్రకటన చేయాలి. నల్లబల్లపై వ్రాయాలి.

**2. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట :**

ఉపాధ్యాయుడు చెప్పబోయే పాఠ్యాంశానికి సంబంధించి పిల్లలను వ్యక్తిగతంగా చదవమనాలి. పాఠంలోని విషయాలను చిత్రాలను, పట్టికలను, పటాలను, గ్రాఫ్‌లను పరిశీలించి అవగాహన చేసుకోమనాలి. పిల్లలను పాఠం చదివిన తరువాత తమకు అర్థం గాని భావనలు, సాంకేతిక పదజాలం, తెలియన పదాల క్రింద పెన్సిల్‌తో గీత గీయమనాలి.

ఉపాధ్యాయుడు పిల్లలకు తెలియని పదాలు, గీత గీసిన వాటిని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. తెలియని పదాలను విద్యార్థులు ఒక్కొక్కరుగా చెబుతూ ఉంటే ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి. ఉపాధ్యాయుడు ఒక్కొక్క పదాన్ని పిల్లలచే చర్చింపజేసి పాఠ్యాంశంపై అవగాహన కల్గించాలి.

**3. భావనల అవగాహన - చర్చ :**

ఉపాధ్యాయుడు పిల్లలచేత పాఠ్యాంశం గురించి మాట్లాడించాలి. అందరు పిల్లలు మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి. తర్వాత పాఠ్యాంశంలో తమకు అర్థం కాని మరియు సమకాలీన అంశాలపై పిల్లలు ప్రశ్నలు అడిగేటట్లు ప్రోత్సహించాలి. వాటిని నల్ల బల్లపైన వ్రాయాలి. తరువాత ఉపాధ్యాయుడు పాఠంలోని విషయము / చిత్రము / పటము / గ్రాఫ్ / పట్టిక గురించి అవగాహన చేయించడానికి కొన్ని ఆలోచింపజేసే ప్రశ్నలు (విద్యా ప్రమాణాల ఆధారంగా) నల్లబల్లపై రాయాలి. ఈ ప్రశ్నలను మొత్తం తరగతి/జట్టు కృత్యంగా నిర్వహించాలి. ఉపాధ్యాయుడు ఒక్కొక్క ప్రశ్నకు పిల్లలు చెప్పిన సమాధానాలను నల్లబల్లపై ముఖ్యాంశాలుగా concept maping చుట్టూ రాయాలి. ఒకవేళ పిల్లల నుండి సరియైన సమాధానం రాకపోతే ఉపాధ్యాయుడు సమాధానాన్ని తాను కూడా జోడించాలి. ఇలా concept maping చుట్టూ ముఖ్యంశాలు రాస్తూ, ఉపాధ్యాయుడు ప్రశ్నల వారీగా మొత్తం పాఠ్యాంశంపై అవగాహన కల్పించాలి.

**4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం.**

ఉపాధ్యాయుడు సమాచార నైపుణ్యాలు, పట నైపుణ్యాలను తగగతి గదిలో అభ్యాసం చేయించాలి. పాఠ్యాంశంలోని సమాచార పట్టికలను పూర్తి చేయించడం, విషయం ఆధారంగా పట్టికలను తయారు చేయించడం, పట్టిక ఆధారంగా ప్రశ్నలు ఇచ్చి విశ్లేషింపచేయడం, పట్టిక ఆధారంగా గ్రాఫ్ రూపంలో చూపటం, గ్రాఫ్ ఆధారంగా ప్రశ్నలు ఇచ్చి విశ్లేషింపచేయడం వంటివి తరగతి గదిలో ఉపాధ్యాయుడు పిల్లలతో అభ్యాసం చేయించాలి. ఒక వేళ చెప్పే పాఠంలో సమాచార నైపుణ్యాలకు

అవకాశం లేనట్లయితే ఉపాధ్యాయుడు స్వయంగా పట్టికలను తయారు చేయడం, టెక్ట్స్, గ్రాఫ్‌లను సేకరించి పిల్లలచే అభ్యాసం చేయించడం. ఇలా అభ్యాసం చేయించడం వల్ల పిల్లల్లో సమాచార నైపుణ్యాలైన సేకరణ, నమోదు, విశ్లేషణ, నిర్ధారణకు రావడం వంటివి పెంపొందుతాయి.

అలాగే పట నైపుణ్యాలలో పాఠ్యాంశంలోని పటాలను పరిశీలించటం, గుర్తించడం, విశ్లేషించడం, గీయడం వంటివి పిల్లలచే అభ్యాసం చేయించాలి. ఒక వేళ పాఠ్యాంశంలో పటాలు లేనట్లయితే ఉపాధ్యాయుడు స్వయంగా పాఠ్యాంశానికి అనుబంధ అంశాలపై పటాలను సేకరించి పిల్లలచే అభ్యాసం చేయించాలి. అలాగే పటాలు గీయడంలో తరగతి గది మొదలుకొని భారతదేశ పటం వరకు అభ్యాసం చేయించాలి.

బోధనా సోపానాల గురించి వివరంగా తెలుసుకున్నాం కదా! మరి ఇప్పుడు పాఠానికి పీరియడ్ ప్రణాళిక ఎలా రాయాలో చూద్దాం. మొదటి పీరియడ్ ప్రణాళిక రాసే ముందు పాఠం మొత్తానికి లక్ష్యాలు రాసుకోవాలి. దీనివల్ల పాఠం పూర్తి అవగాహన కావడమే గాక, పిల్లల్లో ఏ ఏ సామర్థ్యాలు పెంపొందించాలో కూడా తెలుస్తుంది. పాఠం లక్షాలు విద్యా ప్రమాణాల వారిగా రాయాలి.

**IV. పీరియడ్ ప్రణాళిక నమూనా**

I. పాఠం పేరు

II. పీరియడ్‌ల సంఖ్య ................... సమయం .................

III. బోధించే అంశం / ఉపశీర్షిక : ...................................

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు : ............................

V. బోధనాభ్యసన వ్యూహాలు, సోపానాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు | నల్లబల్లపని | సామగ్రి / వనరులు |
|---|---|---|---|
| | | | |

VI. పిల్లల అవగాహన పరిశీలన.

# పీరియడ్ ప్రణాళిక-1

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 1వది సమయం : 45 ని॥లు

III. బోధించే అంశం/ఉపశీర్షిక : ప్రభుత్వ పాత్ర

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :


★ ప్రభుత్వానికి బడ్జెట్ అవసరం గురించి వివరిస్తారు.

★ ప్రభుత్వాలు సబ్సిడీలు ఇవ్వడానికి గల కారణాలు చెబుతారు.

★ ప్రభుత్వం నిర్వహించే కార్యకలాపాల గురించి వివరిస్తారు.

★ ప్రభుత్వ ఖర్చు వివరాలను వార్తాపత్రికలనుండి సేకరిస్తారు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం<br>1. పలకరింపు | పిల్లలూ... గుడ్ మార్నింగ్! ఎలా ఉన్నారు? నిన్నటి తరగతిలో రిజర్వ్‌బ్యాంక్ ద్రవ్యప్రవాహాన్ని ఏరకంగా నియంత్రిస్తుందో తెలుసుకున్నారు, కదా! అదేవిధంగా 8వ తరగతిలో ప్రభుత్వాలు ప్రజలకోసం ఏఏ సదుపాయాలు కల్పిస్తున్నాయో తెలుసుకున్నారుకదా! ఈరోజు మనం బడ్జెట్–పన్నుల గురించి తెలుసుకోబోయేముందు మీకు వీటి గురించి ఏమైనా తెలుసా చెప్పండి. (ఉపాధ్యాయులు మైండ్ మ్యాపింగ్ చేస్తారు) | | |
| 2. కాన్సెప్ట్ మ్యాపింగ్ | పిల్లలూ – ప్రభుత్వ బడ్జెట్, పన్నుల గురించి మీకు తెలిసింది బాగా చెప్పారు. వెరీగుడ్. ఇపుడు మనం ప్రభుత్వ బడ్జెట్ – పన్నుల గురించి వివరంగా తెలుసుకుందామా! |  | |
| 3. పాఠ్యాంశ ప్రకటన | ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు | ప్రభుత్వ బడ్జెట్–పన్నులు | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| B. ఇచ్చిన అంశాన్ని చదవడం తెలియని పదాలు/భావనలు/సాంకేతికపదాలు గుర్తించడం – అవగాహన.<br>1. పాఠాన్ని చదవడం, తెలియని పదాలు<br>2. గుర్తించిన పదాలను నల్లబల్లపై రాయడం, చర్చించడం. | పిల్లలూ... అందరూ పాఠ్యపుస్తకం తీయండి. పేజీ నెం. 130, 131 పేజీలు చదవండి. పాఠంలోని ఈరెండు పేజీలలో మీకు తెలియని పదాలను/భావనలను/సాంకేతిక పదాలను గుర్తించి దానికింద గీతగీయండి. చదివేటప్పుడు చిత్రాలను పరిశీలించండి. డబ్బాలలోనివి కూడా చదవండి. పిల్లలూ – అందరూ చదివి మీకు తెలియని పదాలు గుర్తించారుకదా! ఒక్కొక్కరు లేచి గుర్తించిన వాటిని చెప్పండి. | | |
| 1. పదాలు/భావనలు/సాంకేతిక పదాల గుర్తింపు | (వాటిని ఉపాధ్యాయులు నల్లబల్లపై రాస్తారు. వీటిని పరిశీలించమనాలి. పిల్లలు చెప్పినవాటిని నల్లబల్లపై కుడివైపు రాస్తారు)<br>ఉదా: అంతరంగిక, తపాల కార్యాలయాలు, రాయితీలు ఇంజనీరింగ్ | పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాస్తారు.<br>ఉదా : అంతరంగిక, తపాలా కార్యాలయాలు, రాయితీలు, ఇంజనీరింగ్ | |
| 2. అవగాహన – చర్చ | పిల్లలూ... తెలియని పదాలు చెప్పారుకదా! మరి మీకు దీనిలో కొన్ని పదాలు ఎవరికైనా ఏమైనా తెలుసా! వాటి గురించి చెప్పండి. (పిల్లలు చెప్పిన వివరణ తర్వాత మిగిలిన పదాలను ఉదాహరణలతో వివరిస్తారు.) | | |
| C. భావనల అవగాహన–చర్చ.<br>1. మాట్లాడుట | పిల్లలూ... పాఠం చదివి, పదాలు గుర్తించారుకదా! మరి మీకు సారాంశం ఏమి అర్థమైందో చెప్పండి.<br>(ముగ్గురు లేదా నల్గురు పిల్లలతో మాట్లాడిస్తారు) | | |
| 2. ప్రశ్నించుట | పిల్లలూ... ప్రభుత్వ కార్యకలాపాలు, ప్రభుత్వ పాత్ర గురించి ప్రశ్నించండి. | విద్యార్థులు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాస్తారు. ఉపాధ్యాయులు మరికొన్ని ప్రశ్నలు బోర్డుపైన వ్రాయును. | |
| 3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు | పిల్లలూ – మీరు కొన్ని ప్రశ్నలు అడిగారుకదా! మరి కొన్ని ప్రశ్నలు నల్లబల్లపై చూడండి. | | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| | ఒక్కొక్క అంశాన్ని గురించి జట్లలో విద్యార్థులను చర్చించమంటారు. తర్వాత ఉపాధ్యాయులు వివరిస్తారు.<br>★ పేజీ నెం. 131 లోని డబ్బాలలోని ప్రశ్నలుకూడ చర్చిస్తారు.<br>పిల్లలూ – ఈ ప్రశ్నలను ఒక్కొక్కటి చర్చించుదామా! (పిల్లలతో చర్చిస్తూ అవసరమైన వివరణ ఇస్తారు.) ముఖ్యాంశాలను బోర్డుపై వ్రాస్తారు. | 1. ప్రభుత్వాలకు బడ్జెట్ ఎందుకు అవసరం?<br>2. ప్రభుత్వాలు ప్రజలకొరకు ఏఏ సదుపాయాలు, కార్యక్రమాలు చేపడుతుంది?<br>3. ప్రతి ప్రజాసదుపాయాలు, కార్యక్రమాలు ప్రభుత్వమే చేపట్టడం సమంజసమేనా ?<br>4. ప్రభుత్వాలు ప్రజలకు రాయితీలు ఎందుకిస్తాయి ?<br>5. ప్రభుత్వాలకు ఆదాయం ఎక్కడినుండి వస్తుంది?<br>(పిల్లలు చెప్పిన సమాధానాలను కీలక పదాల రూపంలో నల్లబల్లపై రాస్తారు.) | ★ బడ్జెట్‌కు చెందిన పేపర్ కట్టింగ్స్.<br>★ ప్రభుత్వ కార్యకలాపాల చిత్రాలు. |
| ★ ముగింపు | పిల్లలూ... ఇంతవరకు బడ్జెట్ పాఠంలో ప్రభుత్వ పాత్ర గురించి తెలుసుకున్నారుకదా! మీకేమి అర్థమైందో చెప్పండి.<br>1. ప్రభుత్వాలకు బడ్జెట్ యొక్క అవసరం ఏమిటి ?<br>2. ప్రభుత్వాలు ప్రజలకు రాయితీలు ఎందుకిస్తాయి ? | | |

VI. పిల్లల అవగాహన–పరిశీలన : పిల్లలూ... కింది సమాచారాన్ని సేకరించండి. (ప్రభుత్వ ఖర్చు వివరాలను, మీ ప్రాంత వార్తాపత్రికల్లో సేకరించి జాబితా రాయండి.)

# పీరియడ్ ప్రణాళిక-2

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 2. సమయం : 45 ని॥లు

III. బోధించే అంశం/ఉపశీర్షిక : ప్రభుత్వ ఖర్చులు

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :

★ ప్రభుత్వం చేసే ఖర్చుల గురించి వివరిస్తారు.

★ ప్రభుత్వం చేసే వివిధ ఖర్చుల వివరాలను వర్గీకరిస్తారు.


★ "బడ్జెట్ అంశాలపై ప్రభుత్వాన్ని చట్టసభలద్వారా నియంత్రించవచ్చు" అనే విషయంపై వ్యాఖ్యానించగలరు.

★ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసే ఖర్చులను చూపే పై గ్రాఫులను తయారుచేస్తారు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం<br>1. పలకరింపు | పిల్లలూ... గుడ్ మార్నింగ్! నిన్నటి తరగతిలో మనం ప్రజలకు వివిధ సదుపాయాలు కల్పించుటలో ప్రభుత్వ పాత్రను గురించి తెలుసుకున్నాముకదా! అదేవిధంగ ఈరోజు ప్రభుత్వం వివిధ కార్యకలాపాలకై చేసే ఖర్చుల వివరాలను తెలుసుకుందాము. | | |
| 2. పునశ్చరణ ప్రశ్నలు | ★ వివిధ కార్యక్రమాలకు ప్రభుత్వం చేసే ఖర్చులు ఏవైనా మీకు తెలిసివుంటే చెప్పండి?<br>★ ప్రభుత్వం ఏఏ కార్యకలాపాలకు ఖర్చు చేస్తుందో చెప్పండి.<br>★ ప్రభుత్వాలు సబ్సిడీలు ఇవ్వడానికి గల రెండు కారణాలు చెప్పండి.<br>పిల్లలూ... ప్రభుత్వం ఏఏ కార్యక్రమాలపై ఖర్చు చేస్తుందో మీకు తెలిసింది. బాగా చెప్పారు. వెరీగుడ్. ఇప్పుడు మనం ప్రభుత్వ ఖర్చుల గురించి వివరంగా తెలుసుకుందామా! | | |
| 3. పాఠ్యాంశ ప్రకటన | ప్రభుత్వ ఖర్చులు | ప్రభుత్వ ఖర్చులు | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| B. ఇచ్చిన అంశాన్ని చదవడం. తెలియని పదాలు/భావనలు సాంకేతికపదాలు గుర్తించడం – అవగాహన.<br>1. పాఠ్యాంశాన్ని చదవటం తెలియని పదాలను గుర్తించటం. | పిల్లలూ... అందరూ పాఠ్యపుస్తకం తీయండి. పేజి నెం. 132, 133 పేజీలు చదవండి. పాఠంలోని ఈ రెండు పేజీలలో మీరు తెలియని పదాలను/భావనలను/సాంకేతిక పదాలను గుర్తించి దానికింద గీతగీయండి.<br>చదివేటప్పుడు చిత్రాలను పరిశీలించండి. డబ్బాలలోని సమాచారమును చదవండి. పిల్లలూ... అందరూ చదివి మీకు తెలియని పదాలను గుర్తించారుకదా! ఒక్కొక్కరు లేచి గుర్తించిన వాటిని చెప్పండి. | | |
| 2. గుర్తించిన పదాలను నల్లబల్లపై రాయడం, చర్చించడం. పదాలు/భావనలు/సాంకేతిక పదాల గుర్తింపు. | వాటిని నల్లబల్లపై వ్రాయాలి. వీటిని పరిశీలించమనాలి.<br>ఉదా : మార్కెటింగ్, విక్రయసేవలు, కళలు – సంస్కృతి | | |
| 3. అవగాహన చర్చ | పిల్లలూ... మీరు తెలియని పదాలు, చెప్పారుకదా! మరి మీకు వీనిలో కొన్ని పదాలు ఏమైనా తెలుసా! వాటిగురించి చెప్పండి. (పిల్లలు చెప్పిన వివరణ తర్వాత మిగిలిన పదాలను ఉదాహరణలతో వివరిస్తారు.) | పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాస్తారు.<br>ఉదా : మార్కెటింగ్, విక్రయసేవలు, కలలు, సంస్కృతి, పెన్షన్ | |
| C. భావనల అవగాహన – చర్చ<br>1. మాట్లాడుట | పిల్లలూ... పాఠం చదివి పదాలు గుర్తించారుకదా! మరి మీకు ఏమి సారాంశం అర్థం అయిందో చెప్పండి. (ముగ్గురు లేదా నలుగురు పిల్లలతో మాట్లాడిస్తారు.) | | |
| 2. ప్రశ్నించుట<br>3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు | పిల్లలు... ప్రభుత్వ ఖర్చులను గూర్చి ప్రశ్నిస్తారు.<br>పిల్లలూ – మీరు కొన్ని ప్రశ్నలు అడిగారుకదా! మరి కొన్ని ప్రశ్నలు నల్లబల్లపై చూడండి. | విద్యార్థులు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాస్తారు.<br>1. ప్రభుత్వం ఖర్చుచేయవలసిన అవసరం ఏమిటి?<br>2. ప్రభుత్వం ఏఏ అంశాలపై ఖర్చు చేస్తుంది ? | ప్రభుత్వ ఖర్చులకు సంబంధించిన పేపర్ కటింగ్స్. |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| | (పిల్లలతో చర్చిస్తూ అంశాలవారీగా అవసరమైన వివరణ ఇస్తారు.) | 3. ప్రభుత్వం అభివృద్ధి పనులే కాక పరిపాలన, శిక్షణ, పెన్షన్ మొదలైన వాటికై ఖర్చు చేయటం సమంజసమేనా.<br>4. బడ్జెట్ అంశాలపై ప్రభుత్వాన్ని చట్టసభలు నియంత్రించవలసిన అవసరం ఏముంది?<br>5. ప్రభుత్వం ఖర్చులపై ప్రజాప్రతినిధుల పాత్ర ఏమిటి?<br>(పిల్లలు చెప్పిన సమాధానాలను కీలకపదాల రూపంలో నల్లబల్లపై రాస్తారు.) | |
| ముగింపు | పిల్లలూ... ఇంతవరకు ప్రభుత్వ ఖర్చులు పాఠంలో వివిధ అంశాల గురించి మీకు ఏమి అర్థమైందో చెప్పండి.<br>1. ప్రభుత్వం ఖర్చు చేయవలసిన అవసరం ఏమిటి?<br>"ప్రభుత్వ వ్యయం - 2011-2012" ప్రభుత్వం చేసిన వివిధ ఖర్చులకు సంబంధించిన 'పై' చార్టు తయారుచేయండి. |  | 'పై చార్టు' |
| D. ప్రాజెక్టుపని | ప్రభుత్వ ఖర్చు వివరాలను వార్తాపత్రికలలో సేకరించి జాబితా రాయండి. | | |

VI. పిల్లల అవగాహన - పరిశీలన: ఈక్రింది ప్రశ్నలు అడిగి, విద్యార్థుల అవగామనను ఉపాధ్యాయులు పరిశీలించును.

1. ప్రభుత్వం ఏఏ అంశాలపై ఖర్చు చేస్తుంది?
2. ప్రభుత్వ ఖర్చులపై ప్రజాప్రతినిధుల పాత్ర ఏమిటి?

# పీరియడ్ ప్రణాళిక-3

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ - పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 3. సమయం : 45 ని॥లు

III. బోధించే అంశం/ఉపశీర్షిక : పన్నులు - పరోక్ష పన్నులు, ఎక్సైజ్ సుంకం, అమ్మకంపన్ను.

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :

- ★ పన్నులను వర్గీకరిస్తారు.
- ★ ఒక వస్తువుపై పన్ను పెరిగితే ఏఏ వాటిపై ప్రభావం చూపుతుందో వివరిస్తారు.
- ★ పరోక్ష పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయమార్గాలను ఊహిస్తారు.
- ★ వివిధ రకాల వస్తువులను సేకరించి, ధరల పట్టికను తయారుచేస్తారు.
- ★ సేవా పన్నులకు ఉదాహరణలిస్తాడు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం<br>1. పలకరింపు | పిల్లలూ... గుడ్ మార్నింగ్! నిన్న మనం ప్రభుత్వంచేసే ఖర్చుల గురించి తెలుసుకున్నాముకదా! ఒకసారి మీకేమి అర్థమైందో చెప్పండి. | | |
| 2. పునశ్చరణ ప్రశ్నలు | పిల్లలూ... బాగా చెప్పారు. ఈరోజు మనం ప్రభుత్వానికి రాబడి వచ్చే పన్నుల గురించి, పరోక్ష పన్నుల గురించి వివరంగా తెలుసుకుందాం! | ★ ప్రభుత్వం వేటిపై ఖర్చు చేస్తుందో రెండు ఉదాహరణ లివ్వండి?<br>★ 2011-12 సంవత్సరంలో ప్రభుత్వం వేటిపై వ్యయం ఎక్కువ చేసింది?<br>★ బడ్జెట్‌లో ఖర్చుల గురించి నిర్ణయం చేసేటప్పుడు ఎవరెవరిని సంప్రదిస్తుంది? | |
| 3. పాఠ్యాంశ ప్రకటన | | పన్నులు - పరోక్ష పన్నులు | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| B. పాఠం చదివి తెలియని పదాలు/భావనల గుర్తింపు, అవగాహన. | పిల్లలూ... పేజీ నెం. 133 లోని చివరి పేరానుండి 135వ పేజీ వరకు చదవండి. తెలియని పదాలు గుర్తించి, దానికింద గీత గీయండి. | | |
| – పదాలు గుర్తించుట | పిల్లలూ... అందరూ గుర్తించారుకదా! మీరు గుర్తించిన పదాలు చెప్పండి. (నల్లబల్లపై రాస్తారు.) | గుర్తించినపదాలు.<br>ఉదా : పరోక్ష పన్ను, ఫ్యాక్టరీ ఎక్సైజ్ సుంకం | |
| – పదాల అవగాహన | పిల్లలూ నల్లబల్లపై రాసిన పదాల గురించి మీకు తెలిసినవి చెప్పండి. (చెప్పిన తర్వాత మిగిలిన వాటిగురించి ఉపాధ్యాయులు వివరిస్తారు.) | | |
| C. భావనల అవగాహన–చర్చ<br>1. మాట్లాడుట | పిల్లలూ... పాఠం చదివి, పదాలు గుర్తించారు కాబట్టి మీకు సారాంశం ఏమి అర్థం అయ్యిందో చెప్పండి. (ముగ్గురు లేదా నల్గురు పిల్లలతో మాట్లాడించాలి.) | | |
| 2. ప్రశ్నించుట | పిల్లలూ... పన్నులు, పరోక్షపన్నులు, ఎక్సైజ్‌సుంకం మొదలైన వాటి గురించి తెలుసుకోవడానికి ప్రశ్నించండి. | పిల్లలు చెప్పిన ప్రశ్నలను నల్లబల్లపై రాస్తారు. | |
| 3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు. | పిల్లలూ... మీరు కొన్ని ప్రశ్నలు అడిగారుకదా! మరి కొన్ని ప్రశ్నలు నల్లబల్లపై పరిశీలించండి. (చర్చిస్తూ ఉపాధ్యాయుడు భావనలను వివరించును.)<br><br>పిల్లలూ... డబ్బాలలో ఉన్న ప్రశ్నలను చూడండి. ఒక్కొక్కరు చర్చిస్తాం. | ★ పరోక్ష పన్నులకు, ప్రత్యక్ష పన్నులకు గల తేడాలు ఏవి?<br>★ పన్ను వలన ఇనుము ధర పెరిగితే ఏమి జరుగుతుంది?<br>★ సేవాపన్నులకు ఉదాహరణ లివ్వండి.<br>★ బాక్స్‌లో ఇచ్చిన ప్రశ్నలను చర్చించండి. | వివిధ వస్తువుల ప్యాకెట్‌లను సేకరించడం. (సబ్బుకవర్లు, టూత్‌పేస్టు డబ్బాలు మొదలగునవి) |
| 4. ముగింపు | పిల్లలూ... ఇప్పటివరకు ఏమి నేర్చుకున్నారో మీ సొంత మాటల్లో చెప్పండి. | | |
| VI. పిల్లల అవగాహన–పరిశీలన | పిల్లలూ... పన్నుల ప్రభావం గురించి తెలుసుకున్నారుకదా. వాటి గురించి ఆలోచించి నల్లబల్లపై రాసిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి. | ★ ఇనుము కాకుండా వేరే వస్తువును ఉదాహరణగా తీసుకొని పన్ను ప్రభావం ఏఏ వాటిపై ఉంటుందో రాయండి. | |

# పీరియడ్ ప్రణాళిక-4

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 4. సమయం : 45 ని॥లు

III. బోధించే అంశం/ఉపశీర్షిక : విలువ ఆధారిత పన్ను (VAT)

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :

★ విలువ ఆధారిత పన్ను అంటే ఏమిటో వివరిస్తారు.

★ పన్ను విధించే విధానానికి ఉదాహరణలిస్తారు.

★ పేజి నెం. 136 లోని చివరినుండి రెండవ పేరా చదివి సొంత మాటల్లో చెబుతారు.

★ పన్నురేట్లు వేరువేరుగా ఎందుకుంటాయో చెబుతారు.

★ VAT గురించి ప్రశ్నిస్తారు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం<br>1. పలకరింపు | గుడ్ మార్నింగ్! పిల్లలూ... నిన్నటి తరగతిలో మనం పన్నులలో పరోక్ష పన్నుల గురించి తెలుసుకున్నారు కదా! మీకు అర్థం అయిన విషయాలు చెప్పండి. | | |
| 2. పునశ్చరణ ప్రశ్నలు | 1. పన్నులలో రకాలు ఏవి?<br>2. పరోక్ష పన్నులు వినియోగదారులు MRP తో కలిపి చెల్లిస్తారు. ఎందుకు ?<br>3. పన్నులు పెరిగితే (ఒక వస్తువుపై) ఇతర వస్తువుల ధరలు ఎందుకు పెరుగుతాయి?<br>4. వినియోగదారుని ధర ఎలా నిర్ణయిస్తారు? | పిల్లలు చెప్పిన సమాధానాలను కీలక పదాల రూపంలో నల్లబల్లపై రాస్తారు. | |
| 3. పాఠ్యాంశ ప్రకటన | పిల్లలూ... చాలా బాగా సమాధానాలు చెప్పారు. ఈరోజు పన్నుల విధింపులో భాగంగా విలువ ఆధారిత పన్ను (VAT) గురించి వివరంగా తెలుసుకుందామా! | విలువ ఆధారిత పన్ను | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| B. పాఠం చదివి తెలియని పదాలు/భావనల గురించి అవగాహన | పిల్లల్లో అందరూ పాఠ్యపుస్తకం తీసి పేజి నెం. 135 నుండి 137 లోని ప్రత్యక్ష పన్నులు అనే పేరాగ్రాఫ్ వరకు చదవండి. మీకు తెలియని పదాలు గుర్తించి దానికింద గీత గీయండి. | | |
| 1. పదాల/భావనల గుర్తింపు | పిల్లలూ... చదివారుకదా! మీకు తెలియని పదాలు ఒక్కొక్కరు లేచి చదవండి. (వాటిని నల్లబల్లపై రాస్తారు.) | పిల్లలు చదివిన పదాలను నల్లబల్లపై రాస్తారు. | |
| 2. పదాల అవగాహన | పిల్లలూ... నల్లబల్లపై రాసిన పదాల గురించి తెలిసినవారు చెప్పండి. (మిగిలిన వాటిని చర్చిస్తూ, ఉపాధ్యాయులు వివరిస్తారు.) | ఉదా : VAT, ఇన్వర్టర్, ఎక్సైజ్‌పన్ను | |
| C. పాఠ్యాంశ అవగాహన–చర్చ<br>1. మాట్లాడించుట | పిల్లలూ... పదాల గురించి తెలుసుకున్నారుకదా! అలాగే విలువ ఆధారిత పన్ను గురించి చదివారుకదా! మీకు VAT పై అర్థమయిన విషయాల గురించి మాట్లాడండి. | | |
| 2. ప్రశ్నించుట | పిల్లలూ... విలువ ఆధారిత పన్ను గురించి మరింత తెలుసుకోవడానికి, అనుభవాల గురించి కొన్ని ప్రశ్నలు వేయండి. | ★ పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాస్తాను.<br>★ విలువ ఆధారిత పన్ను ఎలా విధిస్తారో ఉదాహరణలతో వివరించండి. | |
| 3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు | పిల్లలు మీరు కొన్ని ప్రశ్నలు చెపుతారు! వారు అడిగినవి కాకుండా మరి కొన్ని ప్రశ్నలు నల్లబల్లపై రాస్తారు. చూడండి.<br>పిల్లలూ... ప్రశ్నలు చూసారుకదా! వీటి గురించి చర్చిద్దామా! (పిల్లలతో చర్చింపచేస్తూ, పిల్లలు చెప్పిన సమాధానాలను చర్చిస్తూ తగిన వివరణ ఇచ్చును.) | ★ విలువ ఆధారిత పన్నులపై మీ అభిప్రాయం ఏమిటి? చర్చించండి.<br>★ VAT వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి? | ★ వివిధ రకాల బిల్లులు (VAT) |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| | పిల్లలూ... పేజి నెం. 136 లోని పట్టికను మరిన్ని ఉదాహరణలతో పూరించండి. | పిల్లలూ... పట్టికలో ఒక ఉదాహరణగా ఉందికదా! దానిని నల్లబల్లపై రాస్తాను. మీరు, నేను కలిసి ఇంకొన్ని కలుపుతూ పూర్తిస్థాయి పట్టికను రూపొందిస్తాం.<br><table><tr><td>పదార్థం</td><td>పదార్థ వెల</td><td>పన్ను</td><td>బిల్లు మొత్తం</td></tr><tr><td>గోధుమలు, పిండి, చక్కెర తదితర ముడిపదార్థాలు</td><td>రూ. 90</td><td>రూ. 10</td><td>రూ. 100</td></tr><tr><td></td><td></td><td></td><td></td></tr><tr><td></td><td></td><td></td><td></td></tr></table> | |
| ముగింపు | పిల్లలూ... ఈ పీరియడ్‌లో ఏమేమి నేర్చుకున్నారో కొన్ని ప్రశ్నలకు జవాబు చెప్పండి. | ★ VAT ప్రయోజనకరమేనా? మీ అభిప్రాయం చెప్పండి.<br>★ VAT ను వ్యాపారస్థులు ఎందుకు వ్యతిరేకించారు ? | |
| D. ప్రాజెక్టు పని | పిల్లలూ... VAT కు సంబంధించిన కొన్ని బిల్లులు సేకరించండి. వాటి ఆధారంగా ఒక పట్టిక రూపొందించండి. | | |

VI. పిల్లల అవగాహన – పరిశీలన : VAT పై వ్యాఖ్యానించండి.

# పీరియడ్ ప్రణాళిక-5

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 5.  సమయం : 45 ని॥లు

III. బోధించే అంశం/ఉపశీర్షిక : ప్రత్యక్ష పన్నులు

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :

★ ప్రత్యక్ష పన్నులకు ఉదాహరణలిస్తారు.

★ వ్యక్తిగత ఆస్తులపై పన్ను విధింపునకు గల కారణాలు చెబుతారు.

★ ఆదాయం పన్ను విధించడంలో సరైన విధానం గురించి వివరిస్తారు.

★ ఆదాయపుపన్ను, కార్పొరేటు పన్నులకు గల తేడాలను చెబుతారు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం<br>1. పలకరింపు<br>2. పునశ్చరణ ప్రశ్నలు | పిల్లలూ... ఎలా ఉన్నారు? నిన్న VAT గురించి వివరంగా చర్చించాం కదా! మరి మీకు ఏమి అర్థమైందో చెబుతారా? పిల్లలూ – నేను VAT గురించి కొన్ని ప్రశ్నలు అడుగుతాను చెప్పండి. | ★ అన్ని వస్తువులపై VAT సమానంగా విధించరు. ఎందుకు?<br>★ VAT విధింపు సరైనదే అనడానికి రెండు కారణాలు చెప్పండి.<br>★ పన్ను ఎగవేతకు VAT ఒక పరిష్కారం అని నీవు భావిస్తావా? ఎందుకు ? | |
| 3. పాఠ్యాంశ ప్రకటన | పిల్లలూ... VAT గురించి చాలా బాగా చెప్పారు. మరి రోజు మనం ప్రత్యక్ష పన్నుల గురించి తెలుసుకుందామా! | ప్రత్యక్ష పన్నులు | |
| B. పాఠ్యాంశం చదివి తెలియని పదాలు/భావనలు గుర్తింపు–అవగాహన | పిల్లలూ... అందరూ పాఠ్యపుస్తకం తీసి 137, 138 పేజీలను చదవండి. మీకు తెలియనిపదాలు గుర్తించి, దాని కింద గీత గీయండి. | | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| 1. పదాలు గుర్తించుట | పిల్లలూ... అందరూ పదాలు గుర్తించారుకదా! మీరు గుర్తించిన పదాలు చదవండి.<br>(వాటిని నల్లబల్లపై రాస్తారు.) | ★ పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాస్తారు.<br>ఉదా : అంతిమధర, కార్పొరేటుపన్ను కర్మాగారం | |
| | పిల్లలూ... నల్లబల్లపై రాసిన పదాలను ఒకసారి చూడండి. వీటిలో మీకు తెలిసిన పదాలకు వివరణ ఇవ్వండి.<br>(మిగతా పదాలగురించి చర్చిస్తూ, అవగాహన కల్పించును.) | | |
| C. పాఠ్యాంశ అవగాహన-చర్చ<br>1. మాట్లాడించుట | పిల్లలూ... అందరూ పాఠం చదివారుకదా! ప్రత్యక్ష పన్నుల గురించి మీకు ఏమి అర్థమైందో మాట్లాడండి.<br>(నల్గురు లేదా ఐదుమంది పిల్లలతో మాట్లాడిస్తారు.) | | |
| 2. ప్రశ్నించుట | పిల్లలు ప్రత్యక్ష పన్నుల గురించి ఇంకా మీరు ఏమేమి తెలుసుకోవాలనుకుంటున్నారో ప్రశ్నించండి.<br>(పిల్లలు ప్రశ్నలు అడిగేటట్లు ప్రోత్సహిస్తారు.) | ★ పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాస్తారు. | |
| 3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు | వారు అడిగినవేగాక కొన్ని ప్రశ్నలు నల్లబల్లపై రాస్తారు. పరిశీలించమంటారు. చర్చిస్తూ వివరణ యిస్తారు. | పిల్లలు అడిగిన వాటికింద ఈ ప్రశ్నలు రాస్తారు.<br>★ పన్నులను వర్గీకరించండి.<br>★ ఆదాయపుపన్నుకు, కార్పొరేట్ పన్నుకు తేడాలేమిటి?<br>★ ఎక్సైజ్ సుంకానికి, కార్పొరేట్ పన్నుకు తేడాలేమిటి?<br>★ ఆదాయపుపన్ను విధించడానికి విధానాలలో దేనిని సమర్థిస్తావు?<br>★ ప్రత్యక్షపన్నుల పేరా చదివి మీ అభిప్రాయం చెప్పండి.<br>★ పిల్లలు చదివిన ఖర్చు వివరాలను పట్టిక రూపంలో నల్లబల్లపై రాస్తారు. పట్టికను విశ్లేషిస్తారు. | పన్నులకు సంబంధించిన సమాచార పట్టిక |
| 4. నైపుణ్యాలను అభ్యాసం చేయటం. | పిల్లలూ - ప్రభుత్వ ఖర్చుకు సంబందించిన వివరాలు సేకరించారుకదా! చదవండి. | | |
| ముగింపు | పిల్లలూ... ప్రత్యక్ష పన్నుల గురించి వివరంగ తెలుసుకున్నారుకదా! మీకు ఏమి అర్థమైందో చెప్పండి. | | |
| VI. పిల్లల అవగాహన-పరిశీలన | పిల్లలూ... పన్నుల విధింపులో సరైన విధానం గురించి తెలుసుకున్నారుకదా! మీరు కూడ ఆలోచించి పన్నుల విధింపులో ఎలాంటి విధానాన్ని అనుసరించాలో నమూనా పట్టిక తయారుచేయండి. | | |

# పీరియడ్ ప్రణాళిక-6

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 6. సమయం : 45 ని॥లు

III. బోధించే అంశం/ఉపశీర్షిక : పన్నుల విధింపు

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :

★ పన్నుల విధింపులో సరైన విధానంను సూచిస్తారు.

★ విలాస వస్తువులపై పన్నుల ఎక్కువ విధింపుపై తన అభిప్రాయాన్ని చెబుతారు.

★ పన్నుల విధింపులో ప్రభుత్వం తీసుకునే చర్యల గురించి వివరిస్తారు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం<br>1. పలకరింపు<br>2. పునశ్చరణ ప్రశ్నలు | పిల్లలూ... గుడ్ మార్నింగ్. ఎలా ఉన్నారు? బాగా చదువుతున్నారా? మనం నిన్నటి తరగతిలో ప్రత్యక్ష పన్నుల గురించి తెలుసుకున్నారుకదా! మరి మీకు ఏమి అర్థమైందో చెప్పండి. పిల్లలు ప్రత్యక్ష పన్నుల గురించి కొన్ని ప్రశ్నలు అడుగుతాను చెప్పండి.<br>★ ప్రత్యక్ష పన్నులకు రెండు ఉదాహరణలు చెప్పండి.<br>★ ఆదాయపుపన్ను, కార్పొరేటు పన్నులకు గల రెండు తేడాలు చెప్పండి.<br>ఆదాయపుపన్ను విధించడంలో ఏ విధానాన్ని సమర్థిస్తావు? | | |
| 3. పాఠ్యాంశ ప్రకటన | పిల్లలు ప్రత్యక్ష పన్నుల గురించి బాగా చెప్పారు. గుడ్. 'ఈరోజు పన్నుల విధింపులో సరైన విధానం గురించి మరింత విపులంగా చర్చిద్దామా! | పన్నుల విధింపులో సరైన విధానం | |
| B. పాఠ్యాంశాన్ని చదివి తెలియని పదాలు/భావనల గుర్తింపు – అవగాహన | పిల్లలూ... పాఠ్యపుస్తకం తీసి 139వ పేజీ, 140వ పేజీ వరకు చదవండి. తెలియని పదాలు/భావనలు గుర్తించి దానికింద గీత గీయండి. వాటిని చెప్పండి. | | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| 1. గుర్తించుట | వారు చదివిన పదాలు నల్లబల్లపై రాస్తారు. | పిల్లలు రాసిన పదాలను నల్లబల్లపై రాస్తారు. పరిశీలించండి.<br>ఉదా : విలువలు, జీవన ప్రమాణాలు, ల్యాప్‌టాప్ | |
| 2. అవగాహన | పిల్లలూ... నల్లబల్లపై రాసిన వాటిని పరిశీలించి మీకు తెలిసిన పదాలను వివరించండి. మిగిలిన వాటి గురించి చర్చిస్తూ అవగాహన పొందుతాం. | | |
| C. పాఠ్యాంశ అవగాహన–చర్చ<br>1. మాట్లాడించుట | పిల్లలూ... అందరూ పాఠ్యాంశం చదివారుకదా. మీకు ఏమి అర్థమైందో ఒక్కొక్కరు చెప్పండి. | | |
| 2. ప్రశ్నించుట | పిల్లలూ... పన్నుల విధింపు గురించి మీరు ఇంకా ఏమి తెలుసుకోవాలనుకుంటున్నారో, అనుమానాలు ఏమైనా ఉంటే ప్రశ్నించండి. | పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాస్తారు. | |
| 3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు | పిల్లలూ... కొన్ని ప్రశ్నలు అడుగుతారు. ఉపాధ్యాయులు మరికొన్ని ప్రశ్నలు నల్లబల్లపై రాస్తారు. పరిశీలించ మంటారు. చర్చ ద్వారా సమాధానాలను / వివరణ రాబట్టును)<br><br>పిల్లల ప్రశ్నలు గమనించండి. ఒక్కొక్కటి గురించి చర్చిస్తూ, నల్లబల్లపై మైండ్‌మ్యాపింగ్ చుట్టూ రాస్తూ అవగాహన కల్పించును. | పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు<br>★ పన్నుల విధింపులో సరైన విధానం గురించి వివరించండి.<br>★ విలాస వస్తువులపై పన్నులు ఎక్కువ ఎందుకు విధిస్తారు?<br>★ పన్నుల పెంపు మానవ జీవనంపై ఎటువంటి ప్రభావం చూపుతుంది? | ★ విలాస వస్తువుల చిత్రాలు |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| 4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం | పిల్లలు పన్నుల విధింపు గురించి తెలుసుకున్నాంకదా. పేజీ నెం.140 లోని పట్టికను పరిశీలించి అందరూ నింపండి. | ప్రభుత్వంచే వసూలు చేయబడే పన్నులు (పట్టిక క్రింద ఇవ్వబడింది) | |
| ముగింపు | పిల్లలు పన్నుల విధింపు గురించి తెలుసుకున్నాంకదా! మీకు ఏమి అర్థం అయ్యిందో చెప్పండి.<br>1. విలాస వస్తువులపై పన్నులు ఎందుకు ఎక్కువ ?<br>2. పన్నుల విధింపులో సరైన విధానాన్ని ఎలా ఎన్నుకోవాలి? | | |

ప్రభుత్వంచే వసూలు చేయబడే పన్నులు

| పన్నులు | మొత్తం పన్నుయొక్క శాతం |
|---|---|
| ప్రత్యక్షపన్నులు | 36% |
| | |
| | |
| | |
| మొత్తం పన్నులు | 100% |

VI. పిల్లల అవగాహన–పరిశీలన

పేజీ నెం. 140 పేజీలోని పట్టికను పూరించారుకదా! పట్టిక ఆధారంగా పట్టిక కింద ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.

# పీరియడ్ ప్రణాళిక-7

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 7. సమయం : 45 ని॥లు

III. బోధించే అంశం/ఉపశీర్షిక : పన్నుల వసూలు, పన్నుల ఎగవేత

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :

★ పన్నుల ఎగవేతకు కారణాలు చెబుతారు.
★ పన్ను ఎగవేతవల్ల ఏర్పడే పరిణామాలను ఊహిస్తారు.
★ పన్నులు సక్రమంగా చెల్లించే వారిని ప్రశంసిస్తారు.
★ పన్నుల ఎగవేత అరికట్టడానికి కొన్ని నినాదాలు రాస్తారు.
★ ప్రభుత్వంచే వసూలుచేయబడే పన్నుల పట్టికను పూర్తిచేస్తారు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం<br>1. పలకరింపు | పిల్లలూ... శుభోదయం. నిన్నటి తరగతిలో మనం పన్నుల విధింపులో సరియైన విధానం గురించి తెలుసుకున్నాంకదా! మరి మీకు ఏమి అర్థమైందో చెప్పండి. | | |
| 2. పునశ్చరణ ప్రశ్నలు | ★ విలాసవస్తువులకు రెండు ఉదాహరణలివ్వండి.<br>★ విలాస వస్తువుల ధరలు ఎందుకు ఎక్కువగా ఉంటాయి.<br>★ పన్నుల విధింపులో ప్రభుత్వం తీసుకునే చర్యలు ఏవి? ఆదాయపుపన్ను విధించడంలో ఏ విధానాన్ని సమర్థిస్తావు? | | |
| 3. పాఠ్యాంశ ప్రకటన | పిల్లలూ... ఈరోజు మనం 'పన్నుల వసూలు – పన్నుల ఎగవేత గురించి తెలుసుకుందామా! | పన్నుల వసూలు – పన్నుల ఎగవేత | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| B. పాఠ్యాంశాన్ని చదివి తెలియని పదాల గుర్తింపు-అవగాహన | పిల్లలూ... పాఠ్యపుస్తకం తీసి పేజి నెం. 140 మరియు 141 పేజీలను చదవండి. తెలియని పదాలు గుర్తించి, దానికింద గీత గీయండి. | | |
| 1. గుర్తించుట | పిల్లలూ... అందరూ తెలియని పదాలు గుర్తించారుకదా! ఇప్పుడు ఒక్కొక్కరు లేచి చదవండి. | పిల్లలు చదివిన పదాలను నల్లబల్లపై రాస్తారు.<br>ఉదా : ఎగవేత, నల్లధనం, బిల్లులు | |
| 2. అవగాహన | పిల్లలూ... నల్లబల్లపై రాసిన పదాలను చూడండి. తెలిసిన వాటి గురించి చెప్పండి.<br>(పిల్లలతో చర్చించి, తగిన వివరణలిస్తూ అవగాహన కల్పిస్తారు) | | |
| C. పాఠ్యాంశ అవగాహన - చర్చ<br>1. మాట్లాడించుట | పిల్లలూ... పదాల గురించి తెలుసుకున్నారుకదా! పాఠం చదివారుకదా! మీకు అర్థమయిన విషయాన్నే చెప్పండి. | | |
| 2. ప్రశ్నించుట | పిల్లలూ... పన్నుల వసూలు, పన్నుల ఎగవేత గురించి ప్రశ్నించండి.<br>(ప్రశ్నలు అడిగేటట్లు ప్రోత్సహిస్తారు) | పిల్లలు అడిగిన ప్రశ్నలు నల్లబల్లపై రాస్తారు. | |
| 3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు | పిల్లలు అడిగిన ప్రశ్నలు, మరికొన్ని ప్రశ్నలు నల్లబల్లపై రాస్తారు. పరిశీలించమంటారు. చర్చిస్తూ సమాధానాలు రాబట్టును. అవసరమైనచోట తగిన వివరణ ఉపాధ్యాయులు ఇస్తారు. | ★ పన్నుల వసూలు జనాభాతో పోలిస్తే తక్కువగా ఎందుకు ఉంది?<br>★ నల్లధనంపై మీ అభిప్రాయం చెప్పండి.<br>★ పన్నులు ఎందుకు ఎగవేస్తారు?<br>★ పన్నులు ఎగవేయకుండా ఉండాలంటే ఏమి చేయాలి ? | ★ నల్లధనంపై వచ్చిన పేపరు ఆర్టికల్స్.<br>★ పన్నులు చెల్లించమనే పన్నులశాఖ ఇచ్చే అడ్వర్టయిజ్‌మెంట్స్ |
| ముగింపు | పిల్లలూ... పన్నులు వసూలు, ఎగవేత గురించి చర్చించాం కదా! మీరు ఏమి అర్థంచేసుకొని ఉన్నారో చెప్పండి.<br>★ నల్లధనం గురించి వివరించండి.<br>★ పన్నుల ఎగవేతకు రెండు కారణాలు చెప్పండి. | | |

VI. పిల్లల అవగాహన-పరిశీలన — పిల్లలు పేజీ నెం. 142 లో కీలకపదాలు ఉన్నాయి. వీటి గురించి మీ సొంతమాటల్లో రాయండి.

# పీరియడ్ ప్రణాళిక-8

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 8. సమయం : 45 ని॥లు

III. బోధించే అంశం/ఉపశీర్షిక : కీలక పదాలు

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :

★ వార్షిక బడ్జెట్ గురించి వివరిస్తారు.
★ నల్లధనంపై అభిప్రాయం చెబుతారు.
★ విలువ ఆధారిత పన్ను (VAT) గురించి వివరిస్తారు.
★ కార్పొరేటుపన్ను, ప్రత్యక్షపన్ను, పరోక్షపన్ను, ఆదాయపన్ను గురించి వివరిస్తారు. పోలికలు, భేదాలు చెబుతారు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం<br>1. పలకరింపు | పిల్లలూ... ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు అనే పాఠంలో ప్రభుత్వ ఖర్చులు, పన్నులు, ప్రత్యక్ష, పరోక్షపన్నులు, VAT గురించి తెలుసుకున్నారుకదా! వాటిపై కొన్ని ప్రశ్నలకు జవాబు చెప్పండి. | | |
| 2. పునశ్చరణ ప్రశ్నలు | ★ ప్రభుత్వం వేటిపై ఖర్చు పెడుతుంది?<br>★ పన్నులను వర్గీకరించండి.<br>★ ప్రత్యక్ష పన్నులకు ఉదాహరణలివ్వండి.<br>★ పరోక్ష పన్నులకు ఉదాహరణలివ్వండి.<br>★ పన్నుల చెల్లింపు అనేది దేనిపై ఆధారపడి ఉన్నది. | | |
| 3. పాఠ్యాంశ ప్రకటన | పిల్లలూ... గుడ్ బాగా చెప్పారు. ఈరోజు మనం 'కీలకపదాల' గురించి తెలుసుకుందామా! | కీలక పదాలు | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| B. కీలక పదాలను చదవడం | పిల్లలూ... పాఠం చివర ఉన్న కీలక పదాలను చదవండి. పాఠ్యపుస్తకంలో వాటికి సంబంధించిన పేజీలను పరిశీలించండి. | ★ పిల్లలూ – మీరు కీలకపదాలు చదవండి. నల్లబల్లపై రాస్తారు.<br>★ వార్షిక బడ్జెట్ – నల్లధనం<br>★ విలువ ఆధారిత పన్ను<br>★ కార్పొరేట్ పన్ను – ప్రత్యక్షపన్ను<br>★ పరోక్షపన్ను – ఆదాయపన్ను | |
| 1. కీలకపదాలపై చర్చ | పిల్లలూ... అందరూ పరిశీలించారుకదా! వీటి గురించి చెబుతారా మరి.<br>(పిల్లలచే ఒక్కొక్క కీలకపదం గురించి సమాధానాలు చెప్పిస్తూ అవగాహన కల్గిస్తారు) | | |
| ముగింపు | పిల్లలూ... అన్ని కీలక పదాలకు సమాధానాలు బాగా చెప్పారు. | | |

VI. పిల్లల అవగాహన–పరిశీలన — పిల్లలూ... ఈరోజు చర్చించిన కీలకపదాల గురించి సొంతంగా మీ నోట్‌పుస్తకంలో అందరూ రాసుకొని రండి.

# పీరియడ్ ప్రణాళిక-9

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 9. సమయం : 45 ని॥లు

III. బోధించే అంశం/ఉపశీర్షిక : విషయావగాహన ప్రశ్నలు, ఇచ్చిన అంశాన్ని చదివి అర్థంచేసుకొని వ్యాఖ్యానించడం.

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :


★ విషయావగాహన ప్రశ్నలు చదివి, అర్థంచేసుకుంటారు.

★ ఎక్కువ ఆదాయం సంపాదించేవారు ఎక్కువ పన్నును ఎందుకు చెల్లించాలో చెబుతారు.

★ విషయావగాహన ప్రశ్నల చర్చలో పాల్గొంటారు. సమాధానాలను సొంతంగా రాస్తారు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం | | | |
| 1. పలకరింపు | పిల్లలూ... నిన్నటి తరగతిలో కీలక పదాల గురించి అందరూ రాసారా! మీరు ఏమి రాసారో చదవండి. | | |
| 2. పునశ్చరణ ప్రశ్నలు | పిల్లలూ... మీరు రాసిన వాటిని చదవండి. (ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలతో చదివిస్తాను) | | |
| 3. పాఠ్యాంశ ప్రకటన | పిల్లలూ... ఈరోజు మనం పాఠం చివరలో ఉన్న విషయావగాహన ప్రశ్నల గురించి చర్చిద్దామా! | విషయావగాహన | |
| B. పూర్తి తరగతిలో ప్రశ్నలు | పిల్లలూ... అందరూ పాఠం చివర ప్రశ్నలు తీసి ఒక్కొక్కటి చదవండి.<br>పిల్లలూ... ప్రశ్నలు చదివారుకదా! మరి దీనికి సమాధానం ఏమైఉంటుందో అందరూ ఆలోచించి సమాధానం చెప్పండి. | ★ పిల్లలు చదివిన ప్రశ్నలు నల్లబల్లపై రాస్తాను.<br>★ ప్రభుత్వానికి బడ్జెట్ అవసరం ఏమిటి? బడ్జెట్ పన్నుల గురించి ఎందుకు మాట్లాడుతుంది. | |

| బోధనా సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| | (ప్రశ్నలవారీగా చర్చించి సమాధానాలు రాబట్టును. అవసరమైనపుడు వివరణ యిచ్చును.) |  | |
| | పిల్లలు సమాధానాలు బాగా చెప్పారు. ఇప్పుడు అందరు మీ నోట్‌పుస్తకంలో సొంతంగా సమాధానాలు రాయండి. (ఇలా విషయావగాహన ప్రశ్నలను ఒక్కొక్కటి విద్యార్థులచే చర్చింపచేస్తూ సమాధానాలు విద్యార్థులు సొంతంగా రాసేటట్లు చూడాలి) | (పిల్లలు చెప్పిన సమాధానాలను మైండ్ మ్యాపింగ్ చుట్టు కీలక పదాల రూపంలో రాస్తారు. తగిన వివరణ యిచ్చును.) | |

VI. పిల్లల అవగాహన-పరిశీలన — పిల్లలూ... రేపు వచ్చేటప్పుడు రెండవ, మూడవ సామర్థ్యాల గురించిన ప్రశ్నలను చదువుకొని ఆ పేరాగ్రాఫ్‌లను రాయండి. రేపు వీటిపై చర్చిద్దాం.

# పీరియడ్ ప్రణాళిక-10

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 10. సమయం : 45 ని॥లు

III. బోధించే అంశం/ఉపశీర్షిక : ఇచ్చిన అంశాన్ని చదివి అర్థంచేసుకొని వ్యాఖ్యానించడం, ప్రాజెక్టుపని

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :


★ ప్రత్యక్ష పన్నుల పేరాను చదివి అర్థంచేసుకుంటారు. అభిప్రాయం చెబుతారు.

★ వస్తువుల ధరల పట్టికల ఆధారంగా విశ్లేషిస్తారు.

★ వస్తువుల ధరలు, అమ్ముతున్న ధరల గురించి ఒక నివేదిక రాస్తారు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం | | | |
| 1. పలకరింపు | పిల్లలూ... గుడ్‌మార్నింగ్. నిన్నటి తరగతిలో విషయావగాహనకు సంబంధించిన ప్రశ్నలకు జవాబులు బాగా రాసారు. | | |
| 2. పునశ్చరణ ప్రశ్నలు<br>3. పాఠ్యాంశ ప్రకటన | పిల్లలూ... మీరు రాసిన జవాబులను ఒకరిద్దరు లేచి చదవండి. పిల్లలు మనం ఈరోజు ఇచ్చిన అంశాన్ని చదివి అర్థంచేసుకొని వ్యాఖ్యానించడం, ప్రాజెక్టుపని గురించి చర్చిద్దాం. | ★ ఇచ్చిన అంశాన్ని చదివి అర్థంచేసుకొని వ్యాఖ్యానించడం<br>★ ప్రాజెక్టుపని | |
| B. పూర్తి తరగతిలో ప్రశ్నలు చర్చించటం | పిల్లలూ... అందరూ ప్రత్యక్షపన్నుల పేరా చదివారుకదా! | పిల్లలు చదివిన ప్రశ్నను నల్లబల్లపై రాస్తారు. | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| ప్రాజెక్ట్ పని. | పిల్లలూ... ప్రత్యక్ష పన్నుల పేరా ఆధారంగా ఒక్కొక్కరు మీ అభిప్రాయం చెప్పండి. (చర్చించి, అవసరమైనచోట వివరణ యిచ్చును.<br>పిల్లలూ... ఇప్పుడు అందరూ బాగా సమాధానాలు చెప్పారు. ఇప్పుడు అందరూ మీ నోట్‌పుస్తకంలో సొంతంగా మీ అభిప్రాయాన్ని రాయండి.<br>(ఇలా ప్రాజెక్టుపనికి సంబంధించిన పట్టికను నల్లబల్లపై రాసి విశ్లేషింపచేసి, అభిప్రాయాలు చెప్పిస్తారు.)<br>పిల్లలూ... ప్రాజెక్టుపనికి సంబంధించి సేకరణ, విశ్లేషణ చేసారుకదా! దీని ఆధారంగా ప్రాజెక్టుపని గురించి ఒక సమగ్ర నివేదిక రాసుకొని రండి. | <br>(పిల్లలు చెప్పిన సమాధానాలను నల్లబల్లపై కాన్సెప్ట్ మ్యాపింగ్ చుట్టురాస్తారు.) | |

VI. పిల్లల అవగాహన-పరిశీలన : ప్రత్యక్ష పన్నుల గురించి స్వంతంగా రాసుకొనిరండి.
పన్నుల చెల్లింపు అవసరమా? ఎందుకు?

# పీరియడ్ ప్రణాళిక-11

I. పాఠం పేరు : ప్రభుత్వ బడ్జెట్ – పన్నులు

II. పీరియడ్ సంఖ్య : 11. సమయం : 45 ని॥లు


III. బోధించే అంశం/ఉపశీర్షిక : సమకాలిన అంశాలపై ప్రతిస్పందన, పటనైపుణ్యాలు, ప్రశంస.

IV. పీరియడ్ బోధన ద్వారా ఆశించే సామర్థ్యాలు / లక్ష్యాలు :

★ అద్దె పంపకం గురించి ప్రతిస్పందిస్తారు.
★ బస్సు చార్జీలు ఒక్కసారిగా పెరగడానికి కారణాలు చెబుతారు.
★ భారతదేశ పటంలో ప్రభుత్వరంగ సంస్థలున్న నగరాలను గుర్తిస్తారు.
★ ఆర్థిక వ్యవస్థపై నల్లధనం చూపే ప్రభావంపై ప్రతిస్పందిస్తారు.

V. బోధనాభ్యసన వ్యూహాలు :

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| A. ఉపోద్ఘాతం | | | |
| 1. పలకరింపు | పిల్లలూ... గుడ్‌మార్నింగ్. ప్రాజెక్టుపని నివేదికను ఇంకా ఒకరోజు సమయం తీసుకొని, రేపు చూపెట్టండి. | | |
| 2. పునశ్చరణ ప్రశ్నలు | పిల్లలూ... రెండవ సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలకు రాసిన జవాబులను ఒకరిద్దరు చదవండి. | | |
| 3. పాఠ్యాంశ ప్రకటన | పిల్లలూ... ఈరోజు మనం సమకాలీన అంశాలపై ప్రతిస్పందన, పటనైపుణ్యాలు, ప్రశంస గురించిన ప్రశ్నలను వివరంగా చర్చించుదామా! | ★ సమకాలీన అంశాలపై ప్రతిస్పందన<br>★ పట నైపుణ్యాలు<br>★ ప్రశంస, సున్నితత్వం | |
| B. పూర్తి తరగతిలో ప్రశ్నలు చర్చించటం | పిల్లలూ... 6వ ప్రశ్న చదవండి. | ★ పిల్లలు చదివిన ప్రశ్నను నల్లబల్లపై రాస్తారు. | |

| సోపానాలు | అభ్యసన అనుభవాలు (Learning Experience) | నల్లబల్ల పని | బోధనాభ్యసన (TLM) సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| | పిల్లలూ... ప్రశ్న అర్థమైందికదా! అద్దె పంపకం ఎలాఉంటే బాగుంటుందో చెప్పండి.<br>(చర్చ ద్వారా సమాధానం రాబట్టి, అవగాహన కల్పించును.)<br><br>(ఇలా అన్ని ప్రశ్నలకు జవాబులను పిల్లలతో చెప్పిస్తూ సొంతంగా సమాధానాలు రాసేటట్లు ప్రోత్సహిస్తారు.) | <br><br>(పిల్లలూ... చెప్పిన సమాధానాలను కీలక పదాల రూపంలో కాన్సెప్ట్ మ్యాపింగ్ చుట్టూ రాస్తాను) | |

VI. పిల్లల అవగాహన-పరిశీలన. పిల్లలు చూసారుకదా! అన్ని ప్రశ్నలకు సమాధానాలు మీరే చెప్పారు. కాబట్టి వీటికి సమాధానాలను సొంతంగా రాసుకొని రండి.

# 8 బోధనా వ్యూహాలు, వనరులు

## A) సాంఘిక శాస్త్ర బోధనా వ్యూహాలు

సాంఘిక శాస్త్రం నూతన పాఠ్య పుస్తకాలు ఇతి వృత్తాల ఆధారంగా రూపొందించడం జరిగింది. కాబట్టి పాఠ్యాంశాలలో వైవిధ్యం కనిపిస్తుంది. అందువలన అన్ని పాఠాలను ఒకే పద్ధతిలో బోధించడం సరియైనది కాదు. పాఠ్యాంశ స్వభావాన్ని బట్టి ఉపాధ్యాయుడు అనువైన బోధనా వ్యూహాలను ఎన్నుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాలు సాధించడమే కాకుండ, పిల్లలు బోధనాభ్యాసన ప్రక్రియలో చురుకుగా పాల్గొనడానికి అవకాశం ఉంది. కావున సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలను బోధించడానికి ఎటువంటి బోధనా వ్యూహాలను అనుసరించాలో చూద్దామా?


1. మైండ్ మ్యాపింగ్
2. సెమినార్
3. మీట్‌ది ప్రెస్
4. యూత్ పార్లమెంట్
5. మాదిరి ఎన్నికలు
6. క్షేత్ర పర్యటన
7. కేస్‌స్టడీ
8. పోస్టర్స్ అండ్ బ్రోచర్స్
9. క్విజ్
10. KWL
11. ఏకపాత్రాభినయం
12. తరగతి గది కార్యశాల
13. రీడింగ్ అండ్ రీరైటింగ్ ది టెక్స్ట్

ఒక్కొక్క బోధనా వ్యూహం గురించి విపులంగా చర్చిద్దామా!

### 1) మైండ్ మ్యాపింగ్ :

విద్యార్థులకు ఏదైనా అంశం / భావనను ఇచ్చి ఆలోచింపచేసి, వారి నుండి వచ్చిన ఆలోచనలను క్రోడీకరించి ముగింపు ఇవ్వడం.

ఉదా: 8వ తరగతిలో బ్యాంకింగ్ అనే పాఠం చెప్పేటప్పుడు బ్యాంకింగ్ గురించి మీకేమి తెలుసో చెప్పండి అని అడిగినప్పుడు పిల్లలు బ్యాంకింగ్ గురించి ఆలోచిస్తారు. పిల్లలు చెప్పిన సమాధానాలను మైండ్ మ్యాపింగ్ చుట్టూ రాయాలి.




మైండ్ మ్యాపింగ్ నిర్వహించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. పిల్లలు ఒక విషయంపై విభిన్న ఆలోచనలను ఒక చోటుకి చేర్చి ఒక నిర్ణయానికి రావడం వల్ల ఇది సహజ నిర్మాణాత్మక వాదంగా చెప్పవచ్చు. అలాగే పిల్లలందరూ ఆలోచించడం, పాల్గొనడం వల్ల క్రియాశీల అభ్యసనం జరుగుతుంది. ఇంకా విద్యార్థుల పూర్వ అనుభవాల ఆధారంగా

నూతన విషయంతో జ్ఞానం అనుసంధానం కావడం వల్ల అర్థవంతమైన అభ్యసనం జరుగుతుంది. ఇది విద్యార్థి కేంద్రీకృతంగా ఉంటుంది. ఎందుకుంటే పిల్లలే స్వయంగా అభ్యసనంలో పాల్గొంటారు. ఉపాధ్యాయుడు కేవలం (ఫెసిలిటేటర్‌గా) సౌకర్యకర్తగా ఉంటాడు. దీంట్లో పిల్లలు అందరూ భాగస్వాములు కావడం జరుగుతుంది. కాబట్టి ఉపాధ్యాయుడు బోధన - అభ్యసన ప్రక్రియలో మైండ్ మ్యాపింగ్‌ను ఒక ముఖ్యమైన బోధనా వ్యూహంగా అమలుపరచవచ్చు.

**2) సెమినార్ :**

ఏదైనా ఒక అంశంపై విద్యార్థులకు ముందే సమాచారం ఇచ్చి, అవసరమయిన వనరులను కూడా చెప్పి ఒక పత్రం తయారుచేసుకోమనాలి. తయారు చేసిన పత్రం కాపీలు తరగతిలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిద్ధం చేసుకోవాలి. తరగతి గదిలో తాను రూపొందించిన పత్రాన్ని ఒక్కొక్క విద్యార్థికి ఒకటి ఇవ్వాలి. తరువాత తాను రూపొందించిన (పత్రం) అంశం గురించి విశదీకరించాలి. దీని తరువాత విద్యార్థులు తమ సందేహాలను అడగాలి. సెమినార్ పత్రం సమర్పించిన విద్యార్థి సందేహాలను నివృత్తి చేయాలి. ఇలా 8వ తరగతిలోని బ్యాంకింగ్, చట్టం, న్యాయం, పేదరికం, హక్కులు లౌకికతత్వం, సినిమా వీటిపై ఉపాధ్యాయుడు విద్యార్థులకు సెమినార్ నిర్వహించడానికి అవసరమయిన సహాయ, సహకారాలు అందించాలి. అదే విధంగా 9వ తరగతిలో కూడా రుణాలు, ధరలు, పన్నులు, మానవ హక్కులు, మహిళా చట్టాలు, విపత్తులు లాంటి అంశాలపై విద్యార్థులకు అవకాశ ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల విద్యార్థి ఒక విషయంపై లోతుగా ఆలోచించడమే కాకుండా అదనపు సమాచారం సేకరించడం వల్ల అతనికి సమగ్రమైన అవగాహన ఏర్పడుతుంది.

**3. మీట్ ది ప్రెస్ :**

బోధనా వ్యూహాలలో పిల్లలు ఆసక్తిగా పాల్గొనడానికి అవకాశం ఇచ్చేది మీట్ ది ప్రెస్. దీని కోసం తరగతి లోని కొంతమంది విద్యార్థులను పత్రికా విలేఖరులుగా నియమించి, వారికి కేటాయించిన అంశాలకు ప్రశ్నలను తయారుచేసుకోమనాలి. విద్యార్థులలో మరికొందరిని ఎంపిక చేసి నాయకులుగా గుర్తించాలి. వారికి ఒక్కొక్కరికి ఒక్కో అంశం కేటాయించాలి. మిగిలిన పిల్లలు జరుగుతున్న సంభాషణను నిశితంగా పరిశీలించాలి.

**నిర్వహణా విధానం :**

నాయకులుగా గుర్తించిన పిల్లలను డయాస్ పైన కూర్చొనబెట్టాలి. వారు, వారికి కేటాయించిన అంశంపై ఒక్కొక్కరు మాట్లాడాలి. వీరు మాట్లాడిన తరువాత ఆయా అంశాలపై పత్రికా విలేఖరులుగా పాల్గొన్న విద్యార్థులు వారికున్న సందేహాలను ప్రశ్నల రూపంలో అడగాలి. పైన కూర్చున్న విద్యార్థులు ఎవరి అంశానికి సంబంధించిన ప్రశ్న అయితే వారు సమాధానం ఇవ్వాలి. ఇలా నిర్వహిస్తున్నప్పుడు మిగిలిన విద్యార్థులు పాత్రికేయ విద్యార్థులు అడుగుతున్న ప్రశ్నలను, డయాస్ పైన కూర్చున్న విద్యార్థులు ఇస్తున్న సమాధానాలను పరిశీలిస్తూ ముఖ్యాంశాలను నోటు పుస్తకములో రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల విషయం గురించి అందరు విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుంది.

ఉదా: హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్ర్య ఉద్యమం, చట్టం, న్యాయం, మహిళల రక్షణ చట్టాలు, రోడ్డు, భద్రతా విద్య భారతదేశంలో సేవా కార్యకలాపాలు మొదలైనవి.

**4. యూత్ పార్లమెంట్**

"పాఠశాలపట్ల ఆసక్తి, అభిరుచి ఉండి, చురుకుగా ఉంటూ స్పష్టంగా, ధారాళంగా మాట్లాడే విద్యార్థుల స్వీయ భాగస్వామ్యముతో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడి మార్గదర్శకత్వంలో, రాష్ట్రస్థాయిలో శాసనసభలో, కేంద్ర స్థాయిలో లోకసభలో జరిగే సమావేశాల తరహాలో నిర్వహించుకొనే "ఆసక్తికరమైన కార్యక్రమం" యూత్ పార్లమెంట్.

**ఎవరిని భాగస్వాములను చేయాలి?**

- చురుకైన / ఆసక్తిగల విద్యార్థులు
- పాఠశాలపట్ల ఆసక్తిగల విద్యార్థులు
- గ్రామస్థులు
- తల్లి దండ్రులు

**బాధ్యతల పంపిణీ / సంసిద్ధతా క్రమం :**

ప్రణాళిక (Planning)

తయారీ (Preparation)

ప్రదర్శన / అమలు (Presentation / implementation)

మూల్యాంకనం (Evaluation)

**ప్రణాళిక :**

- పాల్గొనే విద్యార్థులను ఎంపిక చేయాలి.
- వారిలో నుండి మంత్రులుగా కొంతమందిని, మరికొంతమందిని అధికార పార్టీ, ప్రతిపక్షపార్టీ యం.ఎల్.ఎ.లు గా నియమించాలి.
- ప్రధానోపాధ్యాయునికి సమాచారం ఇచ్చి అనుమతి తీసుకోవాలి.
- తోటి ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలి.
- అవసరమైన సామాగ్రి సమకూర్చుకోవాలి.
- తల్లిదండ్రులు / గ్రామస్థులకు తెలియజేయాలి.
- కనీసం 10 రోజుల ముందుగా ప్రణాళిక చేసుకోవాలి. వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలను సిద్ధం చేసుకోమని చెప్పాలి.

**4. నిర్వహణ విధానం :**

1. స్పీకర్, సి.యం, ప్రతిపక్షనేత, మంత్రులు (అంగరక్షకులతో సహా), శాసనసభ్యులు, ప్రెస్ వారికి కేటాయించిన స్థలంలో (cards / charts వ్రాసి, బోర్డులు ఏర్పాటు చేసి) కూర్చోబెట్టాలి.
2. స్పీకర్ అనుమతితో సభ్యుల పరిచయం
3. ప్రశ్నోత్తరాల కార్యక్రమం – ముఖ్యమైన శాఖలకు సంబంధించిన, సమకాలీన సమస్యలకు సంబంధించిన ప్రశ్నలు అడిగే కార్యక్రమం (ప్రతిపక్ష సభ్యులచే)
4. మంత్రుల సమాధానాలు
5. ప్రతిపక్షనేత సందేశం
6. సభ వాయిదా

**5. మాదిరి ఎన్నికలు :**

గ్రామస్థాయి నుండి రాష్ట్ర, కేంద్రస్థాయి వరకు జరిగే ఎన్నికల విధానంను పాఠశాలలో మాదిరి ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎన్నిక పద్ధతి అవగాహన అవుతుంది.

8వ తరగతిలో 3వ థీమ్ లోని 14వ పాఠ్యాంశం పార్లమెంట్, కేంద్ర ప్రభుత్వాన్ని ఈ మాదిరి ఎన్నికల విధానంతో బోధించవచ్చును.

ఉదాహరణకు తరగతి గది నాయకుడిని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఎన్నుకొనే విధానాన్ని నిర్వహించడం

**6. క్షేత్ర పర్యటన :**

విద్యార్థులకు ప్రత్యక్ష పరిశీలన ద్వారా విషయ పరిజ్ఞానం ఎక్కువ కాలం (శాశ్వతంగా) గుర్తుండి పోతుంది. అదే విధంగా పూర్వ భావనలను ప్రత్యక్ష పరిశీలనకు అనుసంధానం చేయడం ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. కాబట్టి ఉపాధ్యాయులు క్షేత్ర పరిశీలనకు అవకాశం కల్పించాలి. ఉదా॥ బ్యాంకింగ్, ప్రజారోగ్యం, కోర్ట్, పార్లమెంట్, వ్యవసాయం – పంటలు, మార్కెట్ – ధరలు, రోడ్డు సిగ్నల్ మొ॥నవి.

**7. కేస్ స్టడీ (వ్యక్తి అధ్యయనం) :**

"సమస్యాత్మకమైన ఒక ముఖ్యమైన అంశాన్ని తీసుకొని, సమస్యకు కారణాలను కనుగొని, వాటిని విశ్లేషించి, పరిష్కార మార్గాలను చూపడాన్ని 'వ్యక్తి అధ్యయనం' అంటారు.

– బోని & హాల్‌పిల్ మన్

సాంఘిక శాస్త్ర బోధనలో భాగంగా మనం 'కేస్ స్టడీ'ని ఉపయోగించవచ్చు. సాంఘికశాస్త్రం పాఠ్యపుస్తకాలలో అనేక 'కేస్ స్టడీ'లను మనం గమనించవచ్చు.

**ఉదాహరణకు:**

6వతరగతిలో – 4,5,6 పాఠాలు "కేస్ స్టడీ" ల ఆధారంగా రూపొందించబడినవే. అదే విధంగా 7, 8, 9 తరగతుల పాఠ్యాంశాలలో భాగంగా అనేక వ్యక్తి అధ్యయనాలు చేర్చబడినవి. ఈ అధ్యయనాలను పరిశీలిస్తే "కేస్ స్టడీ"లో కొన్ని సోపానాలను అనుసరించాల్సి ఉంటుందని అర్థం అవుతుంది.

**కేస్ స్టడీ నిర్వహణ – సోపానాలు (నివేదిక తయారీ) :**

1. **సమస్యను ఎన్నుకోవటం :** సమస్యను ప్రశ్నరూపంలో రాసుకోవాలి.
2. **ప్రస్తుత పరిస్థితి :** సమస్య యొక్క ప్రస్తుత పరిస్థితిని గురించిన సమాచారాన్ని సేకరించి రాయడం.
3. **సమస్యకు గల కారణాలు :** సమస్యకు గల కారణాలను వివిధ మార్గాలద్వారా (రికార్డులు, వ్యక్తులు, వార్తాపత్రికలు మొ॥) సేకరించి నమోదు చేయాలి.
4. **కారణాలను విశ్లేషించటం :** అధ్యయనం చేసేవ్యక్తి, తాను సేకరించిన సమాచారాన్ని శాతాల రూపంలోకి మార్చి లేదా వివిధ అభిప్రాయాలను క్రోడీకరించిరాయాలి.
5. **పరిష్కార మార్గాలను సూచించటం :** చివరగా సమస్యను అధిగమించటానికి కొన్ని పరిష్కారమార్గాలను సూచించాలి. ఆమార్గాలలో ఒకదానిని ఎన్నుకొని ఆచరణలో పెట్టడం చేయాలి. (కనుక తన పరిధిలో ఉన్న సమస్యనే ఎంచుకోవాలి)

ఈ క్రింది 'కేస్ స్టడీ' ని పరిశీలించండి. నివేదిక రాసే విధానాన్ని గమనించండి.

## కేస్ స్టడి (Case Study)

**అంశం :** మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, దాని ఉద్దేశాలను నెరవేరుస్తున్నదా?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని 1982లో అభ్యుదయ ప్రాథమిక పాఠశాలలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టినది. కాని ఆర్థిక కారణాల వలన దీనిని కొనసాగించలేక పోయింది. ఆతర్వాత జనవరి 2003 నుండి భారత ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు ఈ పథకాన్ని ఎలిమెంటరీస్థాయి (1–8 తరగతులు) కి విస్తరించడం జరిగింది. అప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో 9, 10 తరగతులకు కూడా ఈ పథకం ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్నది.

ఈ పథకం యొక్క లక్ష్యలను పరిశీలిస్తే, పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించడం, పాఠశాల నమోదును పెంచడం, గైరుహాజరును నివారించడం, పిల్లల హాజరును పెంచడం, సాంఘిక అసమానతను తొలగించడం, లింగ సమానత్వం, పాఠశాలల పట్ల సమాజ బాధ్యతను పెంచడం, స్త్రీ సాధికారత మొదలైనవి ఉద్దేశాలుగా చెప్పవచ్చు.

పాఠశాలలో మధ్యాహ్న భోజన ఫథకం అమలు తీరును పరిశీలించుటకై కర్నూలు జిల్లాలోని కొన్ని పాఠశాలలను సందర్శించడం జరిగింది. పాఠశాలలో ఈ పథకం అమలు తీరును గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, పొదుపు సంఘాల కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకొనడం జరిగింది.

భోజనంలో భాగంగా అన్నం, పప్పు, కాయగూరలు, సాంబార్, పులిహోర వంటి పదార్థాలతోపాటు, వారానికి రెండు కోడిగుడ్లు ఇవ్వాల్సి ఉంది. కోడిగుడ్లు తినని పిల్లలకు అరటి పండ్లు ఇవ్వాలి. అన్ని పాఠశాలలు, మెను ప్రకారం విద్యార్థులకు అన్నంతోపాటు సాంబార్, కాయగూరలు, పప్పు పంపిణీ చేయడం జరుగుతున్నది. అయితే పిల్లల అభిప్రాయం ప్రకారం అన్నం యొక్క నాణ్యత సరిగాలేదు. కూరలు నీళ్ళలాగా ఉంటున్నాయి. వారానికి ఒకసారి గుడ్డు, మరోసారి అరటిపండు ఇస్తున్నారు. పిల్లలకు సరిపడినంత ఆహారం పెడుతున్నారు.

పరిశుభ్రత విషయానికి వస్తే కొన్ని పాఠశాలల్లో మంచి నీటి వసతి లేదు. పిల్లలే ఇంటి నుండి మంచి నీరు తెచ్చుకోవలసి వస్తున్నది. మరికొన్ని పాఠశాలల్లో వంట గదులులేవు. ఆరుబయట ప్రదేశంలో వంట వండాల్సి వస్తుంది. ఫలితంగా దుమ్ము ధూళి పడి ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయి.

పొదుపు లక్ష్మీగ్రూపులు, మహిళా సంఘాల వాళ్ళు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి 25మంది పిల్లలకి ఒక వంట మనిషి, ఒక సహాయకులు ప్రభుత్వ నిబంధనల మేరకు నియమించబడ్డారు. వీరి గౌరవ భృతిని 75:25 ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయి.

జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో పాఠశాలలకు కావలసిన బియ్యం సరఫరా జరుగుతున్నది. అంతేకాక మహిళా సంఘాలకు చెల్లించవలసిన మొత్తాలనుకూడా వీరి ద్వారానే చెల్లించడం జరుగుతున్నది. తమకు రావలసిన నెలవారి ఖర్చులను క్రమం తప్పకుండా, ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రభుత్వంవారు చెల్లిస్తున్నారని పొదుపు సంఘాల మహిళలు చెప్పారు. గతంలో కంటే ఇప్పుడు సక్రమంగా జరుగుతున్నాయని వారు అభిప్రాయపడ్డారు. అయితే తమకు కావలసిన పాత్రలను, గ్యాస్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తే బాగుంటుందని వారు తెలిపారు. కిచెన్ షెడ్‌లు లేకపోవడం వలన వంట చేయడం చాలా కష్టంగా ఉందని, మంచినీటి సౌకర్యం బడిలోపలికి కల్పిస్తే బాగుంటుందని అన్నారు.

ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల అభిప్రాయం ప్రకారం మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా జరుగుతున్నది. విద్యార్థులు హాజరు శాతం గతంలో కంటే చాలా మెరుగుపడింది. పిల్లలలో ఆరోగ్యసమస్యలు బాగా తగ్గిపోయాయి. పిల్లలందరూ కుల, మత, లింగ, వర్గ బేధాలు లేకుండా కలసి మెలసి కూర్చొని సహపంక్తి భోజనం చేయడం వలన సుహృద్భావ వాతావరణం పెంపొందుతున్నది.

మొత్తం మీద చూస్తే మధ్యాహ్న భోజన పథకం ప్రవేశ పెట్టిన ఉద్దేశాలు, నెరవేరుతున్నట్లు మనకు తెలుస్తున్నది. పిల్లలో పోషకాహార లోపం కనబడటం లేదు. పౌష్టికాహారం వారికి అందించబడుతున్నది. బడిలో పేద, ధనిక, కుల, మత, లింగ బేధాలు కనబడలేదు. గ్రామస్థులు ఈ పథకాన్ని పర్యవేక్షిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నిరంతరం ఈ పథకం సక్రమంగా అమలు చేయడానికి కృషి చేస్తున్నారు. పిల్లల హాజరు శాతం ఆశించిన స్థాయిలో మెరుగుపడింది. బడి మానేసే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. నాణ్యమైన బియ్యం, వంట పాత్రలు, గ్యాస్‌లను కార్యక్రమ నిర్వాహకులకు ప్రభుత్వం అందించడం వలన మరింత మంచి ఫలితాలను పొందవచ్చు. కూరల తయారీలో నాణ్యతను పొందటానికి పై అధికారుల రెగ్యులర్ మానిటరింగ్ తప్పనిసరి.

మధ్యాహ్న భోజనం అమలు తీరు గురించి ఒక డైట్ లెక్చరర్ చేసిన అధ్యయనంలో 'మానిటరింగ్'ను బలోపేతం చేయటం వలన మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు మెరుగు పడుతుందని అభిప్రాయపడెను.

ఇదేవిధంగా ఛాత్రోపాధ్యాయులు విద్యార్థులకు సంబంధించిన ఈ క్రింది అంశాలకు సంబంధించిన సమస్యలను 'కేస్ స్టడీ' కి ఎంచుకోవచ్చు.

**అంశాలు / సమస్య :**

1. విద్యార్థుల వ్యక్తిగతమైన సమస్యలు
2. విద్యార్థుల విద్యాపరమైన సమస్యలు
3. విద్యార్థుల సర్దుబాటు సమస్యలు
4. విద్యార్థుల మూర్తిమత్వానికి చెందిన సమస్యలు
5. విద్యార్థుల ప్రవర్తనాపరమైన సమస్యలు

## 8. పోస్టర్స్ & బ్రోచర్స్ :

విద్యార్థులు ఏదైనా ఒక విషయం గురించి చైతన్యం కలిగించడానికి వారే స్వయంగా పోస్టర్స్ అండ్ బ్రోచర్స్ తయారు చేయుటకు అవకాశం కల్పించాలి. దీనివల్ల విషయము తక్కువకాలంలో ఎక్కువ మందికి తెలియజేయడానికి ఉపయోగపడుతుంది. అలాగే భవిష్యత్తులో కూడా ఏదైనా ఒక విషయం పట్ల లోతుగా చర్చించడానికి అవకాశం ఉంటుంది. ఉదా॥కు మహిళలను చైతన్యపరచుటకు బ్రోచర్ రూపంలో తయారు చేసి పంచడం.

ఇలా అనేక సమస్యలపై స్వయంగా పోస్టర్స్ అండ్ బ్రోచర్స్ తయారు చేయడానికి విద్యార్థులను ప్రోత్సహించాలి. అంటే ఉపాధ్యాయుడు తరగతి గదిలో విద్యార్థుల చేత తయారు చేయించాలి. దీనివల్ల పిల్లలు స్వయంగా పాల్గొనడం వల్ల పాఠ్యాంశాలలోని విషయం బాగా అర్థం అవుతుంది.

## 9. క్విజ్ :

సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు తమ బోధనా వ్యూహంలో క్విజ్ కార్యక్రమాలను చేర్చడం అనేది తప్పనిసరి. ఇందుకోసం ఉపాధ్యాయుడు ఒక రోజు ముందుగానే విద్యార్థులకు పాఠ్యాంశం ఏమిటో తెలియజేయాలి. మరుసటి రోజు అందులో పాల్గొనే విద్యార్థులను (3-4) గ్రూపులుగా చేసి వారి మధ్య క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించాలి. మిగిలిన విద్యార్థులు ఈ ప్రశ్నలు రాస్తూ, జవాబులు ఆలోచిస్తూ, ఒకవేళ క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థులు జవాబులు చెప్పలేక పోయినట్లయితే తామే జవాబులు చెప్పాలి. క్విజ్ కార్యక్రమం ఆశించిన ఫలితం ఇవ్వడానికి ఉపాధ్యాయుడు ముందుగానే ప్రశ్నలను సిద్ధం చేసుకొని ఉంచుకోవాలి.

## 10. KWL

నూతన పాఠ్య పుస్తకాలు పిల్లలు చదివి స్వయంగా అర్థం చేసుకొనేలా ఉన్నాయి. కాబట్టి ఉపాధ్యాయుడు ఈ టెక్నిక్ ద్వారా పిల్లల అనుభవాలకు, పరిసరాలకు దగ్గరి సంబంధం ఉండే పాఠ్యాంశాలకు దీనిని అమలు చేయాలి. దీంట్లో

K అనగా : What I know (నాకేమి తెలుసు)

W అనగా : What I have to know (నేనేమి తెలుసుకోవాలి)

L అనగా : What I have learnt (నేనేమి తెలుసుకున్నాను)

ఇందులో పాఠ్యాంశం గురించి ఏమి తెలుసో, ఏమేమి తెలుసుకోవలెనో, ఏమేమి తెలుసుకున్నామో విద్యార్థికి అర్థం అవుతుంది. ఉదా॥ కు 8వ తరగతిలోని అడవులు – వినియోగం, సంరక్షణ, జీవనోపాధులు, పేదరికం అవగాహన మొదలయినవి.

9వ తరగతిలో భారతదేశంలో వ్యవసాయం, భారతదేశంలో సేవా కార్యక్రమాలు, రోడ్డు భద్రత విద్య మొదలైనవి.

## 11. ఏకపాత్రాభినయం

పిల్లలు ఒక పాత్రకు సంబంధించి తనలోని భావాలని వ్యక్తపరచడమే ఏకపాత్రాభినయం.

చరిత్రకు సంబంధించిన రాజుల వీరగాథలు ఏకపాత్రాభినయం ద్వారా చేయించినట్లయితే అభ్యసనం బాగా జరుగుతుంది. ఉదా: అల్లూరి సీతారామరాజు, కొమరం భీం.

## 12. తరగతిగది కార్యశాల

తరగతివారీగా ఆయా తరగతుల పాఠ్యపుస్తకంలో పాఠ్యాంశాలకు, అనుగుణంగా పిల్లలతో అవసరమైన సామగ్రిని తయారు చేయించడమే తరగతి గది కార్యశాల పని. దీనికి ఉపాధ్యాయుడు ఒక ప్రణాళిక రూపొందించుకోవాలి. పిల్లలకు కావలసిన సామగ్రిని అందుబాటులో ఉంచి, కార్యశాలను నిర్వహించాలి.

ఉదా : సమాచార పట్టికలు తయారుచేయడం.

ఇంకా 6, 7, 8, 9 తరగతులకు ఏఏ సామగ్రి పిల్లలతో తయారు చేయించవచ్చో పరిశీలించి పట్టిక తయారు చేయండి.

## 13. రీడింగ్ మరియు రీ రైటింగ్ ద టెక్స్ట్

నూతన పాఠ్యపుస్తకాలలో విద్యార్థులు చదవడానికి వీలుగా సరళమైన భాషను ఉపయోగించడం జరిగింది. ఉపాధ్యాయుడు పిల్లల నేపథ్యానికి, అనుభవాలకు, పరిసరాలకు దగ్గరగా ఉన్న పాఠ్యాంశాల బోధనలతో ఈ బోధనా వ్యూహాన్ని అనుసరించాలి. దీనిలో మొదట విద్యార్థులను చదవమనాలి. తర్వాత పిల్లలకు ఏమి అర్థమయిందో చెప్పమనాలి. దీనివల్ల పిల్లలలో స్వీయ అభ్యసనం జరుగుతుంది.

6, 7, 8, 9 తరగతుల పాఠ్య పుస్తకాలలో ఏఏ పాఠ్యాంశాలు ఈ బోధనా వ్యూహానికి అనుకూలంగా ఉన్నాయో గుర్తించండి. ఇవేగాక సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పాఠ్యాంశ స్వభావానికి అనుగుణంగా ఏ బోధనా వ్యూహం సరియైనదో నిర్ణయించుకొని అమలు చేయాలి. దీనివల్ల పిల్లలు ఉత్సాహంగా బోధనాభ్యసన ప్రక్రియలో భాగస్వాములు అవుతారు. ఇలాంటి మరికొన్ని బోధనా వ్యూహాలు ఈక్రింద సూచించబడినవి.

**మరికొన్ని బోధనావ్యూహాలు :**

- ★ ప్రశ్నలు మరియు చర్చ
- ★ చదువుట – ప్రతిస్పందించుట
- ★ పదాలపై చర్చించుట
- ★ పటాల కృత్యాలు
- ★ జట్టుకృత్యం – ప్రదర్శన – చర్చ
- ★ ప్రశ్నించడం మరియు వాదనలు
- ★ పరిస్థితి విశ్లేషణ మరియు ప్రతిస్పందన
- ★ సమాచారసేకరణ – విశ్లేషణ – ప్రదర్శన
- ★ చదవడం, చదివిన దానిని సొంత మాటలలో రాయడం
- ★ కామెంటరీలు
- ★ ప్రాజెక్టులు (గ్రూపు, వ్యక్తిగత)
- ★ ప్రదర్శనలు (గ్రూపు, వ్యక్తిగత)
- ★ నమూనాల ఛార్టు, గ్రాఫ్‌ల తయారీ
- ★ డిబేట్స్
- ★ ఇంటర్వ్యూల నిర్వహణ
- ★ సర్వేలు
- ★ నమూనాలను సేకరించడం
- ★ సింపోజియం
- ★ ప్యానల్ డిస్కషన్స్

**బోధనా వనరులు :**

తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియలు సమర్థవంతంగా నిర్వహిచడానికి వనరులు దోహదపడతాయి. పిల్లలకు అదనపు సమాచారం అందించడానికి, ఒక విషయం అర్థం చేయించడానికి, పిల్లలు సామగ్రితో ప్రతిచర్యలు జరపడానికి, బోధనను ఆకర్షణీయంగా చేయడానికి, పిల్లలు అదనపు సమాచారం సేకరించడానికి, పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి, ఒక విషయం గురించి తెలుసుకొనడానికి, ప్రశ్నించడానికి వనరులు తోడ్పడుతాయి.

## B) సాంఘిక శాస్త్రం అవసరమైన వనరులు

1. రెఫరెన్స్ పుస్తకాలు
   - ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాల భూగోళం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం పుస్తకాలు.
   - డిగ్రీ తెలుగు అకాడమీ భూగోళశాస్త్రం
   - యోజన
   - ఇండియా టుడే
   - CBSE Books (NCERT)
   - ICSE Books

| | | |
|---|---|---|
| | – | ఏకలవ్య ప్రచురణలు |
| | – | దినపత్రికలు |
| | – | దినపత్రికలలోని ఆర్టికల్స్ |
| 2. సోషల్ స్టడీస్ ఫోరాలు/క్లబ్‌లు | – | సోషల్ స్టడీస్ ఫోరం/క్లబ్‌లు |
| | – | ఉపాధ్యాయ సంఘాలు |
| 3. వనరుల కేంద్రాలు | – | SCERT, Hyd |
| | – | DIET |
| | – | జిల్లా గ్రంథాలయాలు |
| | – | పాఠశాల గ్రంథాలయాలు |
| 4. మానవ వనరులు | – | బ్యాంక్ సిబ్బంది |
| | – | అడ్వకేట్స్ |
| | – | పోలీస్ సిబ్బంది |
| | – | ప్రజా ప్రతినిధులు |
| | – | MRO, MPDO, MEO మొ॥ |
| 5. మీడియా | – | టెలికాన్ఫరెన్స్‌లు |
| | – | Suject వారి C.D లు |
| | – | MANA T.V. |
| | – | సప్తగిరి ఛానల్ |
| 6. వెబ్‌సైట్స్ | – | www.weekly.com |
| | – | www.aravindaguptatoys.com |
| | – | www.pbs.org/teachers |
| | – | www.new/teaching strategies |

**8వ తరగతి – కావలసిన బోధనా సామగ్రి**

1. ప్రపంచ పటం (భౌతిక, రాజకీయ)
2. గ్లోబు
3. అట్లాసు (oxford)
4. ఛార్టులు
5. భారతదేశపటం (రాజకీయ, భౌతిక)
6. 2011 జనాభా వివరాలు
7. ఆంధ్రప్రదేశ్ (భౌతిక, రాజకీయ) పటం
8. ఉష్ణమాపకం
9. భూచలనాలు (వీడియో CD)
   (a) భూభ్రమణం (b) భూపరిభ్రమణం
10. అందుబాటులో ఉండే కొన్ని ముడిఖనిజాలు
11. వివిధ రకాల మట్టి నమూనాలు

12. కరెన్సీ – Coins - Notes పాతవి / కొత్తవి (అందుబాటును బట్టి)
13. బ్యాంకు లావాదేవీల స్టేషనరీ
    (a) చెక్కు (b) డ్రాఫ్టు (c) నగదు జమ ఫారం (d) నగదు తీసికొనే ఫారం
    (e) పాసుపుస్తకం (f) ATM Card ప్రారంభానికి అప్లికేషన్ ఫారం మొ॥వి.
14. జాతీయనాయకుల చిత్రాలు.
15. భారతరాజ్యాంగం ప్రతి
16. జాతీయ చిహ్నాలు
17. పార్లమెంటు చిత్రం
18. రాష్ట్రపతి భవన్ చిత్రం
19. FIR ఫారం నమూనా
20. BMI Chart
21. విద్యా హక్కు చట్టం ప్రతి
22. సమాచార హక్కు చట్టం ప్రతి
23. వివిధ సంగీత వాయిద్య పరికరాలు
24. వివిధ నాట్యరూపాల వీడియోలు, చిత్రాలు
25. వివిధ క్రీడోపకరణములు
26. దినపత్రికల నుండి సేకరించిన విపత్తులకు సంబంధించిన చిత్రాలు.

**క్షేత్ర పర్యటన**

1. బొగ్గుగనులు
2. అడవులు
3. బ్యాంకు
4. ATM Centre
5. ఆసుపత్రి
6. పరిశ్రమ
7. పోలీస్ స్టేషన్
8. న్యాయస్థానం
9. చౌకధరల దుకాణం
10. సినిమాహాలు సందర్శన (Projector)
11. Printing Press

**9వ తరగతి – కావలసిన బోధనా సామగ్రి**

1. అంతరిక్షం వీడియో
2. ప్రపంచ పటం
3. అట్లాసు

4. వివిధ రకాల శిలలు
5. ఛార్టులు
6. గ్లోబు
7. భారతదేశపటం
8. చిరుధాన్యాలు
9. స్థిర, చర ఆస్తులను చూపే ఛార్టు
10. యూరప్ పటం
11. ఆఫ్రికా పటం
12. ట్రాఫిక్ గుర్తులు
13. డ్రైవింగ్ లైసెన్సు వివిధ ఫారములు

**సందర్శన చేయదగినవి**

1. నక్షత్రశాల
2. బీచ్‌లు (అవకాశమున్నవారు)
3. పరిశ్రమ - (ఏదేని)
4. అటవీశాఖా కార్యాలయం
5. స్వయం సహాయక సంఘాలతో మాట్లాడించటం
6. ఆదాయ పన్నుశాఖ కార్యాలయం

8, 9 నూతన పాఠ్యపుస్తకాలను పరిశీలించి అవసరమైన సామగ్రిని గుర్తించడం జరిగింది. అలాగే 6, 7 తరగతుల పాఠ్య పుస్తకాలను పరిశీలించి అవసరమైన సామగ్రిని గుర్తించండి.

పైన సూచించిన వనరులతోపాటు విద్యకోసం కృషి చేసిన సంస్థలు, పరామర్శ గ్రంథాలు, ఉపయుక్తమైన వెబ్‌సైట్స్, చలన చిత్రాలు ఇవ్వడం జరిగింది. వీటిని చదవడం, చూడడం ద్వారా తరగతిగదిలో మరింత సమర్థవంతంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించవచ్చు.

## A) Organisations that work on Social Sciences at School Level - On Curriculum and Material Development Issues

| Sl.No. | Name of Organisation | Location |
|---|---|---|
| 1. | **Eklavya** | Bhopal, MP |
| 2. | **Uttarakhand Seva Nidhi** | Almora, Uttarakhand |
| 3. | **Nirantar** | New Delhi |
| 4. | **Khoj** | Mumbai |
| 5. | **Avehi Abacus** | Mumbai |
| 6. | **Swanirbhar,** Organisation based in North 24 Pargana | West Bengal |
| 7. | **SAHMAT,** Safdar Hashmi Memorial Trust | New Delhi |
| 8. | **Vidya Bhawan Society** | Udaipur, Rajasthan |
| 9. | **Digantar** | Jaipur, Rajasthan |
| 10. | **Pravah** | Delhi |

## B) Schools that have used Innovative Methods to Teach Social Science

| Sl.No. | Name of Organisation | Location |
|---|---|---|
| 1. | **The School** | Chennai |
| 2. | **Rishi Valley School,** (Social Science and History Curriculum for classes 4 to 7) | Almora, Uttarakhand |
| 3. | **Shishu Van** | Bombay |
| 4. | **Center for Learning** | Bangalore, Hyderabad |
| 5. | **Aadharshila** | Sendhwa, MP |
| (Most of these schools have their websites where contacts and materials can be accessed) | | |

## C) Publishers in Social Sciences

- **Granthshilpi** - New Delhi
- **Eklavya,** Bhopal, M.P.
- **Bharat Gyan Vigyan Samiti,** Delhi
- **NCERT,** New Delhi
- **Publication Division,** New Delhi
- **National Book Trust,** New Delhi
- **Children's Book Trust,** New Delhi
- **Books on Social Science Education by Sage Publications,** New Delhi

- **Books published for Children by Oxford University Press,** New Delhi
- **People's History Series, Tulika Publications,** Chennai
- **Katha,** New Delhi
- **Tara,** Chennai
- **Navayana,** New Delhi

## D. Some Useful Books

- **Samajik Adhayayan** - 6, 7 and 8 - Textbooks developed and published by Eklavya, Bhopal
- **Textbook of Social Science** for class 6, 7 and 8 (English, 1994) : Eklavya, Bhopal
- **Textbooks of Social Science** for classes 6 & 7, developed by Eklavya for Lok Jumbish Parishad, Rajasthan, 1999/2000.
- **Samajik Adhayan Sikshan** - Ek Prayog, published by Eklavya
- **Hamari Dharati, Hamara Jeewan,** textbooks for classes 6, 7 & 8, Uttarakhand Sewa Nidhi, Almora
- **Workbooks** for Rajasthan textbooks for Classes 6, 7 & 8
- **Workbooks** of Haryana for Class 6, 7 & 8 (2008)
- **Text Book of Chattisgarh** for classes 3 to 8 : EVS and Social Science, SCERT, Raipur
- **Textbooks for Ladakh Hill Council** on Environmental Studies Part II for classes 4 & 5
- **Our Tribal Ancestors -** Prehistory for Indian Schools, part 1 & 2, Rishi Valley Education Series
- **Sangam Age and Age of the Pallavas -** TVS Education Society & Macmillan
- **The Young Geographer Series,** Haydn Evans, Wheaton - Pergamon
- **Geography Direct -** Collins Educational
- **Khushi-Khushi** for class 3, 4, 5 : Eklavya, Bhopal
- **Apne Aas pas,** textbook for classes 4 & 5, Digantar, Jaipur
- **Kuchh Karen,** Vidya Bhawan Society, Udaipur
- **Textbooks** of NCERT for class 3 to 8 : NCERT, New Delhi
- **Textbooks** of EVS and Social Science for classes 3 to 8, SCERT, New Delhi

## E. Some Resource & Reference Books

- **Itihas ke Srote,** bhag-1, A resource book for Teachers, published by Eklavya
- **People, Places and Change** : An Introduction to World Cultures by Berry and Ford
- **Puffin History of India series** by Puffin Books, Delhi
- **Report of the seminar on Environment Studies** (1995) : Vidya Bhawan Society
- **Social Science Learning in Schools** - Documentation of the Eklavya's social science experiment, Edited by Prof Poonam Batra and published by SAGE.
- **Teaching Social Science in Schools** - by Alex M George and Amman Madan, Published by SAGE

- **Walk With Me -** A guide for Inspiring Citizenship Action - Pravah, New Delhi
- **Writings of Teachers Ideas for the Classroom -** East West Books, Madras
- **Social Studies Instruction in the Elementary School** by Richard E Servey
- **Learning from Conflict** by Prof Krishna Kumar
- **Turning the Pot Tilling the Land** by Kancha ILAIAH - Navayana Books
- **Different Tales Series -** Anveshi and D.C. Books, Kerala

### F. Localised Resource Books as Models for Creation

- **Our City Delhi -** Narayani Gupta - Oxford University Press
- **School and Society and Area Study of Mylapore -** Tara Publishing

### G. Journals

- **Sandarbh** (For Teachers)
- **Vimarsh** (For Teachers)
- **Chakmak** (For Children)
- **Contemporary Education Dialogue**
- **Economic and Political Weekly**
- **Teacher Talk, A Journal of the TVS Education Society**
- **Journal of the Krishnamurthy Schools**

### H. Films

- **The Young Historians -** Series of films by Ms Deepa Dhanraj
- **Bharat Ki Khoj,** Tele Serial produced & directed by Mr Shyam Benegal
- **Bharat Ki Chhap,** film on Indian History
- **Naata** (on Communalism) TISS Mumbai (Anjali Monteiro)
- **India Untouched -** Stalin (on Untouchability in India)
- **War and Peace -** Anand Patwardhan
- **Making of the Mahatma -** Shyam Benegal
- **Ambedkar**
- **Nanook of the North (on the life of Eskimos)**

### I. Websites

- http://www.neok12.com/History-of-India.htm - has many videos on topics in social science
- eklavya publications, http://www.eklavya.in
- Sangati Interactive teaching learning kits, http://avehiabacus.org/about.htmlhttp://schools.indiawaterportal.org
- Me and my City - sunitha Nadhamuni and Rama Errabelli
  Janagraha Center for Citizenship and Democracy, www.janaagraha.org
- Water related projects and resources, http://schools.indiawaterportal.org/
- Heritage related resources
  The Indian National Trust for National and Cultural Heritage, http://www.intach.org/

- Curriculum based story books : IETS publications
  http://www.ilfsets.com/solutions.asp?secid=1&menuid=3&smenuid=1&childid=1&subchildid=2&pageid=345
- http://www.worldsocialscience.org/, the site of the International Social Science Council.
- UNESCO's Social and Human Sciences page, http://www.unesco.org/new/en/social-and-human-science/and Education page, http://www.unesco.org/en/education
- The IEA's Civic Education Study link is, http://www.iea.nl/icces.html
- Bombay Natural History Society, http://www.bnhs.org
- Kalpavriksha Environment Action Group, http://www.kalpavriksha.org
- Center for Environment Education, India, http://www.ceeindia.org/cee/index.html
- Down to Earth Magazine, http://www.downtoearth.org.in
- Center for Science and Environment, India, http://www.cseindia.org

**Some other Important Websites**

http://www.school.discovery.com
http://www.nationalgeographic.com
http://www.incredibleindia.org
http://www.animalplanet.co.uk
http://www.greenpeace.org
http://www.britanica.com
http://www.arvindguptatoys.com
http://www.khanacademy.com
kotagirishekar youtube
gurudeva.comnew

**వెబ్‌సైట్లు**

★ www.weekly.com
★ www.aravindaguptatoys.com
★ www.plos.org/teachers
★ www.new/teachingstrategies
★ www.askgerography.com
★ www.neok12.com/histor-of-india
★ www.eklavya.in
★ www.schools.indiawaterportal.org
★ www.intach.org
★ www.ilfsets.com
★ www.unesco.org/en/education
★ www.iea.nl
★ www.bnhs.org
★ www.kalpavriksha.org
★ www.ceeindia.org
★ www.downtoearth.org
★ www.cseindia.org

# 9 నిరంతర సమగ్ర మూల్యాంకనం

**మౌలిక ప్రశ్నలు - ఆలోచించండి - ప్రతిస్పందించండి**
**(Basic Questions - Think and Reflect)**

1. మదింపు అంటే ఏమిటి? (What is assessment?)
2. నిరంతర సమగ్ర మూల్యాంకనం అంటే ఏమిటి?
   (What is Continuous and What is Comprehensive Evaluation?)
3. మూల్యాంకనం ఎందుకు? దాని ఉద్దేశ్యం ఏమిటి? (Why evaluation? What is its purpose?)
4. వేటిని మదింపు చేయాలి? (What to assess?)
5. ఎలా మదింపు చేయాలి? (How to assess?)
6. మదింపు ద్వారా పిల్లలకు ఇచ్చే సమాచారం స్వభావం ఏమిటి? ఎందుకు?
   (What is the nature of the feed back? why and to whom?)
7. ఏ విధంగ మదింపు సమాచారాన్ని రిపోర్టు చేస్తాం? రిపోర్టింగ్ పద్ధతులు ఏమిటి?
   (How to report -reporing process?)
8. సి.సి.ఇ లో ఎవరు, ఏ ఏ బాధ్యతలు ఏఏ స్థాయిలలో స్వీకరించాలి?
   (What are the roles and responsibilties for effective implementation of CCE at various levels?)

**నేపథ్యం (Context)**

మూల్యాంకనం అనగానే పిల్లలకు పరీక్షలు నిర్వహించడం అనే భావన మనలోఉంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం మొత్తం కూడా మూల్యాంకనాన్ని పరీక్షల కోణంలో మాత్రమే చూడడానికి అలవాటు పడినారు. పాఠ్యపుస్తకంలో ఇచ్చిన సమాచారాన్ని నిరంతరం బట్టీ పట్టించి పరీక్షలలో రాయడమే బోధనా లక్ష్యంగా మారిపోయింది. మూల్యాంకనం పేరిట నిర్వహించే పరీక్షలు పిల్లలలో పాఠశాలపట్ల, నేర్చుకోవడంపట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించడానికి బదులుగా భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

పిల్లల ప్రగతిని మాపనం చేయడానికి ఉపయోగించే మార్కులు, ర్యాంకులు పిల్లలపై నిరంతరం ఒత్తిడి కలిగిస్తున్నాయి. అందువల్ల వారి శారీరక, మానసిక వికాసాలకు ఆటంకం కల్గుతుంది. మార్కుల సాధనే ధ్యేయంగా బోధనాభ్యసన ప్రక్రియలు కూడా మార్పు చెందాయి. మూల్యాంకనం పిల్లల అభిరుచులు, సామర్థ్యాలతో సంబంధం లేకుండా ఏక మొత్తంగా సాగే పరీక్షా కార్యక్రమంగా అమలవుతుంది. పరీక్షా ఫలితాల సాధనలో అవాంఛనీయ అంశాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. అసంబద్ధమైన పోటీ తత్వం పిల్లల ఉద్వేగ వికాసానికి, జీవన నైపుణ్యాల సాధనకు తావులేకుండా పోయింది. యూనిట్, టర్మినల్ పరీక్షల పేరుతో నిర్వహిస్తున్న మూల్యాంకనం, పిల్లలు ఉత్తీర్ణులయ్యారు, కాలేదు అని ముద్ర వేయడానికి మాత్రమే తోడ్పడుతోందే తప్ప లోపాలను గుర్తించి సామర్థ్యాల సాధనను మెరుగుపరచేందుకు ఉపయోగపడడం లేదు.

ప్రస్తుత మూల్యాంకనం ఉపాధ్యాయ కేంద్రీకృతంగా అమలవుతోంది. ప్రగతి పత్రాల పేరిట పిల్లలకు అందించే సమాచారంలో పాఠ్య విషయాలపై మూల్యాంకనం మాత్రమే చోటుచేసుకుంటుంది. చాలా సందర్భాలలో మనం నిరంతర, సమగ్ర మూల్యాంకనం నిర్వహిస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ పాఠ్యవిషయాలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నాం.

సహపాఠ్యాంశాలకు అనగా ఆరోగ్య-వ్యాయామ విద్య, కళలు-సాంస్కృతిక విద్య, పని-కంప్యూటర్ విద్య, విలువల విద్య-జీవన నైపుణ్యాలు మొదలగు వాటికి తగినంత ప్రాధాన్యత నివ్వడంలేదు. పైగా నిరంతర సమగ్ర మూల్యాంకనం అంటే ఎక్కువగా పరీక్షలు పెట్టడమనే అపోహ పడుతున్నాం. విధాననిర్ణయ కర్తలు, విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయులు నిరంతర, సమగ్ర మూల్యాంకనం యొక్క నిజమైన స్వభావాన్ని అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

**మూల్యాంకనం - ప్రస్తుత పరిస్థితి (Assessment - Existing Situation)**

- విద్యా లక్ష్యాలకు మరియు మూల్యాంకనం చేసే విధానం మరియు అడిగే ప్రశ్నలకు సంబంధం లేకపోవడం.
- విద్యార్థుల అభ్యసనాన్ని కేవలం రాతపరీక్షల ద్వారానే మాపనంచేయడం జరుగుతుంది. మౌఖికం మరియు ప్రదర్శనలకు అవకాశం తక్కువ ఉండడం.
- పరీక్షలలో పిల్లల ప్రగతి ఆధారంగా, బోధనలో మార్పులు లేక సవరణనాత్మక బోధన జరగడం లేదు. పిల్లల ప్రగతి బాగా లేకున్నా కూడా, తరవాత సిలబస్ చెప్పడం చేస్తున్నారు. పిల్లలకు వచ్చినా రాకున్నా సిలబస్‌కు పూర్తి ప్రాముఖ్యత ఇచ్చి మా పని అయిపోయింది అనిపిస్తున్నారు.
- పిల్లలలో ఆలోచనశక్తి, విశ్లేషణ సామర్థ్యాలను పరీక్షించే ప్రశ్నలు కాకుండా, కేవలం బట్టీపట్టి జవాబులు రాసే ప్రశ్నలకు ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుంది.
- అభ్యసనం అనేది పుస్తకాధారితం అయింది. సమాచారం ఇవ్వడం మరియు ఇచ్చిన దానిని యథాతథంగా పరీక్షించడం అనేది విద్యలో పరమార్థం అయినది.
- విద్యా ప్రణాళిక, విద్య యొక్క ముఖ్య ఉద్దేశ్యం- విద్యార్థిని సర్వతోముఖాభివృద్ధి కలిగిన ఒక పరిపూర్ణ మానవునిగా తయారు చేయడం. కాని కేవలం, భాషలు, గణితం, సైన్సు, సాంఘికశాస్త్రాలకే ప్రాధాన్యత ఇస్తూ, కళలు, ఆటలు, ఆరోగ్యం, జీవన నైపుణ్యాలు, విలువలు ఏవైతే వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి, సమాజంలో కలిసి జీవించడానికి తోడ్పడతాయో, వాటిని విస్మరించడం జరిగింది.
- బోధనాభ్యసనం జరుగుతున్నప్పుడు పిల్లలు ఏ విధంగా, ఎంత వరకు నేర్చుకుంటున్నారు అనేది అప్పటికప్పుడు తెలుసుకోకుండా పరీక్షల వరకు ఆగి, అప్పుడు తెలుసుకొని, ఎంత మంది ఎంత వరకు నేర్చుకొన్నారు అనే దాన్ని చూస్తున్నారు.
- పరీక్షల ఆధారంగా ఉపాధ్యాయులు తమ బోధనా విధానాన్ని మార్చుకోవడం కానీ అభివృద్ధి పరచుకోవడం గానీ, లేక ఎలా? ఏ పద్ధతిలో చెబితే ఫలితం బాగా వస్తుందో ఆలోచించడం లేదు. పిల్లల ప్రగతి కేవలం వారి ప్రతిభా పాటవాల మీదనే ఆధారపడి ఉన్నది అనేది ఎక్కువ మంది ఉపాధ్యాయుల నమ్మకం.
- బోధన అనేది పరీక్షలకు అనుగుణంగా పరీక్షలకు తయారు చేయడం లేక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని చేయడం జరుగుతుంది. అందువలనే గైడ్లకు, నోట్సుకు, ప్రశ్న జవాబుల సామాగ్రికి, టెస్ట్ పేపర్‌కి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు.
- మూల్యాంకన విధానాలను బట్టి చదువు ఉంటుంది. అంటే ఉపాధ్యాయుల పనితీరు మరియు పిల్లల తయారీ కూడా పరీక్షలకు లోబడే ఉంటుంది.

పిల్లలకు పాఠశాలలో అందజేయవలసిన అభ్యసనానుభవాల నేపథ్యంలో వ్యక్తిపరంగానూ, సమాజ పరంగానూ విద్యాలక్ష్యాలను రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధిపత్రం వివరిస్తుంది. ఇది పాఠశాల విద్యా కార్యక్రమాలకు, పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకాల అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుంది. విద్యాలక్ష్యాలను సాధించడానికి ప్రణాళికాబద్ధమైన కృత్యాల రూపకల్పన, బోధనాంశాల, బోధనావిధానాల ఎంపిక, సామాగ్రి, మూల్యాంకన విధానాలు మొదలైనవాటిపై ప్రణాళికలు రూపొందించుకోవడం అవసరమని రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం సూచించింది. తద్వారా పిల్లల్లో గుణాత్మకమైన విద్యను సాధించడానికి వీలు కలుగుతుందని పేర్కొంది.

## RTE-2009 - మూల్యాంకనం (RTE-2009 – Evaluation)

విద్యను పొందే హక్కుతోపాటు విద్యా నాణ్యతపై కూడా ఆర్.టి.ఇ. దృష్టిసారించింది. ఎలిమెంటరీ విద్యలో గుణాత్మకత సాధనకు అవసరమైన నియమావళిని ఆర్.టి.ఇ. చట్టంలోని 5వ భాగం పేర్కొంది.

పాఠ్యప్రణాళిక, మూల్యాంకనం రూపొందించడంలో కింది అంశాలు దృష్టిలో పెట్టుకోవాలని సూచించింది.

- రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా పాఠ్యాంశాలు ఉండాలి..
- పిల్లవాని సమగ్ర అభివృద్ధి జరగాలి.
- పిల్లల్లో జ్ఞానాన్ని, శక్తులను, నైపుణ్యాలను పెంపొందించాలి.
- బాలల పూర్తిసామర్థ్యం మేరకు శారీరక, మానసిక సామర్థ్యాల అభివృద్ధి జరగాలి.
- పిల్లల మనసులు గాయపరచకుండా పిల్లలను నిర్భయంగా, ఆందోళన ఒత్తిళ్ళు లేకుండా చేసి వారు తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా వ్యక్తంచేసేలా చూడాలి, దానికి సహాయపడాలి మరియు ప్రోత్సహించాలి.
- పిల్లలను కేంద్రంగా చేసుకొని వారు నేర్చుకునే పద్ధతుల్లో, అనువైన విధానాల్లో అనగా ఆవిష్కరణ, పరిశీలన, పరిశోధన, కనుగొనడం ద్వారా నేర్చుకొనేలా బోధనాభ్యసన ప్రక్రియలు ఉండాలి.
- పిల్లల జ్ఞాన అవగాహనను, అర్థం చేసుకున్న విధానాన్ని, జ్ఞానాన్ని నిజజీవిత సన్నివేశాలలో వినియోగించే సామర్థ్యాన్ని సమగ్రంగా నిరంతరంగా మూల్యాంకనం చేయాలి.
- ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేంత వరకు ఏ పిల్లవాడు ఎలాంటి బోర్డ్ పరీక్షకు హాజరు కావలసిన అవసరం లేదు.
- బాలుడు / బాలిక ఎలిమెంటరీ విద్య పూర్తి చేసిన తరువాత సూచించిన ప్రకారం వారికి ధృవీకరణ పత్రం ఇవ్వాలి.

భారత రాజ్యాంగం ప్రకారం విద్య ప్రాథమిక హక్కుగా నిర్ణయించడం వల్ల ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాల వయసు ఉన్న పిల్లలంతా తప్పనిసరిగా బడిలో చేరి నాణ్యమైన విద్యను పొందాలి. పిల్లలంతా పాఠశాలలో చేరడంతో సరిపోదు. వారు బడిలో ప్రాథమిక విద్య పూర్తిఅయ్యేదాకా కొనసాగాలి. నాణ్యమైన విద్యను పొందాలి. నేర్చుకుంటున్న విద్య నాణ్యమైనదా కాదా అనేది మూల్యాంకనం చేయవలసిన అవసరం ఉంది. ఇంతవరకు పిల్లలను పాఠశాలలకు తీసుకురావడం వారికి మంచి విద్య అందేలా కృషిచేయడం అన్నది ఉపాధ్యాయుల నైతిక అంశంగా ఉన్నది. కానీ నేడు అది చట్టబద్ధమయింది. విద్యాహక్కుచట్టం అధ్యాయం 5, సెక్షన్ 29 సబ్‌సెక్షన్ 2 ప్రకారం పిల్లల ప్రగతిని నిరంతరం సమగ్రంగా మూల్యాంకనం చేయాలని నిర్దేశించింది. సమగ్రంగా అంటే పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, సాంస్కృతిక, ఉద్వేగ అంశాలన్నింటిని మూల్యాంకనం చేయాలి. విద్యాహక్కుచట్టం మూల్యాంకన విధానాన్ని నిర్ధారించేటపుడు ఏ ఏ అంశాలు పరిగణనలోకి తీసుకోవాలో స్పష్టంగా సూచించింది.

విద్యాహక్కు చట్టం సూచించిన విధంగా మూల్యాంకనం చేయడమంటే పిల్లల సామర్థ్యాల సాధనతోపాటు, బోధనాభ్యసన ప్రక్రియను ఉపాధ్యాయుని పనితీరును కూడా పరిగణనలోకి తీసుకోవలసి వుంటుంది. అంటే మూల్యాంకనం ఉపాధ్యాయుని పనితీరుతో ముడిపడిన అంశంగా గుర్తించాలి. బోధనాభ్యసన ప్రక్రియ శిశుకేంద్రీకృతంగా ఉందా లేదా అనేది మూల్యాంకనం నిర్ధారించాలి. అంటే దీనిలో జ్ఞానాన్ని కాకుండా దాన్ని అన్వయించుకునే విధానాన్ని మూల్యాంకనం చేయాలి. అన్వయం అనేది నేర్చుకొన్న జ్ఞానాన్ని నిత్యజీవితంలో ఉపయోగించడం, తదుపరి అంశాలు నేర్చుకోవడానికి ఉపయోగించుకోవడం అనే అంశాలు మూల్యాంకనం చేయాలి. అంటే ప్రస్తుతం ఉన్న ప్రశ్నల స్వభావం మారాల్సి వుంటుంది. దానితోపాటు మూల్యాంకనం నిరంతరంగాను, సమగ్రంగాను నిర్వహించాలి కాబట్టి ప్రత్యేకంగా బోర్డు పరీక్షల అవసరం లేదని కూడా సూచించింది.

మూల్యాంకనం సమగ్రంగా, సమర్థవంతంగా నిర్వహించాలి అంటే నిర్ధారిత సమయంలోపు పాఠ్యాంశాలన్నీ పూర్తిచేయడం కూడా ఉపాధ్యాయుల బాధ్యతగా విద్యాహక్కుచట్టం ప్రతిపాదించింది. నిరంతర సమగ్ర మూల్యాంకనం ఆధారంగా ప్రతి విద్యార్థి నేర్చుకొనే సామర్థ్యాన్ని అంచనావేసి దాని ఆధారంగానే అదనపు బోధన అందించడం. పిల్లల ప్రగతిని వారు

నేర్చుకొనే విధానాన్ని మూల్యాంకనం చేసి తల్లిదండ్రులు, సంరక్షకుల సమావేశాలలో వారి ప్రగతిని ప్రదర్శించాలని కూడా సూచించింది.

### రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం-2011 - మౌలిక సూత్రాలు మరియు మూల్యాంకనంపై దృక్పథం

### (State Curriculum Frame Work -2011 - Core Principles and Perspectives on Evaluation)

**మౌలిక సూత్రాలు (Key principles):**

వ్యవస్థలోని ప్రధాన అపోహలు, నమ్మకాలు, ధోరణులను ప్రస్తావిస్తూ సరైన పరివర్తనతో విద్యా పరిస్థితిలో మార్పు తెచ్చే వ్యవస్థాపరమైన అంశాలపై దృష్టిసారించాల్సి ఉంది. ఈ కమిటీ రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం మౌలిక సూత్రాలను రూపొందించింది. ప్రస్తుత సవాళ్ళను ఎదుర్కొనేందుకు కొన్ని ఇతర సూత్రాలతోపాటు ఎన్.సి.ఎఫ్-2005 పేర్కొన్న మార్గదర్శక సూత్రాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం మౌలిక సూత్రాలు కింది విధంగా ఉన్నాయి.

- పిల్లల అభ్యసనాశక్తులపై దృష్టి కేంద్రీకరించడం.
- పాఠశాలకు వచ్చేటప్పటికే పిల్లలు కలిగి ఉన్న భాష మొదలైన పరిజ్ఞానాన్ని గౌరవించడం.
- బడి బయటి ప్రపంచానికి జ్ఞానాన్ని అనుసంధానం చేయడం (పాఠశాలలో విద్య తమ జీవితానికి ఏమీ సంబంధం లేనిదని విద్యార్థులు అనుకునేలా ఉండకూడదు.
- బట్టీ పద్ధతులకు దూరంగా అభ్యసన ఉండాలి. ప్రతి చర్యలతో (interactions) కూడిన అభ్యసనానికి, ప్రాజెక్టు పనులకు, విశ్లేషణలకు ప్రాధాన్యతనివ్వడం.
- పాఠ్యపుస్తక కేంద్రంగా కాకుండా పిల్లల్లో సమగ్రాభివృద్ధికి దోహదపడేలా విద్యా ప్రణాళికను పరిపుష్టి చేయడం.
- పరీక్షలను సరళీకృతం చేసి తరగతి గదికి అన్వయించడం. 'అభ్యసనను మాపనం చేయడం' కాకుండా 'మాపనం చేయడం'పై దృష్టి పెట్టడం.
- సామాజిక నిర్మాణాత్మక వాదాన్ని (social constructivism), అంశాల వారి పాఠ్య ప్రణాళికను (issue based curriculum), పాఠ్యాంశాల్లో విమర్శనాత్మక బోధనను (critical pedagogy) వృద్ధిపరచాలి.
- పాఠ్య ప్రణాళికలో భాగంగా వృక్ష, జంతుజాలాన్ని పరిరక్షించడం, జీవవైవిధ్యతను, సాంఘిక భిన్నత్వాన్ని, పనిని గౌరవించడం.
- పిల్లల భాష, సంస్కృతులను తరగతి గది ఆచరణల్లో భాగం చేయడం.

పిల్లలు అభ్యసనంలో ఏ స్థాయిలో ఉన్నారో, ఎలా నేర్చుకుంటున్నారో తెలుసుకునేందుకు మూల్యాంకనం ఉపాధ్యాయునికి ఉపకరిస్తుంది. జ్ఞానం, నైపుణ్యాలు, వైఖరులు, విశ్లేషణా సామర్థ్యాలు, విలువలు, నైతిక ప్రవర్తనావళి మొదలైన అంశాలన్నింటిని బోధనాభ్యసన ప్రక్రియలలో భాగంగా మూల్యాంకనం చేయాలి. ఇది పిల్లవానికి సంబంధించిన సమగ్ర సమాచారంతో కూడినదిగా ఉండాలి. అంటే శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలన్నింటిని ఎప్పటికప్పుడు సమగ్రంగా, నిరంతరంగా మాపనం చేయాలి. ఇలా చేయడంవల్ల పిల్లవాణ్ణి అన్ని కోణాలలో అర్థంచేసుకోవడానికి వీలు కలుగుతుంది.

మూల్యాంకనం కేవలం రాతపరీక్షలకు మాత్రమే పరిమితం కాదు. ఇది సామర్థ్య ఆధారితంగా, విద్యాప్రమాణాల సాధనను పరిశీలించేదిగా ఉండాలి. మూల్యాంకనంలో మౌఖిక పరీక్షకు కూడా స్థానం ఉండాలి. విద్యార్థి తన ఆలోచనలను, భావాలను వ్యక్తీకరించడానికి, సొంతంగా రాయడానికి అవకాశం కల్పించేదిగా ఉండాలి. పిల్లల నైపుణ్యాలను, విశ్లేషణాశక్తిని, సృజనాత్మకతను మాపనం చేసేందుకు అనువుగా ఉండాలి.

## CCE – పరీక్షల సంస్కరణలు (CCE - Examinations Reforms)

- CCE ద్వారా, పరీక్ష విధానాలలో ఈ కింది సంస్కరణలు ప్రతిపాదించడం జరిగింది.
- పిల్లల ప్రగతిని అంచనా వేయడం ఎప్పుడో ఒకసారి అని కాకుండా, నిర్మాణాత్మక మదింపు ద్వారా తరగతి గదిలో బోధనాభ్యసనం జరుగుతున్నప్పుడే అంచనా వేయడం జరుగుతుంది.
- నేర్చుకోవడం అనేది జ్ఞాపకం చేయడం నుండి వేరుపరచి, విద్యార్థులు ఆలోచించి స్వంతంగా వ్యక్తీకరణం చేయడంపై దృష్టి పెట్టాలి. మరియు దీన్ని ప్రోత్సహించాలి.
- మూల్యాంకనం అనేది విద్యా ప్రమాణాలు ఏ మేరకు విద్యార్థులు పొందారో అని తెలుసుకొనే విధంగా ఉంటుంది. అంటే విద్యార్థులు ఏ మేరకు అభ్యసనా లక్ష్యాలు, విద్యా లక్ష్యాలు పొందారు? అని తెలుసుకోవడం మీద శ్రద్ధ పెట్టాలి.
- ఉపాధ్యాయులు స్వయంగా తయారుచేసుకున్న ప్రశ్నపత్రాల ద్వారానే పరీక్షలు నిర్వహించాలి. ఎటువంటి పరిస్థితుల్లో కూడా పరీక్షల కోసం ప్రశ్నపత్రాలను కొనడం, మండల స్థాయిలో లేక పాఠశాల సముదాయం స్థాయిలో గాని తయారుచేసినవి ఉపయోగించకూడదు. ఉపాధ్యాయుడు తాను ఏమి బోధించాడు? ఎలా బోధించాడు? ఏ ఏ విద్యా ప్రమాణాలను సాధించడానికి బోధించాడు? అనే అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రశ్నపత్రాన్ని తయారు చేసుకోవాలి. ప్రశ్నలు ఆలోచించి, విశ్లేషించి, పిల్లలు తమ సొంతంగా వివరించే విధానానికి అనుకూలంగా ఉండాలి. పిల్లలు తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి ప్రశ్నలు దోహదపడాలి. పరీక్షలు పిల్లలు సొంతంగా తమ ప్రతిభా పాటవాలను వ్యక్తపరచేవిధంగా ఉండాలి. జవాబులు వారి ప్రతిభకు వెలికితీసే విధంగా ఉండాలి.
- ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థివారీగా, విషయవారీగా, పిల్లల ప్రగతి రిజిస్టర్ అనగా CCE register ను నిర్వహించాలి.
- మదింపు అనేది కేవలం రాత పరీక్షల ద్వారానే కాకుండా, మౌఖికం, ప్రదర్శన, కృత్యాలు చేయడం, ప్రాజెక్టులు, పరిశీలనలు, తరగతి గది పని, వారు రాసిన రిపోర్ట్‌ల ద్వారా కూడా జరగాలి.
- కళలు, ఆటలు, ఆరోగ్యవిద్య, విలువలు, పని అనుభవం మొదలగు వాటిని మూల్యాంకనంలో భాగంగా చేయడం ద్వారా మూల్యాంకనాన్ని సమగ్రంగా చేయడం జరిగింది. (Comprehensive Assessment).
- మూల్యాంకనం సమగ్రమే కాకుండా విద్యార్థులు నేర్చుకొనేటప్పుడు వారు చదివేటప్పుడూ, రాసేటప్పుడూ, లెక్కలు చేసేటప్పుడు, జట్టు పనిలో పాల్గొనేటప్పుడు – చర్చలు జరిగేటప్పుడు వారు మాట్లాడే విధానాన్ని, వివిధ అంశాలపై వారు వ్యక్తపరిచే భావనల పై ఆధారపడి వారి ప్రగతిని ఉపాధ్యాయులు అంచనా వేయాలి. ఈ విధంగా తరగతి గదిలో బోధనా అభ్యాసనం జరిగేటప్పుడు విద్యార్థి ఎలా నేర్చుకుంటున్నాడు అనేది ఉపాధ్యాయుడు అవగాహన చేసుకొని మదింపు చేస్తే దానిని నిర్మాణాత్మక మదింపు అంటాం. ఈ విధంగా మనం ఎప్పటికప్పుడు విద్యార్థుల అభ్యసనాన్ని అవగాహన చేసుకొని మదింపు చేయడాన్ని నిరంతర మూల్యాకనం అంటారు.
- పిల్లల ప్రగతి పత్రం, అన్ని అంశాలపై అనగా కరికులం, కో కరికులం, విద్యార్థి ఆరోగ్యం, హాజరు మొదలగు అన్ని అంశాలపై ప్రగతిని సూచిస్తుంది.
- మాస వారీగా పాఠశాల యాజమాన్య కమిటీ మరియు తల్లిదండ్రుల సమావేశాలల్లో పిల్లల ప్రగతిని చర్చించాలి. పిల్లలు చదువడం, రాయడం, లెక్కలు చేయడం, ఇచ్చిన అంశం పై ధారాళంగా మాట్లాడించడం మొదలగునవి తల్లిదండ్రుల ముందు ప్రదర్శించాలి.
- పాఠశాలలు జూన్‌లో మొదలవగానే ప్రతి సబ్జెక్టులో ఒక ప్రారంభ పరీక్ష నిర్వహించి ప్రతి విద్యార్థి స్థాయిని తెలుసుకొని దానిపై ఆయా విద్యార్థులను ఏ స్థాయికి తీసుకురావాలి అని ప్రతి ఉపాధ్యాయుడు ఒక టార్గెట్ పెట్టుకోవాలి. ఆ విధంగా పెట్టుకున్న టార్గెట్‌పై ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకొని ప్రణాళిక వేసుకొని నిరంతరం ప్రయత్నించాలి. అప్పుడే మనం మన వృత్తికి న్యాయం చేసినవారమవుతాం.

## నిరంతర సమగ్ర మూల్యాంకనం-భావనలు-అవగాహన (CCE- Conceptual understanding)

పిల్లలు సమగ్ర అభివృద్ధిని సాధించాలని ఇందుకోసం పాఠశాలలు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆర్.టి.ఇ-2009 ద్వారా మనకు తెలుస్తుంది. పిల్లలు శారీరకంగా, మానసికంగా, నైతికంగా, భావోద్వేగపరంగా అభివృద్ధి చెందాలి. ఇందుకోసం పాఠ్య విషయాలతో పాటు పిల్లల ఆసక్తులు, విలువలు, వైఖరులు మొదలగు వాటిలో కూడా పిల్లలు అభివృద్ధి చెందాలి.

### 'నిరంతరం' అనగా (What is continuous)

పాఠశాలలో నిర్వహించే మూల్యాంకనాన్ని, విస్తృత అర్థంలో పరిశీలించినపుడు పిల్లల పెరుగుదల వికాసాలకు ఖచ్చితమైన ప్రాధాన్యతనివ్వవలసి ఉంటుంది.

**'నిరంతరం'** అంటే పిల్లల ప్రగతిని ఒక సంఘటనకో, సందర్భానికో ఎప్పుడో ఒక మూడు (3) గంటల పరీక్షకు పరిమితం చేయకుండా ఎల్లప్పుడూ పరిశీలించడం. అనగా నిరంతరం పాఠశాలలోపల, వెలుపల పిల్లల శారీరక, మానసిక వికాసాలను తరచుగా ఒక క్రమపద్ధతిలో పరిశీలిస్తున్నామని పిల్లలకు తెలియకుండానే పరిశీలించాలి. అభ్యసన లోపాలను గుర్తించి సవరణాత్మక చర్యలు చేపట్టడం ద్వారా ఉపాధ్యాయుడు, విద్యార్థి ఇద్దరూ స్వీయ మూల్యాంకనం చేసుకోగలగాలి.

### 'సమగ్రం' అనగా (What is comprehensive)

**పిల్లల సర్వతోముఖాభివృద్ధి. అంటే పిల్లల శారీరక, మానసిక, నైతిక, జ్ఞానాత్మక రంగాలలో అభివృద్ధి అని అర్థం.** ఇందుకోసం విద్యాప్రణాళికలో నిర్వచించిన పాఠ్య, పాఠ్యేతర అంశాలను విడివిడిగా చూడకుండా రెండింటికీ సమాన ప్రాధాన్యతను ఇవ్వడమే. అనగా భాష, గణితం, సైన్సు, సాంఘికం వంటి విషయాలతోపాటు కళలు, పని, విలువలు, ఆరోగ్యం, జీవన నైపుణ్యాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం. ఇది పిల్లల పెరుగుదల, వికాసాలను పాఠ్యాంశాల దృష్టితోనే కాకుండా వారి అభిరుచులు, వైఖరులు, సామర్థ్యాలను కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. **సమగ్ర విద్యలో కళలు, సాహిత్యం, సౌందర్య వివేచన, తాత్విక చర్చ, శిల్పం, సంగీతం వంటి విషయాల్లో అత్యున్నత అంశాల బోధన ఉండాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.**

వీటితోపాటు సృజనాత్మక, విశ్లేషణాత్మక, తార్కిక అంశాలకు కూడా మూల్యాంకనం సమాన ప్రాధాన్యతనిస్తుంది.

### పిల్లల సమగ్ర అభివృద్ధి అంటే ఏమిటి?

## (What is Comprehensive Development of the child?)

విద్య ద్వారా పిల్లలలో సంపూర్ణ వికాసం సాధించాలన్నది విద్యా లక్ష్యం అయినపుడు సమగ్ర అభివృద్ధి అంటే ఏమిటో అర్థం చేసుకోవడం అవసరం. పాఠశాల విద్య పిల్లలు శారీరకంగా ఎదిగే వయసుతో ముడిపడి ఉన్న అంశం కాబట్టి విద్య శారీరక వికాసానికి అంటే పిల్లలు వయసుతో తగిన, ఆరోగ్యం, ఎత్తు, బరువు వుండేలా చూసేందుకు అవసరమైన ఆరోగ్యవ్యాయామ అంశాలు, కీలకం కావాలి. అలాగే స్నేహం, సహకారం, సహనశీలత, ఓర్పు వంటి వైఖరులు అలవడాలి. తార్కిక వివేచన, సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడం, సమస్యలకు కుంగిపోకుండా ఎదురు నిలిచి సమస్యలను పరిష్కరించే నేర్పురావాలి. మంచి వైఖరులతో ఉత్తమ అభిరుచి కలిగిన వ్యక్తిగా సామాజిక బాధ్యత నిర్వర్తించగలగాలి. వీటన్నింటి ద్వారా విషయ పరిజ్ఞానం పొందగలగాలి. కాబట్టి సమగ్ర అభివృద్ధి అంటే పిల్లలు పాఠ్యపుస్తకాల ఆధారంగా జ్ఞానాన్ని నిర్మించుకోవడం మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఉద్వేగ, సాంఘిక, సాంస్కృతిక వికాసాలను పొందడం. ఇందుకోసం పిల్లల్లో జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలు, విలువలు పెంపొందించాలి. కాబట్టి పాఠశాల విద్యలో ఈ అంశాలన్నీ అభ్యసనాంశాలుగా కనిపించాలి. పిల్లల సమగ్ర వికాసానికి

తోడ్పడే అంశాలన్నీ పాఠ్యాంశాలే. వీటిలో పాఠ్య, సహపాఠ్య అన్న విభేదనం అవసరం లేదు. పాఠశాలలో కల్పించే అభ్యసన అనుభవాలన్నీ పిల్లల సమగ్ర వికాసానికి తోడ్పడేవిగా ఉండాలి. కాబట్టి ఈ విషయాలన్నింటిని మూల్యాంకనం చేయాలి.

## CCE ఎందుకు? (Why CCE?)

మూల్యాంకనమంటే కేవలం పరీక్షలు పెట్టడం మాత్రమే కాదు. యూనిట్, టెర్మినల్ పరీక్షల పేరుతో ఎప్పుడో ఒకసారి పిల్లల సామర్థ్యాలను పరిశీలించడం వల్ల వారి అభ్యసనకు అది ఏవిధంగానూ సహాయపడదు. పైగా ఈ విధమైన పరీక్షా పద్ధతి పిల్లలు ఏ సమాచారాన్ని ఎంత వరకు గుర్తుపెట్టుకోగలిగారో పరీక్షిస్తుందో తప్ప వారి విభిన్న సామర్థ్యాలను తెలుసుకోవడానికి ఉపయోగపడదు. మూల్యాంకనం పేరుతో అనేక రకాల పరీక్షలు నిర్వహించడం వలన పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. బట్టీపట్టడానికి అవకాశం కల్పించే పరీక్షా పద్ధతులు, పిల్లల ఉద్వేగ, సాంఘిక వికాసాలను మదింపుచేయడానికి ఉపయోగపడవు. కాబట్టి పిల్లల ప్రగతిని నిరంతరం సమగ్రంగా మూల్యంకనం చేయవలసిన అవసరం ఉంది. పిల్లలు తాము పరిశీలింపబడుతున్నామని వారికి తెలియకుండా మూల్యాంకనం చేయడం వల్ల వచ్చే ఫలితాలు వారికి పునరభ్యాసం కలిగించడానికి ఎంతగానో తోడ్పడతాయి. భయరహిత వాతావరణంలో స్వేచ్ఛగా మూల్యాంకనం చేయడం వల్ల ఎప్పటికప్పుడు లోపాలు గుర్తించి సవరణాత్మక కృత్యాలు నిర్వహించడానికి వీలుకలుగుతుంది. పాఠ్య విషయాలతోపాటు పిల్లల సర్వతోముఖాభివృద్ధికి సంబంధించిన ఆసక్తులు, అభిరుచులు, శారీరక ఎదుగుదల, విలువలు, వైఖరులు, కళాభిరుచి ఇలా అన్ని అంశాలపై ఒక అవగాహన కలిగివుండి, వాటిని వాటిలో పిల్లల అభిరుచిని, ప్రగతిని తెలుసుకోవాలి. అప్పుడే మూల్యాంకనాన్ని సమగ్రమైనదిగా భావిస్తారు.

## CCE లక్షణాలు (Characteristics of CCE)

మూల్యాంకనం - పిల్లలు సమాచారాన్ని గుర్తుపెట్టుకుని బట్టీపట్టి పరీక్షలలో రాయడానికి మాత్రమే ఉద్దేశించినది కాదు. తరగతి గదిలో కల్పించే అభ్యసన అనుభవాలు పిల్లల జ్ఞానాత్మక, మానసిక చలనాత్మక, భావావేశ రంగాలలో తీసుకొచ్చే మార్పులను మదింపుచేసి మెరుగుపరచడానికి తోడ్పడాలి. పాఠశాలలో వివిధ విషయాల రూపంలో అందించే సమాచారం విషయ పరిజ్ఞానాన్ని కల్గించడానికి సరిపోదు. పిల్లల భావి జీవితానికి అవసరమైన విశ్లేషాత్మక, సృజనాత్మక తార్కిక ఆలోచనాశక్తి, స్వీయ క్రమశిక్షణ, సామాజికంగా సర్దుబాటు చేసుకోవడం సమస్యల పట్ల సున్నితంగా ప్రతిస్పందించడం, పరిష్కరించుకోవడం మొదలైన జీవన నైపుణ్యాలు, సామర్థ్యాలు పెంపొందించడం పాఠశాల బాధ్యత (ఎన్.సి.ఎఫ్ - 2005). ఇవి పాఠ్యపుస్తకాల ద్వారా సాధించడానికి పాఠశాలలో ఎన్నో రకాలైన కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుంది. వీటన్నింటిని మనం ఇంతవరకు పాఠ్యేతర అంశాలుగా, సహపాఠ్యాంశాలుగా భావిస్తున్నాం. వాటికి తగినంత ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల పిల్లల్లో సమగ్ర వికాసానికి భంగం కలుగుతుంది. అందుచేత రాష్ట్ర విద్యా ప్రణాళిక పత్రం-2011 పాఠ్య, సహపాఠ్యాంశాలనే విభేదం లేకుండా అన్నింటిని పాఠ్యాంశాలుగానే భావించాలని (ఎస్.సి.ఎఫ్. - 2011) సూచించింది. కాబట్టి నిరంతర సమగ్ర మూల్యాంకనంలో పిల్లల శారీరక, మానసిక, ఉద్వేగ, సాంఘిక వికాసాలన్నీ సమాన ప్రాధాన్యతలో మూల్యాంకనం చేయాలని నిర్దేశించుకోవడం జరిగింది. ఈ కోణంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం ఏమి ఆశిస్తుందో పరిశీలిద్దాం.

- పిల్లల జ్ఞానాత్మక, మానసిక చలనాత్మక, భావావేశ నైపుణ్యాలను పెంపొందించడం, మూల్యాంకనం చేయడం.
- బట్టీపట్టడాన్ని, సమాచారాన్ని గుర్తుపెట్టుకోవడమనే తరగతి గది ప్రక్రియల స్థానంలో విశ్లేషణాత్మక ఆలోచనలతో సొంతంగా జ్ఞాన నిర్మాణం చేసుకోవడాన్ని ప్రోత్సహించడం, సొంతంగా తమ ఆలోచనలను, భావాలను వ్యక్తపరిచేటట్లు చేయడం.

- మూల్యాంకనాన్ని బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా పరిగణించడం.
- మూల్యాంకనం ద్వారా పిల్లల అభ్యసన సామర్థ్యాలను బోధనాభ్యసన విధానాలను మెరుగుపరచుకోవడం మరియు నిరంతరం పరిశీలిస్తూ సవరణలు చేసుకోవడం.
- మూల్యాంకనం ద్వారా పిల్లలు ఎక్కడ నేర్చుకోలేకపోతున్నారో తెలుసుకొని తగువిధంగా బోధించడం.
- బోధనాభ్యసన ప్రక్రియ విద్యార్థి కేంద్రీకృతంగా సాగేందుకు తోడ్పడాలి.

నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని బోధనాభ్యసన ప్రక్రియలలో భాగంగా అమలుచేయాలి. దీనివల్ల పిల్లల సంపూర్ణ వికాసానికి తోడ్పడే విభిన్న తరగతి గది అంశాలు ఎంత వరకు సమర్థంగా ఉపయోగపడుతున్నాయి అనేది తెలుసుకోవడానికి వీలుకలుగుతుంది. నిరంతర సమగ్ర మూల్యాంకనంలో పాఠ్య, సహపాఠ్య అంశాలు అన్న విభేదం లేకుండా అన్నింటినీ సమాన ప్రాధాన్యత కలిగిన అంశాలుగా గుర్తించి అమలుచేయాలి.

మూల్యాంకనం అభ్యసనంలో అంతర్భాగంగా నిరంతరం జరిగే ప్రక్రియగా నిర్వహించడానికి తగిన ప్రణాళికను తయారుచేసుకోవాలి. మూల్యాంకన స్వభావాలను అర్థం చేసుకోవాలి.

**మూల్యాంకనం స్వభావం (Nature of Assessment)**

**నేర్చుకోవడంలో భాగంగానే మూల్యాంకనం (అభ్యసనం జరిగేటప్పుడే మూల్యాంకనం)**

**(Assessment as learning)**

**పాఠశాలలో కల్పించే అభ్యసన అనుభవాలు పిల్లల సమగ్ర వికాసానికి దోహదపడేవిగా ఉండాలి. పిల్లలు అభ్యసన సన్నివేశాలలో పాల్గొని నేర్చుకుంటున్నపుడు వారిని మూల్యాంకనం చేయదాన్ని అభ్యసనం జరిగేటపుడు మూల్యాంకనం చేయడం అంటాం.** ఉదాహరణకు పిల్లలు ఒక అంశంపై తరగతి గదిలో జరిగే చర్చలలో పాల్గొన్నపుడు వారు విషయాన్ని అర్థంచేసుకోవడానికి ఏవిధంగా ప్రశ్నిస్తున్నారు, తమ అభిప్రాయాలను ఏవిధంగా వ్యక్తంచేస్తున్నారు అనే అంశాలను ఉపాధ్యాయుడు పరిశీలించడానికి అవకాశం వుంటుంది. ఈ సందర్భంలోనే పిల్లల సందేహాలను నివృత్తి చేయడానికి ప్రయత్నం కూడా జరుగుతుంది. అంటే పరిశీలన ద్వారా పిల్లలు ఏమి నేర్చుకున్నారు అనేది మూల్యాంకనం చేయడం జరుగుతోందన్నమాట. అభ్యసనం, మూల్యాంకనం వేరువేరుగా కాకుండా అభ్యసనం జరుగుతున్నపుడే మూల్యాంకనం కూడా ఉంటుంది. ఎప్పటికప్పుడు పిల్లలు తమనుతాము సరిచేసుకుంటూ నేర్చుకోవడానికి ఉపాధ్యాయుడు సహకరించగలుగుతాడు. ఇది ఫార్మాటివ్ అసెస్‌మెంట్. పిల్లలకు నేర్చుకోవడానికి ఒక కృత్యం లేక ప్రాజెక్టు ఇచ్చినపుడు, అది చేసి మనకు నివేదిక ఇస్తే అతను అతను ఏం నేర్చుకున్నాడో అని తెలుస్తుంది. దీన్నిబట్టి విద్యార్థి ప్రగతి కూడా తెలుస్తుంది. నేర్చుకోవడంలో ప్రగతి తెలుసుకోవడమే మాపనం లేక మూల్యాంకనం.

**అభ్యసనం కొరకు (మెరుగుపర్చడానికి) మూల్యాంకనం (Assessment for Learning)**

**అభ్యసనం మెరుగుపర్చడాని కోసమే మూల్యాంకనం, మూల్యాంకనం యొక్క ప్రథమ లక్ష్యం పిల్లల అభ్యసనాన్ని పెంపొందించడమే. ఇది ఎలానో ఆలోచించండి.** తరగతి గదిలో అభ్యసన సన్నివేశాలలో పిల్లలు పాల్గొని నేర్చుకుంటున్నపుడు వారిని పరిశీలిస్తూ విద్యార్థి నేర్చుకుంటున్నాడా లేదా! ఏఏ అంశాలలో ఇబ్బందిపడుతున్నాడు? ఏఏ అంశాలలో మరింత సహాయం అవసరం ఏ రకమైన సహకారం అందించినట్లయితే నేర్చుకోగలుగుతాడు? అనే విషయాలను దృష్టిలో ఉంచుకుని పరిశీలించడం, బోధనలో మార్పు చేసుకొనేందుకు చర్యలు చేపట్టడాన్ని అభ్యసనం మెరుగుపరచడానికి చేసే మూల్యాంకనం అంటాం.

సాధారణంగా మనం మూల్యాంకనం కోసం పరిశీలించడమో, పరీక్ష నిర్వహించడమో చేస్తుంటాం. కానీ ఫలితాలను ఆధారంగా చేసుకొని విద్యార్థికి ఏ ఏ అంశాలలో సహకారం అవసరమో గుర్తించి చర్యలు చేపట్టడంలో దృష్టిపెట్టడం జరగదు.

అభ్యసనాన్ని మెరుగుపరచడానికి మూల్యాంకనం పరిశీలించిన తర్వాత మెరుగుపరచడానికి సహకారం అందించడం ఎంతో అవసరం. పిల్లల నోటుపుస్తకాలను, ఇంటిపనిని పరిశీలించినపుడు పిల్లలు ఎక్కడ తప్పులు చేస్తున్నారు? ఎక్కడ ఇబ్బందిపడుతున్నారు అని తెలుస్తుంది. దీన్నిబట్టి పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారు అనే దానిపై ఉపాధ్యాయునికి ఒక అవగాహన వస్తుంది. ఇది ఫార్మాటివ్ అసెస్‌మెంట్.

**అభ్యసనం యొక్క మూల్యాంనం (Assessment of Learning)**

**పిల్లలు ఆయా విషయాలను ఎంతవరకు నేర్చుకున్నారో తెలిపేదే అభ్యసనం యొక్క మూల్యాంకనం.** విద్యార్థులు వివిధ అభ్యసన కృత్యాలలో పాల్గొంటూ వివిధ భావనలను, వ్యవహార రూపాలను, ప్రకియా నైపుణ్యాలను పొందుతారు. ఇలా పిల్లలు పొందిన జ్ఞానాన్ని కొంతకాలం తర్వాత పరీక్షించడమే "అభ్యసనం యొక్క మూల్యాంకనం". ఇది పిల్లల మార్కులు, గ్రేడుల రూపంలో ప్రదర్శితమౌతుంది. ఇది ఉపాధ్యాయులు లేదా బాహ్యానికషల లేదా రెండింటిచేత మూల్యాంకనం చేయబడుతుంది. ఈ విధానంలో చాలామంది విద్యార్థులు ఒకేసారి ఒకేవిధంగా మూల్యాంకనం చేయబడతారు. సాధారణంగా టర్మ్ పూర్తయిన తరువాత నిర్వహించే పరీక్షలు "అభ్యసనం యొక్క మూల్యాంకనం"ను తెలియజేస్తాయి. ఇది పిల్లల అభ్యసన సాధనపై తుది నిర్ణయాన్ని ప్రకటించే పద్ధతి. అనగా త్రైమాసిక, అర్ధవార్షిక, సంవత్సరాంత పరీక్షలు వాటికి ఉదాహరణలు. ఇది సమ్మేటివ్ అసెస్‌మెంట్.

**మూల్యాంకనం చేయాల్సిన అంశాలు (1–5 మరియు 6–10 తరగతులు)**

**(Areas of Assessment (1-5 and 6-10 classes)**

***ప్రాథమికస్థాయి (1–5 తరగతులు)***

- ప్రథమ భాష తెలుగు/ఉర్దూ
- గణితం
- పరిసరాల విజ్ఞానం
- ఇంగ్లీషు
- కళలు, సాంస్కృతిక విద్య
- ఆరోగ్య, వ్యాయామ విద్య, యోగా, ధ్యానం
- పని, కంప్యూటర్ విద్య
- విలువల విద్య, జీవన నైపుణ్యాలు, వైఖరులు

***ఉన్నత పాఠశాల స్థాయి (1–10 తరగతులు)***

- ప్రథమ భాష
- ద్వితీయ భాష
- తృతీయ భాష
- గణితం
- సామాన్యశాస్త్రం
- సాంఘికశాస్త్రం
- కళలు, సాంస్కృతిక విద్య
- ఆరోగ్య, వ్యాయామ విద్య, యోగా, ధ్యానం
- పని, కంప్యూటర్ విద్య
- విలువల విద్య, జీవన నైపుణ్యాలు, వైఖరులు

## వేటిని మూల్యాంకనం చేయాలి? (What to assess?)

**భాషలు:**

1. వినడం, ఆలోచించి మాట్లాడడం
2. చదువడం,అర్థంచేసుకుని ప్రతిస్పందించడం
3. సొంతంగా రాయడం (స్వీయరచన)
4. పదజాలాభివృద్ధి
5. సృజనాత్మక వ్యక్తీకరణ, ప్రశంస
6. భాషను గురించి తెలుసుకోవడం

**గణితం:**

1. భావనల అవగాహన, సమస్య సాధన (Problem Solving)
2. కారణాలు చెప్పడం-నిరూపణ (Reasoning and Proof)
3. వ్యక్తీకరణ (Communication)
4. సంధానం (Connections)
5. ప్రాతినిధ్యం-దృశ్యీకరణ (Representation-Visulisation)

**పరిసరాల విజ్ఞానం**

1. విషయావగాహన
2. ప్రశ్నించడం - పరికల్పనలు చేయడం
3. ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు
4. సమాచార నైపుణ్యాలు
5. బొమ్మలు, మ్యాపులు గీయడం, నమూనాలు తయారుచేయడం
6. వైఖరులు, ప్రశంస, నిత్యజీవిత వినియోగం

**విజ్ఞాన శాస్త్రం**

1. విషయావగాహన
2. ప్రశ్నించడం - పరికల్పనలు చేయడం
3. ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు
4. సమాచార నైపుణ్యాలు
5. బొమ్మలు, గ్రాఫ్‌లు గీయడం, నమూనాలు తయారుచేయడం ద్వారా భావప్రసారం
6. సౌందర్యాత్మక స్పృహ - వైఖరులు ప్రశంస జీవ వైవిధ్యం - నిత్యజీవిత వినియోగం

**సాంఘికశాస్త్రం**

1. విషయావగాహన
2. విషయాన్ని చదివి అర్థంచేసుకోవడం, వ్యాఖ్యానించడం
3. సమాచార నైపుణ్యాలు
4. సమకాలీన, సామాజిక అంశాలపై ప్రతిస్పందన, ప్రశ్నించడం
5. పటనైపుణ్యాలు
6. సునిశితత్వం - ప్రశంస, వైఖరులు

**కళలు, సాంస్కృతిక విద్య**

1. రంగులు వేయడం, చిత్రాలు గీయడం, అలంకరించడం, నమూనాలు బొమ్మలు తయారు చేయడం
2. ట్యాన్‌గ్రామ్, ఓరిగామి, కుట్లు, అల్లికలు
3. నాటికలు, ఏకాంకికలలో నటించడం, కొరియోగ్రఫీ,
4. పాటలు పాడడం, వాద్యపరికరాల వినియోగం, నృత్యం - స్థానిక కళారూపాలు ప్రదర్శించడం, మైమ్
5. మన సంస్కృతి, కళలు, సాహిత్యం

**ఆరోగ్య, వ్యాయామవిద్య**

1. ఆసక్తిగా పాల్గొనడం నియమ నిబంధనలు పాటించడం, క్రీడాస్ఫూర్తి, ప్రత్యేక నైపుణ్యాలు
2. యోగ, ధ్యానం, స్కౌట్స్, గైడ్స్, ఎన్.సి.సి.
3. కుటుంబ సంబంధాలు, భద్రత, ప్రథమ చికిత్స
4. ఆరోగ్యం, పౌష్టికాహారం, మంచి ఆహారపు అలవాట్లు.
5. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, మంచి అలవాట్లు

**పని, కంప్యూటర్ విద్య**

1. నమూనాలు వస్తువుల తయారీ, పనిముట్లు, సామగ్రి వినియోగం.
2. వ్యక్తుల సేవల వినియోగం, ఉత్సవాలలో పాల్గొనడం (అంతర కరికులమ్ కార్యక్రమాలు, బాధ్యతలు నిర్వర్తించడం)
3. కంప్యూటర్ ఆధారంగా నేర్చుకోవడం
4. కంప్యూటర్‌ను వినియోగించడం
5. సామాజిక కార్యక్రమాలు, శ్రమదానం

**విలువల విద్య, జీవన నైపుణ్యాలు**

1. మంచి, చెడు విచక్షణాజ్ఞానం, సత్ప్రవర్తన
2. రాజ్యాంగ విలువలు
3. సహనం, దయ, తథానుభూతి మొదలగు వ్యక్తిగత విలువలు
4. జీవననైపుణ్యాలు, ఆలోచనా నైపుణ్యాలు
5. ఉపాధ్యాయులు, సహాధ్యాయులు పాఠశాల, ప్రభుత్వ ఆస్తుల పట్ల సరైన వైఖరులు కలిగి ఉండడం.

# 10 నిర్మాణాత్మక మూల్యాంకనం - అమలు

## CCE - ఎలా మూల్యాంకనం చేయాలి? - విధానాలు
## (CCE – How to assess? – Procedures)

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా పాఠశాలలో నిర్వహించే మూల్యాంకన విధానాలు పిల్లలను సంపూర్ణంగా పరిశీలించి నమోదుచేసేవిగా ఉండాలి. ఉపాధ్యాయులు తరగతిగది లోపల బయట పిల్లలను పరిశీలిస్తూ చేసే అంశాలతోపాటు క్రమానుగతంగా నిర్ణీత కాలవ్యవధులలో నిర్వహించే మూల్యాంకనం కూడా అవసరమే. ఇవి వారాంత, పక్ష, మాస, టర్మినల్ రూపాలలో కూడా ఉండడం అవసరం. అయితే ఏ మూల్యాంకన విధానం అయినప్పటికి వచ్చే ఫలితాలను బట్టి ఏ ఇద్దరినీ ఒకరితో ఒకరిని పోల్చకూడదు. అంటే మూల్యాంకనం పిల్లలు ఎలా నేర్చుకున్నారు? ఏమి నేర్చుకున్నారు? అనే అంశాలు పరిశీలించడంతోపాటు నేర్చుకున్న అంశం స్థిరంగా ఉండేందుకు కూడా మూల్యాంకనం తోడ్పడాలి. జ్ఞానము, అవగాహన వినియోగం, విశ్లేషణ, నూతన సందర్భాలలో సర్దుబాటుచేసుకోవడమనే అంశాలతోబాటు అభిరుచులు, వైఖరులు, ఉద్వేగాలు, ప్రత్యేక ఆసక్తులు, శారీరక ఎదుగుదల ఆరోగ్యకరమైన విషయాలుకూడా నిశితంగా మూల్యాంకనం చేయాలి. ఈ విధమైన మూల్యాంకనం రెండు రకాలు.

1. నిర్మాణాత్మక మూల్యాంకనం (ఫార్మాటివ్ అసెస్‌మెంట్)
2. సంగ్రహణాత్మక మూల్యాంకనం (సమ్మేటివ్ అసెస్‌మెంట్)

### 1. నిర్మాణాత్మక మూల్యాంకనం :-

పిల్లలు ఎలా నేర్చుకొంటున్నారు? ఏమి నేర్చుకొంటున్నారు? ఎక్కడ వెనుకబడుతున్నారు? దీన్ని ఎలా సరిదిద్దాలీ? అనే అంశాలును ఎప్పటికప్పుడు అంచనావేస్తూ, అవసరమైన చర్యలను చేపట్టి ప్రగతిని సాధించడానికి తోడ్పడేదే నిర్మాణాత్మక మూల్యాంకనం. ఇది నిరంతరం జరుగుతూనే ఉంటుంది. బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ సమయంలో, తదనంతరం పిల్లలూ తోటివారితో కల్సి పనిచేస్తున్నపుడు, కృత్యాలు/ప్రాజెక్టులు/అన్వేషణలు వంటి పాఠ్య, పాఠ్యేతర కార్యకలాపాలలో పాల్గొంటున్నపుడు నిర్మాణాత్మక మూల్యాంకనం చోటుచేసుకుంటుంది. ప్రధానంగా ఇది నేర్చుకోవడానికే తోడ్పడేది (Evaluation for learning) అనగా పరీక్షించడానికి లేదా అంచనా వేయడానికి పరిమితం కాకుండా, తదుపరి అభివృద్ధికి లేదా ప్రగతికి తోడ్పడ్తుంది.

**నిర్మాణాత్మక మూల్యాంకనం- లక్షణాలు:**

- బోధనాభ్యసన జరుగుతున్నప్పుడే పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారో పరిశీలించడం.
- అభ్యసనను మెరుగుపరచుకోవడానికి నిరంతరం జరిగేది (on going assessment)
- అభ్యసనాన్ని మెరుగుపరుస్తుంది.
- అభ్యసనం ఎలా జరుగుతుంది అనే విధానంపై దృష్టిపెడుతుంది.

- అంతర్గతంగా నిర్ణయించుకున్న పద్ధతులు, లక్ష్యాలపై ప్రభావం చూపుతుంది.
- అభివృద్ధి పరచవలసిన అంశాలను గుర్తించడానికి పనికివస్తుంది.
- బోధనా పద్ధతులు, విధానాలు మొదలైనవన్నీ నిరంతరం మార్చుకోవడానికి వీలైన సరళీకృతం కలిగివుంటుంది.
- ప్రగతి కోసం ప్రయత్నిస్తుంది.
- పరస్పరం నేర్చుకోవడానికి వీలుకల్పిస్తుంది.
- సూక్ష్మస్థాయి పరిశీలన.
- పిల్లల డైరీలు, నోటుపుస్తకాలు మొదలైన సాధనాల ద్వారా మూల్యాంకనం జరుగుతుంది.

**F.A. సాధనాలు/ అంశాలు :-**

నిర్మాణాత్మక మూల్యాంకనం అనేది కేవలం పరీక్షలకే పరిమితం కాదు. ఇతర ప్రత్యామ్నాయ సాధనలపై ఆధారపడుతుంది. నిర్మాణాత్మక మూల్యాంకనం స్వభావరీత్యా నిరంతరం జరుగుతూనే ఉంటుంది. కాబట్టి కింది సాధనాలను నిర్మాణాత్మక మూల్యాంకనంలో వినియోగిస్తారు.

| వ.సం. | అంశం/సాధనాలు | మార్కులు |
|---|---|---|
| 1. | ఇచ్చిన అంశాన్ని చదివి, వ్యాఖ్యానించడం; సమకాలీన/సామాజిక అంశాలపై ప్రతిస్పందించడం | 5 |
| 2. | విద్యార్థుల రాత అంశాలు | 5 |
| 3. | ప్రాజెక్ట్ పని | 5 |
| 4. | లఘుపరీక్ష (స్లిప్ టెస్ట్) | 5 |
| | మొత్తం | 20మా |

**నోట్ :** పై అంశాలను క్రమ సంఖ్య 1, 2 మరియు 3లను 10 మార్కులకు 4వ దానిని 20 మార్కులకు నిర్వహించి వాటిని 5 మార్కులకు తగ్గించి, రికార్డు చెయ్యాలి.

**ఫార్మెటివ్ పరీక్ష - అంశాలు :**

**1. ఇచ్చిన అంశాన్ని చదివి వ్యాఖ్యానించడం; సమకాలీన/ సామాజిక అంశాలపై ప్రతిస్పందించడం :**

- ఈ అంశాన్ని రెండు విధాలుగా నిర్వహించాలి.
- 'ఇచ్చిన అంశాన్ని చదివి, వ్యాఖ్యానించడం' అనే అంశాన్ని రెండుసార్లు, 'సమకాలీన/సామాజిక అంశాలపై ప్రతిస్పందించడం' అంశాన్ని రెండుసార్లు నిర్వహించాలి.
- మొదటి F.A. లో 'ఇచ్చిన అంశాన్ని చదివి, వ్యాఖ్యానించడం' నిర్వహిస్తే రెండవ F.A. లో 'సమకాలీన సామాజిక అంశాలపై ప్రతిస్పందించడం' అనే అంశాన్ని నిర్వహించాలి.

ఇప్పుడు ఒక్కొక్క అంశాన్ని ఎలా నిర్వహించాలో చూద్దాం.

**A) ఇచ్చిన అంశాన్ని చదివి, వ్యాఖ్యానించడం :**

1) చదివిన అంశంపై మాట్లాడటం – 5 మార్కులు

2) మాట్లాడిన అంశముపై నివేదిక తయారీ మరియు ప్రదర్శన – 5 మార్కులు

విద్యార్థులు వ్యాఖ్యానించడం, ప్రతిస్పందించడం కోసం కింది విధంగా అంశాలను ఎంపిక చేసి ఇవ్వాలి.

1) ఉపాధ్యాయుడు పిల్లలను చదవడానికి ప్రోత్సహించాలి – అనగా పుస్తకాలు, పేపర్ కట్టింగ్స్, మ్యాగ్జైన్స్ ఇతర తరగతుల పుస్తకాలు.

2) ఒక్కొక్కసారి టెక్స్ట్ (text) ఆధారంగా ఇవ్వడం.

3) మరియొకసారి పిల్లలే చర్చించి చదవాల్సిన సమాచారాన్ని సేకరించుకోవడం.

4) ఇంకొకసారి స్థానిక అంశాలకు అన్వయించి, అంశాన్ని ఎంపిక చేయడం.

5) సమకాలీన అంశాలను గుర్తించడం, వాటికి సంబంధించిన పుస్తకాలను సమాచారాన్ని చదివించడం.

❍ ఈ అంశాలన్ని కూడా పాఠ్యపుస్తకం లోనివికాకుండా, Other than Text book నుండి ఎంపిక చేయాలి. అంతేకాక గ్రంథాలయ పుస్తకాల నుండి, వార్తాపత్రికల నుండి, మ్యాగజైన్లు మొదలైన వాటి నుండి సేకరించాలి.

6) వార్తాపత్రికల నుండి అంశాలను సేకరించడం.

**B) సమకాలీన/సామాజిక అంశాలపై ప్రతిస్పందించుట :** అనగా ప్రతినిత్యం మీడియాలో, వార్తాపత్రికలలో వచ్చిన అంశాలు లేక సామాజిక సమస్యలు అనగా స్త్రీల పట్ల హింస, అవినీతి, రైతు ఆత్మహత్యలు, ప్రజలలో నేరప్రవృత్తి, మద్యపానం మొదలగు సామాజిక అంశాలను పిల్లలతో చెప్పించి నల్లబల్ల మీద రాసి పిల్లలను ఎంపిక చేసుకోమనాలి.

1) అంశము పై ప్రతిస్పందన, నివేదిక తయారీ – 5 మా

2) ప్రదర్శన/అంశం మీద మాట్లాడించుట – 5 మా

**ఎలా నిర్వహించాలి?**

❍ సమకాలీన, సామాజిక అంశాలను తరగతి గదిలో పిల్లలచే గుర్తింప చేయాలి.

❍ గుర్తించిన అంశాలను పిల్లలకు ఉపాధ్యాయుడే లేదా విద్యార్థుల ఇష్టానుసారముగా ఎంపిక చేసి, కేటాయించాలి.

❍ చర్చను నిర్వహించడం ద్వారా, మైండ్ మ్యాపింగ్ ద్వారా, డిబేట్స్ ద్వారా, అంశాల ఎంపిక జరగాలి.

**విద్యార్థులు ఏమి చేయాలి?**

- అంశాన్ని ఎంపిక చేసుకొనుట.
- నివేదిక తయారు చేయుట.
- నివేదిక ఆధారంగా మాట్లాడుట–చర్చ

**ఎంపిక చేసుకునే అంశం ఎలా ఉండాలి?**

- సామాజిక సమస్యలలో, వార్తాపత్రికలో వచ్చినవి.
- అందులో గ్రామ సమస్యలు, జిల్లా సమస్యలు, రాష్ట్ర/దేశ సమస్యలు.

**2. పిల్లలు రాసిన అంశాలు :**

ప్రాథమికంగా పిల్లలు తప్పులేకుండా రాయడం, అందంగా రాయడంతో మొదలైన ఈసామర్థ్యం, క్రమేణా సొంతంగా రాయడం, క్రమపద్ధతిలో రాయడం, విశ్లేషణాత్మకంగా రాయడం, నివేదికలు రాయడం, అభిప్రాయాలు రాయడం, విమర్శనాత్మకంగా రాయడం, సృజనాత్మకంగా రాయడం వంటి సామర్థ్యాల స్థాయికి చేరుతుంది. 'రాయడం' అనే సామర్థ్యం రాస్తు ఉంటేనే వృద్ధి చెందుతుంది. ఇందు కోసం కేవలం పరీక్షలపుడు రాసే జవాబు పత్రాలపైననే ఆధారపడడం వల్ల పిల్లలు రాసే సామర్థ్యాన్ని పూర్తిగా అంచనా వేయలేం. ఇది నిరంతరం జరగాలి. ఇందుకోసం పిల్లలు ప్రతిరోజూ ఏదో ఒకదాని గురించి ఎంతో కొంత రాయాల్సి ఉంటుంది. ఈ సామర్థ్యాన్ని పెంపొందించడానికి పాఠ్యపుస్తకంలో మీ అభ్యసనాన్ని మెరుగుపర్చుకోండి పేరుతో అభ్యాసాలున్నాయి. పిల్లలు వీటికి ఆలోచించి సొంతంగా జవాబులను తమ నోటుబుక్‌లో రాయాలి. పిల్లలు నోట్‌బుక్‌లో జవాబులు రాసిన విధానాన్ని పరిశీలించి మార్కులు కేటాయించాలి. గైడ్లలో చూసి రాసినా, ఇతర నోట్‌బుక్‌ల నుండి కాపీచేసినా మార్కులు కేటాయించకూడదు. ఆలోచించి సొంతంగా చేస్తే మార్కులు ఇవ్వాలి. ఉపాధ్యాయుడు కూడా ప్రశ్నలకు జవాబులను నల్లబల్లపై రాసి పిల్లలను రాసుకోమని చెప్పకూడదు. అలా చేయటంవల్ల పిల్లల్లో సొంతంగా రాసే సామర్థ్యం వృద్ధి చెందదు. పిల్లలు రాసిన అంశాలు క్రింది రూపాలలో ఉంటాయి.

- నోటు పుస్తకాలు విషయాలవారీగా పూర్తిచేసి ఉండటం.
- సమాచార పట్టికలు పూర్తిచేయడం.
- పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను పూర్తిచేయడం.
- పటాలను గుర్తించడం, గీయడం.
- గోడ పత్రికలలో సాంఘికశాస్త్ర అంశాలు ఉంటాయి.

**3. ప్రాజెక్టు పనులు :**

APSCF-2011 పేర్కొనినట్లు అభ్యసనం పాఠ్యపుస్తకాల పరిధిని దాటాలి. అదనపు పఠనాసామగ్రిని పిల్లలు చదవాలి. పఠనాసక్తి పెరిగి స్వతంత్ర పాఠకులుగా ఎదగాలి. ఇందుకోసం అనేక కృత్యాలు, సామర్థ్యాల సమూహమైన ప్రాజెక్టు పనులు నిర్వహించాలి. ప్రాజెక్టు పనుల కోసం విద్యార్థి రకరకాల వ్యక్తులను కలిసి, వారితో మాట్లాడి సమాచారాన్ని సేకరించాలి.

- సేకరించిన సమాచారాన్ని నమోదు చేసి, విశ్లేషించాలి. విశ్లేషణలను నివేదిక రూపంలో రాసి, తరగతిలో ప్రదర్శించాలి. నివేదికపై చర్చించాలి.

**ప్రాజెక్టు పనుల ప్రాధాన్యత :**

నిర్మాణాత్మక మూల్యాంకనంలో భాగంగా విద్యార్థిలోని సమగ్ర అంతర్గత శక్తుల్ని వెలికితీయడం, వాటిని పెంపొందించడం, వినియోగించడం మొదలైన ప్రక్రియల వలననే ప్రాజెక్టు పనులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

విద్యార్థి మానసిక వికాసంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని, స్నేహభావాన్ని, ఇతరులను గౌరవించడాన్ని, సాంఘికపరమైన సర్దుబాటు మొదలైన జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవటానికి ప్రాజెక్టు పనులు దోహదపడుతాయి.

- **ప్రాజెక్టు పనులు ఎలా నిర్వహించాలి?**

- ఏ పాఠానికి చెందిన ప్రాజెక్టును ఆ పాఠ్యాంశం చివర పూర్తి చేయించాలి.
- ప్రాజెక్టును ఎలా పూర్తిచేయాలో విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాలి.
- పూర్తి చేసిన ప్రాజెక్టులను పిల్లలచే మాట్లాడించాలి. రిపోర్టును చదివించాలి.
- ప్రాజెక్టు పూర్తి చేయించడంలో ఉపాధ్యాయుడు తగు సలహాలు, సూచనలతోపాటు గ్రంథాలయ పుస్తకాలు, ఇతర సామగ్రి అందుబాటులోకి వచ్చేలా సహకరించాలి.
- గ్రూపులలో తయారు చేసిన ప్రాజెక్టులలో విద్యార్థులు ప్రతిఒక్కరు స్వతంగా నివేదికను రాయాలి.
- ప్రాజెక్టు నివేదికలలో ఒకరి నివేదికను మరియొకరు కాపీ కొట్టకుండా చూడాలి.
- నివేదికలను భద్రపరచాలి.

**– ప్రాజెక్టుల స్వభావం :**

1) వ్యక్తిగత ప్రాజెక్టు 2) గ్రూపు ప్రాజెక్టు

**– ఏ ఏ అంశాల ద్వారా ప్రాజెక్టును నిర్వహించాలి?**

1) ఇంటర్వ్యూ 2) సమాచార సేకరణ 3) పుస్తక పఠనం

4) పరిశీలనలు 5) ప్రయోగాలు, అన్వేషణలు

6) సృజనాత్మక అంశాలు మరియు నూతన ఆవిష్కరణలు.

**– మార్కుల కేటాయింపు :**

| | | | |
|---|---|---|---|
| I | ప్రాజెక్టును చేయడం | – 3 మా | 30% |
| II | నివేదిక తయారీ | – 5 మా | 50% |
| III | నివేదిక/ప్రాజెక్టుపై మాట్లాడుట | – 2 మా | 20% |

(అంటే నివేదికను చదవడం కాదు, ప్రాజెక్టుపై స్వంతంగా మాట్లాడాలి.)

**– ప్రాజెక్టు తయారీ మరియు ప్రదర్శనలోని సోపానాలు/నిర్వహణా క్రమం :**

- ప్రాజెక్టు పేరు
- ప్రాజెక్టు స్వభావం : వ్యక్తిగత / జట్టు ప్రాజెక్టు
- పని విభజన (జట్లలో కలిసి ప్రాజెక్టు నిర్వహిస్తున్నప్పుడు)

**– ప్రాజెక్టు నిర్వహణ**

- సమాచార/దత్తాంశ సేకరణ
- సమాచార నమోదు
- నమోదు చేసిన సమాచార విశ్లేషణ
- విశ్లేషణపై నివేదిక తయారీ
- తరగతి గదిలో నివేదిక ప్రదర్శన – చర్చ
- ప్రాజెక్టు ద్వారా ఏమి నేర్చుకున్నారు? – చర్చ

పాఠ్యాంశాలన్నిటిపైనా ప్రాజెక్టులు నిర్వహించాలి. పాఠ్యాంశాల చివరన ఇచ్చిన ప్రాజెక్టులతో పాటు అవసరమైన సందర్భాలలో విద్యార్థుల ఆసక్తి, పాఠ్యాంశాల మేరకు ఉపాధ్యాయులు స్వయంగా ప్రాజెక్టులను గుర్తించి, విద్యార్థులచే నిర్వహింపచేయాలి.

**4. లఘుపరీక్షను ఎలా నిర్వహించాలి ?**

- ఈ పరీక్షను యూనిట్ టెస్ట్‌లా కాకుండా/ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్వహించాలి.
- రాతపరీక్ష 20 మార్కులకు నిర్వహించాలి. దానిని 5 మార్కులకు తగ్గించాలి.
- 20 మార్కుల పరీక్ష ఒకేసారి కాని లేదా రెండు లేక మూడు సార్లు కాని నిర్వహించుకోవచ్చు.
- దీనికి నిర్దిష్ట సమయం అవసరం లేదు. ఎప్పుడైనా ఒక పీరియడ్ సమయంలో నిర్వహించుకోవచ్చు.
- రాత పరీక్షకు 20 మార్కులున్నాయి కాబట్టి ఏవైనా 2 లేదా 3 విద్యా ప్రమాణాలకనుగుణంగా ప్రశ్నాపత్రాన్ని ఉపాధ్యాయులే తయారుచేసుకొని నిర్వహించి, మూల్యాంకనం చేసి, నల్లబల్లపై పూర్తిస్థాయి అవగాహనను చర్చ ద్వారా కల్పించాలి.
- ప్రశ్నాపత్రం రూపొందించుకోవడంలో ఉపాధ్యాయునికి స్వేచ్ఛ ఉంది. కొన్ని ప్రశ్నలను నల్లబల్లపై రాసి పీరియడ్ వ్యవధిలో పరీక్ష నిర్వహించాలి.
- నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లలు సమాధానాలు రాయడానికి ప్రతి సబ్జక్టుకు ప్రత్యేక నోటు పుస్తకం ఉండాలి.
- ఈ నోట్ పుస్తకంలోని సమాధానాలను ఉపాధ్యాయులు దిద్ది, మార్కులు CCE రిజిష్టర్‌లో నమోదుచేయాలి.

**లఘు పరీక్షాంశాలు :-**

- భావనలపై అవగాహన (ప్రశ్న/జవాబు)
- పటాలను విశ్లేషించటం, పటంలో ప్రాంతాలను గుర్తించడం.
- సేకరించిన సమాచారంపై విశ్లేషణ.
- సామాజిక అంశాలపై అవగాహన, అనుభవాల విశ్లేషణ.
- ప్రశంస, విలువలు.
- **ప్రతి FA లో లఘు పరీక్షను 20 మార్కులకు, మిగిలిన వాటిని ఒక్కొక్క దానిని 10మార్కులకు నిర్వహించాలి. కాని రికార్డు చేయునపుడు వానిని 5 మార్కుల చొప్పున కుదించి రికార్డు చేయాలి.**
- ఫార్మేటివ్ మూల్యాంకనం వివరాలను కింది విధంగా నమోదు చేయాలి.

| క. సంఖ్య | విద్యార్థి పేరు | ఇచ్చిన అంశాన్ని చదివి వ్యాఖ్యానించడం; సమకాలీన అంశాలపై ప్రతిస్పందించడం 5 మా॥ | రాత అంశాలు (Written Works) 5 మా॥ | ప్రాజెక్టు పని 5 మా॥ | లఘు పరీక్ష (Slip Test) 5 మా॥ | మొత్తం మార్కులు 20 మా॥ |
|---|---|---|---|---|---|---|
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |

- నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని సంవత్సరంలో 4 సార్లు నిర్వహించాలి. (జూలై, ఆగష్టు, నవంబర్, జనవరి/ ఫిబ్రవరిలలో)
- 4 సార్లు నిర్వహించిన పిమ్మట సంవత్సరాంతంలో వాటి సరాసరి మార్కులను 20కు లెక్కగట్టి బోర్డుకి అందచేయాలి.

**నోట్ :** నిర్మాణాత్మక మూల్యాంకనంలో రాత అంశాలకు ఒక నోటుబుక్‌ను (200 పేజీలు), మిగిలిన మూడింటికి కలిపి ఒక నోటుబుక్‌ను (200 పేజీలు) పెట్టి దానిలోనే రాయాలి. వానిని ఉపాధ్యాయుడు ఎప్పటికప్పుడు పరిశీలించి, సూచనలు రాసి మార్కులు ఇవ్వాలి. ప్రతి నిర్మాణాత్మక మూల్యాంకన సమయంలో మొదటి పేపరు మరియు రెండవ పేపరు పాఠాల ఆధారంగా పరీక్షించాలి.

## ప్రాజెక్టు పని - ఒక ఉదాహరణ

ప్రాజెక్టు : సమాచార హక్కు చట్టం ద్వారా మీ ప్రాంతములోని వ్యక్తుల సమస్యలు పరిష్కరించబడిన వారి విజయ గాథలను గురించి ఒక నివేదిక తయారు చేయండి.

ఉపోద్ఘాతము : ప్రభుత్వ పాలనా వ్యవహారాలలో పారదర్శకతను పెంపొందించడానికి ప్రజలు కోరిన సమాచారాన్ని అందించడానికి ఉద్దేశించిన ఈ చట్టాన్ని భారత పార్లమెంటు ఆమోదించింది. ఇది ప్రజల అవసరాలు, తమ పనుల జాప్యానికి గల కారణాలను తెలుసుకోవడానికి అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన నిధులు, విధుల పట్ల ఎంత బాధ్యతాయుతంగా పనిచేశారో తెలుసుకోవడానికి సామాజిక ఆస్తుల నిర్వహణకు ప్రభుత్వం వెచ్చించే నిధులు అవినీతిని నిర్మూలించుటకు పనుల జాప్యాన్ని నివారించుటకు ఈ చట్టం వ్యక్తుల చట్టంగా మారింది.

ఉద్దేశ్యం : మేము తీసుకొన్న ఈ ప్రాజెక్టు ద్వారా మా ప్రాంతంలో లబ్ధి పొందిన వారి విజయ గాథల స్ఫూర్తి ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి ఈ ప్రాజెక్టును ఎంపిక చేసుకోవడం జరిగింది.

సమాచార సేకరణ : మా మండలంలోని మండల రెవిన్యూ కార్యాలయము మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయము నుండి ఈ మాసములో సమాచార హక్కు కింద దరఖాస్తు చేసినవారి వివరాలు, వారు పొందిన వివరాలు మరియు మా గ్రామ పంచాయతులలో ఈ ఆర్థిక సంవత్సరానికి విడుదలైన విధులు, ఖర్చుల వివరాలు గురించి సమాచార హక్కు చట్టం కింద అడిగిన వారి వివరాలను సేకరించడం జరిగింది. ఈ సేకరణ కోసం ప్రశ్నావళి రూపొందించుకొని సర్వేచేయడం జరిగింది.

ప్రశ్నావళి (సర్వేనిర్వహణకు) :

1) సహచట్టం కింద దరఖాస్తు చేసిన వారి పేరు :

2) చిరునామా గ్రామం :

3) కోరుతున్న సమాచారం :

4) ఆర్థిక పరమైనదా?/సామాజిక పరమైనదా? :

5) కోరిన సమాచారం పొందినారా? లేదా? పొందకపోతే కారణాలు :

పై ప్రశ్నావళి ఆధారంగా ఏప్రిల్ మాసమునందు మండల రెవిన్యూ కార్యాలయమునకు కులధృవీకరణ పత్రము ఇవ్వకపోవడానికి గల కారణాలను కోరుతూ 5 దరఖాస్తులు, ప్రభుత్వ భూముల వివరణ కోరుతూ ఒక దరఖాస్తు, M.P.D.O కార్యాలయానికి మా గ్రామము నుండి మండల కేంద్రానికి, రోడ్డు బాగు చేయుటకు విడుదలైన నిధులు, ఖర్చుల గురించి ఒక దరఖాస్తు, మా గ్రామ పంచాయతీ కార్యాలయానికి గత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన నిధుల వివరాల గూర్చి ఒక దరఖాస్తు వచ్చినట్లు మా సర్వేలో తేలింది.


పై వివరాల ఆధారంగా ప్రశ్నావళి పరిశీలన అనంతరం దరఖాస్తులను సమస్యల ఆధారంగా వర్గీకరించడం జరిగింది. అలాగే కార్యాలయాలపరంగా పట్టికలో నమోదు చేయడం జరిగింది.

| క్ర.సం. | కార్యాలయం పేరు | దరఖాస్తు వివరాలు | | | పరిష్కరించడం జరిగిందా/లేదా | సంతృప్తి చెందారా? లేదా |
|---|---|---|---|---|---|---|
| | | ఆర్థికపర | సామాజికపర | భూముల | | |
| 1. | మండల రెవిన్యూ కార్యాలయం | – | 5 | 1 | 2 | – |
| 2. | MPDO కార్యాలయం | – | 1 | – | పాక్షిక పరిష్కారం జరిగింది. | అసంతృప్తి |
| 3. | గ్రామపంచాయతి | 1 | – | – | పరిష్కారం జరిగింది | – |

**సమాచార విశ్లేషణ :** పై పట్టిక ఆధారంగా సమాచారచట్టం ఆధారంగా తహశీల్ కార్యాలయం నందు కుల ధృవీకరణ పత్రం జారీచేయడానికి రెండు దరఖాస్తులు తిరస్కరించబడినవి. కారణాలు పరిశీలించగా, RI గారు ధృవీకరణ చేయనికారణాంగా, రిజక్ట్ చేయబడినట్లు దరఖాస్తులో రిమార్కులు చేశారు. భూములకు సంబంధించిన విషయాల సమాచారం అందుబాటులో ఉంది. MPDO కార్యాలయం ఇచ్చిన వివరాలు, గణాంకాలు విశ్వసనీయతగా కనపడనందున, పై అధికారులకు అప్పీలు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి.

**ఫలితాలు :** సమాచార చట్టం ద్వారా పొందిన సమాచారం వలన, అధికారుల్లో పారదర్శకత, విధుల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించినట్లుగా కనబడలేదు. కొన్ని విషయాల్ల కొంతమంది అస్పష్టంగా సమాచారాన్ని అందించడం వలన చట్టం అమలుకోసం, పై అధికారులకు అప్పీలు చేయడం, వలన అధికారుల బాధ్యతారాహిత్యం బహిర్గతమైంది.

**గ్రాపుల రూపంలో ప్రదర్శన :**




దరఖాస్తులు　　కార్యాలయాలు　　పరిష్కారంను తెలుపు పటం

పై గ్రాఫులు సమాచార చట్టం ద్వారా చేసిన దరఖాస్తుల వివరాలు, కార్యాలయాల వివరాలు, చేసిన పనులను వివరిస్తున్నాయి. పరిష్కారం పొందిన దరఖాస్తుల శాతం, అప్పీలు చేసిన దరఖాస్తుల శాతం వివరాలు ప్రదర్శించబడ్డాయి.

**ముగింపు :**

పైన క్రోడీకరించిన సమాచారం ఆధారంగా సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో చైతన్యం పెరిగిందని అధికారుల్లో చాలా వరకు బాధ్యతారాహిత్యం, విధుల పట్ల అలసత్వం తగ్గినట్లు ప్రాజెక్టు ఫలితాలు తెలియచేస్తున్నాయి.

## ప్రాజెక్టు నివేదికలో ఉండవలసిన అంశాలు

1. విద్యార్థి పేరు :
2. తరగతి : మాధ్యమము.
3. రోల్ నెంబర్ :
4. ప్రాజెక్టుపేరు / శీర్షిక :
5. ప్రాజెక్టు లక్ష్యము :
6. నిర్వహణా విధానము / పద్ధతి :
7. సమాచార విశ్లేషణ - వివిధ పట్టికలు :
8. సమస్య సాధన / వివరణ :
9. ఫలితము :
10. ముగింపు :
11. ఉపయోగించిన గ్రంథాలు / వెబ్ సైట్లు :

**మార్కుల భారత్వము :**

ప్రాజెక్టులను మూల్యాంకనం చేసినపుడు కింద సూచించిన విధంగా భారత్వం కేటాయిస్తూ మార్కులు నమోదు చేసి గ్రేడు ఇవ్వాలి.

1. సూచికల తయారీ / సమాచార సేకరణకు అనువైన వానిని గుర్తించుట / సమాచార సేకరణ / సమాచార విశ్లేషణ / వివిధ పట్టికల తయారీ / ఫలితాల నమోదు - 5 మార్కులు
2. నివేదిక తయారీ, ప్రదర్శన / మౌఖికంగా వివరించుట / సమర్పణ - 5 మార్కులు

**గమనిక :** బృంద ప్రాజెక్టులు నిర్వహించవలసి వచ్చినపుడు బృందములోని ప్రతి విద్యార్థి వ్యక్తిగతంగా మౌఖికంగా ఆ ప్రాజెక్టు నిర్వహణా విధానాన్ని వివరించాలి. ఆ విద్యార్థి వివరించే విధానం ఆధారంగా ఆ విద్యార్థికి గరిష్టంగా 5 మార్కులు కేటాయించాలి. అయితే ఒకవేళ ప్రాజెక్టును 5 మార్కులకే తీసుకొని నిర్వహిస్తే రెండు సోపానాలకు $2\frac{1}{2}$ మార్కుల చొప్పున కటాయించాలి.

**జాగ్రత్తలు :**

1. ప్రాజెక్టు నివేదికలను ఉపాధ్యాయులు భద్రపరచవలసి వుంటుంది. అధికారులు ఎవరైన పరిశీలించాల్సి వచ్చినపుడు వీటిని వారికి అందుబాటులో ఉంచాలి. వీటి ఆధారంగా పిల్లలు పొందిన మార్కులను సరిచూస్తారు.
2. అవసరమైన సమాచారం సేకరించగలిగే అవకాశం వున్న ప్రాజెక్టును మాత్రమే విద్యార్థులకు కేటాయించాలి.
3. సమాచార సేకరణకు అవసరమైన ప్రశ్నావళిని రూపొందించుటలో విద్యార్థులను తగిన సలహాలను సూచనలను ఇవ్వాలి.
4. ప్రాజెక్టు నిర్వహణకు అవసరమయ్యే భావనలను విద్యార్థులకు వివరించాలి.

ఇలా ఉపాధ్యాయులు ప్రాజెక్టుననుసరించి గ్రూపులలో / వ్యక్తిగతంగా విద్యార్థిచే చర్చింపచేసి, ప్రశ్నించి, వారు సమర్పించు నివేదికను పరిశీలించి తగిన ఆధారాలతో పిల్లల ప్రగతిని అంచనా వేయాలి.

# 11 సంగ్రహణాత్మక మూల్యాంకనం - అమలు

## సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Assessment)

విద్యార్థి బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా నేర్చుకొన్న అంశాలను మొత్తంగా మూల్యాంకనం చేయడాన్ని సంగ్రహణాత్మక మూల్యాంకనం అంటారు. ఇవి కోర్సు మొత్తం పూర్తిఅయిన తర్వాత లేదా నిర్ధారిత పాఠ్యాప్రణాళిక పూర్తయిన తరువాత పిల్లల సాధనను పరీక్షించే పద్ధతి. ఈ పద్ధతిలో విద్యార్థి తాను చదివిన కోర్సుద్వారా ఏమి నేర్చుకున్నాడు?, ఎంత వరకు నేర్చుకున్నాడు? అనే అంశాలను పరిశీలించడం జరుగుతుంది. సాధారణంగా రాత (పేపర్ – పెన్సిల్) పరీక్షల రూపంలో మాత్రమే నిర్వహించే సంగ్రహణాత్మక మూల్యాంకనంలో పాఠ్యవిషయాలను మాత్రమే పరీక్షించడం జరుగుతుంది. పిల్లలు ఎంత నేర్చుకున్నారు అని పరీక్షించడం. టర్మినల్, వార్షిక పేరిట నిర్వహించే సంగ్రహణాత్మక మూల్యాంకనం విద్యార్థులకు వారి సాధనను, మార్కులు, ర్యాంకుల రూపంలో అందజేస్తుంది. ఉత్తీర్ణత సాధించారో లేదో మాత్రమే తెలియజేస్తుంది. విద్యార్థులు చదివిన అంశాలన్నీ అవగాహన చేసుకొని స్వంతంగా పరీక్షలలో రాయవలసి రావడం వల్ల పిల్లల్లో పరీక్షలపట్ల భయం, వ్యాకులత ఉండదు. ఈ తరహా అంతర్గత మూల్యాంకన విధానం పరీక్షల పేరిట పిల్లల మధ్య కలిగే అవాంఛనీయ పోటీని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. దీని స్వభావాన్ని మరింతగా నిశితంగా అర్థంచేసుకుందాం.

- ఇది అభ్యసనను మూల్యాంకనం చేసే పద్ధతి.
- సాధారణంగా టర్మ్, వార్షిక పరీక్షల రూపంలో నేర్చుకున్న మొత్తాన్ని పరీక్షిస్తుంది. అనగా గతంలో త్రైమాసిక (Quarterly), అర్ధ వార్షిక (Half Yearly) మరియు వార్షిక (Annual) పరీక్షలుగా నిర్వహించేవారు. ప్రస్తుతం ఒక సంవత్సరంలో దీన్ని రెండుమార్లు నిర్వహిస్తారు. మొదటిది అక్టోబర్ మాసంలో, రెండవది మార్చి/ ఏప్రిల్ మాసంలో నిర్వహిస్తారు.
- విద్యాప్రమాణాల ఆధారంగా పిల్లల ప్రగతిని ఉపాధ్యాయుడు స్వయంగా తయారుచేసిన పరీక్షా పేపర్‌తో పరిశీలించే పరీక్ష పద్ధతి.
- పరీక్ష నిర్వహణ కోసం ఉపాధ్యాయులు సబ్జెక్టువారీగా నిర్ధారించిన విద్యా ప్రమాణాల ఆధారంగా ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి (విషయవారీ భారత్వ పట్టికలను పరిశీలించండి.)
- మౌఖిక పరీక్షను ప్రత్యేకంగా నిర్వహించాల్సిన అవసరం లేదు. మౌఖిక పరీక్షకు సంబంధించిన విద్యా ప్రమాణాలకు కేటాయించిన మార్కులను ఉపాధ్యాయుడు తమ పరిశీలనల ఆధారంగా లేదా అంతకుముందు నమోదుచేసిన ఫార్మేటివ్ మూల్యాంకనం ఆధారంగా కేటాయించి పిల్లల ప్రగతిని నమోదుచేయాలి.
- రాత పరీక్ష కోసం ఆయా సబ్జక్టులవారీగా నిర్ధారించిన భారత్వాల ప్రకారం విద్యాప్రమాణాల ఆధారంగా ప్రశ్నాపత్రం రూపొందించుకోవాలి.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం ఒక విద్యా సంవత్సర కాలంలో రెండుసార్లు నిర్వహించాలి. కాబట్టి మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం. అక్టోబర్ మాసంలో, రెండవ సంగ్రహణాత్మక మూల్యాకనం మార్చి లేదా ఏప్రిల్ మాసంలో నిర్వహించాలి. మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం కోసం ప్రశ్నపత్రం రూపొందించుకొనేటప్పుడు అక్టోబర్ నెలవరకు పూర్తయిన సిలబస్‌ను పరిగణలోకి తీసుకోవాలి. అలాగే రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం కోసం ప్రశ్నాపత్రం రూపొందించు కొనేటప్పుడు పూర్తి పాఠ్యపుస్తకాన్ని అనగా అన్ని అధ్యాయాలను పరిగణలోకి తీసుకోవాలి.

- సమ్మేటివ్ ప్రశ్నాపత్రాన్ని రూపొందించినపుడు అన్నిరకాల ప్రశ్నలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అనగా వ్యాసరూప ప్రశ్నలు, లఘు సమాధాన ప్రశ్నలు, సంక్షిప్త సమాధాన ప్రశ్నలు, లక్ష్యాత్మక ప్రశ్నలు మొదలగునవి.
- ఒక సామర్థ్యానికి చెందిన ప్రశ్నలన్నీ ప్రశ్నపత్రంలో ఒకే విభాగంగా ఇవ్వాలి. ప్రాజక్టు పనులను ప్రశ్నపత్రంలో ఇవ్వరాదు.

**సంగ్రహణాత్మక మూల్యాంకనం :**

- సాంఘిక శాస్త్రంలో సంగ్రహణాత్మక మూల్యాంకనంను రాత పరీక్షగా నిర్వహించాలి.
- సంగ్రహణాత్మక మూల్యాంకన విధానం 9, 10 తరగతులకు ఒకే విధముగా ఉంటుంది.
- సాంఘిక శాస్త్రంలో 9, 10 తరగతులకు ఒకే విధానం ఉంటుంది.
- సాంఘిక శాస్త్రంలో 9, 10 తరగతులకు మూడు సంగ్రహణాత్మక పరీక్షలు నిర్వహించాలి.
- సంగ్రహణాత్మక పరీక్ష ప్రశ్నపత్రాలను 9, 10 తరగతులకు జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (DCEB) సరఫరా చేస్తుంది. ఈ ప్రశ్న పత్రాలను విషయ నిపుణత గల్గిన ఉపాధ్యాయుల బృందం (10 నుండి 15) తయారు చేస్తుంది.
- SA-I సెప్టెంబర్/అక్టోబరులలో, SA-II డిసెంబరు/జనవరిలో నిర్వహించాలి. 9వ తరగతికి SA III ను వార్షిక పరీక్షగా జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (DCEB) నిర్వహిస్తుంది. 10వ తరగతికి SA III ను పబ్లిక్ పరీక్షగా సెకండరీ స్కూల్ బోర్డు నిర్వహిస్తుంది.
- 10వ తరగతిలో సంగ్రహణాత్మక మూల్యాంకనం రెండు పేపర్లుగా ఉంటుంది.

  పేపర్-I పాఠ్యపుస్తకంలోని భాగం-I : వనరుల అభివృద్ధి, సమానత (1-12 పాఠాలు)

  పేపర్-II పాఠ్యపుస్తకంలోని భాగం-II : సమకాలిన ప్రపంచం, భారతదేశం (13-22 పాఠాలు)
- SA - సాంఘిక శాస్త్రంలో పేపరు-I 40 మార్కులకు, పేపరు-II 40 మార్కులకు ఉంటుంది.
- నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Assessement) 20 మార్కులకు ఉంటుంది.

| సాంఘికశాస్త్రం | మార్కులు | పబ్లిక్ పరీక్ష మార్కులు | నాలుగు FAల సగటు |
|---|---|---|---|
| పేపరు-I | 50 | 40 | |
| పేపరు-II | 50 | 40 | 20 |
| మొత్తం | 100 | 80 | 20 |

- పేపరు-I లో 40 మార్కులకు 14 మార్కులు తెచ్చుకోవాలి. అలాగే పేపరు-II లో కూడా 40 మార్కులకు 14 మార్కులు తెచ్చుకోవాలి. అంతర మూల్యాంకనంలో 20 మార్కులకు 7 మార్కులు తెచ్చుకోవాలి. అప్పుడు మాత్రమే విద్యార్థి పాస్ అవుతాడు. (35% మార్కులు తెచ్చుకోవాలి)

**గ్రేడింగ్ :-**

- 9, 10 తరగతులకు SA లో వచ్చిన మార్కులు ఆధారంగా కింది విధంగా గ్రేడ్ ఇవ్వాలి.

| Grade | Marks | Grade Points |
|---|---|---|
| A1 | 46-50 Marks | 10 |
| A2 | 41-45 | 9 |
| B1 | 36-40 | 8 |
| B2 | 31-35 | 7 |
| C1 | 26-30 | 6 |
| C2 | 21-25 | 5 |
| D | 18-20 | 4 |
| E | 0-17 | 3 |

A1 – Outstanding performance

A2 – Excellent participation and oragnisation of activities

B1 – Have good leadership qualities

B2 – Shows interest only in participation

C1 – Have required content knowledge

C2 – Little knowledge about materials and procedures

D- Poor performance and interest

E – Not Participated in any activity

**CCE – రిజిష్టరు, రికార్డులు (CCE - Registers and Records)**

ఆయా మాసాలలో పూర్తిచేసిన పాఠ్యాంశాలను మదింపు చేయవలెను. FA నిరంతరంగా బోధనాభ్యసనలో అంతర్భాగం చేస్తూ పిల్లలకు గ్రేడులు ఇస్తాం. SAలో రాత పరీక్ష నిర్వహించి అందులో కూడా గ్రేడులు ఇస్తాం. విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా 8 అంశాల గ్రేడింగ్ స్కేల్– A1, A2, B1, B2, C1, C2, D, E పై విద్యార్థి ప్రగతిని నిర్ధారిస్తాం. మార్కుల ఆధారిత గ్రేడులు విద్యార్థి ప్రగతిని అంచనావేయటానికి సులభమయిన మార్గం.

భాషా, భాషేతర అంశాలతోపాటు సహపాఠ్యాంశములయిన ఆరోగ్యం మరియు వ్యాయామ విద్య, సాంస్కృతిక విద్య, విలువలు మరియు వైఖరులు కూడ మదింపు చేయబడుతాయి.

- $SA_1$, $SA_2$ (Summative Assessment) నిర్వహించే రెండు సందర్భాలలో సహపాఠ్య అంశాలు అంచనా వేయబడుతాయి. మార్కుల ఆధారిత గ్రేడింగ్ సహపాఠ్యఅంశాలలో విద్యార్థులకు ఇవ్వబడుతుంది.

- ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతిగది/ విషయంనకు సంబంధించిన ఒక సిసిఇ రిజిష్టర్‌ను నిర్వహిస్తాడు. ఇందులో ప్రతి విద్యార్థి ప్రగతిని నమోదు చేస్తాడు. ఈ ప్రగతిని ప్రగతిపత్రం/క్యుములేవిట్ రికార్డులో పొందుపరచి తల్లిదండ్రులకు పరిశీలనార్థం పంపిస్తారు.
- క్యుములేటివ్ రికార్డ్ ప్రతి విద్యార్థికి 1-5, 6-10 తరగతుల వరకు నిర్వహించబడుతుంది. దీన్ని 8వ తరగతి పూర్తి అయిన పిదప ఎలిమెంటరీ విద్యను పూర్తిచేసినట్లుగా సర్టిఫికెట్ ప్రదానం చేయబడుతుంది. ఈ క్యుములేటివ్ రికార్డులో గడిచిన 8 సంవత్సరాలలో పిల్లవాని అన్ని అంశాలు అనగా హాజరు, పాఠ్య, పాఠ్యేతర అంశాలలో ప్రగతి మరియు తల్లిదండ్రుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు ప్రతిబింబిస్తాయి.

## CCE – నిర్వహణ–బాధ్యతలు (CCE - Implementation - Roles & Responsibilities)

నిరంతర సమగ్ర మూల్యాంకనంను ఎప్పటికప్పుడు అన్ని పాఠ్యాంశాలలోని అన్ని సామర్థ్యాలను పరిశీలించి అంచనా వేయాలి.

పాఠ్యాంశాల వారీగా పరిశీలించిన అంశాలను రిజిష్టర్‌లో నమోదు చేసే బాధ్యత ఉపాధ్యాయునిది.

- తరగతి గదిలోని పిల్లలందరికీ బాధ్యత వహించాల్సింది ఉపాధ్యాయుడు.
- పాఠశాలలో సిసిఇ నిర్వహణ, బాధ్యత నిర్వహించాల్సింది ప్రధానోపాధ్యాయుడు, ఆయా ఉపాధ్యాయులు దీనికి బాధ్యత వహించాలి. పర్యవేక్షించాలి.
- కాంప్లెక్సు స్థాయిలో సిసిఇ నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యత ప్రధానోపాధ్యాయునిది.
- పాఠశాలలో సిసిఇ నిర్వహణలో ఎస్ఎంసి, పిటిఏ కూడా పర్యవేక్షణ బాధ్యత నిర్వహించాలి.
- మండల స్థాయిలో సిసిఇ నిర్వహణ అమలు బాధ్యత నిర్వహించాల్సింది మండల విద్యా శాఖాధికారి (ఎం.ఇ.ఓ.) మరియు వారి సిబ్బంది.
- జిల్లా స్థాయిలో సిసిఇ నిర్వహణ, అమలు, పర్యవేక్షణ జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఓ) బాధ్యత వహించాలి.

## CCE – అమలు – సూచికలు – ఆధారాలు
## (CCE - Indicators of implementation - Evidences)

సిసిఇ పాఠశాల ఆధారిత, ఉపాధ్యాయునికి సంబంధించిన మూల్యాంకనం. ఈ ప్రశ్నాపత్రంలను ఖచ్చితంగా ఉపాధ్యాయుడే తయారు చేయాలి. కాని ఇతర సంస్థల నుండి గాని వ్యక్తుల నుండి గాని పొందరాదు. పిల్లల ప్రగతిని పైన వివరించిన 5 అంశాల గ్రేడింగ్ స్కేల్‌పై మార్కుల ఆధారంగా నిర్థారించి, నమోదు చేయాలి. విద్యా ప్రమాణాలలో విద్యార్థులు సాధించిన గ్రేడ్లను A1, A2, B1, B2, C1, C2, D, E గా గుర్తించాలి. ప్రతి పాఠశాల నిర్దేశించిన విద్యా ప్రమాణాల సాధనకు కృషి చేయాలి. ప్రతి విద్యార్థికి నిర్దేశించిన సామర్థ్యాల సాధనకు సంబంధించిన శక్తి, సామర్థ్యాలు ఉన్నాయని విశ్వసించాలి. విద్యార్థుల ప్రగతి ఆధారంగా తరగతి గది/ పాఠశాలకు గ్రేడు ఇవ్వబడుతుంది. ఇది ఎంతమంది విద్యార్థులు $A^+$ మరియు A సాధించారనే దానిపై నిర్ణయించబడుతుంది. సహపాఠ్యాంశాల మూల్యాంకనంనకు పలు రకాల మూల్యాంకన సాధనాలు ఉపయోగించబడి, గ్రేడింగ్ ఇవ్వబడుతుంది.

ప్రతి ఉపాధ్యాయుడు సిసిఇ రిజిష్టర్‌ను నిర్వహించాలి. ఇందులో ప్రతి విషయానికి చెందిన అభ్యసనా సూచికలు అనగా విద్యా ప్రమాణాలు ఒక బేస్‌లైన్‌పై ఎంత మేరకు ప్రగతిని సాధించారనే విషయాన్ని గ్రేడుల రూపంలో నమోదు చేయాలి. క్యుములేటివ్ రికార్డు కూడ నిర్వహించబడుతుంది. ఇది రెండు దశలలో ఉంటుంది. 1 నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక,

6 నుండి 10వ తరగతి వరకు ప్రాథమికోన్నత. 8వ తరగతి అనంతరం సర్టిఫికెట్ ప్రధానం చేయబడుతుంది. SCERT వారు సిసిఇ అమలుకు అవసరమయిన మార్గదర్శకత్వమును, శిక్షణలను, కరదీపికలను తయారుచేసి ఉపాధ్యాయులకు క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులకు, డిసిఇబికి అందిస్తుంది.

సిసిఇ అమలు జరుగుతున్న ఆధారాలకు ఈ కింది వాటిని గమనించాలి. తద్వారా ఒక పాఠశాలలో సిసిఇ అమలు జరుగుతున్న తీరును అంచనా వేయవచ్చు.

1) ఉపాధ్యాయుడు సొంతంగా తయారు చేసుకున్న ప్రశ్నాపత్రాలు, పిల్లల నోటుపుస్తకాలు
2) పాఠ్యపుస్తకాలలోని పిల్లల స్వీయ మూల్యాంకనం, ప్రణాళికలు, వార్షిక మరియు యూనిట్/ పాఠ్యప్రణాళికలు
3) సి.సి.ఇ. రిజిష్టర్ నిర్వహణ
4) ఉపాధ్యాయుల డైరీ
5) పిల్లల డైరీ
6) పోర్ట్‌ఫోలియోలు
7) పరిశీలన నివేదికలు
8) చెక్‌లిస్ట్‌లు
9) సమాధాన పత్రాలు
10) పిల్లల ప్రదర్శనలు
11) పాఠ్యపుస్తకంలో ఇవ్వబడిన అభ్యాసాలు, ప్రశ్నలకు పిల్లలు ఆలోచించి సొంతంగా రాయడం.
12) ప్రాజెక్టు పనుల నివేదికలు
13) క్యుములేటివ్ రికార్డ్
14) ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయుల రివ్యూ మినిట్స్ బుక్.
15) గైడ్లు, స్టడీమెటీరియల్స్ ఉపయోగించకపోవడం.

## సంగ్రణాత్మక మూల్యాంకనం (SA) - గుణాత్మక అంశలు :

### 1) ప్రశ్నాపత్రం స్వభావం :-

- ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలు జ్ఞాపకముంచుకొని రాయడానికి, బట్టీపట్టి రాయడానికి వీలుగా ఉండకూడదు.
- ప్రశ్నలు బహుళ సమాధానాలు రాసేటట్లుగా ఉండాలి. అలాగే వివరణాత్మకంగా, విశ్లేషణాత్మకంగా సమాధానాలు రాసేటట్లుగా ఉండాలి.
- ప్రశ్నలు, పిల్లల ఆలోచనా సామర్థ్యాన్ని, తార్కిక, విశ్లేషణ, నిర్ణయం (Judgement) అభిప్రాయాలు వ్యక్తపరచేవిధంగా ఉండాలి.
- ప్రశ్నలకు జవాబులు ఆలోచించి రాసేటట్లుగా ప్రశ్నలుండాలి.
- పబ్లిక్ పరీక్షలలో ఒకసారి వచ్చిన ప్రశ్నలు మళ్లీ పునరావృతంకావు.
- పాఠం చివర ఇచ్చిన ప్రశ్నలను యధాతంగా పరీక్షలలో అడగరాదు.
- ప్రశ్నలు విద్యాప్రమాణాలను ప్రతిబింబించాలి. అనగా విద్యా ప్రమాణాల ఆధారంగా ఉండాలి.

**విద్యాప్రమాణాల సాధన – ప్రశ్నలు :-**

- ప్రశ్నలు విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి.
- ప్రశ్నలు విద్యా ప్రమాణాలను సాధించేటట్లుగా ఉండాలి.

**ఎ) విషయావగాహన – పరీక్షాంశాలు :-**

- ప్రశ్నాపత్రంలో ఇచ్చిన ప్రశ్నలు విషయావగహన విద్యా ప్రమాణాన్ని సాధించేటట్లు ఉండాలి. అనగా ఒక విషయానికి సంబంధించి కారణాలు, వర్గీకరించడం, పోలికలు, భేదాలు, ఉదాహరణలు వివరించడం, విశ్లేషించడం చేస్తూ రాయగల్గాలి.

1) గ్రామీణ ప్రాంతం వారు పట్టణాలకు వలసపోవడానికి గల కారణాలు రాయండి.

2) ఆహార ఉత్పత్తి పెరగటానికి, ఆహార భద్రతకు మధ్యగల సంబంధాన్ని వివరించండి.

3) లిఖిత రాజ్యాంగం గల దేశాలకు ఉదాహరణలివ్వండి?

4) అమెరికాలోని నల్లజాతీయులు, మైదాపైబీ ఉద్యమాల మధ్యగల తేడాలు, పోలికలు రాయండి.

5) గ్రామ పెద్దలు, లోక్ అదాలత్‌ల మధ్య వివాదాలను పరిష్కరించే విధానాల పై మీ అభిప్రాయం రాయండి.

**బి) పాఠ్యాంశాన్ని (ఇచ్చిన) చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం :**

- ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు ఈ విధంగా ఉండాలి. పాఠ్యాంశంలోని ఒక అంశాన్ని ఇచ్చి, దానిని అర్థం చేసుకొని వ్యాఖ్యానించేలా ఉండాలి. దానిని విద్యార్థి సొంత మాటలలో రాయగల్గాలి.
- ఈ సామర్థ్యం/విద్యాప్రమాణం కింద ఇచ్చే ప్రశ్నలు పిల్లల భావ వ్యక్తీకరణ, తార్కిక, విశ్లేషణ సామర్థ్యం అంచనా వేయడానికి ఉద్దేశించినవి. ఉదాహరణకు కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దాం.

1. ఒకే పరిస్థితులు ఉంటే మగపిల్లల కంటే ఆడపిల్లలు ఎక్కువ మనగలుగుతారని వైద్య పరిశోధనలు చెపుతున్నాయి. అంటే, వివక్షత లేకపోతే మగపిల్లలల కంటే ఆడపిల్లల సంఖ్య ఎక్కువగా లేదా సమానంగా ఉండాలి. సెన్సెస్ సర్వేనుంచి మనకు మరో విషయం కూడా తెలుస్తోంది. భారతదేశంలో ప్రతి వందమంది మగపిల్లలకు 103 మంది ఆడపిల్లలు పుడుతున్నారు. కానీ మగపిల్లల కంటే ఎక్కువ సంఖ్యలో ఆడపిల్లలు చనిపోతున్నారు. 0–5 వయస్సులో బతికి బట్టకట్టిన మగపిల్లల సంఖ్య కంటే ఆడపిల్లల సంఖ్య చాలా తక్కువగా ఉందని సెన్సెస్ చెపుతోంది. ఆడపిల్లలు బతకటానికి ఎక్కువ అవకాశాలు ఉన్నప్పటికీ ఇలా జరుగుతోందంటే వారి పోషణ, సంరక్షణలలో ఏదో వివక్షత ఉండి ఉండాలి.

పై పేరాగ్రాఫ్ చదివి దానిపై నీ అభిప్రాయాన్ని సొంత మాటలలో వివరించండి.

2. వ్యవసాయానికి ఇప్పుడు ఎక్కువ పెట్టుబడి అవసరం అవుతోంది. ఉత్పత్తిలో మిగుల్చుకున్న డబ్బు ద్వారా మధ్యతరగతి, పెద్ద రైతులకు తరువాతి పంటకు పెట్టుబడి ఏర్పాటు అవుతుంది. ఇంకొకవైపున భారతదేశంలో 87 శాతంగా ఉన్న చిన్న రైతులకుపెట్టుబడి దొరకటం కష్టంగా ఉంది. వాళ్ల సాగుభూమి తక్కువగా ఉండటం వల్ల వాళ్ల ఉత్పత్తి సరిపోదు. అదనపు ఉత్పత్తి లేనందువల్ల వాళ్ల మిగులునుంచి పెట్టుబడి అందక అప్పు చెయ్యాల్సి వస్తుంది. తక్కువ ఆదాయం కారణంగా చిన్న రైతులు వ్యవసాయ కూలీ పనికి వెళ్లాల్సి వస్తుంది.

పేరా చదివి, పెట్టుబడి గురించి నీ అభిప్రాయం చెప్పండి.

3. స్థానిక పర్యావరణం నుంచి నిర్వాసితులు కావటం వల్ల నష్టపోయేది ప్రజలు ఒక్కరే కాదన్నది ముఖ్యంగా గుర్తించాలి. ప్రజలతోపాటు సాంప్రదాయ జ్ఞానం మాయమైపోతుంది, సుసంపన్నమైన పర్యావరణ జీవ వైవిధ్యత అంతరించిపోతుంది. ఈ జ్ఞానంఎన్నో తరాలలో ఏర్పడి పెంపొందుతూ వచ్చింది. ఇటువంటి సాంప్రదాయ జ్ఞానం బావా మహాలియా వంటి వాళ్లలో ఉంది. "మాకు అడవిలోని ప్రతి చెట్టు, పొద, మొక్క పేరు తెలుసు; వాటి ఉపయోగాలు తెలుసు. అడవులు లేని ప్రాంతంలో మేం నివసించాల్సి వస్తే ఎన్నో తరాలుగా కాపాడుకుంటూ వస్తున్న ఈ జ్ఞానమంతా ఉపయోగం లేకుండా అయిపోతుంది. మెల్లగా ఇదంతా మరచిపోతాం." పర్యావరణం అనేక రకాలుగా ముప్పుకు లోనవుతున్న ప్రస్తుత తరుణంలో దానిని బాగా అర్థం చేసుకున్న ఇటువంటి సమూహాల పాత్ర ఎంతో ముఖ్యమని గుర్తించాలి.

పై పేరాగ్రాఫ్ చదవండి. నీ అభిప్రాయంను విశ్లేషిస్తూ వివరించండి.

**సి) సమాచార నైపుణ్యాలు :-**

※ ప్రశపత్రంలోని ప్రశ్నలు కింది విధంగా ఉండాలి.

- ❍ సమాచారం ఇచ్చి, దానిని పట్టిక రూపంలో రాయడం.
- ❍ పట్టిక ఇచ్చి, దాని కింద ప్రశ్నలు ఇచ్చి విశ్లేషించడం.
- ❍ గ్రాఫ్‌లు ఇచ్చి, ప్రశ్నలు ఇచ్చి విశ్లేషించడం.
- ❍ గ్రాఫ్ ఇచ్చి, దానిని పట్టిక రూపంలోకి మార్చడం.
- ❍ గ్రాఫ్ ఇచ్చి, దానిని క్రమపద్ధతిలో సమాచారాన్ని రాయడం.

ఉదాహరణకు

**1. 2013లో భారతదేశం, దాని పొరుగు దేశాలకు సంబంధించిన కొన్ని వివరాలు పట్టికలో ఉన్నాయి. పరిశీలించండి.**


**పట్టిక 5 : 2013 లో భారతదేశం, దాని పొరుగు దేశాలకు సంబంధించిన కొన్ని వివరాలు**

| దేశం | తలసరి ఆదాయం, డాలర్లలో | ఆయు: ప్రమాణం సంవత్సరాలలో | సగటున బడిలో గడిపిన సంవత్సరాలు | పాఠశాల విద్యలో ఉండే సంవత్సరాలు | ప్రపంచ మానవ అభివృద్ధి సూచికలో స్థానం |
|---|---|---|---|---|---|
| శ్రీలంక | 5170 | 75.1 | 9.3 | 12.7 | 92 |
| భారతదేశం | 3285 | 65.8 | 4.4 | 10.7 | 136 |
| పాకిస్తాన్ | 2566 | 65.7 | 4.9 | 7.3 | 146 |
| మయన్మార్ | 1817 | 65.7 | 3.9 | 9.4 | 149 |
| బంగ్లాదేశ్ | 1785 | 69.2 | 4.8 | 8.1 | 146 |
| నేపాల్ | 1137 | 69.1 | 3.2 | 8.9 | 157 |


1. తలసరి ఆదాయం ఎక్కువగా ఉండి మానవ అభివృద్ధి సూచికలో మెరుగుగా గలదేశం ఏది?
